
# అద్వైతామృత వర్షిణి



తనికెళ్ళ లక్ష్మీ రుక్మిణి



# అద్వైతామృత వర్షిణి

సద్గురు భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబావారి
దివ్య శ్రీచరణ సన్నిధిని సమర్పించబడుతున్న
అద్వైత భావకుసుమాంజలి

తనికెళ్ళ లక్ష్మీరుక్మిణి

**అద్వైతామృత వర్షిణి**


| | | |
|---|---|---|
| మొదటి ముద్రణ | : | నవంబర్, 2010 |
| ద్వితీయ ముద్రణ | : | నవంబర్, 2011 |
| తృతీయ ముద్రణ | : | 2017 |
| వెల | : | రూ. 100/- |


**© శ్రీమతి తనికెళ్ళ లక్ష్మీరుక్మిణి**


ప్రతులకు : **శ్రీమతి కొండూరి నాగమణి**
1-10-23, ఫ్లాట్ నెం. 101,
అశోక్‌నగర్, హైదరాబాదు - 500 020.
ఫోన్ : 040-27633311, 9949207060
**శ్రీమతి టి. రుక్మిణి** 9441901115

అక్షర కూర్పు : **జి.వి.గ్రాఫిక్స్**
గాంధీనగర్, హైదరాబాదు - 500 0820.
ఫోన్ : 040-65591076

ముద్రణ : **శ్రీకళాప్రింటర్స్**
గాంధీనగర్, హైదరాబాదు - 500 080.
ఫోన్ : 040-27611864

# ఖేలతి హృదయే సాయిః

**ఖేలతి మమ హృదయే**
**రామః ఖేలతి మమ హృదయే**
**మోహ మహార్ణవ తారక కారీ**
**రాగద్వేష ముఖాసుర మారీ ॥**
**శాన్తి విదేహసుతా సహచారీ**
**దహరాయోధ్యా నగర విహారీ ॥**
**పరమహంస సామ్రాజ్యోద్ధారీ**
**సత్యజ్ఞానానన్ద విహారీ ॥**

శ్రీ సదాశివ బ్రహ్మేంద్రుల, ఈ 'అద్వైత వేదాంత' దివ్య సంకీర్తన ఎంత దివ్య భావనాలహరి! మానవ జన్మ ఎత్తటం, ముముక్షువు కావటం, పరముక్తి పొందటం, ఇదొక క్రమ, క్రమ పరిణామ విధానం. అధ్యాత్మ ప్రస్థానం. అందరూ అందుకోవలసిన సాఫల్యం.

ఈ సాధనా క్రమంలో ఎన్నో జన్మలు గడిచినా, ఎందరో గురువుల, మహాత్ముల సాంగత్యం లభించినా, ముడి విడివడే క్షణం వచ్చినపుడే, యోగం సిద్ధిస్తుంది. అదొక ఆరంభకాలం. ఆనందలిప్త. నికామక్షణం.

ఈ సందర్భంలో ప్రాపంచికమైన ఏ విషయమూ మనసును తాకదు. మనసూ కోరదు. అంత గాఢంగానూ స్వస్వరూప దర్శనాన్ని కోరుకునే మనస్సు సాధకుణ్ణి నిలవనీయదు. ఇదొక నిశ్చల పోరాటం. గెలుపోటములు ఎరుగని ఆట. మధనం పంచే అమృతం. అదే అమదానందం. ఆ ఆనంద తారక స్థితి

అనుభవరససిద్ధమయ్యే దాకా హృదయంలో కలిగే కదలిక, మెదలిక, అల, కల, మెలకువ వంటివన్నీ చివరకు దరి చేర్చేవే. కడతేర్చేవే.

సాధకుడి సంస్కారం, ప్రాప్తి, అన్వేషణ, అలుపెరుగని సాధన, కనులలవని నిరీక్షణ గురువు వైపు నడిపిస్తుంది. ఆ గురువు దొరికిన మరుక్షణమే సత్యావిష్కరణకై తెర తొలగుతుంది. సాధన తీవ్రమవుతుంది. అయితే ఇంకా మలగని మనస్సు, తొలగని తమస్సు, వెలగని తపస్సు, యాత్రను సాగనీయవు. కాసేపు ఎగుడు, కాసేపు దిగుడు!

ఖేదం–మోదం, సంయోగం–వియోగం, ఆశ–నిరాశ, లోకం–లోకాతీతం, జీవం–దైవం, భ్రమ–బ్రహ్మ ... ఈ ద్వంద్వాల మధ్య మనస్సు రాపిడిలోంచి రవ్వలు మొలుస్తయ్. ప్రయాణించబోయే వెలుగు దారికి అది తొలి వేకువ. రాకా సుధాకరమయమైన అద్వైత భూమికను చేరుకోవటానికి సుగమప్రస్థాన ప్రభాత వేళ.

ఈ గ్రంథమంతా ఒక విచిత్రగతి .....

ప్రపంచాన్ని వదలాలని ఉన్నా, వదలలేక, ప్రపంచాన్ని వదలినట్లున్నా అందవలసినది అందక, అందుకున్నా అందిందో లేదో అన్న శంక యాతన పెడుతున్నప్పుడు గురువే గురుతు చూపిస్తాడు. ప్రత్యక్ష, పరోక్ష అనుగ్రహం కురిపిస్తూ, పరీక్షిస్తూ, పరిరక్షిస్తూ, నిరీక్షణ క్షణాలను యోగక్షణాలుగా మారుస్తూ దారిచూపిస్తాడు. తథ్యం! మానవ జీవితమే మహాయోగం.

మానవశక్తులను కాదనుకుని దివ్యశక్తులను పొందాలనుకునే ప్రయత్నం యోగం కాదు. మానవశక్తుల పరిధిని, పరిమితిని గుర్తించి, వాటిని మరింత స్పష్టంగా, బలంగా అనుభవించటమే నిజమైన యోగ జీవితం. శాస్త్రాలు,

వ్యాఖ్యానాలు, వివరణలు, వాదాలు యోగ భూమికను స్పష్టంగా బోధిస్తాయి. అవగాహనవల్ల మార్గం సుగమ మౌతుంది. అంతరంగ ప్రయాణం తేలికవు తుంది.

మానవ జీవితమే ఒక దివ్యగానం. ఒక సుజ్ఞానగీతిక. నిరంతర పరిణామం జీవలక్షణం. సత్యాన్వేషణ దాని పరమావధి. ఆత్మ, సత్యము కనుక, సత్యాన్వేషణ అంటే ఆత్మాన్వేషణే. పరమనిష్ఠతో కొనసాగించే అన్వేషణ ఎంతో సులభం. మార్గం ఆంతరంగికం. గమ్యమూ ఆంతరంగికమే. సిద్ధీ ఆంతరంగికమే. అంతా లోపలే వుంటే, బయట వున్నదేమిటి? కాదనుకోవలసినదంతా బయట అనిపిస్తున్నది. కావలసినది మాత్రం లోపల వున్నది. పరిణామం చెందుతూ 'అపరిణామ ప్రాప్తి' పొందితే అదే ముక్తి! అటువంటి జీవనముక్తే, యోగాంతం!

స్వప్నానుభవాలు, స్వాత్మానుభూతులు, తత్వానుసంధానం, అనుక్షణం లభించే అపురూప వరాలు, పైకి కనిపించినంత తేలికైన విషయాలు కావివి. ఎన్నో స్థితులు, ఎన్నో గతులు, మరెన్నో సంగతులు.

జీవుడి వేదన, నివేదన, ఆరాధన, అర్పణ, అన్వేషణ, నిరీక్షణ, నిర్వేదన, అలజడి, ఆనందం, ఊహ, ఉద్వేగం, ఉత్సాహం, అరుణ–అచలస్థితులు, శరణాగతి, సేవ, ప్రేమ వంటి పదహారు కళల సమాహార స్వరూపంగా ఈ గ్రంథం **"అంతర్వాహిని"**.

గురు దైవతం భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారు. మాయా లీలామనుష స్వరూపమిది. పండిత, పామర భేదం లేని నడిచే బ్రహ్మ పదార్థమది. స్ఫురణ, ప్రేరణ ఆయన అనుగ్రహం.

ఈ గ్రంథం పల్లానికి సాగే నీటి ప్రయాణం. సాగి సాగి సంగమ

స్థానం చేరే విన్నాణం. విశ్వాసమెరుగని వారికి విచిత్రం. విశ్వాసమున్న వారికిది ఆహ్లాద భూమిక.

భగవంతుడితో మాట్లాడగలగటం ఒక యోగప్రాప్తి. భగవంతుడు పలకరించకుండానే దయ చిలకరించడం, ప్రసాదవితరణం.

శ్రీమతి తనికెళ్ళ లక్ష్మీరుక్మిణి గారు తన గురుదైవమైన స్వామితో ఏర్పరచుకున్న మానసిక బంధాన్ని, పొందిన ఆనందానుభవాన్ని, అనుభవ సారాన్ని గమనించినపుడు, ఈ గ్రంథం ఆమె హృదయ లోగిలి నుంచి తెరచుకున్న నవ్యద్వారం. ఒక నూత్న మార్గాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తున్నట్లు తోస్తుంది. ఏకలవ్యారాధనలో ఏ 'ఎరుకత' అయినా సద్గురువుకి సమర్పించగల సంభారమిదే.

దీనికంతకీ కారణం?

'ఖేలతి హృదయే సాయిః'

19-8-2010

**వి.ఎస్.ఆర్.మూర్తి**
ఆధ్యాత్మిక శాస్త్రవేత్త

ఓం శ్రీసాయిరాం

# ఆత్మీయంగా ... నాలుగు మాటలు ...

భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారికి సమకాలీనులముగా పుట్టటం మన అదృష్టం.

అవతార పురుషులైన శ్రీరామచంద్ర మూర్తినీ, శ్రీకృష్ణ పరమాత్మనూ మనం చూడలేదు. రామాయణాన్ని, భాగవతాన్ని చదివి, వారి లీలలను వర్ణించి, వారి దివ్యగుణ సంపదను కీర్తించి తరించుతున్నాం. సగుణోపాసనలో, సాకారోపాసనలో వారి దివ్య మూర్తులను మనస్సులోనే ముద్రించుకుని సాధన చేస్తున్నాం. వారి దివ్య లీలలనూ, వారిలోగల దివ్య మహిమలనూ ప్రత్యక్షంగా ఈనాడు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారిలో సందర్శించే భాగ్యం మనకు కలిగింది. ఎన్నిసార్లు చూచినా చూడాలనీ, ఎన్నిసార్లు విన్నా వినాలనీ అనిపించుతుంది బాబా వారి విషయంలో. అదే అవతారమూర్తుల లక్షణం అని కూడా మనకు శాస్త్ర, పురాణ, ఇతిహాసాల వల్ల తెలుసు!

అటువంటిబాబా వారిని ఒక్కసారి చూచి తరించిన వారు ఉన్నారు. ఒక్కసారి బాబావారిని విని ధన్యులయిన వారున్నారు. చివరకు కలలో బాబా వారిని సందర్శించటంద్వారా ఎంతో పరివర్తనం చెందిన వారూ ఉన్నారు. “ఆత్మజ్ఞానానుభవం పొందినవారు నాదగ్గరికి రానవసరంలేదు. నేనే వారి దగ్గరకు వెళ్తాను” అన్నారు భగవాన్ బాబా!

ఈ దృష్టితో చూస్తే భగవాన్ బాబా వారి దివ్యకృప శ్రీమతి తనికెళ్ళ రుక్మిణమ్మ మీద అపారంగా ప్రసరించిందనీ, ఆమె వెంట, జంట, యింట,

లోన, వెలుపల స్వామి వారే ఉంటున్నారనీ ఆమె దివ్యానుభూతులను గూర్చి తెలుసుకున్న వారికి అర్థం అవుతుంది!

"నేను బోధించటానికి రాలేదు. మేల్కొలపటానికి వచ్చాను" అన్నారు. భగవాన్ బాబా! ప్రాపంచిక, సాంసారిక జీవితాన్ని ఆధ్యాత్మిక దృష్టితో చూచి అదొక నిద్రావస్థలోని స్వప్నతుల్యమైన స్థితి అన్నారు తత్త్వజ్ఞులు. శ్రీమతి రుక్మిణమ్మను భగవాన్ బాబా మేల్కొల్పారు.

★ ★ ★

సాఫీగా గడుస్తున్న ఆమె జీవితంలో కలిగిన భర్తృ వియోగం ఒక పెనువిషాదం అయింది. విషాద భరితమైన ఈ వియోగం ఆమె విషయంలో ఆత్మారామునితో సంయోగంగా పరివర్తన చెందింది!

"స్వామీ! నీ కృప కావాలి" అంటాము. కాని, సాయికృపాఫలమైన ఈ దివ్యమైన ఆంతరిక పరిణామాన్ని కోరుకుంటున్నామా? అని సాధకులుగా ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి! ఈ పరిణతి రుక్మిణమ్మకు దొరికింది. అయితే ఈ పరివర్తనం కోసం ఆమె ఎన్ని జన్మల నుంచి వేచి ఉన్నదో ఎవరికి తెలుసు?

★ ★ ★

బాల్యం నుంచీ నాకు రుక్మిణమ్మ తెలుసు. కాలాంతరంలో ఆమె బ్రతుకును ఆమె అన్వేషిస్తూ వెళ్ళింది. రెండేళ్ళ క్రితం వారి బంధువుల వివాహానికి నేనూ వెళ్ళాను. అక్కడికి రుక్మిణమ్మ కూడా వచ్చింది.

"ప్రసన్నం ... నేను పిచ్చిదాన్ని అయిపోయానని కొంత మందికి అనిపించుతోంది. వారి దృష్టిలో నేనొక వెర్రిదాన్ని. నన్ను వాళ్ళు అర్థం చేసుకోలేరు. నువ్వు అర్థం చేసుకోగల వాడివని నాకు తెలుసు ... చూడునాయనా! నీలాగా నేను పుస్తకాలు చదువుకోలేదు. మా మధుసూదనం అన్నయ్య లాగా

(అంటే మా నాయనగారైన కీ.శే. పాతూరి మధుసూదన శాస్త్రిగారు) వేదాంత శాస్త్రాలూ చదువలేదు. కానీ, నాకు ఆ సాయీశ్వరుడు ఆత్మానందాన్ని అనుగ్రహించాడు. ఇప్పుడు నాకెవ్వరూ లేరు. అంతా స్వామే! ఈ శరీరానికి ఆరడగుల చోటు చాలునని చెబితే ప్రసన్నం, (రుక్మిణమ్మ గారి సోదరి) ఆరడగుల గది ఇచ్చింది. దాంట్లో నేను స్వామితో ఉంటూ వుంటాను", అన్నది నాతో రుక్మిణమ్మ!

ఆమె నోటి వెంట యిటువంటి మాటలు విని మొదటిసారిగా ఆశ్చర్యం చెందాను. ఆమెలో నాకొక యోగిని, ఒక తపస్విని, శారీరక స్పృహలేని విరక్తురాలు, ఆత్మానురక్తురాలు కనిపించింది.

మన సంప్రదాయంలోని "అవధూత" స్థితి వంటి స్థితిని మానసికంగా ఆమె అనుభవిస్తున్నట్లు నాకు స్ఫురించింది. ఆమె పిచ్చిది కాదు, వెర్రిదీకాదు. ఆమెలో ఐహిక వస్తువుల కోసం కలిగే పిచ్చిని తప్పించి, దైవం కోసం పిచ్చిని ప్రవేశపెట్టారు బాబా!

"పిచ్చిని తప్పించి, పిచ్చిని తెప్పించు సచ్చిదానంద ఓ సాయిరామా!" అనే భగవాన్ బాబా వారి మాటల్లో కల ఆంతర్యం రుక్మిణమ్మ రూపంలో నాకు కనిపించింది. కనిపించే ప్రకృతి అంతటి నుంచీ ఆత్మానుభవ ప్రేరణ కలిగించే జ్ఞానాన్ని, స్పందనలనూ అవధూతలు పొందుతూ ఉంటారు.

★ ★ ★

సాధకావస్థలో మహిమలపై వ్యామోహం పనికి రాదంటారు. "ఎవరెవరో వస్తూ ఉంటారు. ఏవో అడుగుతూ ఉంటారు. నాకు తోచింది చెపుతాను. వారి కోరికలూ నెరవేరుతూ ఉంటాయి." అని రుక్మిణమ్మ చెప్పినప్పుడు నాకు ఒక విధమైన జంకు, సంకోచం కలిగాయి.

"ఈమె స్వల్పమైన సిద్ధులకు ప్రాముఖ్యతనిస్తోందేమో!" అనిపించింది.

"స్వామి నా నోటికి తాళం వేశారు. భూత భవిష్యత్తులు ఎవ్వరికీ చెప్పను ఆత్మానందానికి తోవ చూపగలను. ఎవరైనా వస్తే వారికి ఆత్మను గూర్చే చెపుతాను" అని ఆమె అన్నప్పుడు నాకు సంతోషం కలిగింది.

ఆమె "స్టేట్ ఆఫ్ మైండ్" ఏమై ఉండాలి?" అనుకునే వారికి "ఆమె సాయిచైతన్యానుభూతిని పొందే ధన్యురాలు" అని చెప్పవచ్చు అనిపించింది. కృష్ణచైతన్యం అనీ, క్రీస్తుచైతన్యం అనీ, సాయి చైతన్యం అనీ ఒకే ఒక దివ్య చైతన్యానికి వివిధమైన వ్యాఖ్యానాలు చేస్తూ ఉంటాం. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు వచ్చింది ఇటువంటి దివ్య చైతన్యావిర్భావాన్ని మనలో కలిగించటం కొరకే కదా! దానిని ప్రాప్తింప చేసుకున్న రుక్మిణమ్మ ధన్యురాలు!

★ ★ ★

ఈ రచన యొక్క లిఖిత ప్రతిని నాకిచ్చి "దీనిని పరిష్కరించి, పాఠకులకు దీని ద్వారా ఏదైనా ప్రయోజనం ఉంటుంది అని నీకు తోస్తే దీనిని పుస్తకంగా వేయిస్తాను" అని రుక్మిణమ్మ చెప్పినప్పుడు ఈ లిఖిత ప్రతిని పూర్తిగా చూచాను. నేనేమీ పండితుణ్ణి కాను. కేవలం ఒక సాధకుణ్ణి. భగవాన్ బాబా వారి సందేశాలకు ఈ పుస్తకంలోని భావాలు అనుకూలంగా ఉంటే మంచిదే కదా!" అనుకుని ఒక ఆధ్యాత్మిక సాధకుని దృష్టిలో దీనిని పరిశీలించాను. ఒక విధంగా ఇది రుక్మిణమ్మ "ఆధ్యాత్మికడైరీ" అంటే తప్పులేదు.

"నాకు అంతా ప్రశాంతతే. బాధను భరించే శక్తి నాకు దైవం ప్రసాదించిన వరం."

"ఎవ్వరికీ ఉత్తరాలు వ్రాయను. నీకయినా ఎందుకు వ్రాస్తున్నానంటే అమ్మ అమ్మకాదని తెలుసుకున్నావు కాబట్టి."

"ఇప్పుడు నాకు ఒంటరితనం అనిపించటం లేదు. మనస్సంతా భగవంతుడే నిండి ఉన్నాడు. ఎంత సమయమూ దేవుడితో మాట్లాడటానికే చాలటం లేదు."

"ఈ జీవితం ఊహించలేనంత అద్భుతంగా ముగుస్తుంది!"

"మోహంలో నన్ను బంధించక మనుషులకి దూరంగా ఉంచి, వాళ్ళని ప్రేమించటమే తప్ప వాళ్ళకి బందీ కాకుండా నా సాయి నన్ను ప్రతిక్షణం చూసుకుంటున్నాడు. నేను, నా లోకం వేరు."

గత జన్మల ఆధ్యాత్మిక సాధన యొక్క బలం చేత ఈ జన్మలో ఒక్కోసారి అనుకోకుండానే, హఠాత్తుగానే దివ్యచైతన్య స్ఫురణ కలుగుతుంది. కావలసిన వారితో వియోగం, సమస్తమునూ కోల్పోవటం వంటి ఘటనలు ఈ దివ్య చైతన్యం యొక్క స్ఫురణకు దోహదం చేయటం కొరకే సంభవిస్తాయి. సాంసారిక జీవులకు ఏది దుఃఖమో, ఆధ్యాత్మిక జీవులకు అది వారి పట్ల సాధనలో ఉన్నతికి దైవం ఏర్పరచిన ఒక మెట్టు అవుతుంది! ఐహికమైన సిరిసంపదలు పుష్కలంగా ఉన్నా వాటిని విడిచి పెట్టి సాయి చైతన్యంతో కూడిన భావాలూ, మాటలూ, చేతలూ, అనుభూతులూ ఈ బ్రతుకులో పండించుకుంటున్నది రుక్మిణమ్మ.

కాబట్టి ఈ అనుభవాలను ఒక పుస్తక రూపంలో ప్రచురించటం, సాధకులకు అందించటం కూడా ఒక మంచి (ఆధ్యాత్మిక) సేవయే అవుతుంది కదా!

పాఠకులకూ రుక్మిణమ్మ వెలిబుచ్చినటువంటి భావాలు స్ఫురిస్తూ ఉండవచ్చు. మంచిదే. కానీ "ఆ భావాలు వ్యక్తి యొక్క లోకాన్ని మార్చాలి. వ్యక్తిత్వాన్ని, నిత్య జీవితాన్ని దివ్యానందంతో, ఆత్మానుభూతితో, అనంత ప్రేమతో నింపాలి కదా! అంతవరకూ దివ్యభావాల "డైనమో"గా ప్రతి సాధకుడూ బ్రతకటం

అలవరచుకోవాలి". అంటారు భగవాన్ బాబా! ఈ సాధన చేసే ప్రతి సాధకుడూ యిలాంటి పుస్తకాలను చదవటం ద్వారా తన భావాలకు కూడా ఒక ఒరవడిని ఏర్పరచుకోగలుగుతాడు అనటంలో సందేహం లేదు.

ఈ రచనలో నాకు అప్పగించిన "పరిష్కర్త" బాధ్యత ఏమీ లేదు! అయితే ఈ భావాలను ఒక పద్ధతిలో అమర్చి పాఠకులకు అందించటంలో కొన్ని సూచనలు చేశాను.

కల్లాకపటం లేని మనస్తత్వం, సరళమైన భాష, దివ్యమైన భావాలూ, సాధనావస్థలో జీవుడు స్వీకరించే సుఖ దుఃఖాల స్వరూపం, గుండె నిండా దైవం కోసం నిండిన ఆవేదన, బాహ్యజీవితమును ఒక నీడగనూ, అంతరికమైన జీవితాన్ని ఒక దివ్యజ్యోతిగానూ స్వీకరించి అనుభవించటంలో చూచే దృశ్యాలూ, వినే శబ్దాలూ, వాటికి సంబంధించిన మార్మికమైన (Mystical) స్ఫురణలూ, మొదలైన ఎన్నో అంశాలకు ఈ చిన్న పుస్తకం ఒక అద్భుతమైన పేటిక!

రుక్మిణమ్మ జీవితంలో "భగవాన్ బాబా వెంట, ఇంట, జంట, లోన, వెలుపల ఉండే ఒక దివ్యశక్తిగా" మనకు ఈ పుస్తకం చదివితే అనిపించుతుంది!

మనస్సు యొక్క సూక్ష్మాతి సూక్ష్మమైన పరిధిల్లో నుంచి, స్థూలమైన పరిధి వరకూ మనస్సు ఎలా పని చేస్తుందో తెలుసుకోవటానికి దివ్యసాధకురాలైన రుక్మిణమ్మ భావాలు సహకరిస్తాయి.

ఈ పుస్తకాన్ని చదవటం నాకొక "ఇన్‌వార్డ్ జర్నీ" (Inward Journey) అయింది.

ఆత్మీయంగా నాలుగు మాటలు చెప్పే ఈ అవకాశాన్ని అనుగ్రహించిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారికి నాప్రేమాంజలులు సమర్పించుతూ, తన

దివ్య భావాలను సాధక లోకోపకార భావంతో తోటి సాధక లోకానికి అందించిన శ్రీమతి రుక్మిణమ్మ నా హృదయపూర్వకమైన అభినందనలు తెలుపుతూ.

సాయి సేవలో

27.6.1995 **పాతూరి ప్రసన్నం**

సికింద్రాబాద్

ఓం

చిరంజీవి రుక్మిణమ్మ పుట్టపర్తి సాయి భక్తురాలు. ఎల్లప్పుడూ ఆ సాయీసునే ధ్యానించుచు భజించుచు కాలమును గడుపు కొనుచున్నది. ఆమెకు నిద్రులలో చాల కలలు వచ్చుచున్నవి. శ్రీ సాయినాధుడు ఆ కలలకు నిద్రులలో చాలా మంచి అర్ధములను తెలియజేయుచున్నారు. ఆ కలల అర్ధములను మంచి భాషలో మంచి పదములతో ఎప్పటికప్పుడు వ్రాసుకొనుచున్నది. చి॥ రుక్మిణి ఏమియూ చదువుకొనలేదు. ఏ కావ్యము పఠించలేదు. అయినను మంచి భాషలో మంచి పదములతో ఆసాయీసుని ఆగ్రహముతో వ్రాసుకొనుచున్నది. పూర్వజన్మ సుకృతముచేత ఆ సాయీసుని అనుగ్రహము వలన అట్లు వ్రాయుచున్నవని నా నమ్మకము. నేను ఆమె వ్రాసిన పుస్తకమును చదివిన తరువాత నాకు కల్గిన అభిప్రాయమును తెలియపర్చుచున్నాను.

ఇట్లు

**సి. హెచ్.వి. సుబ్రహ్మణ్యశాస్త్రి**

---

1999లో మా బావగారు అప్పటివరకు నాకు కలిగిన అనుభవాలు చదివి వారి అభిప్రాయం పైవిధంగా తెలియపరిచారు.

శ్రీ మాత్రేనమః

# రమ్యానుభూతి

సాగరతరంగాలు నిరంతరం ఉవ్వెత్తుగా ఎగిసిపడుతూ మళ్ళీ విరిగిపడుతూ వుండటం సముద్ర సహజలక్షణం. ఆ తరంగాల నిడివి ఎంత? ఇప్పటివరకు ఎన్ని తరంగాలు ఎగిసిపడినాయి? అంటే చెప్పటం మాత్రం ఎవరివల్లాకాదు అని మాత్రం ఖచ్చితంగా చెప్పగలం. మనస్సు కూడా సాగరమే. దానికి మనస్సాగరం అని కదాపేరు. మనస్సాగరంలోనివి భావతరంగాలు. అవికూడా ఎడతెగని తరంగాలేగానీ, ఆ భావలహరిని మాత్రం కట్టుదిట్టం చేసి, వాక్కుద్వారానో, అక్షరరూపంలోనో పదుగురికీ కరదీపికగా అందించ వచ్చును అనేది నిత్యసత్యం.

కానీ ఆ సముద్ర తరంగాలనే రామమంత్ర మహిమతో అగస్త్యమహర్షి ఆపోసన పట్టాడు. ఆ రామమంత్రంతోనే అపార జలనిధిని హనుమ తరించాడు. ఆ! ఆ "హనుమ రామదూత కదా! దైవాంశ కదా!" అనుకోవచ్చు. కానీ వారు మనకు ఆత్మగురువులు. మహర్షులు పరమాత్మను దర్శించిన ద్రష్టలు. అటువంటి గురువులు లోకోద్ధరణ కారణ జన్ములై ఏయుగంలోనైనా వుంటారు.

పైవిధంగా చరాచర జగత్తంతా వ్యాపించిన గురువులు నలుసంత జ్ఞానమనే అంజనాన్ని ఎవరి అంతర్నేత్రానికి పెడతారో వారికి మాత్రమే పరమాత్మానుభూతి లభిస్తుంది. అటువంటి వారి మనస్సు లౌకిక విషయాలకు దూరంగా ఏకాంతాన్ని కోరుకుంటుంది. భక్తి సాగరంలో మునకలు వేస్తూ చరాచర జగత్తంతా భగవంతుని ప్రేమ, కరుణామృత సాగరమేనన్న భావనలో లీనం అవుతారు. అది రామసాగరం కావచ్చు. సాయి సాగరం కావచ్చు. అందుకే కాబోలు త్యాగరాజుగారు గురువు లేక ఎంతటిగుణికి అయినా మనస్సు నిలువదన్నారు భగవంతుని మీద.

అటువంటి గురుకృపాకటాక్ష పాత్రురాలు శ్రీమతి తనికెళ్ళ రుక్మిణమ్మ. కేవలం గురువే దైవమని భావించి, పరమాత్మానుభూతిలో జన్మసాఫల్యాన్ని

గ్రహించి పరితృప్తితో తన జీవితాన్ని గడుపుకుంటున్న ధన్యజీవి.

త్రేతాయుగంలో శబరి గురుశుశ్రూషతోనే తరించిందని తెలియని వారుండరు. అందుకే తానుగా శ్రీరామచంద్రుడు శబరిని వెదుక్కుంటూ వచ్చినా అమ్మా శబరి! నీ గురుశుశ్రూషచక్కగా ఫలించిందా? నీసాధన నీకు మనశ్శాంతిని కలిగించిందా? అని అడిగాడుగానీ, నీవెలావున్నావని అడగలేదు. శబరికూడా రామా! నేను నాగురువు లోకాలకు వెళ్ళటానికి అనుమతి నీయమని అడిగింది గాని స్వర్గమో మోక్షమో అడగలేదు. ఆమెకు ఏమీ తెలియక పోయినా రామదర్శన భాగ్యం స్వర్గఫలం ప్రాప్తించాయి గురుసేవాఫలంగా.

ఆ విధంగానే తనగుండెగుడిలో గురుచరణాలను ప్రతిష్టించి, గురవను గ్రహంతో సర్వాంతరాత్మ అయిన పరమాత్మ ఆత్మపంజరంలోనే వున్నాడని గ్రహించి, అద్వైతామృతభావ లహరిలో మునకలువేసి, ఆ భావసంపదను ఒడిసినట్టు, అక్షరాలుగా రూపుదిద్దిన ఆత్మానుభవ అక్షరశిల్పి నాస్నేహితురాలు, గురుపత్ని శ్రీమతి రుక్మిణమ్మకు మనసా వాచా ప్రీతి పూర్వకంగా నమస్క రిస్తున్నాను.

ఆమె పొందిన పరమాత్మానుభూతి సారం అయిన “అద్వైతామృత వర్షిణి” గ్రంథం ఎందరికో ఆత్మానుభూతికి కరదీపిక కాగలదని నాభావన. శ్రీమతి రుక్మిణమ్మ పరిపక్వహృదయంతో, అనుభూతి రమ్యంగా మరెన్నో తన పరమాత్మానుభావాలను (అహంబ్రహ్మాస్మి) అక్షరరూపం కల్పించే శక్తిని ప్రసాదించమని శివశక్తులు అయిన లలితాకామేశ్వరులను ప్రార్థిస్తున్నాను. ఎందరో మహానుభావులు. అద్వైతామృత పిపాసులైన సాధకులందరికీ నా నమశ్శతాలు. వడ్డించిన విస్తరిలా అద్వైతామృతం ముందుండగా, నాలుకతో తెలుసుకునే రుచిని గరిటెనడిగినట్లు మరొకరు చెప్పటం ఎందుకూ! ఎవరికి వారే చదివి గ్రహించి రమ్యానుభూతిని పొందవలసినదిగా కోరుతున్నాను.

శ్రీమాత సేవలో

**చెవుటూరి కుసుమ కుమారి,** హైదరాబాద్

ఓం శ్రీసాయిరాం

# "హృదయ గుహలో నుండి ..."

1984 జులై 13న గురుపూర్ణిమకి భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా వారి దగ్గరికి పుట్టపర్తి వెళ్ళినప్పటి నుంచి మానసికంగా కొన్ని మాటలు వినబడటం, దృశ్యాలు కనబడటం, అనుభూతులు కలగటం జరిగింది. 1985లో ఒకసారి స్వామి కలలో "లీలలు చూపిస్తాను ... వ్రాసుకొమ్మని" చెప్పారు. అప్పటి నుంచి ఎప్పటికప్పుడు ఈ అనుభవాలన్నీ వ్రాస్తూ ఉండటం ప్రారంభించాను. 2000 సంవత్సరంలో ఒంటిమిట్ట కోదండరాముని ఆలయంలో పోతన భాగవతం వ్రాసినచోట ఈ పుస్తకానికి "అద్వైతామృత వర్షిణి" అని పేరు పెట్టించారు.

"అద్వైతామృత వర్షిణి"గా రూపుదిద్దుకున్న ఈ పుస్తకం వ్రాత ప్రతిని స్వామి ప్రేరణతో శ్రీ వి.యస్.ఆర్. మూర్తిగారికి ఇచ్చి, పుస్తకం చదివి వారి అభిప్రాయం తెలియచేయవలసిందిగా కోరాను. నా మాటను మన్నించి వారు ఎంతో పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ పుస్తకాన్ని ఎంతో శ్రద్ధగా చదివి ముందు మాట "ఖేలతి మమహృదయే సాయిః" వ్రాసి ఈ పుస్తకాన్ని అచ్చు వేయించమని నన్ను ప్రోత్సహించారు. "అద్వైతామృతవర్షిణి" వెలుగులోనికి రావటానికి కారకులైన వారిని గురించి ఏమి వ్రాసినా తక్కువే. నిరహంకారి, నిర్మల హృదయులు, ఆధ్యాత్మిక బోధలు చేసే మంచి వక్త, అన్నింటినీ మించి శ్రీశ్రీశ్రీ భగవాన్ సత్యసాయి బాబా వారి అనుగ్రహం పుష్కలంగా పొందిన అదృష్టవంతులు శ్రీ వి.యస్.ఆర్. మూర్తి గారు. వారు ఇంకా ఎన్నో ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇచ్చి మానవాళిని దైవమార్గంలో నడిపించాలని కోరుకుంటూ, వారికి, వారి కుటుంబానికి స్వామి దివ్యాశీస్సులు తెలియచేస్తున్నాను.

నా అనుభవాలు కొన్ని చదివిన శ్రీ పాతూరి ప్రసన్నంగారు ఈ పుస్తకం గురించి 1995లోనే "ఆత్మీయంగా నాలుగు మాటలు" వ్రాశారు. కాని, 1999లో ప్రసన్న వారి భార్య కొన్నాళ్ళు కాశీ విశ్వనాధుని సన్నిధిలో గడపాలనుకుని కాశీ వెళ్ళారు. కాశీ వెళ్ళిన కొద్ది రోజులకే ఏ అనారోగ్యమూ లేని ప్రసన్న కపాల మోక్షం అయి ఈశ్వరునిలో కలిసిపోయాడు. ప్రసన్న చిన్ననాటి నుండీ మంచి సాధకుడు. కుటుంబంలో ఉన్నా తామరాకు మీది నీటి బొట్టులాగా సంసారం చేసి వైరాగ్యమే సంపదగా పొందిన అదృష్టవంతుడు. భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారి అనుగ్రహం పొందిన భాగ్యశాలి, మంచివక్త, రచయిత. ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇస్తూ వ్యాసాలు కూడా వ్రాసేవారు.

ఈ పుస్తకం పూర్తయి "అద్వైతామృతవర్షిణి"గా అచ్చు అయి వెలుగులోనికి వచ్చే సమయంలో భౌతికంగా అతను లేకపోవటం చాలా బాధ అనిపించినా సాయీశ్వరునిలో లీనం అయిన అతను ఆత్మపరంగా చూస్తాడన్న ఆనందం నాకు తృప్తిని ఇచ్చింది. ప్రసన్న ఇలా తనలో ఐక్యం అయిపోతాడని తెలిసి స్వామి ముందే అతని చేత, 1995లో ఆత్మీయంగా నాలుగు మాటలు వ్రాయించారు. బాబా! నీ భక్తుల మీద నీకు ఎంత ప్రేమ!

మా రెండవ అమ్మాయి చి॥ కొండూరి నాగమణిని స్వామి "ఈ అనుభవాలన్నీ ఒక క్రమ పద్ధతిలో, పుస్తక రూపంలో రావటానికి, ప్రూఫులు దిద్దటానికి" ఎన్నుకుని ఎంతో సహాయం చేయించారు. ఆమెకి ఆమె కుటుంబ సభ్యులకి స్వామిదివ్యాశీస్సులు.

అమ్మ అనుభవాల పుస్తకం "అద్వైతామృతవర్షిణి"ని అచ్చు వేయించి ఇచ్చిన మా అబ్బాయి చి॥ తనికెళ్ళ విజయరాఘవ మూర్తి దంపతులకు, పిల్లలకు స్వామి దివ్యాశీస్సులను అందచేస్తున్నాను.

అతి స్వల్ప వ్యవధిలో అక్షరములను చక్కగా కూర్పు చేసిన చి॥ కృష్ణమూర్తి, శారద (జి.వి. గ్రాఫిక్స్) దంపతులకు, అందంగా పుస్తకం అచ్చు వేయించి ఇచ్చిన శ్రీకళా ప్రింటర్స్ (గాంధీనగర్) శ్రీనివాస్ గారికి స్వామి దివ్యాశీస్సులు అందజేస్తున్నాను.

పుస్తకం స్వామి చెంతకు చేర్చటంలో సహకరించేందుకు స్వామిచే ఎన్నుకోబడిన శ్రీ నిష్టల వెంకట్రావు, శ్రీమతి లీలాని దంపతులకు భగవాన్ దివ్యాశీస్సులు అందచేస్తున్నాను.

'సమస్త లోకా సుఖినోభవంతు!'

శాంతి శాంతి శాంతిః

20-10-2010 **తనికెళ్ళ లక్ష్మీరుక్మిణి**

# విషయం

విషయం గ్రంథమంతా పరచుకున్నది.

ఏ అనుభవానికి ఆ అనుభవమే ప్రత్యేకం.

చదువుకుంటూ వెళ్తుంటే సాధకుడు తన అనుభవంతో సరిపోల్చుకుని ముందుకు సాగుతాడు.

ప్రత్యక్షరమూ సత్యసాయి భగవానుని ఆనంద సుధా మకరందమే!

# అద్వైతామృత వర్షిణి

సారవంతమైన నేల, బలమైన బీజాలు, కావలసినంత నీటి వసతి, సూర్యరశ్మి మొదలైనవన్నీ చక్కగా సమకూరినప్పుడే చక్కని పంట పండటానికి అవకాశం, ఆ పంటను పదిమందీ అనుభవించి, ఆనందించే భాగ్యం కలుగుతుంది.

అదే విధంగా ఆధ్యాత్మిక చింతన వైపు హృదయం ఆకర్షించబడటానికీ, భగవతత్త్వాన్ని గుర్తించడానికి, బ్రహ్మతత్వాన్ని తెలుసుకుని, స్వయంగా అనుభవించి తుదకు తానే దైవంగా, దైవమే తానుగా బ్రతకటానికీ ఎవరైనా కానీ కొన్ని లక్షణాలను ప్రాథమికంగా కలిగి ఉండాలి.

పూర్వజన్మ సుకృతం చేత కర్మపరిపక్వత చెందటం, దైవానుగ్రహం కలగటం సంభవిస్తుంది. ఎన్నో జన్మల నుండి మోక్షమార్గంలో పయనిస్తూ, కర్మ పరిపక్వంతో దైవానుగ్రహం పొందితేకాని హృదయం ఆధ్యాత్మిక చింతన వైపు మళ్ళదు.

పూవు పుట్టగానే పరిమళిస్తుందన్నట్లుగా ఒక్కొక్కరి జీవితంలో చిన్నతనం నుండే దివ్యలక్షణాలు బహిర్గతమవుతూ, క్రమక్రమంగా పూజార్హమైన పుష్పంగా వారి జీవితము భగవత్సాన్నిధ్యమును చేరుకుంటుంది. అంతేకాని, ఒక్కమారుగా భగవంతునిలో ఐక్యత చెందగలగటం చాలా కష్టం. దైవ సంకల్పం, ఈశ్వరానుగ్రహం ఉంటే తప్ప.

క్రమానుసారంగా, దైవ సంకల్పానుసారంగా ఏ వ్యక్తి జీవితంలోనైనా ప్రకటితమయ్యే కోరికలు, సంభవించే పరిస్థితులు ఆ వ్యక్తిని భగవంతుని చెంతకు చేరుస్తాయి.

అనేక రూపాలలో, అనేక నామాలతో చేసే ఖండారాధన కాకుండా చిన్నతనం నుండీ ఒకే దేవుడిని పూజించాలని అనిపించేది. తెలియకుండానే మనసు అఖండారాదన వైపు మొగ్గు చూపేది. కృష్ణుడన్నా, కృష్ణ తత్వమన్నా నాకు మక్కువ ఎక్కువగా ఉండేది.

చిన్నతనం నుండీ “ఈ జీవితం ఏమిటి? చనిపోయాక ఏమవుతాము? జీవితం ముగిసేలోగా సాధించగలిగినది ఏమైనా ఉన్నదా? పదిమందికీ ఏ రకంగానైనా ఉపయోగపడగలమా? అనే భావన ఉండేది.

చదువంటే ఎంతో శ్రద్ధ. బాగా చదువుకోవాలనే ఆసక్తి ఉండేది. కాని, నేను ఆ రోజులలో చదువుకునే అవకాశం లేక ఎక్కువగా చదువుకోలేదు. ఏదో ధనం సంపాదించి, కూడబెట్టి పిల్లలకి ఇవ్వాలి అని అనిపించేది కాదు.

భవిష్యత్తును గురించి ఆందోళన లేకుండా నిశ్చింతగా, హాయిగా గడిపే స్వభావం, కులమత భేదాలు పాటించకుండా అన్ని మతములను గౌరవించడం. పెద్ద వయసులో కూడా అంటే వృద్ధాప్యంలో కూడా అందరూ నా దగ్గరికి వస్తుండాలి అనే కోరిక ఉండేది.

మేము మద్రాసులో ఉండగా 1982వ సం॥ మొదటిసారిగా మా అబ్బాయి తనికెళ్ళ విజయరాఘవమూర్తితో కలిసి సుందరం వెళ్ళి బాబా దర్శనం చేసుకున్నాను. దర్శనం తరువాత బాబామీద నాకెలాంటి అభిప్రాయమూ కలుగలేదు.

మళ్ళీ 1983 జనవరిలో రెండవసారి మా అమ్మాయి సుధ, అల్లుడు రామకృష్ణతో కలిసి బాబా దర్శనం కోసం సుందరంకి వెళ్ళాను. మాకు పది గజాల దూరంలో కారు ఎక్కుతూ కనిపించినప్పుడు బాబా ఎడమ పాదం దర్శనమయింది.

ఈసారి దర్శనం తరువాత ఇంట్లోనూ, నాలోనూ కూడా చాలా మార్పులు జరిగినాయి. ఆ మార్పుల వలన నాలో చాలా అశాంతి చోటు చేసుకున్నది. నా పూర్వజన్మ సుకృతం వలన నా మనసు ఈశ్వరుని యందు లగ్నమై ఆయన అనుగ్రహంతో ఒకే దైవాన్ని కొలవాలన్న కోరిక కలిగింది. ఆ కోరికతోనే రోజూ పూజచేసే గదిలో కాక దాని పక్కన పీటవేసి ఈశ్వరుని పెట్టాలని అనిపించింది. పీటకు పసుపు రాసి, కుంకుమ బొట్లుపెట్టి, శివపార్వతుల ఫొటో పెట్టిన తరువాత, మరికొన్ని దేవతామూర్తులను కూడా పెట్టాలనిపించి షిరిడీసాయిబాబా, వినాయకుడు, లక్ష్మి, సరస్వతితో పాటు మా ఇలవేల్పు నాగేంద్రుడి ఫొటో కూడా పెట్టి రోజూ పూజ చేసుకుంటూ ఉండగా అనుకోని కారణాలవల్ల ఆ పూజ ఆగిపోయింది. తరువాత ఆ ఫొటోలు, తీసివేసి పూజ మధ్యలో ఆగిపోయినందుకు పరమేశ్వరుని తలచుకుని దుఃఖించాను.

తరువాత ఆంజనేయుని ఫొటో పెట్టాలని అనిపించి ఆంజనేయుని ఫొటో కొని తెచ్చి పూజ ప్రారంభిస్తూ నువ్వైనా నిలవమని ఆంజనేయుని ప్రార్థించాను. ఫొటో పెట్టిన వెంటనే అనుకోకుండా ఆంజనేయుడి గుడికి వెళ్ళాను. చాలా ఆనందంగా అనిపించింది. ఇది జరిగిన కొద్ది రోజులకే అనుకోని పరిస్థితుల వలన ఆంజనేయుడి ఫొటో కూడా తీసివేయటం జరిగింది. రెండుసార్లు ఇలా జరగటం వలన అంతులేని వేదనని అనుభవించాను.

ఒకరోజు రాత్రి పడుకునే ముందు “ఈ జీవన సంధ్యా సమయంలో నాకు తోడు ఎవరు?” అని విపరీతంగా దుఃఖించాను. 1984లో బాబా “గురుపూర్ణిమ”కి నన్ను పుట్టపర్తికి చేరేలా చేసి తానే నాకు తోడూ నీడా అయినారు.

ఆ తరువాత కార్తీక మాసంలో ప్రతిరోజూ వడపళని వెళ్ళి శివాలయంలో శివునికి, అమ్మవారికి, నవగ్రహాలకు రోజూ ప్రదక్షిణలు చేశాను. ఆ దేవాలయంలోనే 'నాగుల చవితి' నాడు నాగేంద్రునికి పాలు పోశాను. 1983 డిశంబరులో గురువాయురు వెళ్ళి శ్రీకృష్ణ దర్శనం చేసుకుని వచ్చాను.

నా బాధ్యతలు అన్నీ తీరిన తరువాత కొన్నాళ్ళకి ఎవరి దగ్గరా ఉండకుండా ఏదో ఒకచోట ఒంటరిగా, ప్రశాంతంగా ఉండాలని అనిపించింది. తిరుపతిలో ఒక గది తీసుకుని ఉందామని అనుకున్నాను. కానీ వీలుకాలేదు. 1982 మరియు 1983లో మద్రాసులో రెండుసార్లు శ్రీసత్యసాయిబాబా దర్శనం అయింది. అప్పుడు ప్రత్యేకంగా నాకు ఏమీ అనిపించలేదు. పుట్టపర్తిలో ప్రశాంతంగా ఉండవచ్చునని మా అక్కయ్యగారి అబ్బాయి చల్లా భాస్కరశాస్త్రి చెపితే ఏ బంధాలు లేకుండా పుట్టపర్తిలో ఉండాలని అనుకున్నాను.

1984లో నరసరావుపేటలో మా రెండవ అన్నయ్య ద్రోణావఝుల పూర్ణచంద్రబాబు నాకు శ్రీసత్యసాయి ఫొటో ఇచ్చారు. రెండు మామిడి పండ్లు, మల్లె పువ్వులు తీసుకుని మా అన్నయ్యతోపాటు సాయిభజనకు మొదటిసారిగా వెళ్ళాను.

అప్పటికి స్వామిని గురించికాని, ఆయన తత్వం, బోధల గురించికాని నాకు ఏమీ తెలియదు. కేవలం ఒంటరిగా, ప్రశాంతంగా ఉండటం కోసం మాత్రమే పుట్టపర్తి వెళ్ళాలని అనుకున్నాను.

తెనాలిలో మా ఆఖరు అమ్మాయి సుధ ఇంట్లో ఉండగా ఒక వారం రోజులపాటు భోజనం చెయ్యకుండా కేవలం స్వల్పంగా కొన్ని అటుకులు మాత్రమే తిని ఉండాలని అనిపించింది. అన్నయ్య నాకు స్వామి ఫొటో ఇచ్చిన తరువాత ఆ కోరిక తీరింది. ఏడవ రోజున రాత్రి కలలో మా అమ్మాయి సుధకి "అందరితో కలిసి స్వామి భోజనం చేస్తూ" కనిపించారు. "లీలలు చూపిస్తాను

... రాసుకోమని" అన్నారు. ఎనిమిదవ రోజున మామూలుగా భోజనం చేశాను. అప్పట్లో నాకు ఒంటిమీద ఉన్న కొద్దిపాటి బంగారు వస్తువులు తీసివేసి, ఏదో ఒక రంగు చీరలు మాత్రమే కట్టుకోవాలని అనిపించేది. తెనాలిలో ఉండగా ఒక్కసారి పొన్నూరు వెళ్ళి ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాను. అక్కడ గుడిలో ఒకావిడ అఖండజ్యోతిలో నూనె వేస్తూ కనిపించారు. నేను కూడా ఆమెలాగా అఖండజ్యోతిలో నూనెవేస్తూ ఆ జ్యోతిని చూస్తూ ఉండాలన్న కోరిక నాలో కలిగింది. కాని 1984 జులైలో 'గురుపూర్ణిమ'కి పుట్టపర్తి వెళ్ళినప్పుడు నా గురుదేవుల కృపతో నాలోనే అఖండజ్యోతిని దర్శించాను.

సాయినాథుడే సద్గురువై బయట వెలిగే జ్యోతిని కాక అఖండంగా వెలిగే ఆత్మజ్యోతిని దర్శింపచేశారు.

నా ఆరోగ్యం అంతగా బాగాలేని కారణంగా నన్ను పుట్టపర్తి తీసుకు వెళ్ళటానికి మా అబ్బాయి ఒప్పుకోలేదు. ఎలాగయినా పుట్టపర్తి రప్పించుకోమని స్వామిఫొటో దగ్గర విపరీతంగా ఏడ్చాను. తరువాత తనంతట తానే మా అబ్బాయి విజయం నన్ను పుట్టపర్తి తీసుకు వెళ్ళటానికి ఒప్పుకున్నాడు.

1984వ సంవత్సరం జులై నెలలో 'గురుపూర్ణిమ'కు ముందు కొద్దిపాటి వంటసామగ్రిని తీసుకుని మద్రాసు నుండి మా అబ్బాయితో కలిసి మొట్టమొదటి సారిగా పుట్టపర్తికి బయలుదేరాను. వంటపాత్రలంటే విరక్తి కలిగినా తప్పనిసరై కొద్దిపాటి సామానులు మాత్రం నాతోకూడా తీసుకువెళ్ళాను. అక్కడికి వెళ్ళేముందు ఇరవైనాలుగు గంటలు కన్నీటి ధారలతో విపరీతంగా దుఃఖించాను.

పుట్టపర్తి సమీపిస్తుండగా "నల్లగా, ఉంగరాల జుట్టుతో, నీగ్రో ఆకారంలా ఉన్న ఒక వ్యక్తిఫొటో" దృశ్యంగా కనిపించింది. నీగ్రో రూపంలో ఉన్న ఆ ఆకారాన్ని డ్రైవరు సీటు ప్రక్కన "టక్కున" పెట్టినట్లయింది.

పుట్టపర్తి చేరాక సాయంకాలం నేను, మా అబ్బాయి స్వామి దర్శనానికై వెళ్ళాము. అక్కడ వరుసస్థానం కోసం నంబరు నేనూ తీస్తే బాగుండునని అనిపించింది.

ఆ రాత్రి పుట్టపర్తిలో వచ్చిన కలలో – "ఒకరికి బాబు పుడితే చూడటానికి వెళ్ళాను. ఇంతకుముందు ఇద్దరూ అబ్బాయిలే, ఈ సారి అమ్మాయి పుడితే బాగుండేది" అని ఆవిడ అన్నది. "త్రిమూర్తుల్లా ముగ్గురూ కొడుకులే" అని నేను అన్నాను.

త్రిమూర్తి స్వరూపం అంటే దత్తదర్శనం అని తరువాత స్వామి తెలియ చేశారు.

తెల్లవారితే 'గురుపూర్ణిమ'. ఆ సమయంలో దర్శనం ఉండదని తలా ఒక విధంగా చెప్పారు. కాని మా మేనకోడలు సీత మాత్రం దర్శనం ఉంటుందని చెప్పి తరిమినట్లుగా తొందరగా పంపించింది. సరిగ్గా నేను దర్శనానికి వెళ్ళేటప్పటికి వరుసలో నంబరు తీయవలసిన ఆవిడ హఠాత్తుగా అక్కడి నుంచి లేచి వెళ్ళిపోవటంతో నేను ఆ స్థానంలో కూర్చున్నాను. ముందురోజు అనుకున్న విధంగా నంబరు తీసే అవకాశం ఈ విధంగా ఈ రోజు నాకు కలగటం అద్భుతంగా అనిపించింది.

నంబరు తీస్తే ఐదు నంబరు వచ్చింది. అలా ఐదు నంబరు టోకెను తియ్యగానే తెలియకుండానే నాలోని పంచప్రాణాలూ పంచభూతాలలో కలిసి పోయినట్లు, ఆత్మ పరమాత్మలో ఐక్యం అయినట్లు అనిపించి ఆనందంతో దుఃఖం వచ్చింది. కన్నీటి పొరల మధ్య స్వామి కనిపించరని అనుకుంటూ ఉండగా స్వామి వచ్చారు. అందరూ ఉత్తరాలు వ్రాసి స్వామికి ఇవ్వటానికి

సిద్ధంగా ఉన్నారు. మూడు గంటల సేపు, స్వామిదర్శనం అయ్యేంత వరకూ అలా కంటిధారలు వస్తూనే ఉన్నాయి.

నా ప్రక్కన కూర్చున్న ఆవిడ దగ్గర నుంచి, స్వామి ఉత్తరం తీసుకున్నారు. నాకు అలా ఏదైనా ఉత్తరం వ్రాసి ఇవ్వాలని అనిపించలేదు. "స్వామి భగవంతుడే అయితే, నా కోరికలో న్యాయం, ధర్మం ఉంటే, నా వేదనను గుర్తించి ఆయనే నా సమస్యను పరిష్కరిస్తారు. వేరే ఉత్తరం ఎందుకు ఇవ్వాలి?" అని అనిపించింది.

"స్వామీ! పదిమందికి పనికి వచ్చేట్లయితే ఈ లోకంలోనూ, లేకపోతే శ్మశానంలోనో ఆరడగుల చోటు ప్రసాదించు" అని వేడుకున్నాను.

'గురుపూర్ణిమ' సందర్భంగా ఆ రోజు సాయంత్రం పూర్ణచంద్ర హాలులో స్వామి ఉపన్యాసం ఇస్తున్నారు. అలా ఉపన్యాసం వింటూ కళ్ళు మూసుకుంటే ఒక 'పిండాకారం' దృశ్యంగా కనిపించింది. ఈ విషయాన్ని మా అబ్బాయికి చెప్పాను.

స్వామి నావైపు కన్నెత్తి చూడకపోయినా నాకు బాధ అనిపించలేదు. ఇంక తరువాత పుట్టపర్తిలో ఉండాలని అనిపించలేదు. అక్కడ వసతి సౌకర్యం కుదిరినప్పటికీ ఇంక పుట్టపర్తిలో ఉండకుండా మా అబ్బాయితో కలిసి తిరిగి మద్రాసు వెళ్ళాను. పుట్టపర్తి నుంచి వెళ్ళేటప్పుడు నాతో తెచ్చుకున్న వంట పాత్రలన్నీ పోయాయి. అది నాకు శుభసూచకంగా అనిపించింది.

పుట్టపర్తి వచ్చేటప్పుడు ఏ ప్రదేశంలో అయితే నీగ్రోరూపం కనిపించిందో అదే చోట స్వామి కమలాకారంగా ఉన్న ఒక స్థూపం పైన విభూతి చల్లుతున్నట్లుగా ఒక దృశ్యం కనిపించింది. వెంటనే ప్రక్కన ఉన్న మా అబ్బాయితో ఈ విషయం చెప్పాను. (తరువాత తెలిసింది ఆ కమలాకార స్థూపం స్వామి సనాతనధర్మం స్థూపం అని).

మద్రాసు వెళ్ళాక ఇంక వేరే ఏ దేవుడినీ పెట్టుకోకుండా ఒక్క స్వామి ఫొటోనే పెట్టుకోవాలి అని అనుకున్నాను. ఈ ఫొటో అయినా నిలుస్తుందో లేదోనని అనిపించింది.

తెల్లవారితే స్వామి ఫొటో పెడదామని అనుకుంటూ ఉండగా, తెల్లవారు ఝామున కలలో "నల్లనిపాము మెలికలు తిరుగుతూ, ఎటు వెళ్ళాలో తోచనట్లుగా జరజర ఇంట్లో పాకుతూ కనిపించింది" మా ఇంటి ఇలవేల్పు నాగేంద్రుడు కాబట్టి ఇది ఒక శుభసూచకంగా భావించి, స్వామి ఫొటోతో పాటు మర్నాడు మా ఇలవేల్పు నాగేంద్రుని వెండి పడగ కూడా పెట్టాను. ఇక నా గదినే "ప్రశాంతి నిలయం"గా భావించుకుని, స్వామి భజన పాటల కాసెట్లు వింటూ ప్రశాంతంగా ఉన్నాను. కానీ, కొన్ని రోజులైన తరువాత మళ్ళీ ఇంట్లో ఉండాలని అనిపించలేదు.

శ్రావణ శుక్రవారం నాటి రాత్రి కలలో – "నల్లగా, పొట్టిగా ఉన్న ఒక వ్యక్తి "ఏదో ఒకటి జరిగినంత మాత్రాన మీరు "బాబా"ను నమ్మాలా! ఎన్నో ఏళ్ళ నుంచి నేను ఆయన దగ్గరే ఉంటున్నాను, నమ్మవద్దు" అని చెప్పాడు. అలా కల వచ్చాక నాకు బెంగగా అనిపించి మా కోడలు అన్నపూర్ణకి చెప్పాను. తను ఆ విషయం డాక్టరు చావలి బలరామ్‌గారితో చెపితే ఆయన "బాబాగారు తనపట్ల నమ్మకాన్ని పరీక్షించటం కోసం అలాగే చేస్తారు" అని చెప్పారు.

బాబాగారి ఫొటో పెట్టాక సహస్రనామ పూజ చేద్దామని అనుకుని, "ఒకవేళ 'దొంగబాబా' అయితే ఈ పూజ వ్యర్థం కాదా? శివుడికి అందదు కదా!" అని అనుకున్నాను. మా పెత్తల్లిగారి అబ్బాయి అవే చదువుకోమని చెప్పిన మీదట ఆ నామాలే రెండు పూటలా చదువుకోవటం ప్రారంభించాను.

మళ్ళీ కొన్నాళ్ళకు ఇంట్లో ఉండాలని అనిపించక నన్ను ఎక్కడైనా

ఒంటరిగా ఉంచమని ప్రార్థిస్తూ స్వామి ఫొటోకు తలబాదుకుని ఏడిచాను. ఆ రోజు సాయంత్రం స్వామి సహస్రనామాలు చదువుతూ ఉంటే ఆ పుస్తకంలో "గీతా బోధకాయనమః"అన్న నామం దగ్గర, తరువాత "భక్తి శక్తి ప్రదాయ కాయనమః" అన్న మరొక నామం దగ్గర కుంకుమ వచ్చింది. నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించి, మా అబ్బాయితో కలిసి డా॥ బలరామ్‌గారి వద్దకు వెళ్ళి ఆయనకు ఈ కుంకుమ గుర్తులు చూపించాను.

"అనుమానం ఎందుకు? ఇది స్వామి లీలే!" అని చెప్పి ఆయన పుస్తకానికి నమస్కరించారు. ఆ తరువాత ఇలా కుంకుమ వచ్చిన విషయాన్ని మా అబ్బాయితో కూడా చెప్పాను.

స్వామి ఫొటో పెట్టాక చాలా అశాంతిగా ఉన్నది. నా ఆత్మీయురాలు కె.విజయని చూడాలని విపరీతంగా అనిపించింది. నాలుగురోజుల తరువాత ఎర్రని అంచుతో ఉన్న పసుపు పచ్చని చీరెతో విజయ మా ఇంటికి రాగానే మా అబ్బాయితో "విజ్జీ! విజయ అమ్మవారిలా ఉంది" అని అన్నాను. కొంచెం సేపటికి మా మనుమడు చి॥ జోగేంద్ర విజయతో "మామ్మ దేవుడిని పెట్టుకుంది చూడు" అంటూ ఆమెని స్వామి ఫొటో దగ్గరకు తీసుకువెళ్ళాడు. విజయ స్వామి ఫొటో దగ్గరికి వెళ్ళాక శక్తి ప్రవేశించినట్లయింది. అప్పటికి కాని నాకు తృప్తి కలగలేదు. అలా తృప్తి కలిగాక శక్తిని తలుచుకుని విజయకు చీర పెట్టి పసుపు, కుంకుమ ఇచ్చాను. ఆమె సంతోషంగా చీరె కట్టుకుని ఇంటికి వెళ్ళింది.

విజయ వెళ్ళాక స్వామి భజన పాట "మన్ మందిర్ మే దీప్ జలావో" అన్న పాట వింటూ ఉంటే నాకు కాళ్ళు, చేతులు షాక్ కొట్టినట్లుగా అయి విపరీతంగా ఏడుస్తూ "నా శక్తంతా ఎవరో తీసుకుపోతున్నారంటూ మా కోడలి ఒళ్ళో తలపెట్టుకుని ఏడ్చాను."

ఈ విషయం మరునాడు మా కోడలు, డాక్టరు బలరామ్‌గారితో చెపితే "స్వామి తనలోనికి తీసుకుంటున్నప్పుడు అలాగే ఉంటుందని చెప్పి "టెన్షన్" తగ్గటానికి మాత్రలు ఇచ్చారు. పుట్టపర్తి నుండి వచ్చాక ఒకరోజు "నేను చనిపోయి ఈ రోజుకి పదమూడవరోజు, ఈ రోజు నుంచీ ఇక దీపం పెట్టను" అని దీపపు కుందులు తీసివేశాను. ఇలా ఎందుకు జరిగిందా? అని తరువాత బాధపడ్డాను. తరువాత మా స్నేహితురాలు కుసుమతో కలిసి "కంచి"కి వెళ్ళాను. అక్కడ ముగ్గురు స్వాములనూ ఒకేసారి చూశాను. ముగ్గురినీ ఒకేసారి చూడటం ఆనందం అనిపించింది. ఆమెతో నాకు దీపం పెట్టాలని అనిపించటం లేదని చెపితే "నీకు ఎప్పుడు వెలిగించాలి అనిపిస్తే అప్పుడే వెలిగించవచ్చునని" చెప్పింది.

ఆ తరువాత వరుసగా కలలో విపరీతంగా పాములు కనిపిస్తూ ఉండేవి. ఏదైనా దోషం ఉందేమోనని ఒకరు చెప్పిన మీదట మా అబ్బాయి వడపళనిలో నాగేంద్రునికి పాలతో అభిషేకం చేయించాడు.

దసరాలలో బెంగుళూరు మీదుగా పుట్టపర్తి వెళ్ళాలని టిక్కెట్టు కొనుక్కున్నాను. ఉదయమే లేచి సహస్రనామాలు చదువుకున్నాను. రైలు టైము దాటిపోయే వరకూ విపరీతంగా, కుండపోతగా వాన కురవటం వలన నా ప్రయాణం ఆగిపోయింది. ప్రయాణం ఆగిపోయిందని బాధపడుతూ పడుకున్నాను. అప్పుడు ఒక కల వచ్చింది. కలలో "ఒకావిడ పెద్ద బొట్టు పెట్టుకుని ప్రక్కనే కూర్చున్న ఒక అమ్మాయితో కలిసి భజన పాటలు పాడుతున్నది. నేను కిటికీ చువ్వలుతొలగించి హాలులోకి వెళ్ళి ఆవిడతో "నాకు పాటలంటే ఇష్టం. నాకు ఎందుకు తెలియపరచలేదు?" అని అడిగితే "పాంఫ్లెట్లు (కరపత్రాలు) పంచాము. అందలేదా?" అన్నది ఆవిడ. అక్కడ పచ్చని కాగితాలు కనిపించాయి. "అద్దంలో చూచుకుని వచ్చావా?" అని ఆవిడ అడగగానే నేను చూడలేదని

చెప్పి, గదిలోకి వెళ్ళి అద్దంలో చూసుకుని వచ్చాను. “నువ్వు చాలా చిక్కావు” అని ఆమెతో అంటే “నవరాత్రులు ఉపవాసం కదా! ఈ రోజు భోజనం చేస్తాను” అని ఆవిడ అన్నది.

తరువాత నాకు విపరీతంగా జ్వరం వచ్చింది. $104^0$ జ్వరం ఉన్నా “నేను మందు ఏమీ వేసుకోను. ఈ జర్వం స్వామే తగ్గిస్తారు” అని మా అన్నయ్య వాళ్ళతో చెప్పి, స్వామి విభూతి నీళ్ళలో కలిపించుకుని తాగాను. ఆ మరునాడు ఇంట్లో భజన చెయ్యాలి అని అనిపించింది. సాయంత్రం మా బంధువు ఒకరు నన్ను చూడటానికి వచ్చి “జ్వరం వచ్చిందా!” అంటూ నా తలపై చెయ్యి వేసి నిమిరాడు. “నీ రూపంలో వచ్చి స్వామి నా తల నిమిరారు. ఇక నాకు నయం అవుతుంది” అని అతనితో అన్నాను. సాయంత్రం అందరం కలిసి భజన చేసి హారతి ఇచ్చాము.

డా॥ బలరామ్ గారి దగ్గరకు వెళ్ళి నా ప్రయాణం ఆగిపోవటం, ఆ రోజున నాకు వచ్చిన కలల గురించి ఆయనకు చెప్పాను. దసరాలలో స్వామి శక్తి రూపంలో ఉంటారు కాబట్టి మీకు శక్తిరూపంలో దర్శనమిచ్చారు అని ఆయన చెప్పారు. “పూలు, దీపం పెట్టాలని, ఊదొత్తులు, కర్పూరం వెలిగించాలని అనిపించటం లేదని” ఆయనతో అన్నాను.

“స్వామి మీ హృదయ పుష్పం కోరుతున్నారు. ఒక్క కర్పూరం మాత్రం వెలిగించండి” అని ఆయన చెప్పారు. పూజలో పెట్టిన నాగేంద్రుని విగ్రహం విరిగిపోయిందని చెపితే ఆయన ఆ విగ్రహాన్ని తిరుపతి హుండీలో వేసి, గిండీలోని షిరిడీ సాయి ఆలయంలోని పుట్టలో పాలు పొయ్యమని చెప్పారు. అనుకోని విధంగా ఆ మరునాడే మా అబ్బాయి తిరుపతి వెళ్ళి హుండీలో విగ్రహం వెయ్యటం జరిగింది.

నేను జ్వరంతో ఉన్నప్పుడు ఇక మీదట "ఓం శ్రీసాయినాథాయ నమః" అని కాకుండా నాగశక్తి-సాయిశక్తి అని అంటానని మా కోడలితో చెప్పాను. మా మనుమడు జోగీంద్రతో కూడా అలాగే చెప్పించాను. దసరాల తరువాత ఒక రోజు కలలో "మా అబ్బాయి భగవద్గీత తెచ్చి ఇచ్చాడు" అదే రోజు మా అబ్బాయి నాకు అనుకోకుండా భగవద్గీత కాసెట్ తెచ్చి ఇచ్చాడు.

తరువాత విశాఖపట్నంలో మా బంధువుల అమ్మాయి పెళ్ళికి వెళ్ళబోతూ ముందుగా తెనాలి వెళ్ళి అక్కడ మా అమ్మాయి సుధ ఇంట్లో కొన్ని రోజులు ఉన్నాను. వైజాగ్ పెళ్ళికి వెళితే అక్కడ నాకు రోజూ సహస్రనామాలు చదువుకోవడానికి వీలుకాదేమోనని అనుకుంటే "వీలవుతుంది" చదువుకోమని మా అమ్మాయి చెప్పింది.

విశాఖపట్నం వెళ్ళాక కూడా కొన్ని రోజులు పూజగదిలోనే ఉదయం, సాయంత్రం సహస్రనామాలు చదువుకున్నాను. ఒకరోజు పూజగదిలో చదివితే వేరేవాళ్ళకు అడ్డం అన్న ఉద్దేశ్యంతో ఎక్కడ చదివితే ఏమిటని మేడమీదికి వెళ్ళి సూర్యుని ఎదురుగా కూర్చుని "ఈ కాళ్ళు, చేతులు, శరీరం నావి కావు. నువ్వే, నేను, నేనే నువ్వు" అని అర్థం తెలియకుండానే అనుకున్నాను. ఒకరోజున అక్కడ మా బంధువులు రమ ఇంట్లో, యశోద ఇంట్లో పనిమనిషికి వస్త్రం ఇవ్వమని ఎవ్వరో చెప్పినట్లు అనిపించి వాళ్ళకి చీరెలు ఇచ్చాను. ప్రేమ సమాజంలో అన్నదానం చేశాను.

ఒకరోజున యశోదతో "సహస్ర నామాలు చదువుతూ కూర్చునే బదులు నీకు సాయం చేస్తాను. ఒకళ్ళకి సాయం చేస్తే పూజ చేసినట్లే కదా! నేను మాత్రం ఇంక ఎవ్వరి దగ్గర నుండీ ఏమీ తీసుకోను. ఏదీ ఆశించకుండా సేవ చేస్తాను" అని చెప్పాను. ఆ రోజు నుంచీ సహస్రనామాలు చదవటం మానేశాను.

ఒకరోజున స్నానాల గదిలో దృశ్యంలో గుళ్ళు గుళ్ళుగా నల్లని, గుండ్రటి ఆకారాలు కనిపించాయి. అవి శివలింగాలని, అణువణువునా తానే నిండి ఉన్నానని తరువాత స్వామి తెలియచేశారు. తరువాత కలలో అన్నంతో ఉన్న గిన్నెలు ఎక్కువగా కనిపిస్తూ ఉండేవి.

ఒకరోజున కలలో "స్వామి ఏదో ప్రారంభోత్సవానికి వస్తున్నారు. ఇక్కడ ఇలా సాయిబాటలో ఉండబట్టి కదా! నేను స్వామిని చూడగలిగాను" అని వెక్కివెక్కి ఏడిచాను.

మా మూడవ అమ్మాయి సుజాత వాళ్ళు పెట్టబోయే కాలేజి గురించి వ్రాసిన ఉత్తరం మొదటిసారిగా మేము మద్రాసులోని గిండీలోని షిరిడీసాయి ఆలయంలో పాలు పొయ్యటానికి వెళ్లబోతుండగా వచ్చింది. ఆ ఉత్తరాన్ని సాయి పాదాల వద్ద పెట్టి "ఎవ్వరికీ ఇబ్బందిలేని విధంగా, ఏ ఆడపిల్ల దగ్గరా ఉండకుండా మా అమ్మాయి వైజాగ్‌లో వాళ్ళ నాన్నగారి పేరున పెట్టబోయే కాలేజీలో స్వీపరుగా ఉంటాను స్వామీ!" అని అనుకున్నాను.

"డిశంబరు ఒకటవ తేదీ లోపల కాలేజి ప్రారంభం కాకపోతే నేను వైజాగ్ నుంచి వెళ్ళిపోతాను స్వామీ" అని వేడుకున్నాను. నవంబరు 30వ తేదీన మా వాళ్ళ ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసుకుంటున్నారు. వ్రతం జరుగుతున్న సమయంలో "కాలేజి విషయం ఏదో ఒకటి తేలాలి" అని అనుకుంటూ ఉండగా మా అల్లుడు వచ్చి ఎవరో ఒకాయన తనతో "కాలేజీకి ఇల్లు తరువాత వెతకవచ్చు. ఉన్న ఇంట్లోనే డిశంబరు 3వ తేదీన కాలేజి పేరు పెట్టి వ్రతం చేసుకోమన్నార"ని నాతో చెప్పారు.

"కాన్వెంటుకు ఏం పేరు పెట్టాలి?" అని అనుకుంటూ ఉండగా ఎవరో స్వామి సర్పం ధరించిన శివుని రూపంలో ఉన్న ఫొటో ఒకటి తెచ్చి యిచ్చారు.

'నాగసాయి' అన్న పేరు సూచనగా భావించి కాన్వెంటుకు "నాగసాయి కిడ్స్ కాన్వెంటు" అనీ, కాలేజీకి వాళ్ళ నాన్నగారు కీ.శే. తనికెళ్ళ జోగారావు గారి పేరు మీద "టి.జె.ఆర్. ట్యూటోరియల్స్" అని పేరు పెట్టి వ్రతం చేసుకున్నారు.

స్వామి అనుకున్న ప్రకారం చేశారన్న ఆనందంతో, కాలేజికి ఇల్లు దొరికే లోపల విశాఖపట్నం నుండి డిశంబరు 6న బయలుదేరి 7వ తేదీన హైదరాబాదులోని మా రెండవ అమ్మాయి మణి వాళ్ళింటికి వచ్చాను.

డిశంబరు 5వ తేదీ రాత్రి పనిమీద ఒక ఫొటో స్టూడియోకి వెళ్లవలసి వచ్చింది. అక్కడ ఎవరో నాకు తెలియని వాళ్ళు "వైజాగ్ పోర్టులో షిరిడీ బాబా గుడికి వెళ్ళారా?" అని అడిగితే వెళ్ళలేదని చెప్పాను. "అయితే రేపు గుడికి వెళ్ళండి" అని వాళ్ళు నాకు చెప్పారు.

డిశంబరు ఆరవ తేదీన విశాఖపట్నం నుండి బయలుదేరే రోజున ఉదయం వైజాగ్ పోర్ట్ షిరిడీ సాయి ఆలయానికి వెళ్ళినపుడు విగ్రహం నుంచి రెండుసార్లు తేజస్సు బయటకు వచ్చి కనిపించింది. షిరిడీసాయి నిజదర్శనం అయింది. ఈ విషయం బయటకు చెప్పవచ్చో లేదో తెలియక ఎవ్వరికీ చెప్పలేదు. హైదరాబాదుకు బయలుదేరే ముందు మా బంధువు శివుడి ఇంట్లో దేవుని మందిరంలోని సరస్వతీదేవి ఫొటో నుంచి మందార పువ్వు పడింది. సాయి అనుగ్రహంగా భావించి అది యశోదకి ఇచ్చాను.

డిశంబరు ఆరవ తేదీన హైదరాబాదుకు బయలుదేరి విశాఖపట్నం నుంచి రైల్లో వస్తూండగా కలలో – "మా నాన్నగారు కీ.శే. ద్రోణావఝుల రామక్రిష్ణయ్యగారు వాలుకుర్చీలో కూర్చుని కనిపించారు. ఎవరో హనుమంతుడు కావాలా ... చుట్టు చుట్టు" అనటం వినిపించి, నేను "చెప్పండి – చెప్పండి" అన్నాను. ఈ కల గురించి కూడా నాకు ఎవరికీ చెప్పాలని అనిపించలేదు.

ఏడవ తేదీ సాయంకాలం మా అమ్మాయి మణి "ఎందుకో చాలా వేదనగా ఉన్నది" అన్నది. ఆమెతో నిన్ను ఆంజనేయస్వామి గుడికి తీసుకువెళతాను పూజకి అంటే తను 11వ తేదీ మంగళవారంనాడు వెళాదమని" అన్నది.

1984 డిశంబరు 11వ తేదీన దిల్‌షుక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి గుడికి పూజకి వెళదామని అనుకున్నాను. ఆ రోజు ఉదయం బాత్‌రూమ్‌లో స్నానం చేస్తూ ఉండగా "నీకు కాషాయ వస్త్రం ప్రసాదించబోయేది మణికి పుట్టబోయే పిల్లవాడు" అని ఎవరో అనటం వినిపించింది. తలుపు తెరిచి బయటకు వచ్చేసరికి ఎదురుగా మణి నిలబడి ఉన్నది. "నాకు వస్త్రం ప్రసాదించబోయేది ఎవరో తెలుసా?" అని తనతో అంటే "నాకు పుట్టబోయే కొడుకా!" అని మణి అన్నది. "నీకు ఎలా తెలుసు?" అంటే "ఏమో! అలా అనిపించింది" అన్నది. అందరిలోనూ ఉండే దైవం ఒకటే కాబట్టి అలా తోచింది అని అనుకున్నాము. తరువాత నేను, మణి, వాళ్ళ రెండవ అమ్మాయి శిరీషను తీసుకుని దిల్‌షుక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాము.

త్రోవలో 120 గులాబి పువ్వులు లెక్కపెట్టికొన్నాము. గుడిలో ఒక్కొక్క ప్రదక్షిణ చేస్తూ స్వామి వద్ద ఒక్కొక్క గులాబి పువ్వు ఉంచాను. గుడిలో లెక్కబెడితే కేవలం 108 పువ్వులు మాత్రమే ఉన్నాయి. గుడి నుంచి తిన్నగా మా బంధువుల ఇంటికి వెళ్ళి ప్రసాదం తీసుకుని వచ్చేశాము. వచ్చేటప్పుడు పూల కొట్టు అతనిని అడిగితే ఖచ్చితంగా లెక్కపెట్టి 120 పూలు ఇచ్చాను. మీరు కూడా చూశారు కదా! అన్నాడు. కాని, గుళ్ళో లెక్కపెట్టినపుడు మాత్రం 108 పూలే ఉన్నాయి. అప్పటివరకు సాయి లీలలు నాకు తెలియకపోవటం వలన ఇలా జరగటం ఆశ్చర్యం అనిపించింది.

ఆ రోజున రాత్రి కలలో వినపడిన మాటలు "వచ్చి ఇరవై ఏళ్ళు అయింది. నీలకంఠుడు" మేడమీద నుంచి "అమ్మా" అని పిలుస్తూ ఒక పిల్లవాడు రావటం కనిపించింది.

మరొక రోజున కలలో ఆంజనేయస్వామి బాగా విస్తరించిన ఆకారంతో వెన్నెలలో నడిచి వచ్చి మణీ వాళ్ళ గది గుమ్మం ముందు నిలవటం, గది తలుపులకు ఇనుప గడియలు వేసి ఉండటం కనిపించింది. ఈ కలకు, హైదరాబాదు రైలులో వస్తుండగా "చుట్టు ... చుట్టు" అన్న కలకు 21.6.95న స్వామి ఈ విధంగా అర్థం తెలియచేశారు.

"అద్వైత స్థితిని చేరుకోవటానికి సద్గురువు చుట్టూ తిరుగు. గురువు మాట్లాడినా, మాట్లాడక పోయినా నీవు ఆయనను విడువకు. మనసును ఇతర ఆలోచనలు చుట్టుముట్టకుండా ఏకాగ్రతతో, గురుధ్యానంలో ఉండి గురుపాదాలకు ప్రదక్షిణ నమస్కారములు చేసి సుగుణములనే పుష్పములతో పూజించి కన్నీటితో గురువు పాదములను కడిగి ప్రసన్నుని చేసుకుని, మాలిన్యం తొలిగిన మణివలె సాధకుడు నిర్మల చిత్తంతో ఉంటే పూర్ణచంద్రుని వలె పరిపూర్ణుడైన గురువు ప్రసన్నవదనంతో శిష్యుని వద్దకు వచ్చి, అజ్ఞానంతో మూసుకుపోయిన హృదయ కవాటమును తెరిచి, యోగమార్గమున నడిపించి ఆత్మదర్శనం చేయిస్తాడు" –

ఒకరోజున మణికి వచ్చిన కలలో ... "అందంగా పూలతో అలంకరించిన ఓడలో నేను గిరగిర చుట్టు తిరుగుతు ఉంటే నా వంటిన ఉన్న వస్త్రం స్వామికి చుట్టుకోవటం కనిపించింది."

ఒకరోజు రాత్రి దుప్పటి కప్పుకుని పడుకుంటే దుప్పటి అంతా విభూతి వాసనతో నిండిపోయింది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు చాలా వేడిగా ఉన్నట్లు అనిపించింది. ఉచ్ఛ్వాస నిశ్వాసలు భగవంతునివిగా అనిపించింది.

మరొక రోజున నాకు వచ్చిన కలలో “నేను ధ్వజస్తంభం వద్ద ఉండగా ఇద్దరు బ్రాహ్మణులు నన్ను పొడవటానికి వస్తూ ఉంటే అమ్మవారు వెండి హస్తంతో నన్ను దగ్గరికి తీసుకుని దుష్టశక్తుల నుండి కాపాడింది.”

4.1.85న స్కంధగిరి సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో స్వామికి పంచామృతములతో అభిషేకం జరిగింది. ఆ రోజున గుడిలో కనకదుర్గ అమ్మవారు పచ్చని వస్త్రాలతో, నిమ్మకాయలతో విశేషంగా అలంకరించబడి ఉంది. ముందు రోజున నాకు కలలో కనిపించి వెండి హస్తం వంటిదే అమ్మవారికి అలంకరించబడి ఉండటం చాలా అద్భుతంగా అనిపించింది. కలలో కనిపించిన అమ్మవారు దుర్గామాత అని తెలిసింది.

తరువాత మా పెద్దమ్మాయి సుమన ఇంటికి రామచంద్రపురం (బిహెచ్ఇఎల్) వెళ్ళాను. వాళ్ళ ఇంట్లోనే మొదటిసారిగా నా అనుభవాలు వ్రాయటం ప్రారంభించాను.

13.1.85న కలలో ఒక వృద్ధురాలు కనిపించి “ఆధ్యాత్మ రామాయణం పద్దెనిమిది అధ్యాయాలు వచ్చు” కాని, గొంతు రావటం లేదు” అన్నది.

శ్వాస పీలుస్తున్నప్పుడు, విడుస్తున్నప్పుడు ఓం నమః శివాయ పంచాక్షరీ నామం జరుగుతున్నదని, పెదవి కదపకుండానే శబ్దం వినపడుతున్నదని మా అమ్మాయి సుమనతో చెప్పాను.

ఒకరోజున కలలో మా పెద్దన్నయ్య (సుబ్బరాయశాస్త్రి) ఒక బోర్డుమీద వ్రాయబడిన కొన్ని నామాలలో “ఓం నమః శివాయ” అను నామం చూపించి అదే జపం చెయ్యమని చెప్పారు.

నాకు జపం మానసికంగానే జరుగుతున్నది. ఆ రోజు ఒక పుస్తకం చదివితే అందులో మానసిక జపమే శ్రేష్ఠమైనది అని వ్రాయబడి ఉన్నది. నా

స్వయంగురువే అలా చెప్పారన్నట్లుగా భావించి ఇది తప్పో ... ఒప్పో అని ఎవరినీ అడగకుండా ఇది భగవంతుడే చెప్పాడని తలచి, ఆయన మీదే భారం వేసి అప్పటి నుంచీ మానసిక జపం ప్రారంభించాను.

"నేను అజ్ఞానిని! నా తప్పులను సరిచేసి నన్ను నడిపించే భారం ఆ భగవంతునిదే! నా భారం భగవంతునిపై వేశాను కనుక ఆ భగవంతుడే కాపాడాలి!" అని అనుకున్నాను.

సాధన ప్రారంభంలో నా గురువు సత్యసాయి ఈ విధంగా ప్రార్థనలు చేయించారు. మొదట గురువుకి, తరువాత పంచభూతాలకు, ముక్కోటి దేవతలకు, త్రిమూర్తులకు, నాకు జన్మనిచ్చిన తల్లితండ్రులకు, నా భర్తకి జన్మనిచ్చిన అత్తమామలకు, నా భర్తకు, కుటుంబంలోని పెద్దలు అందరికీ నా నమస్కారములు తెలియజేసి, వాళ్ల దీవెనలు నాకు అందచేశారు. ఇదంతా మానసికంగానే జరిగింది.

తరువాత మా మేనల్లుడు వై.యస్.యన్.మూర్తి (సూరిబాబు)తో శ్రీశైలం వెళ్ళాను. వెళ్ళే ముందు రోజు రాత్రి మా అమ్మాయి సుజాత పెట్టబోయే కాలేజికి ఇల్లు దొరికిందని ఫోను ద్వారా వార్త అందింది. మర్నాడు సూరిబాబుతో శ్రీశైలం వెళ్ళాను. అక్కడ శివునికి అభిషేకం చేసి, శివుని విభూతి, అమ్మవారి కుంకుమ, ప్రసాదం తెచ్చి స్వామి సూచించిన విధంగా పిల్లవాడు పుట్టాలని ప్రార్థిస్తూ ఆ కుంకుమ బొట్టు మణికి పెట్టి, తన కడుపుపై విభూతి వ్రాశాను.

ఫిబ్రవరి ఐదవ తేదీన హైదరాబాదు నుంచి బయలుదేరి తెనాలిలో ఉన్న మా అమ్మాయి సుధ ఇంటికి వెళ్ళాను. 7.2.85న తెనాలి వెళ్ళినరోజు రాత్రి కలలో పింకురంగు దుస్తులలో ఉన్న స్వామి, ఆయన ప్రక్కన రూపంలేని నల్లని ఆకారం ఒకటి కనిపించింది. నల్లనిది అంటే లక్ష్మి అని అనుకున్నాను.

కాని, మరునాడు స్వామి కలకి అర్థం తెలియజేశారు "కలలో కనిపించిన ఆ స్వామే నా గురువు. గురువుగా ఆయన నిరాకారుడైన పరబ్రహ్మమును చూపిస్తున్నట్లుగా తెలియచేశారు.

ఒకరోజున నాగేంద్రస్వామి వస్తాడన్నట్లుగా కల వచ్చింది. ఆ మర్నాడు మా అమ్మాయి సుధకి కలలో పెద్ద సర్పం (నాగేంద్రుడు) ఇంట్లోకి వస్తున్నట్లు కనిపించిందని నాకు చెప్పింది! స్వామీ! నాగసాయి రూపంలో నువ్వు వస్తే నాకు భయం అలా రాకని దణ్ణం పెట్టుకున్నాను. అందుచేత సుధకి కలలో అలా కనిపించి ఉంటారని అనుకున్నాను. సాయికి తన బిడ్డలపై ఎంత వాత్సల్యం!

తెనాలిలో సుధ ఇంట్లో ఉండగా కొన్ని మాటలు వినబడటం, కొన్ని దృశ్యాలు కనిపించటం జరుగుతుండేది.

ఒకరోజున వినబడిన మాటలు ...

"తరగనా? ఏమిటి ... కరివేపాకు! వైరాగ్యం పీట వేసుకున్నది"–

వినబడ్డ ఆ మాటలకు తెలియజేయబడిన అర్థం ఇది "తరగనా" – చెడును ఖండించు, మంచిని పెంచు. కరివేపాకు – నల్లగా (కరి) మురికి పట్టిన ఆత్మను శుద్ధి చేసి (వేపాకు) చేదు ఔషధం వంటి జ్ఞానమును సేవించి తరించు. స్థిరమైన వైరాగ్యంతో దైవత్వాన్ని చేరుకో! ఆత్మకంటిన మాలిన్యమును తొలగించి స్ఫటికం వంటి స్వచ్ఛతను పొందు!

10.2.85 మధ్యాహ్నం వినిపించిన మాట "జ్ఞానం" కనబడిన దృశ్యం "పెరుగు గిన్నె" అంటే జ్ఞానం పెరుగుతున్నదని అర్థం.

తరువాత కలలో "వస్త్రానికి రంగు అంటినట్లు" కనిపించింది. తెలుసుకున్న అర్థం "ఆత్మకు కొంచెం మురికి ఉన్నదని".

వినబడినమాట – "అలుకుతావటే?"

"అంటే ఆత్మను కడుగుతావా? శుభ్రం చేస్తావా" అని. ప్రశ్న వేస్తున్నదీ, జవాబు చెపుతున్నదీ ఆయనే ... అంటే భగవంతుడే.

11.2.85 మధ్యాహ్నం వేసిన ప్రశ్న "ఇంకా కడుగుతావా?" కనిపించిన దృశ్యం "తెల్లని తెర" అనగా "ఆత్మ తెల్లగా పరిశుభ్రంగా అయింది ... ఇంకా కడగటం ఎందుకని? ఈ అర్థాలన్నీ భగవంతుడే తెలియజేస్తున్నాడు.

కనబడ్డ దృశ్యాలకు, వినపడుతున్న మాటలకు అర్థం బాబా పాటల కాసెట్ వింటుంటే తెలిసింది. తెలిసిన తరువాత కంటి వెంట ఆనందాశ్రువులతో స్వామి పాదాలు కడిగాను.

ఇలా అనుభవాలు కలగటం ప్రారంభం అయిన తువాత మా అమ్మాయి మణికి వ్రాసిన ఉత్తరం ...

మణీ ... నా అనుభవాలు ఎప్పటికప్పుడు కాగితం మీద పెడతాను. వాటిని ఒక క్రమపద్ధతిలో వ్రాసి జాగ్రత్తగా ఉంచు. పుస్తకంలో వ్రాస్తే మంచిది. నా చేత భగవంతుడు వ్రాయించిన దానిని అంతటినీ తిరగరాసే శక్తిని భగవంతుడు నీకు ప్రసాదించాడు. కాబట్టి అందరికీ అర్థం అయ్యేలాగా ఆ సరస్వతే నీచేత వ్రాయిస్తుంది. ఆ నమ్మకం భగవంతుడికి ఉండబట్టే ఈ పనిని నీకు అప్పగించాడు. నేను పంపిన అనుభవాలు ఎప్పటికప్పుడు ఒక క్రమ పద్ధతిలో వ్రాసి తారీఖు వేస్తూ ఉండు. నీకు టైము లేకపోయినా ఆ అవకాశం, చక్కని వాతావరణం భగవంతుడు నీకు కలుగజేస్తాడు. ప్రస్తుతం ఇది మన ఇద్దరికీ సంబంధించినది మాత్రమే. కాబట్టి అంతా రహస్యంగానే ఉంచాలి. "ఎవ్వరికీ చెప్పకు" అని నేను అనను. ఆ స్థితిని నీకు స్వామే కలుగజేస్తారు. నేను పంపిన కాగితాలు కూడా జాగ్రత్తగా ఉంచు."

12.2.85 వినబడిన మాటలు "అటు కాదు ఇటు" 'అటు' అన్నది చెడ్డ మార్గం; "ఇటు" అన్నది మంచి మార్గం. విన్న మాటలు - "కాబేజి", "ఉంగరం".

కాబేజి - కా - కారెట్సు (బంగారం వన్నె)

బి - బంగారం

జి - జీవితం

అనగా పదారువన్నెల మేలిమి బంగారం జీవితాన్ని ప్రసాదించారు. ఉంగరం అంటే అనుగ్రహం అని తెలియచేశారు. ముద్రిక స్వామి అనుగ్రహ చిహ్నం.

దృశ్యం - కడుగుతున్న ప్రదేశాలు రెండు.

1. కడిగిన ప్రదేశం - నా ఆత్మ

2. కడగబోతున్నది - మరికొన్ని ఆత్మలు.

ప్రశ్న - ఎవరే అతడు?

జవాబు - అతడే పరమేశ్వరుడు. విశ్వానికి ప్రభువు.

నాకు ఉంగరం పెట్టుకోవటం అంటే ఇష్టంగా ఉండేది. బాబా ఉంగరం పెట్టి తీశాను. శ్రీశైలం నుండి శివుడి ఉంగరం తెచ్చాను. అది కూడా పెట్టుకోలేదు. చివరకు నేను మామూలుగా పెట్టుకునే ఉంగరం కూడా మా పెద్దమ్మాయి సుమన ఇంట్లో ఉండగా తీసేశాను.

"అనుగ్రహ ముద్రికను ప్రసాదించాక ఇక వేరే ఉంగరం ఎందుకు?" అని స్వామి తెలియజేశారు. నా గురువు ఇలా తెలియ చేశాక ఉంగరం మీద ఇష్టత పూర్తిగా పోయింది. ఎవరికైనా స్వామి అనుగ్రహముద్రిక కంటె కావలసినది ఏమున్నది?

చక్కని లాకెట్‌తో ఒక పొట్టి గొలుసు వేసుకోవాలని చిన్నప్పటి నుంచీ ఒక కోరిక ఉండేది. సాయిలాకెట్ తెచ్చుకున్నాను. దాని చుట్టూ పచ్చలూ, కెంపులూ వేసి ఒక లాకెట్ తయారుచేయించి మెళ్ళో వెసుకోవాలని ఆశ. కాని, ఆ ఆశ తీరకుండానే మణి ఇంట్లో 1.1.85న మెళ్ళో గొలుసు తీసేశాను.

స్వామి దానికి అర్థం తరువాత ఇలా తెలియజేశారు. "కోటాను కోట్ల సూర్యప్రభల కాంతితో వెలిగే అంతరాత్మను చూసుకున్న నీకు లాకెట్‌తో పని ఏమిటి? అన్న ఉద్దేశంతోనే నిన్ను లాకెట్టు చేయించుకోనివ్వలేదు."

నా హృదయంలో బాబా ఉండగా ఇంకపై లాకెట్టు ఎందుకు? ఇక ఆ కోరిక తీరిపోయింది. స్వామి లీలలు అద్భుతాలు!

విన్నమాట : "కొత్తిమీర"

అర్థం – "కోరికలు తిమింగలాలై మనసును తొలిచేస్తుంటే రానంటున్నది మోక్షం. కాన రాకున్నది కైవల్యం.

విన్నమాట – అక్క చెల్లెళ్ళు, రెండు కళ్ళు

అర్థం – నా మీద లక్ష్మి సరస్వతుల దృష్టి పడింది.

25.2.85 మధ్యాహ్నం – కనిపించిన దృశ్యం "కారులో ఒక స్త్రీ తెల్లని వస్త్రాలు ధరించి రావటం, ఆమె నుదుట వెలుగు. ఆమెను రమ్మని ఆహ్వానించగా '18'న వస్తానని అన్నది."

18.2.85 సాయంత్రం ఆరు, ఏడు గంటల మధ్య వినిపించిన మాట "సుహాసిని" శుభానికి చిహ్నం తెలుపు. శుభసూచకమైనటువంటి ధవళ వస్త్రాలతో మందహాసంతో, ఆధ్యాత్మిక సిరులిచ్చే తల్లి అమ్మ వస్తున్నది. శ్రద్ధా భక్తులతో ఆహ్వానించి జాగ్రత్తగా నీ హృదయ పీఠం మీద భద్రపరచుకో."

20. 2. 85 విన్న మాటలు – "వెయ్యి జన్మలు, జీవుడు, విముక్తి"

కనబడిన దృశ్యం – పడగ ఎత్తిన పాము.

అర్థం : "భగవంతుని అవతారమైన సద్గురు శ్రీ సత్యసాయి బాబా నన్ను తన పాదాల వద్దకు చేర్చుకుని ప్రాపంచిక బంధాలు అయినటువంటి సుఖాల ఉచ్చుల నుండి తప్పించి కుండలినీ యోగం ద్వారా జీవుని విముక్తి చేసి పరమాత్మలో విలీనం చేశారు.

విన్నమాటలు – "చిక్కడు" ఇక్కడ దొరకదు. 'అక్కడ' దొరుకుతుంది.

అర్థం – పరమాత్మ ఎవ్వరికీ చిక్కడు. కాని, శోధిస్తే ఎవరికైనా లభ్యం అవుతాడు. ఇక్కడ చూస్తే కనిపించడు. ఆత్మలో చూస్తే కనిపిస్తాడు.

## మణికి వ్రాసిన కొన్ని ఉత్తరాలు

1. ... తెనాలి వచ్చిన దగ్గర నుంచీ అనుకోకుండా చిన్నచిన్న పూజలు భగవంతుడు చేయిస్తున్నాడు. ఎన్నని వ్రాయను? ఎన్నో కలలు, ఏవేవో దృశ్యాలు కనిపించటం, కొన్ని మాటలు వినిపించటం జరుగుతున్నది. ఇవన్నీ మనకు విచిత్రం ... అద్భుతం. ఎవరికైనా చెపితే నమ్మకపోవచ్చు. ప్రస్తుతం ఇవి మన ఇద్దరి మధ్య మాత్రమే. ఏది అద్భుతంగా తోచినా నీకు చెప్పాలని అనిపిస్తుంది. వినే వాడిని బట్టి చెప్పేవాడు. అందుకే వక్తకి తగ్గ శ్రోత, శ్రోతకి తగ్గ వక్త కావాలని అంటారు. నేను కొన్ని విషయాలు ఎప్పటికప్పుడు తారీఖు, సమయం వేసి వ్రాస్తున్నాను. అవి నమ్మాలో వద్దో నాకే తెలియటం లేదు. సాయి ఎన్నో లీలలు చూపిస్తున్నారు. నేను అవన్నీ మనస్ఫూర్తిగా నమ్మినా ఇవన్నీ నీకు ఇప్పుడు వ్రాయాలా తరువాత వ్రాయాలా అన్నది ఆ సాయే తెలియచెయ్యాలి. ఆయన ఆజ్ఞ అవగానే వ్రాస్తాను. నేను విశాఖపట్నం నుంచి రైలు దిగి మీ

ఇంటికి వచ్చిన క్షణం నుంచీ నాలోని మార్పును తెలుసుకున్నది నువ్వు మాత్రమే. అందుకే మొదటిసారిగా నిన్ను "బంగారూ!" అని పిలిచాను. నువ్వు తప్ప అందరూ నన్ను మామూలుగానే చూస్తున్నారు. నీకు మాత్రమే అలా ఎందుకు కనిపిస్తున్నానో అర్థం కావటం లేదు.

నేను, సుధ కలిసి చిన్న చిన్న పూజలు చేస్తున్నాము. అన్నీ అమర్చి నాతో సహకరించి చేస్తున్నది. సుధ పుట్టిన తరువాత మనకు మామూలు ధనం రాలేదు. భక్తిధనం వచ్చింది. సుధ పుట్టిన తరువాత నాన్నగారు ఎమ్.ఎస్.సి. చదవటం, గవర్నమెంటు ఉద్యోగం రావటం వలన నాకు కొంచెం పెన్షను ఏర్పాటు అయింది. 'నాది' అని తినటానికి, నాకు అది చాలు. "గంగి గోవు పాలు గంటెడైనను చాలు" ఆ కొంచెం నాకు ఎంతో విలువైనది.

మీ అందరి పెళ్ళిళ్ళూ ఆ భగవంతుడు స్వయంగా దగ్గరుండి చేయించాడు. ఇప్పుడు 85లో భక్తిదనం ప్రారంభమైంది. ఈ ధనం ఎన్ని తరాలైనా తరగనిది.

నాకు బంగారు పంజరం వద్దు. నాకు స్వామి పాదాలు చాలు. కావలసినవన్నీ నాకు స్వామి పాదాల దగ్గరే దొరుకుతాయి. నాకు ప్రపంచంలో నా అన్న వస్తువు "ఈశ్వరుడే". సాయి ప్రేమ తప్ప నాకు ఏదీ లేదు. నేను తల్లిగా ఈ ఉత్తరం వ్రాయటం లేదు. సాయి భక్తురాలిగా వ్రాస్తున్నాను. నేను ఎంతో శాంతిగా, ఆనందంగా ఉన్నాను. నేను వేరు, సాయి వేరు కాదు. నా చేత మొట్టమొదటి సారిగా "బంగారూ" అనిపించుకున్న అదృష్టవంతురాలివి. ఆ అదృష్టం ఇప్పుడు తెలియదు."

2. … కారణాలు ఏవైనా ఈ సంసారం మీద విరక్తిని పెంచుకుని, భవబంధాలు తెంచుకుని, భగవంతునికి చేరువ అయ్యాను. మళ్ళీ ఆ ఉచ్చులు

బిగించుకుని దైవానికి దూరం కాను. నా సద్గురువు సాయి అక్కడే ఉండి నాకు గీతబోధిస్తూ ఉన్నాడు. ఆయన 'అక్కడ' నేను 'ఇక్కడ' ఉన్నా సాయి దృష్టి మాత్రం నామీదే ఉన్నది. గీతామృతాన్ని తాగుతూ ప్రతిక్షణం ఆచరిస్తున్నాను. నాలోని కుండలినీ శక్తి గురువు అనుగ్రహం చేత పడగవిప్పి కదిలింది. ఎంతో శ్రమిస్తేనే కాని ఈ యోగం పట్టదు. నా గత జన్మ పుణ్యం నాకీ శక్తిని ప్రసాదించింది. అందుకే నాకు కొన్ని దృశ్యాలు, మాటలు వినబడుతున్నాయి. ఇది సత్యం.

దృశ్యాలు, మాటలు ఒక కాగితం పైన టైముతో సహా వ్రాస్తున్నాను. తెనాలి వచ్చినది మొదలు 20వ తారీకు దాకా అలా వినిపించాయి. ప్రస్తుతం మాటలు, దృశ్యాలు రావటం లేదు. నాకు అవి ఏమీ తెలియక పోవటం వలన అలా వ్రాసి ఉంచాను.

అల్లవరంలో అనుకోకుండా ఒక తెలుగు టీచరుతో పరిచయం అయింది. అతనికి కుండలినీ శక్తి గురించి కొంత తెలుసు. రెండు రోజుల క్రితం అతనువస్తే అనుకోకుండా అతనితో కుండలినీ శక్తి గురించి మాట్లాడటం జరిగింది. శ్రీ సాయిబాబాయే నాతో ఆ విధంగా మాట్లాడుతున్నారన్న భావన కలిగి, నేను పుట్టపర్తి వెళ్ళిన దగ్గర నుంచీ నా కలలు, అనుభవాలు అతనికి చెప్పాను. నేను చాలా అదృష్టవంతురాలిననీ, కష్టపడకుండానే భగవంతుడు ఈ శక్తిని ప్రసాదించాడనీ అన్నారు. ఇటువంటిది చాలా అరుదుగా జరుగుతుందని చెప్పారు.

నాకు దైవం తప్ప ఎవరూ లేరు. నా మంచీచెడూ ఆయనే చూస్తాడు. ఈ ప్రపంచ బంధాలతో నాకు సంబంధం లేదు. మీరు నా బిడ్డలు కాదని ఎప్పుడో చెప్పాను. అలా అని మీకు దూరం కాను. కావాలనుకున్న వాళ్ళు నా

దగ్గరకే వస్తారు. ఎవరికీ ఉత్తరాలు వ్రాయను. నీకయినా ఎందుకు వ్రాస్తున్నానంటే అమ్మ అమ్మకాదని తెలుసుకున్నావు కాబట్టి. మేము అల్లవరం ఊళ్ళోకి ప్రవేశిస్తుండగా షిరిడీసాయి ఫోటో కనిపించింది. నీ విషయం గురించి ఆలోచిస్తూ ఉండగా “ఇప్పుడు కాదు!” అని వినిపించింది. దైవలీలలు అద్భుతం! వేచి చూద్దాము.

మొన్న శనివారం ఉదయం వేంకటేశ్వరస్వామిని దివ్యమైన వెలుగులో విగ్రహరూపంలో చూశాను. భగవంతుడు ఇంతగా కరుణించి ఇక్కడే దర్శనం ఇవ్వటం నేను ఊహించలేనిది. దేవుడున్నాడని గట్టిగా చెపుతాను.

స్వామి లీలలు మనకి పరీక్ష. ప్రతిక్షణం భగవంతుడినే తలచు కుంటున్నాను. నన్ను బాధపెట్టేకొన్ని ఇలాంటి సంఘటనలు కలిగిస్తే ఆయనని దూషిస్తానేమోనని ఆయన పరీక్షలు పెడుతున్నాడు. అన్ని పరీక్షలూ తట్టుకునే శక్తిని ప్రసాదించిన తరువాత ఇంక నాకు భయం ఎందుకు?

నా గురించి వ్రాయటానికి ఏమున్నది? నేనంటూ ఒకటి ఉంటేకదా! ఈ మధ్య పడుకున్న వెంటనే అద్భుతమైన వెలుగు కనిపిస్తున్నది. ఇప్పటికి మూడుసార్లు అలా కనిపించింది. అదేమిటో నాకు అర్థం కాలేదు. తరువాత టీచరు గారు చెపితే ఆ వెలుగుకు అర్థం తెలిసింది.

వివేకానందుడి పుస్తకంలో వెలుగును గురించి వ్రాసిన విషయం నాకు చెప్పారు :-

“రామకృష్ణ పరమహంస వివేకానందుని అడిగారట. “పడుకునే ముందు నీకు అద్భుతమైన వెలుగు కనిపిస్తున్నదా?” అని. వివేకానందుడు ‘కనిపిస్తున్నది’ అని చెప్పాడు. జ్యోతి కనిపిస్తున్నది కాబట్టి నువ్వు జ్ఞాన సిద్ధుడవు” అని రామకృష్ణ పరమహంస చెప్పారు.”

నేను గొప్ప వ్యక్తిని కాకపోయినా చెడ్డదాన్ని కాదు. కాకపోతే పరిస్థితులు ప్రపంచం మీద విరక్తిని, దైవం పట్ల భక్తిని కలుగజేశాయి. దానితో దైవసన్నిధికి చేరాను. దైవత్వం నిండినవాడు సద్గురువు. అటువంటి సద్గురువు సాయి పాదాల చెంతకు చేరాను. భగవంతుడు ప్రసాదించిన తెలివితో భారం ఆయనపైన వేసి శరణాగతిని పొందాను. దానితో మోక్షం ప్రసాదించాడు.

సాయి దూరంగా ఉన్నాడు చూసేవాళ్ళకి, కాని నాకు మాత్రం నాలోనే ఉన్నాడు. స్వయంగా గురువై కలలో భగవద్గీతను ప్రసాదించి, ఆరునెలలుగా గీతాబోధచేస్తున్నాడు. తల్లికి బిడ్డ దూరంగా ఉన్నా తల్లి దృష్టి బిడ్డపైనే ఉంటుంది. అదే విధంగా సాయి నన్ను చూస్తున్నారు. ప్రతిక్షణం గీతామృతాన్ని త్రాగి తరిస్తున్నాను.

తుమ్మెద మకరందం కోసం పువ్వు చుట్టూ తిరిగి దానిలో ప్రవేశించిన తరువాత పువ్వులోని మకరందాన్ని గ్రోలుతూ తనను తానే మరిచిపోతుంది. ఆ విధంగానే న్యాయంగా ధర్మంగా నా శేషజీవితాన్ని గడపటం కోసం రెండేళ్ళు పిచ్చిపట్టినట్లు తిరిగాను. చివరకు సద్గురుసాయి పాదాల చెంతకు చేరాను. ఆయన ప్రేమతో నన్ను చేరదీశారు. ఆయన పదకమలాల మధ్య నా మనసు చిక్కుకుని గీతామృతాన్ని గ్రోలుతున్నది. ఆ రుచి మరిగిన తరువాత ఈ ప్రపంచంలోని ప్రతిదీ అరుచిగానే ఉంటుంది. అందుకే ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువు మీదా వ్యామోహం పోయింది. స్వామి నా మనసు మేలిమి బంగారంలా తయారు చేశారు. ఇక మీదట ఈ స్వచ్ఛమైన బంగారానికి ఏ రూపాన్ని ప్రసాదిస్తారో చూడటమే నా పని.

భగవంతుని కంటె చూడదగిన వస్తువు వేరొకటి ఏదీ లేదని తెలుసుకుని, ఏం చేస్తే కనిపిస్తాడో అన్నీ చేసి డబ్బు ఖర్చు లేకుండా ఆ దైవాన్ని చూసిన నాకు ఇంక చూడవలసింది ఏమీ లేదు. ఎక్కడికో వెళ్ళి ఏదో చూడాలన్న

కుతూహలం కూడా లేదు. నాలోనే ఉన్న దైవాన్ని చూస్తున్నాను. మాట్లాడు తున్నాను. నాకు ఈ తృప్తి చాలు. అంత అవసరం అయితే ఆ దైవమే నాకు అన్నీ చూపిస్తాడు.

ఎన్ని నిర్ణయాలో తీసుకుని, ఎన్ని పద్ధతులో ఆచరించి వాటికి కట్టుబడి పరమాత్మను నాలో నిలుపుకున్నాను. ఆ మూర్తిని దూరం చేసుకోలేను. నా ఆనందాలు అన్నీ దైవంతోనే. దైవాన్ని నమ్ముకున్నాను. ఆయన తినటానికి లేకుండా చేసినా సరే ఆనందంగా జీవిస్తాను. నశించే ఈ శరీరాన్ని యాచించి పోషించనక్కరలేదు.

నశించే వాటి మీద వ్యామోహం లేదు. మీరు అమ్మ అనుకుంటున్న మీ అమ్మ 1984 జులై 13వ తేదీ గురుపూర్ణిమ నాడు ఆత్మను పరమాత్మలో కలుపుకున్నది. నా శరీరాన్ని చూసి అమ్మ అని అనుకుంటున్నారు. 1974లో నాన్నగారిని పోగొట్టుకున్నారు. 1984లో మీ అమ్మ దూరం అయింది. నా కోసం మీరు బాధపడవద్దు. నేను చాలా ఆనందంగా ఉన్నాను. నాలో జరుగుతున్న ప్రతి మార్పు అద్భుతం! అమోఘం! ఎన్నని వ్రాయను?

ఈ ఉత్తరాలలో ముఖ్యమైనవి ఏవైనా ఉంటే అవన్నీ ఒక క్రమపద్ధతిలో వ్రాయి. ఎప్పటికైనా పనికి వస్తాయి. ఆ టైము నీకు భగవంతుడు ప్రసాదిస్తాడు. నేను ఇలా వ్రాస్తున్నానంటే ఏదో ప్రత్యేకత ఉండి ఉంటుంది. ఏ మంచిపని చేసినా అందులో అమ్మను చూసుకో. నిన్ను మొదటి సారి "బంగారూ" అని పిలిచాను. ఉత్త బంగారం కాక మేలిమి బంగారంలా అవ్వాలి. అప్పుడే అమ్మ ఆశయాలు వెలుగులోకి వస్తాయి.

నేను నీ విషయంలో అన్నది ఇంకా జరగలేదు. అంటే ఏదో కారణం ఉండి ఉంటుంది. అందుకే నిశ్చింతగా ఉన్నాను. ఇల్లే సత్యం అని అనుకోకుండా

పూర్వ జన్మ సుకృతంతో "తామరాకు మీద నీటి బొట్టు"లాగా సంసారం చేశాను. అలా అని ఎవ్వరినీ సన్న్యసించమని చెప్పను. భగవంతుడు ప్రసాదించిన దానితో అన్ని ఆనందాలు ఆనందంగా అనుభవించండి.

ఇప్పుడు నాకు ఒంటరితనం అనిపించటం లేదు. మనసంతా భగవంతుడు నిండి ఉన్నాడు. ఎంత సమయము దేవుడితో మాట్లాడటానికే చాలటం లేదు. తీరికలేదు. పదిహేనేళ్ళ వయసులో పుట్టిల్లు విడిచి నాన్నగారితో కొత్త జీవితం ప్రారంభించాను. గడచిన జీవితంలో భరించలేని కష్టాలు ఏమీ అనుభవించలేదు. అతి మాములుగా జీవితం గడిచిపోయింది.

నాన్నగారిని పోగొట్టుకుని భరించలేని బాధను అనుభవించాను. ఇప్పుడు ఆ బాధ లేదు. పుట్టినవారు గిట్టక మానరని తెలిశాక ఇప్పుడు భగవంతుడిని తోడు చేసుకుని రెండవసారి మళ్ళీ జీవితాన్ని ప్రారంభించాను.

తల్లి, తండ్రి, భార్య, పిల్లలు కొంతకాలమే. చివరిదాకా ఉండేది దైవం ఒక్కడే. పూర్వజన్మ సుకృతం వలన ఈ సత్యం త్వరలో తెలుసుకుని, భవబంధాలు తెంచుకుని పరమాత్మ అండన చేరాను. నేను నమ్మిన నా దైవం నన్ను మోసం చెయ్యడు. ఆయన నీడలో నా జీవితం సుఖంగా అంతమవుతుంది. ఇంకా కర్మ ఉన్నది. అందుకే మళ్ళీ సంసారం ప్రారంభం అయినది. ప్రతి చిన్న పనిలోనూ పరమాత్మనే చూస్తున్నాను. నాకు కావలసిన చిన్న చిన్న పనులు మనుషులచేత స్వామే చేయిస్తున్నారు. బడి – గుడి అన్నారు.

విశాఖ పట్టణంలో నాన్నగారి పేరు మీద స్థాపించిన టి.జె.ఆర్. ట్యుటోరియల్స్‌లో నేను కోరుకున్న స్వీపరు పని స్వామి నాకు ప్రసాదించారు.

3. "…. నీ విషయంలో నేను అనుకున్నది అబద్ధం కాదు. అది నిజం అయ్యేంత వరకూ నీకు ఉత్తరం వ్రాయను. కోపంతో వ్రాయలేదని బాధపడకు.

ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత దానికి కట్టుబడి ఉండటం తప్ప నా నిర్ణయాన్ని మార్చుకోను. నా గురించి నేను వ్రాయను. నువ్వే తెలుసుకుందువు కాని.

సోమరిపోతులా తింటూ కూర్చోవటం భగవంతుడు మెచ్చడు. కొన్ని పరిస్థితుల ప్రభావంతో మనిషిలో మానవత్వం నశించి, దానవునిగా మారతాడు. కానీ, పూర్వజన్మ సుకృతం కొద్దీ నాలో దైవత్వం చోటు చేసుకున్నది. నాకు అంతా ప్రశాంతతే. అంటే బాధేలేదని కాదు. బాధను భరించే శక్తి నాకు దైవం ప్రసాదించిన వరం.

నా ఉత్తరం కోసం ఎదురు చూడకు. నువ్వు నాకు ఎప్పుడూ బంగారువే. ఈ ప్రపంచంలో నేను ద్వేషించేవారు ఎవ్వరూ లేరు. నేను కావాలని అనుకున్న వాళ్ళకి ఎప్పుడూ దూరం కాను.

మనస్సును పిండే బాధ. అప్పుడే దైవ సాక్షాత్కారం. నీలమేఘశ్యాముని దివ్య దర్శనం. మానవుడు మాధవుడిగా మారిన తర్వాత ఇంకా మార్పు ఏముంటుంది? జీవాత్మ పరమాత్మలో కలిసిపోయిన తర్వాత ఆ ఆనందం 'ఇంత' అని చెప్పలేనిది.

ఏ బిడ్డ ప్రేమకోసం ఈ తల్లి తపించిందో ఆ ప్రేమ చిన్ని కృష్ణయ్య ద్వారా పొందుతున్న నాకు ఇంకేమి కావాలి? ఈ ప్రపంచంలో డబ్బుతో కొనలేనిది దైవాన్ని. ఆ దైవాన్ని ప్రేమతో కట్టిపడవేసిన నీ తల్లి ఎంత అదృష్టవంతురాలో ఊహించు!!

4. "....... పరమేశ్వరుడికి ఇప్పటికి మన మీద దయ కలిగింది. మన ఇద్దరి కోరిక తీరుతుంది. ఆ సమయం వచ్చింది. స్వామి కరుణించారు.

నీ దగ్గర నుంచి వచ్చినప్పటి నుంచీ రోజుకొక అనుభవం. నీకు

ఎప్పటికప్పుడు వ్రాయాలనే అనుకున్నాను. కాని, వ్రాయలేక పోయాను. ఇన్ని రోజులు ఎందుకు ఇలా జరిగిందా అని బాధ పడ్డాను. స్వామి ఎందుకు వ్రాయనివ్వలేదో ఈ రోజే తెలిసింది. ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. నీకు ఉత్తరంలో వ్రాయటం కాదు. వచ్చినప్పుడు చెపుతాను. స్వామి దయ వలన నువ్వు త్వరలోనే నా దగ్గరకు వస్తావు. సాయి మాత నీ కోరిక తీరుస్తుంది!"

5. "... నేను అజ్ఞానిని... పదినెలలుగా నా స్థితి ఏమిటో తెలియక తపిస్తుంటే దైవం నీ రూపంలో వచ్చి 'నీ స్థితి ఇది' అని తెలియచేశారు. నాకు కలిగిన యోగం ఏమిటో కొంత తెలిసింది. వినాయకుడి గుడిలో శ్రీ భాష్యం అప్పలాచార్యులుగారు చెపుతున్న సుందరకాండ వింటూ ఉంటే నా స్థితి పూర్తిగా అర్థం అయింది. నాలో కలుగుతున్న మార్పులు, వింటున్న మాటలు, కనబడుతున్న దృశ్యాలు – వీటన్నింటికీ అర్థం "అరటి పండు ఒలిచి పెట్టినట్లుగా" అర్థం అయింది. కాని, మళ్ళీ చెప్పాలంటే ఏ ఒక్కటీ జ్ఞాపకం రావటం లేదు. ఇలాంటి వాళ్ళు కోటికొకరు అని ఆయన చెపుతుంటే అదే స్థితిలో ఉన్న నాకు అది విని తట్టుకోవటం చాలా కష్టం అయింది. అయినా నా భక్తి బహిర్గతం కాకూడదు. ఒక్కొక్కసారి ఒంట్లోంచి వేడి ఆవిరులు, చెమటలు అన్నీ భరించే శక్తి స్వామే ప్రసాదిస్తున్నారు.

గుడిలో అప్పలాచార్యులుగారు రామముద్రిక గురించి చెపుతూ ఉంటే ఆ అనుభవం నాకు కూడా అయింది. కాబట్టి ఆనందంతో నన్ను నేను అదుపు చేసుకోవటం కష్టం అయింది" –

అల్లవరం నుంచి వైజాగ్ వెళ్ళాక కొన్ని దివ్యానుభూతులు కలుగుతున్నాయి.

15.5.85 గురువారం నాడు సత్యసాయి ఫొటోరూపంలో ఇంట్లో ప్రవేశించారు.

19.5.85 ఈ రోజు పరమాత్మ మా మనుమరాలు "దీప్తి" రూపంలో స్వయంగా వచ్చి నా ఒడిలో కూర్చోవటం జరిగింది. నేను ఆనందభాష్పాలతో స్వామిని అభిషేకించాను. స్వామి నాచేత స్వయంగా పాయసం చేయించుకుని శక్తిరూపంలో ప్రసాదం స్వీకరించటం జరిగింది.

29.7.85 దృశ్యం – "ఉల్లిపాయ పొరలు తీస్తుంటే దాంట్లో అద్భుతమైన వెలుగు"

అర్థం: ఉల్లిపొరలు లాగా మాయపొరలు తొలగిపోయి, అజ్ఞానం అంతరిస్తే ఆత్మజ్యోతి ప్రకాశిస్తుంది.

తర్వాత అనేక రూపాలలో నాకు దైవ దర్శనం అయింది. ఏ రూపం చూసినా అందులో భగవత్స్వరూపమే గోచరించింది.

14.8.85 "చదువుల తల్లి సరస్వతి కోడిపుంజు రూపంలో దర్శన మిచ్చింది. కోడికూతతో మేల్కొంటారు. అలాగే అజ్ఞానమనే నిద్రలో ఉన్నవారిని తట్టిలేపేదే జ్ఞానం. జ్ఞానమే సరస్వతి. అందుకే అమ్మ అలా కోడిపుంజు రూపంలో కనిపించిందని తర్వాత తెలిసింది.

నాకు పరలోక విద్యను ప్రసాదించిన సరస్వతికి కన్నీటితో అభిషేకం చేశాను. తల్లీ! దివ్యజ్ఞానమైన ఆత్మతత్త్వాన్ని బోధించిన నిన్ను నా హృదయపీఠం మీద నిలుపు కోవటం కంటె నీకు నేనేమి ఇవ్వగలను తల్లీ! ఇవ్వగలిగింది ఇంకేమి ఉంది!

18.8.85 దృశ్యం – తెల్లని దుస్తులలో ఉన్న స్త్రీ అన్నమాట –

"నేను ఎందుకు ఇప్పుడు రావాలి? నేను ఎక్కువ మాట్లాడను" పంజాబీ దుస్తులలో పలక పట్టుకుని ఒక అమ్మాయి అన్నమాట "చూపించనా? - రాసుకో!".

తెల్లని దుస్తులలోని స్త్రీ శివశక్తి స్వరూపమైన సాయిమాత. "నేను ఎందుకు ఇప్పుడు రావటం" ఎక్కువగా మాట్లాడను అంటే "ఆత్మజ్ఞానాన్ని అనుభవానికి తీసుకువస్తాను. అనుభూతులన్నీ వ్రాయి".

1984 గురుపూర్ణిమకి వెళ్లినపుడు స్వామి కన్నెత్తి చూడలేదు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అయినా కొండంత తృప్తిని ఇచ్చి' స్వయంగురువై ఇంత జ్ఞానాన్ని ప్రసాదించిన స్వామికి ఇవ్వటానికి నా దగ్గర ఏమున్నది? ఆత్మనివేదనే గురు దక్షిణ. సత్యసాయి పాదాల వద్ద కర్పూరంలా కరిగిపోతున్నాను. ఈ ప్రపంచంలోని సుఖాలు నేను ఎన్నడూ కోరుకోలేదు.

"నేను పుట్టి ఏమి సాధించాను?" అని నాలో నేను కుమిలిపోయే దాన్ని. కాని, ఇపుడు తెలిసింది జన్మకు కారణం!"

తండ్రీ! నన్ను నీలో కలుపుకోవయ్యా! ఈ మాయా ప్రపంచంలో ఇమడలేను శివా! ఆత్మజ్ఞానంతో మాయను ఛేదించుకుని, నీ వెలుగును చూసిన నేను ఈ చీకటి ప్రపంచంలో ఇమడలేను శివా! పరమేశ్వరా! మోక్షం ప్రసాదించు సాయి కృష్ణా!

ఒక మంగళవారం రాత్రికలలో పెద్ద వెలుగు, మెరుపులు. దృశ్యం శ్రీశైల భ్రమరాంబ.

ఈ రోజు ఉదయం ఒక అద్భుతం జరిగింది. నేను పని చేసుకుంటున్నాను. "అమ్మా!... అమ్మా!" అని ఒక ముష్టి అమ్మాయి పిలిచింది.

మా అమ్మాయితో చెప్పి బియ్యం వేయించాను. ఆమె మళ్ళీ కాన్వెంటు పెద్దగేటు వైపు వచ్చి మళ్ళీ "అమ్మా" అని పిలిచింది. సరే! ఒక పావలా తీసుకుని నేనే వెళ్ళాను. ఒక ముసలి ఆవిడ కాషాయరంగు జాకెట్టు, ఆకు పచ్చని చీరె, చంకలో చీపురుతో కనిపించింది. ఒక్కసారిగా షాక్ కొట్టినట్లయింది. చీపురుతో రావటం చేత లక్ష్మి అని, అనుకున్నది జరుగుతుందని తెలియచేసే దృశ్యమని అనుకుని మనసులోనే దణ్ణం పెట్టుకున్నాను. ఆవిడ "అన్నపూర్ణ... అన్నపూర్ణ" అంటు వెళ్ళిపోయింది. ఇంట్లోకి వచ్చాక తట్టింది "శ్రీ సత్యసాయి బాబా శక్తిరూపంలో వచ్చి దర్శనం ఇచ్చారని!"

ఒకరోజు నేను మా బంధువు రమ ఇంట్లోకి వెళ్ళగానే చీపురుతో దొడ్లు కడుగుతూ పాకీ అతను కనిపించాడు. లోపలికి వెళ్ళిన తర్వాత అతను దొడ్డి కడిగి వెళుతూ నన్ను పరీక్షగా చూసి వెళ్ళాడు. ఇప్పుడు అనిపిస్తున్నది సాయి ఆ రూపంలో నన్ను చూశారని. ఏమిటి ఈ విచిత్రాలు! నేను పుట్టపర్తి నుంచి వచ్చిన తర్వాత మళ్ళీ ఇంటి వాతావరణంలో ఇమడలేనేమోనని అనిపించింది. అప్పుడు స్వామిని మళ్ళీ వేడుకున్నాను "చచ్చిపోవాలని అనుకున్నదాన్ని బతికించి నన్ను ఎందుకిలా ఏడిపిస్తున్నావు? అని", అలా ఏడుస్తూ "నాదీ అనే ఒక చోటు నాకు కావాలి. పాకీ దొడ్లయినా కడుగుతాను, ఏ పనయినా చేస్తాను. నాకు ఇంత చోటు చూపించమని" వేడుకున్నాను. అది జ్ఞాపకం చేస్తూ స్వామి అలా కనిపించారని ఇప్పుడు అనిపించింది. "సాయి ఏ రూపంలోనైనా దర్శనం ఇవ్వవచ్చును" అని.

29.8.85 వృషభరూపంలో సాయి దర్శనం.

దృశ్యం: "ఒక స్త్రీ చక్రం మధ్య గుండ్రంగా తిరుగుతున్నది. ఒక వ్యక్తి ఆ స్త్రీని అందుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు".

అర్థం: శ్రీ చక్ర స్వరూపిణి లలితాంబిక. శివశక్తి స్వరూపం. అది ముక్తికాంతను అందుకోవటానికి సాధకుడు చేస్తున్న ప్రయత్నం.

మరొక దృశ్యం – “దివ్య తేజస్సుతో శ్వేత వర్ణపు పడగ, తెల్లని కాంతి పుంజం, ఎగురుతున్న మూడు పక్షులు”

భావం: ఎగురుతున్న పక్షులే త్రిగుణాలు. దివ్యతేజస్సుతో శ్వేతవర్ణపు పడగ. అనగా అది ఆదిశేషువు. తెల్లని కాంతి పుంజం. అంటే తెల్లని కాంతితో ప్రకాశించే శ్రీమహావిష్ణువు. తురీయావస్థలో గోచరించేది అంతా వెలుగే.

దివ్యతేజస్సుతో ఆదిశేషునిపై పవళించిన శ్రీమహావిష్ణువే తురీయావస్థలో గోచరించే అనంతమైన వెలుగు.

29.8.85 ఉదయం నుంచీ ఏదో వేదన, తపన. “నా స్వయం గురువై నాకు ఆత్మతత్త్వం బోధించావు. చదువు పూర్తయింది. గురు దక్షిణగా నేను ఏమివ్వగలను? నీ అంతదాన్నిగా నన్ను తీర్చిదిద్దుకున్నావు. నన్ను నీకు అర్పించుకున్నాను. నన్ను పదిమందికీ పనికి వచ్చేలా తీర్చిదిద్దమని” వేడుకున్నాను. “నేను ఇక్కడ నువ్వు అక్కడ! నిన్ను చూసేదెలా?” అని అనుకున్నాను.

మధ్యాహ్నం భోజనం సమయంలో ఒకరు శివసాయి ఫొటో తెచ్చి ఇచ్చారు. అప్పుడు నా ఆనందానికి అవధులు లేవు! నాకు బాబా స్వయంగా వచ్చినంత తృప్తి కలిగింది. చేతిలోని ఫొటో అలమరలో పెట్టి భోజనం చేద్దామని కంచంలో అన్నం పెట్టుకుని తినబోతుంటే “షాక్” కొట్టినట్లయింది. అది వరకు బాబా ఫొటో ఉన్న స్థలంలో ఫొటో పెట్టాలని వెంటనే అక్కడ పెట్టాను. “నా యోగం పూర్తయింది. స్వామికి పాద నమస్కారం ఎలా చెయ్యను?” అని

ఉదయం నుంచీ ఎంతో ఆర్తితో అనుకున్నాను. అందుకే స్వామి ఫోటో రూపంలో వచ్చారు అని అనిపించింది. వెంటనే కర్పూరం వెలిగించి హారతి ఇచ్చి పాద నమస్కారం చేసుకున్నాను. ఇది స్వామి లీల కాదా!

30.8.85 శుక్రవారం. ఉదయం తలంటి స్నానం చేసి, తులశమ్మ చుట్టూ ముగ్గులు పెట్టి, పసుపు కుంకుమ చల్లాను. ఏదో ప్రత్యేకమైన రోజునే అలా చెయ్యటం జరుగుతుంది. ఈ రోజు అలా చేశానంటే ఏదో ప్రత్యేకమైన కారణం ఉండి ఉంటుందని అనుకున్నాను. ఏదో ప్రేరణతో పాయసం చేశాను. గిన్నెకు పసుపు పూసి, కుంకుమ పెట్టి పొంగలి చేశానంటే అది సాయి ప్రేరణే. పాయసం ఉడుకుతున్నప్పుడు పాలు పొంగుతుంటే ఏదో అద్భుతంగా అనిపించింది. భక్తి పొంగాలని దణ్ణం పెట్టుకున్నాను. అప్పుడు రేడియోలో 11.40 ని॥లకి అన్నీ కృష్ణుడి పాటలు, అన్నాచెల్లెళ్ళ పాటలు వచ్చాయి. ఔను! కృష్ణుడు చెల్లెలు ద్రౌపదికి చీరలు ఇచ్చాడు. ఇప్పుడు నాకు వస్త్రం ఇవ్వబోతున్నాడు. ఇది తెలియచెయ్యటం కోసమే ఈ పాటలు! మొదటి ప్రసాదం ఎవరు తింటారా! అని అనుకున్నాను. మా మనుమరాలు దీప్తికి పెట్టమని సాయి చెప్పారు.

దానికి పసుపురాసి, బొట్టుపెట్టి పాయసం పెట్టాను. కొంత పెరట్లో వేశాను. నాలుగు కాకులు వచ్చి తిన్నాయి. ఆ నాలుగు కాకులూ కూడా ఏదో ఒక అవకరంతో ఉన్నాయి. నా శేష జీవితం అటువంటి వికలాంగులైన వ్యక్తులకు అంకితం కావాలని కోరుకున్నాను. "కాళ్ళు ఉండీ దైవబాటన నడవని వాళ్ళు, కళ్ళు ఉండీ అంతర్ముఖులై పరమాత్మని చూడని వాళ్ళు, మనసుండీ ప్రేమతత్త్వం లేనివాళ్ళు, చేతులు ఉండీ సేవ చేయని వాళ్ళు వీళ్ళే నిజమైన వికలాంగులు" అని స్వామి అర్థం తెలియచేశారు.

స్వామిని తలుచుకుంటుంటే కంటి వెంట నీరుధారగా కారేది. ఇప్పుడు అలా కంటనీరు రావటం లేదు. మనసు బండ బారినట్లుగా ఉంది. భక్తి పాటలు వింటు ఉంటే పారవశ్యంతో అణువణువూ పులకరించి భగవంతునిలో లీనమైనట్లు అనుభూతి కలిగేది. ఇప్పుడు ఆ స్పందన లేదు. నాకు ఆ దుఃఖం కావాలి. నా స్వామి కోసం ఇంకా ఇంకా ఏడవాలి. ఇలా ఎందుకు అయింది? నేను శిలలా మారిపోయానా? భక్తుడు భగవంతునిలో లీనమయ్యాక అతని స్థితి ఇలాగే ఉంటుందా! స్వామే తెలియచెయ్యాలి!

7.9.85 ఈ రోజు కృష్ణాష్టమి. కాని, ప్రత్యేకంగా ఏ పూజా చెయ్యాలని అనిపించలేదు. "కృష్ణా! నన్ను నీకు అర్పించుకున్నాను. ఇంతకంటె ప్రత్యేకంగా నీకు వేరే ఏమీ ఇవ్వలేనయ్యా" అని నేనే ఆయనకి నివేదన అయ్యాను.

దృశ్యం: నేను తెల్లని వస్త్రాలతో చల్ల చిలుకుతూ ఉంటే చిన్ని క్రిష్ణయ్య నా దగ్గరికి వచ్చి గోరుముద్దలు తినటం, ఈ ప్రపంచం అంతా శూన్యంగా అనిపించింది"

"నన్ను నీలో త్వరగా కలుపుకోవయ్యా" అని స్వామిని వేడుకున్నాను. "పరమేశ్వరా! నువ్వు తప్ప నాకెవ్వరూ లేరు. నీకోసమే బ్రతుకుతున్నాను. అన్ని బంధాలు తెంచుకున్నాను. నన్ను త్వరగా నీలోకి చేర్చుకోవయ్యా! ఈ ప్రపంచంలో నేనింక ఇమడలేనని దుఃఖించాను.

22.9.85 దృశ్యం: "విష్ణుచక్రం". కుర్చీలో బ్రాహ్మణుడు కూర్చుని ఉన్నాడు. ఆయన నుదుట బ్రహ్మాండమైన వెలుగు.

20.9.85 గుడిలో సుందరకాండ పారాయణం జరుగుతుంటే వెళ్ళాను. సుందరకాండ వింటూ ఉంటే నేను అనుభవిస్తున్న స్థితి జీవాత్మ పరమాత్మలో

కలిసిపోయినప్పుడు కలిగే ఆనందం అని నిర్ధారణ చేసుకున్నానను. నా స్వయం గురువు శ్రీ సత్యసాయిబాబాను తలచుకుని తన్మయత్వం చెందాను. సాయి అవతార పురుషుడు. సద్గురువు. ఎన్ని జన్మల పుణ్యమో నన్ను సాయి పాదాల చెంతకు చేర్చింది.

26.9.85 ఉదయం లేచిన దగ్గర నుంచీ ఈ రోజు గుడిలో సుందరకాండ చెప్పటం పూర్తవుతుంది. ఎలాగైనా శ్రీ భాష్యం అప్పలాచార్యులు గారికి పాద నమస్కారం చెయ్యాలి. ఎలాగా! అని అనుకున్నాను. నా కోరిక తీర్చటానికా అన్నట్లు ఆయన మేము ఉన్నదగ్గరకే వచ్చారు.

నా జీవితంలో ఎప్పుడూ ఎవరినీ గురువుగా భావించి నమస్కారం చెయ్యలేదు. కాని, పంచాక్షరీ జపం ముందు హైదరాబాదులోని సత్యనారాయణ స్వామి కోవెలలో "నా సత్యసాయే ఈ రూపంలో వచ్చారని" ఒకరికి పాద నమస్కారం చేశాను. మళ్ళీ తొమ్మిది నెలల తర్వాత నా యోగం పూర్తయ్యాక ఈ రోజు నా స్వయం గురువు ఈ రూపంలో వచ్చారని తలచి మళ్ళీ పాద నమస్కారం చేశాను.

సాయి తలచుకుంటే జరగనిది ఏమున్నది?

27.9.85 మధ్యాహ్నం కలత నిద్రలో మృదంగనాదం వినపడటంతో పాటు ఎవరో అడుగులు వేస్తున్న దృశ్యం కనిపించింది. అస్పష్టమైన ఆ మృదంగ నాదం నన్ను ఏవో లోకాలకు తీసుకు వెళ్ళింది. చెప్పలేని, భరించలేనంత ఆనందం కలిగింది. పుస్తకజ్ఞానం లేని నాకు స్వామి ఏమి అర్థం తెలియచేస్తారో?

రాత్రి కనబడిన దృశ్యం "అద్భుతమైన కాంతిపుంజం".

28.9.85 రేడియోలో ఉదయం సంగీత శిక్షణ కార్యక్రమంలో ఒక పాట వచ్చింది. 'వేణునాదం హృదయం తొలిచేస్తుంటే మృదంగ నాదమే ప్రణవ

మంత్రమైతే అదియే దైవం" అని పాట. ఆ పాట వింటూ ఉంటే నాకు నిన్న అంటే 27.9.85న కలత నిద్రలో వినబడిన మృదంగనాదానికి అర్థం తెలిసి పరవశిస్తూ, ఆనంద భాష్పాలు కారుస్తూ సాయి పాదాలు కడిగాను.

మూడు గం॥ల ప్రాంతంలో వంట్లో ఏదో కదలిక. "జెర్క్" (Jerk) ఇచ్చినట్లయింది. కొద్దిరోజుల క్రితం కూడా ఒకసారి ఇలాగే అయింది. రాత్రి పడుకున్నప్పుడు పాదాలలో నుంచి ఏదో పాకినట్లు వణుకు వచ్చింది. మా అమ్మాయి సుజాతతో చెప్పాను. ఇలా ఎందుకు జరిగిందో నాకు తెలియలేదు. అప్పటికి ఊరుకున్నాను.

సుందరకాండ చెపుతూ అప్పలాచార్యులుగారు చెప్పారు "కుండలినీ శక్తి పైకి లేచినప్పుడు శరీరం కదిలినట్లు అవుతుందని" సరిగ్గా ఇందాక అలాగే జరిగింది. మళ్ళీ మాములుగా అయ్యాక ఇది వ్రాస్తున్నాను.

ఆ మధ్య ఒకసారి ఒళ్ళంతా బరువెక్కింది. దీనికి అర్థం స్వామే ఎప్పుడో తెలియచేస్తారు. ఎవరైనా గురువుకు సేవలు చేస్తూ ఇటువంటి యోగాన్ని పొందుతారు. కాని, నాకు మాత్రం నన్ను దూరంగా ఉంచి, ఆయన దృష్టినంతా నా మీద ప్రసరింపచేసి యోగ మార్గాన నడిపిస్తున్నారు. ఈ స్థితిని తట్టుకోలేనేమోననిపించి స్వామినే శక్తినిమ్మని వేడుకుంటున్నాను. ఆయనే అంతా భరించి మాములుస్థితికి తీసుకు వస్తున్నారు. ఈ స్థితిలో జరుగుతున్న సంగతులు ఎవ్వరికీ చెప్పకూడదుట నమ్మకం లేనివాళ్ళకి. స్వామి అనుజ్ఞతో కొన్ని మాత్రం యశోదకి చెపుతున్నాను.

మోహంతో నన్ను బంధించక మనుషులకు దూరంగా ఉంచి వాళ్ళని ప్రేమించటమే తప్ప వాళ్ళకి బందీకాకుండా నా సాయి నన్ను ప్రతి క్షణం

చూసుకుంటున్నాడు. నేను, నా లోకం వేరు. నా దైవం నాలోనే ఉన్నాడు. ఎవ్వరితోనూ మాట్లాడాలని లేదు. అలాగని ఎవ్వరిమీదా ద్వేషం లేదు.

"స్వామీ! నన్ను నీలోకి ఎప్పుడు చేర్చుకుంటావు?" అని ప్రార్థిస్తూ నా పనులు నేను చేసుకుంటూనే మానసిక జపం చేసుకుంటున్నాను. అదే అఖండజపం. ఈ జగత్తు అంతా చీకటిగా ఉన్నది. దివ్యమైన కాంతి పుంజం చూసిన నాకు ఈ ప్రపంచంలోని సుఖాలు సంతోషం కలుగ చెయ్యటం లేదు.

2.10.85 సూర్యభగవానుని తలుచుకుని "భగవాన్! నిన్ను స్తుతించటానికి ఏ మంత్రాలు రావయ్యా. నిన్ను ప్రేమగా పిలవటం తప్ప" అని అనుకుని, లోపలికి వచ్చి ఎందుకో ఒక్కసారి కళ్ళు మూసుకున్నాను. అంతే అద్భుతమైన వెలుగు ... ఆకాశంలో రంగులు! సూర్యబింబం! తర్వాత చీకటి చంద్రుడు! ఇది ఏమిటో అర్థంకాక అలా ఉండిపోయాను. మళ్ళీ కళ్ళు మూసుకుంటే అదే వెలుగు!

ఏమిటీ ఈ అద్భుతం! అని ఆశ్చర్యం నుంచి తేరుకున్న తర్వాత స్వామి తెలియచేశారు. వాళ్ళు సూర్యుడు చంద్రుడు అని! ఈ సంతోషం భరించలేను! కాని ఏం చెయ్యను! చెపితే ఇది సత్యం అని అర్థం చేసుకునేవాళ్ళు లేరు.

"స్వామీ! ఈ ఆనందం నాతో పాటు నువ్వు పంచుకోవయ్యా!" అని పరమాత్మను వేడుకున్నాను.

5.10.85 ఉదయం తలంటుకుంటూ చాలారోజుల తర్వాత తలమీద నూనె పెట్టుకుంటూ "స్వామీ! ఇవి నీ చేతులే! ఆశీర్వదించ"మంటూ మూడుసార్లు తలపై నూనె పెట్టుకున్నాను.

6.10.85 ఈ రోజు మా మనుమరాలు దీప్తి (దానికి అప్పుడు 3

ఏళ్ళు) నన్ను "నువ్వు అమ్మమ్మవి కావు" అన్నది. తర్వాత అద్దం తెచ్చి దానిలోకి చూస్తూ "పరమేశ్వరా! పరమేశ్వరా!" అనటం మొదలు పెట్టింది. "పరమేశ్వరుడు ఏడీ" అంటే నా వీపుమీద, తలలోనూ ఉన్నాడని చూపించింది. ఇలా దీప్తి చెప్పటానికి ముందు నేను "స్వామీ! క్రిందటి సం॥ దసరాకి వద్దామంటే రానివ్వలేదు. అద్దంలో చూసుకు రమ్మన్నావు. నన్ను నీ దగ్గరకు చేర్చుకో! నేను ఆత్మను తెలుసుకున్నాను" అని అనుకున్నాను. ఇంతలో దీప్తి ఇలా చేసింది. సాయే ఆ రూపంలో నాతో "అద్దంలో (ఆత్మలో) పరమాత్మను చూసుకున్నావు" అని చెప్పినట్లయింది.

8.10.85 రాత్రి కలలో "అద్భుతమైన కాంతితో గోపురం కనిపించింది. మడి, ఆచారాలతో దేవుడు కనిపించడు అని అన్నయ్యకి చెప్పాను".

షిరిడీ బాబా ఫొటోకి పూలు పెట్టి కళ్ళు మూసుకుంటే జ్యోతి కనిపించింది.

13.10.85 రాత్రి చికాగ్గా ఉంటే పెరట్లో తులసిచెట్టు ఎదురుగా కూర్చున్నాను. కొంచెం ప్రశాంతంగా ఉన్నది. కళ్ళు మూసుకుంటే వెలుగులు చిమ్ముతూ నక్షత్రం కనిపించింది.

సాయంత్రం మా అమ్మాయి సుధ సుందరకాండ చదివి వినిపిస్తుంటే అందులో "సీత, హనుమంతుడు తనను రాముని వద్దకు చేర్చగలడా?" అని అనుమానిస్తుంది. అప్పుడు నాకు ఇలా అనిపించింది "సీతాదేవికే అంతటి అనుమానం వచ్చింది. అలాంటిది నాకు కలగటంలో ఆశ్చర్యం ఏమున్నది?" అని.

"సత్యసాయీ! నన్ను ఈ సంసార సాగరాన్ని దాటించు మధ్యలో వదిలిపెట్టకు" అని వేడికన్నీళ్ళతో సాయిపాదాలు కడిగాను.

14.10.85 మధ్యాహ్నం దృశ్యం – "మబ్బులలోకి చంద్రుడు వెళ్ళటం" (ఈ దృశ్యానికి 1995లో స్వామి అర్థం తెలియచేశారు)

"పరాశక్తిని తెలుసుకోవాలన్న సాధకుడు గురువు అనుగ్రహంతో యోగమార్గాన పయనిస్తూ తల్లిని వెతికే ప్రయత్నం చేస్తున్నప్పుడు చంద్రుడు మంచి మనసుతో కురిపించే చల్లని వెన్నెల వెలుగులలో శక్తి దర్శనభాగ్యం పొంది ఆనందిస్తారు. కాని, తమోగుణంతో, రాక్షస ప్రవృత్తితో రావణుని వలె అమ్మని సమీపించే ప్రయత్నం చేసినప్పుడు చంద్రుడు తన వెన్నెల కనిపించకుండా మబ్బులలోకి వెళతాడు".

7.10.85 ఉదయం స్నానం చేసి వస్త్రం ప్రసాదించమని చేతులెత్తి నగ్నంగా ప్రార్థించాను. కళ్ళు మూసుకుంటే జ్యోతి కనిపించింది. పదిమందికీ పనికి వచ్చే పదార్థంగా తయారు చేయమని సాయిని వేడుకుంటూ విపరీతంగా దుఃఖించాను.

29.10.85 స్వామిని తలుచుకుని "స్వామీ! నీ అరవైయ్యవ పుట్టినరోజు నాటికి ఎలాగయినా పుట్టపర్తి తీసుకువెళ్ళమని" ఏడిచాను. స్వామి దయ ఉంటే వెళతారేమోనని యశోద అన్నది.

30.10.85 ఉదయం నుంచీ ఎంతో ప్రశాంతంగా ఉన్నది. పుట్టపర్తి వెళ్ళాలి అన్న ఆదుర్దా లేదు. వారం రోజులు అన్నం తినను అని అనుకున్న నాచేత స్వామి అన్నం తినిపించారు. అంతా సాయిలీల! పుట్టినరోజుకు నన్ను తప్పకుండా పిలిపించుకుంటారన్న ఆశతో, నమ్మకంతో ఎదురు చూడటమే. ఆయన దయ. సాయిని వేధించను. ఇక్కడ ఉండే స్వామికి జరిగే 60వ జన్మదిన వేడుకలను కన్నుల పండుగగా చూసుకుంటాను. "దైవం పిచ్చి పట్టిస్తాడని అనుకుంటే ప్రశాంతతే ఇచ్చాడు" అని అనుకున్నాను.

సాయి నన్ను పూర్తిగా అనుగ్రహించారన్న నమ్మకంతో సాయి పుట్టినరోజు పిలుపుకోసం ఎదురు చూస్తూ ఉన్నాను.

6.11.85 "సత్యసాయీ! నాకు నువ్వే అన్నీ అయి నా జీవితం నడిపిస్తూ ఉన్నప్పుడు నాకు అంతా ఆనందమే. నా బిడ్డలు నీ సేవకు అంకితమై నీ పిలుపుకోసం ఎదురు చూస్తూ ఉన్నారు. అనుగ్రహించు! ఒక లీల ప్రదర్శించు. నన్ను ఒక సమిధగా వాడుకో! నీ అనుగ్రహంతో నిన్ను నాలో చూసుకుని, మనిద్దరం వేరుకాదన్న భావనతో ఉన్న నన్ను కటాక్షించు!"

8.11.85 నేను రాముతో 'మణిని ఏదైనా పదిమందికి పనికివచ్చే పని చెయ్యమని' కబురు పంపించాను. కాని, అతను దానికి ఆ కబురు అందచెయ్యకముందే తను భగవద్గీత అందరికీ సులభంగా అర్థం అయ్యేలా ఒక "రీసెర్చి" చేస్తానని ఉత్తరం వ్రాసింది. సాయిలీల!

స్వామీ! నీ కోసం భవబంధాలు తెంచుకున్నాను. నిన్ను చూడనిదే ఎవ్వరినీ చూడాలని లేదు. నన్ను అనుగ్రహించి 17.11.85కి పుట్టపర్తి పిలిపించుకో" అని కన్నీటితో అభిషేకం చేశాను.

10.11.85 ఈ రోజు "మ్యూజిక్‌లో" అన్న మాట వినబడింది.

స్వామీ! 20వ తేదీలోపల నీ సన్నిధికి రాకపోతే ఈ ఊరు వదిలి నీ అనుగ్రహం కోసం నువ్వు చూపించిన ఊరిలో, నీ నామాన్ని అఖండంగా జపిస్తూ, ఉన్న చీరెలు, చిరిగి పేలికలైనా అవే ధరిస్తూ, నీవు అన్న మాట నిలబెట్టుకునే వరకూ ఎదురు చూస్తూ, బంధువులకు దూరంగా ఈ ప్రపంచంలో నువ్వు తప్ప ఎవ్వరూ లేరు అని శేష జీవితం గడపటమే నా నిర్ణయం. దీనికి తిరుగులేదు. ఈ సత్యమార్గంలో ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎదుర్కొని, సాయి

నన్ను కాపాడుతాడనే నమ్మకంతో ముందుకు సాగటమే నా నిర్ణయం. దీనికి సాక్ష్యం నా మనసే. నా మనసంతా దైవమే. మంచిపనికి దైవ సహాయం ఉంటుందన్న నమ్మకంతో నా జీవితాన్ని అంకితం చేస్తున్నాను. ఈ వ్రాసినదంతా "నేను" కాదు. దైవం. అందుకే అన్నమాట ప్రకారం జీవిస్తాను. నేను రాసింది ఎవరూ చూడలేదని మాట తప్పను. నేను చేసే ప్రతి పనిని సాయి చేయిస్తున్నాడు... చూస్తున్నాడు.

సాయి కృష్ణా! అజ్ఞానిని! కరుణించు.

సాయంత్రం ఏడుగంటలకు ఒక డాన్సు ప్రోగ్రాముకు వెళ్ళాము. దైవ ప్రేరణతో వెళ్ళే ముందు కాలభైరవ దర్శనం అయింది. అక్కడ ప్రదర్శనలో డాన్సు చేసే వాళ్ళంతా సాయిగానే అనిపించి ఏదో భాషకు తెలియని ఆనందం కలిగింది!

11.11.85 ఉదయం 9 గం॥ 45 ని॥లకు రేడియోలో ముత్తుస్వామి దీక్షితుల వర్ధంతి సందర్భంగా సంగీత రూపకం ప్రసారమైంది. దాంట్లో 'శ్రీ విద్య' గురించి అంతా చెప్పారు. నేను ఈ యోగంలోనే ఉన్నాను కాబట్టి "ఇది నేను ప్రసాదించిన యోగమే"నని తెలియచెయ్యటానికే సాయి మరొకసారి ఈ ఏర్పాటు చేశారు. నిన్న నాకు "మ్యూజిక్కులో" అని వినబడ్డ మాటకి అర్థం ఇది అని తెలిసింది. నేను అజ్ఞానిని. ఈ యోగం గురించి నాకు తెలియదు. శ్రీ దివాకరుని వేంకట సుబ్బారావుగారు వ్రాసిన "సుందరకాండ – శ్రీవిద్య" పుస్తకం చదివినా అర్థం కాలేదు. ఆగస్టులో మణి వైజాగ్ వచ్చినప్పుడు నా స్థితి ఇలా ఉంది అని చెప్పి పుస్తకంలో "టిక్కులు" పెట్టి చెప్పినా నాకు అర్థం కాలేదు. ఇంత యోగం పట్టినా ఇంకా నేను అజ్ఞానంలోనే ఉన్నాను.

స్వామి పరిపూర్ణకటాక్షం ప్రసాదించారు. ఆయన బాటన నడిచి పదిమందిని నడిపించటానికి నా ప్రాణం ధారపోస్తానని నా సాయితండ్రికి తెలియచేస్తున్నాను.

స్వామీ! ఈ ఆనందం ఒక్కదానినే భరించలేను. సరైన స్థితిని కలిగించమని భగవాన్ శ్రీ సత్యసాయి బాబాను వేడుకున్న నాకు ఆ స్థితిని కలిగించారు. సాయి తన దివ్యత్వమును నాలో ప్రవేశపెట్టారు. గురువుకు తగిన శిష్యురాలిగా తయారు చేశారు. శివశక్తి అవతారం తర్వాత ప్రేమ సాయి అవతరాం. ఇవి నేను వ్రాయలేదు. స్వామే నా చేత వ్రాయించారు.

సాయి ప్రేమ సాయి అవతారంగా ప్రతి ఇంటా వెలసి చిన్ని కృష్ణుని లీలలు ప్రదర్శించి, ప్రేమతత్త్వాన్ని బోధిస్తారు. స్వామి దర్శన, స్పర్శన భాగ్యానికి ఇక నోచుకోలేమేమోనన్న భక్తుల ఆవేదన ఈ రూపంగా తీరుస్తారు.

భవిష్యత్తులో జరగబోయేది సూచించిన స్వామికి ఏమివ్వగలను? ప్రతి అణువు స్వామికి అర్పితం చేసి పూర్తిగా అంకితమైపోయాను. నేను ఆయన వేరు కాదు. ఇద్దరం ఒక్కటే. పూర్వజన్మ సంస్కారంతో సరైన సమయంలో నాకు సాయి పాదము దొరికింది. ధన్యురాలిని. సృష్టి అంతా నాలోనే చూసుకుని తరిస్తున్నాను. పుట్టినరోజు పండుగకి పుట్టపర్తి ఎలా వెళతానో స్వామికే తెలియాలి. నేను నిశ్చింతగానే ఉన్నాను.

నా హృదయఫలం గీతామృతంతో పరిపక్వం చెందింది. ఈ ఫలాన్ని స్వామికి అర్పించుకోవటం కోసం, స్వామి అనుగ్రహం కోసం ఎదురుచూస్తూ ఉంటాను. రామునికోసం శబరిలాగా, సాయికృష్ణుని కోసం ఈ రుక్మిణి ఎదురు చూస్తూ రోజుకొక యుగంలా గడుపుతున్నది.

రామావతారంలో, కృష్ణావతారంలో ఆ అవతారమూర్తులను చూడని వాళఌ్ళ ఈ కలియుగంలో సాయి అవతారంలో వారిని చూసుకుని జన్మలు ధన్యం చేసుకోండి! సత్యం, ధర్మం, న్యాయం, శాంతి, ప్రేమ, అహింస – ఈ సనాతన ధర్మాన్ని నిలపండి.

12.11.85 ఉదయం తులసిచెట్టు చుట్టూ పసుపు, కుంకుమ చల్లి ముగ్గులు పెట్టాను. పులుసు అన్నం కలిపి వీధిలో వేస్తే ఒక కుక్క వచ్చి వాసన చూసి తినకుండా వెళుతుంటే "స్వామీ! ఈ రూపంలో వచ్చావు! నీకు నచ్చని పదార్థం ఏమున్నది? తిను" అని వేడుకున్న వెంటనే అన్నం అంతా తినేసి వెళ్ళింది.

సాయంత్రం 3 గం॥కి గంగిరెద్దు రూపంలో స్వామి వచ్చి మణి నాకు ఇచ్చిన వైలెట్ చీరను స్వీకరించారు. ఇదంతా "స్వామి నాకు వస్త్రం ప్రసాదించబోతున్నారు" అనటానికి సూచన అనిపించింది. స్వామి నా కోరిక తీరుస్తారు.

సాయి యిచ్చినా నేను వస్త్రం స్వీకరించను. ఆయన సంకల్పంతో మాలో కలిగిన విధంగా ప్రేమ సాయి చేతి వస్త్రాన్నే ధరిస్తాను. ఆ రోజు కోసం ఎదురుచూస్తాను. కాని, అది ఈ జన్మలోనే జరిగి తీరాలి.

1935లో పుట్టిన నేను ఎన్నో దీపావళులు చూసాను. నూనెతో దీపాలు వెలిగించాను. కాని, అసలైన దీపావళి ఇదే. నాలోని కామం అనే రాక్షసిని జయించి జ్ఞానజ్యోతిని దర్శించాను. ఇదంతా శ్రీ సత్యసాయి పెట్టిన జ్ఞానభిక్ష!

13.11.85 తెల్లవారి ఐదుగం॥లకు కనిపించిన దృశ్యం –

"ఒక చెయ్యి ముడులు విప్పుతున్నట్లుగా కనిపించింది. నా రెండు

చేతుల వేళ్ళు ఒకదాని మధ్య ఒకటి పెనవేసుకున్నాయి. కొంత సేపటికి రెండు చేతుల వేళ్ళు గట్టిగా బిగుసుకున్నట్లు అయింది".

"ముడివిప్పుతున్న దృశ్యానికి, చేతులు బిగుసుకున్నట్లు అవటానికి అర్థం ఏమిటా?" అని అనుకుంటూ ఉంటే సాయి వాటికి అర్థం తెలియచేశారు. "ప్రాపంచిక బంధాల ముడులు విప్పబడి భగవంతుడితో బంధం బిగుసుకుందని!"

ఆ మధ్య ఒకరోజున "పదమూడున అయింది" అని వినబడ్డ మాటలకి అర్థం ఈ రోజు తెలిసింది. ఇలా 13వ తారీఖున స్వామి బంధవిముక్తి కలిగించారు.

"సాయికృష్ణా! సామాన్యులకు అలవికాని పని నాచేత సునాయాసంగా చేయించావు! నా జన్మచరితార్థం అయింది!"

స్వామీ! 20వ తారీఖు తర్వాత ఇక్కడ నిద్దర చెయ్యను. ఏ కోరికలూ లేకుండా నిన్నే కోరుకోవటం తప్పు అంటే గీతే అబద్ధం అవుతుంది.

భూమాత కంటి వెంట రక్తం కారుతున్నది. యువత మేల్కొని స్వార్థం వీడి అమ్మకన్నుల పన్నీరు కురిపించాలి. సాయిశకం 2000 సం॥ నుండి ప్రారంభం కావాలి!

14.11.85 ఉదయం మా అమ్మాయి సుజాత పూలుకొని, సాయి ఫొటో తెచ్చి నా గదిలో పెట్టి పూలు పెట్టింది. కాని, హారతి ఇవ్వలేదు. ఏదో ప్రేరణతో గిన్నెకు పసుపు పూసి నాలుగు బొట్లు పెట్టి పాయసం చేశాను. అది పూర్తి కాకుండానే మా అమ్మాయి సుధ తోటి కోడలు వచ్చి "మా అన్నయ్య ప్రకాశరావుగారు పుట్టపర్తి వెళుతున్నారు. మీరు కూడా వెళ్ళిరండి" అన్నది.

సుజాత ఇంట్లో అద్దెకున్న రామారావుగారు వెంటనే హైదరాబాదు వెళ్ళటానికి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కు టిక్కెట్టు కొని తెచ్చారు. రిక్షావాని రూపంలో పరమాత్మ ప్రసాదం గ్రహించారు.

ఆ విధంగా 14.11.85న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 15.11.85న హైదరాబాదు వచ్చి అక్కడి నుంచి ప్రత్యేకంగా వేసిన రైలులో పుట్టపర్తికి వెళ్ళాను!

★ ★ ★

1985లో మా మూడవ అమ్మాయి సుజాత, ఆమె భర్త శాంతిసాగర్ వైజాగ్‌లో టి.జె.ఆర్. ట్యుటోరియల్స్ పేరిట ప్రారంభించిన కాలేజీలో బంధుత్వభావంతో కాకుండా మనసులో స్వామి అన్న ప్రకారం ఈ కాలేజీలో "నేను స్వీపరును" అన్న భావంతో పనిచేస్తూ ప్రశాంతంగా గడుపుతున్న కాలంలో నా గురుదేవులు సాయి ఆధ్యాత్మిక సాధనలో కొన్ని పనులు చేయించారు.

సాధన సమయంలో రోజూ ఉదయం రేడియోలో "సూక్తిముక్తావళి"ని తప్పకుండా వినేదాన్ని. అందులో చెప్పే సూక్తులను ఆదర్శంగా చేసుకుని నా సాధనను కొనసాగించాను.

బట్టలు ఉతుకుతూ బట్టలు జాడించిన నీరు క్రింద పోస్తూ ఉంటే ఆ చోటు పరమేశ్వర రూపంగానూ, బట్టలు జాడించిన నీరు అభిషేక జలంగానూ భావించి అభిషేకం చేసేదాన్ని. గిన్నెలు తోమి పంపు కింద కడుగుతుంటే గిన్నె భగవత్స్వరూపంగానూ, నీరు గంగా జలంగాను భావించి అభిషేకం చేసేదాన్ని. పంచాక్షరి జపిస్తూ పిల్లలకు స్నానం చేయించి శివునికి అభిషేకం చేస్తున్నట్లుగా భావించేదాన్ని.

ఒకరోజున స్నానం చేసి బాత్‌రూమ్ కడుగుతుంటే చీపురు పుల్ల క్రింద

పడింది. అది తీసి చీపురులో గుచ్చబోతుంటే ఆ పుల్లలో ఈశ్వరదర్శనం అయింది. వెంటనే 'మగ్గు'తో నీళ్ళు పుల్లమీద పోస్తూ అభిషేకం చేశాను. స్నానం చేస్తూ ఈ శరీరం నాది కాదు... నీది, ఈ పాదాలు నీవి... ఈ శరీరం నీది" అనుకుంటూ స్నానం చేసేదాన్ని.

ఎవరివైనా బట్టలు ఉతుకుతున్నప్పుడు 'గురుదేవా! నీ వద్ద ఉండి, నీ సేవలు చేసే భాగ్యం లేదు. కాని, ఈ బట్టలు ధరించిన వాళ్ళని నీ రూపాలుగా భావిస్తూ సేవచేస్తాను" అనుకుంటూ, ఇంతటి అదృష్టం కలుగచేసిన నా గురువుకు మనస్ఫూర్తిగా నమస్కరించేదాన్ని.

ఎవరికి భోజనం పెట్టినా నా స్వామికే పెట్టినట్లు భావించి తృప్తిపడే దాన్ని. విగ్రహాలకు నైవేద్యం పెట్టటంలో తృప్తిలేక వంట చేసిన వెంటనే మొదటి భోజనం ఎవరికి పెట్టినా, పని మనిషికి పెట్టినా నా స్వామికే పెట్టినట్లు తృప్తిపడేదాన్ని.

సాధన సమయంలో కొన్ని రోజులు ఏదో ఒక దివ్య ప్రేరణతో ఏదో ఒక ప్రసాదం తయారు చెయ్యటం, పరమేశ్వరుడు ఏదో ఒక రూపంలో స్వీకరించటం జరిగింది.

సాధన సమయంలో ఒకరి ద్వారా స్వామి "పీటకు పసుపు పూసి, కుంకుమపెట్టి దేముళ్ళని పెట్టవద్దని" చెప్పించారు. ఎప్పుడూ అలా చేసే నన్ను వద్దని చెప్పటం బాధ అనిపించింది. కాని, కొంతకాలం తర్వాత స్వామి ఇలా అర్థం తెలియజేశారు.

"భగవంతుని ఎదుట విగ్రహరూపంలో పూజించే విధానం నుంచి తప్పించి నీ హృదయంలోనే భగవంతుడు ఉన్నాడని తెలియజేయటం కోసమే సద్గురువుగా అలా చెప్పించాను".

ఈ పనులన్నీ చేస్తున్నప్పుడు "ఏమైనా తప్పు చేస్తున్నానా" అని మానసికంగా చాలా ఘర్షణ పడేదాన్ని. అయినా నా సద్గురువు శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబాయే నా చేత ఇలా చేయిస్తున్నారన్న పరిపూర్ణమైన విశ్వాసంతో గురువు మీద భారం వేసి, వీటి ఫలితం ఎలాంటిదైనా ఆ ఫలితంతో నాకు సంబంధం లేదనే నమ్మకంతో చేసేదాన్ని.

నన్ను సగుణం నుండి నిర్గుణమునకు తీసుకువెళ్ళటానికి చేయించిన సాధనలే ఈ పనులని నా గురువు నాకు మానసికంగా తెలియజేశారు.

ఈ సాధనలు జరుగుతున్నప్పుడు నాకు ఆరోగ్యం బాగాలేదు. కాని, నాకు వచ్చే పెన్షను తప్ప ఎవరి వద్ద నుండీ సొమ్ము తీసుకోనని నిర్ణయం చేసుకున్నాను.

"వైద్యం చేయించుకునేందుకు డబ్బు లేదు. ఎవరి సొమ్ము నేను తీసుకోను. నువ్వు తప్ప ఈ ప్రపంచంలో ఎవ్వరూ నాకు లేరు. నువ్వే తగ్గించాలి!" అని ఏడిచేదాన్ని.

స్వామి అనుగ్రహంతో వాంతులు, కడుపు నొప్పి తగ్గాయి. మనస్ఫూర్తిగా స్వామిని నమ్మిన వాళ్ళకి ఆయన పరీక్షలు పెట్టినా, ఆయన పెట్టే పరీక్షలకు తట్టుకుని నిలబడగలిగితే (ఆ శక్తికూడా ఆయన ఇచ్చినదే) తల్లిలా తన ఒడిలో సేద తీరుస్తారు.

సాధన సమయంలో కర్మలను తొలగించుకునే ప్రయత్నంలో నా శక్తి చాలదు అని అనిపించినప్పుడు "గురుదేవా! నా శక్తి చాలటం లేదు. నీ శక్తిని ప్రసాదించి నా కర్మను తొలగించమని ప్రార్థన చేసేదాన్ని. కరుణామయుడైన నా సాయి తన శక్తిని ప్రసాదించేవారు.

జగజ్జనని 'సాయి మాత'గా కలియుగంలో అవతరించింది. సాయిమాత పుట్టపర్తిలో ఉన్నట్లు అనిపించినప్పటికీ ఆర్తితో పిలిస్తే మన హృదయకమలంలో ఉన్న అమ్మ తన ప్రేమను మనకు అందించి ప్రశాంతతను ఇస్తుంది.

కొన్ని సందర్భాలలో, పర్వదినాలలో పుట్టపర్తికి వెళ్ళలేకపోయినా ఇక్కడే అనేక రూపాలలో దర్శనం ఇచ్చి సాయిమాత నాకు తృప్తినిచ్చింది. కలియుగ వాసుల పూర్వపుణ్య ఫలంచేత సాయిమాత అవతరించింది.

హైదరాబాదులో ఉండగా ఒకరోజున మణీ వాళ్ళ ఇంట్లో బాబా చిత్ర పటానికి పూలదండ వేసి, అది తీసి నా తలలో పెట్టుకున్నాను. తర్వాత తలలో నుంచి తీసి నేల మీద పడవేశాను. నేలపై నుండి తీసి మళ్ళీ స్వామి ఫొటోకి వేయటం, తిరిగి నా తలలో పెట్టుకోవటం అలా చేసాను. "స్వామీ! ఇలా ఎందుకు చేశాను? దీని అర్థం ఏమిటి?" అనుకున్నాను.

తర్వాత స్వామి "ఫొటోలో ఉన్నదీ, నీలో ఉన్నదీ క్రింద నేలలో ఉన్నదీ అంతటా ఉన్నది నేనే కాబట్టి నాకు పెట్టినా, నువ్వు పెట్టుకున్నా, నేలపై పడవేసినా అంతా నాకే చెందుతుందని తెలియ చెయ్యటానికే ఇలా జరిగింది" అని తెలియ చేశారు.

సాధన సమయంలో రాత్రి కలలో ఆకాశం అందుబాటులో ఉన్నట్లుగా కనిపించటం, ఆకాశంలో విఘ్నేశ్వరుడు, దివ్య తేజస్సుతో అనేక దేవతామూర్తులు, నక్షత్రాలు, మిరుమిట్లు గొలిపే వెలుగు, కాంతివంతమైన మెరుపులు కనిపించటం జరుగుతుండేది.

వైజాగ్‌లో ఒకరి ఇంటికి స్వామి పాదుకలు తీసుకుని వచ్చారు. నన్ను రమ్మని పిలిస్తే అక్కడికి వెళ్ళాను. మా బంధువు ఒకామె స్వామి పాదుకలను

నా శిరస్సున పెట్టించుకోమని అన్నారు. అప్పటికే నా గురుదేవుని పాదుకలు నా శిరస్సును ఉన్నాయన్న అనుభూతి కలగటం వలన మళ్ళీ అలా పెట్టుకోవటానికి నా మనసు అంగీకరించలేదు.

ఒకసారి "స్వామి పలకటం లేదు ఎప్పుడు వెళ్ళినా అని" బాధతో తలగోడకు కొట్టుకోబోతుంటే వెంటనే స్వామి "నా పాదాలు శిరస్సున ధరించానని అంటావు కదా! మరి నా పాదాలు గోడకేసి కొడతావా?" అని అన్నారు.

అప్పటి నుండీ అలా ఎప్పుడూ చెయ్యకూడదని నిశ్చయించుకున్నాను.

కలలో ఒకరోజున "గరుడపక్షి ఒకటి పడుకుని ఉన్న నన్ను తన రెక్కలతో పూర్తిగా కప్పివేసింది".

పై కలకు స్వామి తెలియజేసిన అర్థం – "పక్షి తన రెక్కల మాటున గుడ్డును పొదిగి పిల్లను తయారు చేసిన విధంగా గురువుగా నిన్ను నా రెక్కలమాటున పొదిగి జ్ఞానమణిగా తయారు చేస్తాను" అని.

ఒకరోజున కలలో "పాము కుబుసం విడిచిపెట్టినట్లు" కనిపించింది. "పాము కుబుసం ఎలా విడిచిపెట్టిందో అదే విధంగా దేహాభిమానం విడిచి ఆత్మనిష్టలో ఉండమని" స్వామి మానసికంగా తెలియచేశారు.

ఇంకొకరోజున కలలో "పురివిప్పిన నెమలి అగ్నిలో పడి కాలిపోవటం, పుట్టలో నుంచి ఒక స్త్రీ తీసి పదార్థాలు తీసి అందరికీ పంచటం" కనిపించింది.

ఈ కలకి స్వామి మానసికంగా తెలియచేసిన అర్థం –

"సాధకుడిలోని కోర్కెలు పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తుంటే, సాధకుడు వాటిని జ్ఞానాగ్నిలో కాల్చి వేయటంతో కోరికలు నశించి, దేహమనే

పుట్ట భగవంతుని కృపావర్షంతో కరిగి అమృతత్త్వం సిద్ధించిన తర్వాత హృదయం అమృతభాండం కాగా 'శక్తి' రూపంలోవచ్చి మధురమైన వాక్కులను (మధురపదార్థములు) అందరికీ పంచటం".

స్వామీ! ఈ కనిపిస్తున్న ప్రపంచంలో డబ్బుతో కొనుక్కునే సుఖ సంతోషాలు నాకు వద్దు. డబ్బుతో కొనలేనిది నిన్ను మాత్రమే. భక్తి ధనం ప్రసాదించు, దానితో నిన్నుకొని, ఏ మాలిన్యం అంటని నా హృదయ పీఠం మీద నిన్ను నిలుపుకుంటాను. నాలో నిలుపుకున్న నీ మూర్తి శాశ్వతంగా నిలవాలంటే నీ శక్తి కావాలి. మంచిపనులు చేసి నా చేతులు పవిత్రం చేసుకున్నాను. పవిత్రమైన ఈ చేతులతో దోసిలి పట్టి, నీ ఎదుట నిల్చున్న నాకు దైవశక్తిని ప్రసాదించు శివా!

ఏ ధనాన్ని అయితే ప్రసాదించావో ఆ ధనాన్ని తృణప్రాయంగా చూసే మనసును కూడా ఇచ్చావు. ఇలాంటి వరం ప్రసాదించిన నీకు ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను? అందుకే నన్ను నేను నీకు అర్పించుకున్నాను. నీ కృపాదృష్టితో పునీతనై నీకు ఆత్మనివేదన చేసుకున్నాను. నువ్వు నేను వేరుకాదని తెలిసిన తర్వాత ఈ కనిపిస్తున్న ప్రపంచంలో ఇమడలేకపోతున్నాను. ఈ స్థూల శరీరాన్ని నశింపచేసి నీలోకి ఎప్పుడు ఐక్యం చేసుకుంటావా అని స్వాతివానకై ముత్యపు చిప్పలాగా ఎదురు చూస్తున్న నాకు ఆ శుభదినం ఎప్పుడోకదా! నశించిపోయే ఏ వస్తువూ నాకు వద్దు. నశించని ఆత్మ కావాలి.

ఇన్నేళ్ళూ ఈ దేహం నాది అన్న భ్రమలో దీనిని శుభ్రం చేశాను. దేహం వేరు, ఆత్మ వేరు అని తెలుసుకున్నాక ఈ దేహం మీద వ్యామోహం నశించింది. దేహమే దేవాలయం, ఆత్మే పరమాత్మ. అందుచేత దేహమే దేవాలయం కాబట్టి దీనిని పవిత్రతకోసం శుభ్రం చేస్తున్నాను. ఇప్పటి వరకూ

నన్నూ, నా కుటుంబాన్నీ, ఆ తర్వాత బంధువులను, స్నేహితులను నా అనుకున్న వాళ్ళని, నేను కావాలని అనుకున్న వాళ్ళనీ ప్రేమించాను. గీతామృతాన్ని త్రాగిన తర్వాత, కృష్ణతత్త్వం అనే ప్రేమతత్త్వం వంటబట్టిన తర్వాత "నేను – నా వాళ్ళు" అనుకునే తత్త్వం పోయి ప్రపంచంలోని ప్రతి వస్తువునూ ప్రేమిస్తున్నాను. ఈ జగమంతా సర్వవ్యాపకుడైన కృష్ణపరమాత్మగా గోచరిస్తున్నది.

సృష్టిలోని చలించేవీ, చలన రహితం అయినవీ అన్నీ పరమాత్మ రూపాలే. దేనిని ద్వేషించినా పరమాత్మను ద్వేషించినట్లే.

నా కోరిక దైవంతో సమంగా ఎదగాలని. శ్రీ సత్యసాయిబాబా నాకు సద్గురువై తన శక్తితో నన్ను తనంత దానిగా చేసి దైవంగా మార్చారు. నాకు తల్లీ, తండ్రీ, గురువు, దైవం, ప్రియుడు, బిడ్డ అన్నీ ఆయనే. అందుకే అన్నీ ఆయనలో చూసుకుంటూ నా ప్రేమనంతా ఆయనకే ఇచ్చాను. ముందు జీవితం ఎలా నడుపుతాడో ఆయనకే తెలియాలి. నేను వేరు ఆయన వేరు కాదు. కాబట్టి ఆయన బాటన నన్ను నడిపిస్తారు. అదే సత్యబాట. అదే దైవం.

కలలో కనిపించి లీలలు వ్రాయమన్నారు. వ్రాశాను. "ఇవి నా లీలలు" అని ఆయనే ఋజువు చెయ్యాలి. అప్పుడు పుస్తకంగా వ్రాస్తాము. లేకపోతే ఇవి నాకు మాత్రమే పరిమితం. ఎన్ని బాధలు వచ్చినా సాయిని మాత్రం విడవను.

దీనికి సాయే సాక్షి!

1984 జులై పదమూడవ తేదీన గురుపూర్ణిమనాడు పుట్టపర్తిలో స్వామి దర్శనం చేసుకున్నాక అప్పటి నుండీ వచ్చిన మార్పులు వినిపించిన మాటలు, కనిపించిన దృశ్యాలు, 1985 నవంబరు 23న స్వామి "60వ" జన్మదినానికి

వెళ్ళే వరకు జరిగినవన్నీ వ్రాసి ఉన్న కాగితాలు మొత్తం 15.11.1985న సికింద్రాబాదు స్టేషనులో మణికి అందజేశాను.

1985 నవంబర్ 23న స్వామి అరవైయ్యవ జన్మదినోత్సవమునకు పుట్టపర్తి వెళ్ళివచ్చిన తర్వాత అక్కడి అనుభూతులను, విశేషాలను తెలియచేస్తూ మణికి వ్రాసిన ఉత్తరం.

"... నీ ఉత్తరాలు అందాయి. నీ కోరిక, నా కోరిక తీరుతుందనే గట్టి నమ్మకం, సత్యాన్ని నమ్మాను. దైవం నాకు వస్త్రాన్ని ప్రసాదిస్తాడు. ఎన్ని జన్మల పుణ్యం వలననో స్వామి మనలను అనుగ్రహించారు. అనుగ్రహించిన దైవం ఆగ్రహించడు. ఆ రోజుకోసం ఎదురుచూడటమే. స్వామి పెట్టే పరీక్షలకి తట్టుకుని, పాదం వదలక అఖండ నామం జపించటమే మన సాధన.

తీవ్రమైన వైరాగ్యం భక్తిగా మారి దైవసాక్షాత్కారాన్ని పొందినదాన్ని. భక్తిధనంతో కృష్ణపరమాత్మను నావాడిగా చేసుకున్న రుక్మిణిని. ప్రేమతత్వంతో మాధవుడిని నా మదిలో నిలుపుకున్న రాధని. నా ప్రేమకే కాదు – నిర్మలమైన ప్రేమ ఉన్న వారందరిలోనూ గోవిందుడు ఉన్నాడు. ఏ ఒక్కరికీ స్వంతం కాదు సాయికృష్ణుడు. ఆర్తితో పిలిస్తే వస్తాడు.

15.11.85న మూడుగంటలకి నువ్వు సికింద్రాబాదు స్టేషనుకు రావడం, నువ్వు వెళ్ళేవరకు జరిగిన విషయాలు నీకు తెలుసు. వైజాగ్ నుంచి మాతోపాటు శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి భార్య రామంగారు కూడా వచ్చారు. స్వామి పుట్టినరోజు పండుగకి. ఆవిడ పేరు "రామం"కి స్వామి తెలియచేసిన అర్థం.

'రా' అంటే రాగం. రాగమంటే ఓంకారనాదం.

'మం' మంత్రం.

అంటే ఓంకార నాదమే ప్రణవ మంత్రం. ప్రణవ మంత్ర స్వరూపిణి గాయత్రి.

రైలు రాత్రి 9 గం॥కి. స్పెషల్ ట్రెయిను కావటం వలన సేవాదళ్ కార్యకర్తలు అతిస్వల్ప వ్యవధిలోనే రైలును అలంకరించారు. ఇంజనుకు కొబ్బరాకులు, అరటి మట్టలు, మామిడాకులు, రంగు కాగితాలు అంటించి అలంకరించారు.

మా కంపార్ట్‌మెంటులో చాలా తక్కువమంది ఎక్కారు. ఒకగంటసేపు భజన చేశారు. నాకు కంటి నిండా ఆనందభాష్పాలు. పదిమంది మధ్యలో అలా కన్నీరు రావటం ఇష్టం లేక స్వామినే వేడుకున్నాను. "స్వామీ! ఇంటికి చేరే వరకూ కన్నీరు రాకూడదని" అలాగే స్వామి అనుగ్రహించారు.

రైలు దిగబోతుంటే కొన్ని దృశ్యాలు కనిపించాయి. 'ఎగురుతున్న నల్లని పక్షులు. తాడులో గుండ్రని బిళ్ళ వేసి మెడలో వెయ్యటం, తల మీద నీరు జల్లుతున్నట్లు, ముడిమీద కిరీటం పెడుతున్నట్లు" కనిపించింది. విన్న మాటలు "తొమ్మిది అయింది. ఆంజనేయ" అన్న మాటలు వినిపించాయి. "ఒక కన్నం ఉన్నపుట్ట, ఒక నీటి బిందువు మహాసముద్రంలో కలిసిపోవటం దృశ్యంలో కనిపించాయి.

ధర్మవరంలో దిగి అక్కడ సేవాదళ్ వాళ్ళు పెట్టిన పులిహోర, పెరుగన్నం తిని బస్సులో 5 గం॥కి పుట్టపర్తి చేరాము. పుట్టపర్తిలో మా మేనకోడలు సీత ఇంట్లో ఉన్నాను. వెళ్ళగానే ఆ రోజు స్వామి ఉదయం ముట్టుకున్న ప్రసాదం, విభూతి, జీడిపప్పు ఏలకులు సీతా వాళ్ళ ఆయన ఇచ్చారు. రాగానే స్వామి తాకిన ప్రసాదం స్వీకరించటం అద్భుతం అనిపించింది.

17వ తేదీ సాయంకాలం నేను "డెలిగేటు"ను కానని చెప్పినా కూడా 'మాతాజీ' వెళ్ళమన్నారని చెప్పి 'డెలిగేట్లు' వెళ్ళే త్రోవలోనే నన్నూ వెళ్ళమన్నారు.

మధ్యాహ్నం స్పీచ్‌లో స్వామి "మోక్షం కోరుకునే వాళ్ళు ఇద్దరో ముగ్గురో ఉంటారని" అన్నారు. స్వామి దృష్టిలో మనం ఉన్నామా!

18న స్నానం చేసి "సాయీశ్వరా! రెండుసార్లు వివస్త్రనై వస్త్రం ఇవ్వమని ప్రార్థించాను. ఇప్పుడు మూడవసారి అడుగుతున్నానని చేతులు జోడించి నమస్కరించే లోపల ఎవరో తలుపు తియ్యమని దబదబ బాదారు. "సరే! స్వామే ఇలా చేశారు. ఏదో కారణం ఉండి ఉంటుందని నమస్కరించటం మాని తలుపు తీశాను.

తర్వాత ఒకరోజు ఉదయం స్వామి మందిరానికి వెళ్ళాను. మా అమ్మగారని చెప్పి సీత నన్ను లోపలికి తీసుకువెళ్ళింది. అక్కడ ఒక పున్నాగ చెట్టు ఉన్నది. ఆ చెట్టు క్రింద కూర్చుని "సాయికృష్ణా! ఆనాడు ద్వాపర యుగంలో పొన్నమాను మీద కూర్చుని గోపికల వస్త్రాలను అపహరించి, చేతులెత్తి, భక్తితో మొక్కినవెంటనే వస్త్రాలు ఇచ్చావు. ఈనాడు నేను అడుగుతున్నాను. నావంటి మీద వస్త్రం ఉన్నా అది ఉన్నట్లు కాదు. నువ్వు వస్త్రం ఇచ్చే వరకూ నేను వివస్త్రనే. అనుగ్రహించు కృష్ణా!" అని వేడుకున్నాను. మూడవసారి ఇక్కడ ఇలా ప్రార్థించటం కోసమే ఆ రోజు బాత్‌రూము తలుపు కొట్టించింది. స్వామి లీలలు అర్థం చేసుకోవటం కష్టం! కాని, నా జీవితాన్ని స్వామి నడిపిస్తున్నారు. అందుకే అర్థం చేసుకో కలుగుతున్నాను. ప్రతి సంఘటనా స్వామి దగ్గరకు చేర్చేదే!

"స్వామీ! నీ పుట్టిన రోజుకు ఎంతమందో వస్తారు. అంతమందిలో నేను ఒక్కదాన్ని ఎక్కువ అవుతానా! అని కళ్ళు పుళ్ళు పడేలా ఏడిచాను. నాకు

ఏలోటు రాకుండా స్వామి అన్ని ఏర్పాట్లు సీత ఇంట్లో ప్రత్యేకంగా చేయించారు. కాని, ఈసారి కూడా స్వామి నన్ను కన్నెత్తి చూడలేదు. పుట్టిన రోజున స్వామి నన్ను ఇల్లు కదలనివ్వలేదు ఆరోజు స్వామిని చూడలేదు. ఉదయం ధనం మీద వెళుతుంటే చూడలేదు. సాయంకాలం ఉయ్యాలసేవ కూడా చూడలేదు. ఆ రెండింటి కోసం జనం వస్తే నన్ను తన దగ్గరకి రప్పించుకుని కూడా ఆ రెండు ఉత్సవాలనూ చూడనివ్వకపోవటానికి కారణం ఏదో ఉండి ఉంటుందని అనుకుంటూ అలాగే కూర్చున్నాను.

సాయంకాలం ఒకతను వచ్చి ఉయ్యాల సేవ అవగానే స్వామి తాకి ఇచ్చిన ప్రసాదం అని చెప్పి "ఎవరికోసమో తెచ్చాను. వాళ్ళు లేరు. మీకు ప్రాప్తం" అని ఏలకుపొడి స్వీటు ఇచ్చాడు. ఇది స్వామి లీల!

23.11.85న రాత్రి వచ్చిన కల – "అమ్మవారివి పెద్ద విగ్రహాలు కనిపించాయి. నేను ఆకాశంవైపు చూస్తున్నాను. ఆకాశం నేను అందుకునేంత ఎత్తులో ఉన్నది. ఆ కాంతి ఇలా ఉంటుందీ అని నేను చెప్పలేను. ఆ కాంతిలో శివుడు, పార్వతి, స్వామి మెడలో నాగేంద్రుడి పడగ. అక్కడంతా నక్షత్రాలు, చంద్రుడు, పువ్వులు, అటూ ఇటూ పరుగెడుతూ పులులూ, సింహాలూ, కోతులూ సృష్టి అంతా కనిపించింది".

ఎంత మరిచిపోదామన్నా ఆ దృశ్యం మరిచిపోలేను.

పుట్టిన రోజు నాడు పగలు దర్శనం ఇవ్వకుండా రాత్రి కలలో పార్వతీ పరమేశ్వరుల దర్శనభాగ్యం ప్రసాదించారు. ఎన్నో జన్మల పుణ్యం.

సాయంత్రం ఒక దృశ్యం "ఒక బాబు, బాబు తలపై ఒక గొడుగు కనిపించింది" నాలోని అహంకారమును బలిచేయుటకు వచ్చిన వామనమూర్తి అని ఈ దృశ్యానికి అర్థం తెలిసింది.

ఎన్నెన్నో అద్భుతాలు! ఎలా వ్రాయాలో, ఎలా పూర్తి చేయాలో కూడా తెలియటం లేదు. స్వామి దయతో కొంత వ్రాయగలుగుతున్నాను.

స్వామీ! అందరికీ ఇళ్ళకు తిరిగి వెళ్ళాలన్న కోరిక. నాకు మాత్రం ఇల్లు లేదు. వైజాగ్ ఇంటికి వెళ్లాలని లేదు. స్వామీ! నువ్వు తప్ప నాకు ఈ ప్రపంచంలో ఎవ్వరూ లేరు! ఎక్కడికని వెళ్ళను? ఇక్కడే ఉండనివ్వు లేదా మంత్రాలయం పంపించు" అని ఎంత ప్రార్థించనా స్వామి తన దగ్గర పుట్టపర్తిలో ఉండనివ్వలేదు. మళ్ళీ వైజాగే పంపించారు.

స్వామి నాకు ఎక్కడ స్థానం చూపిస్తారో చూడటమే కాని ఈ నెల తర్వాత మాత్రం ఇక్కడ ఉండను. ఈలోగా నాకు ఇంత చోటు చూపించు. నేను ఎవ్వరి దగ్గరా ఉండలేను" అని వేడుకున్నాను.

నవంబర్ 23న రాత్రి వచ్చిన కలను గురించి సీతతో చెపితే "స్వామి తన పుట్టిన రోజున దేవతలు వస్తారని అన్నారు. బహుశా వాళ్ళే నీకు కనిపించి ఉంటారు. అదృష్టం" అని అన్నది.

నీకు కొన్ని దృశ్యాలు వ్రాసిన కాగితాలు ఇచ్చాను కదా? ఆ దృశ్యాలన్నీ పుట్టపర్తిలో మళ్ళీ కనిపించాయి. తర్వాత వ్రాయటమో, సాయి అనుగ్రహంతో కలుసుకున్నప్పుడో వాటిని గురించి చెపుతాను.

భక్తుల కథలు కొన్ని తెలుసు. నిజంగా అనుభవించగలగటం అనిర్వచనీయమైన ఆనందం. ఈ ఆనందం ఎన్ని కోట్లు వెచ్చించి దొరుకుతుంది?

పుట్టపర్తిలో స్వామి అనేక రూపాలలో దర్శనం ఇచ్చారు. అందరూ స్వామిని చూడటానికి పరుగులు పెడుతుంటే నేను మాత్రం ఆయన రూపంలో వస్తారోనని ఎదురు చూడటం, ఆయన అలాగే దర్శనం ఇవ్వటం జరిగింది. అక్కడ స్వామి పలకరించి బంగారూ! అంటారని ఆశ పడ్డాను. కానీ, అలా

అనలేదు. లీలలు చూపించి తృప్తి పరచారు. స్వామి స్వయంగా పలకరించే రోజు కోసం ఎదురు చూస్తాను.

ఎన్నో జన్మల తర్వాత నా సద్గురువు సాయి ద్వారా నా తల్లిని తెలుసుకున్నాను. ఆ తల్లిని చేరే వరకూ నా శేష జీవితాన్ని సాగిస్తాను.

అర్థం లేని, ఆనందం లేని కలయికలు. కాని, అసలైన ఆనందం ఇప్పుడు. ఈ ఆనందంలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాను. ఈ అనుభూతిని నేనే కాదు మానవ జన్మఎత్తిన ప్రతి ఒక్కరూ అనుభవించాలి.

ఒక రోజున కలత నిద్రలో ఒక దృశ్యం – "పెద్ద శ్వేత వర్ణపు నాగుపాము జరజర ఎండు గడ్డిలో నుంచి పాకుతున్నది. ఆ పాముకు మొదలు చివర కనిపించలేదు".

పుట్టపర్తి వెళ్లి వచ్చిన దగ్గర నుంచీ తరచు కలలో పాములు కనిపిస్తున్నాయి. "భయంతో స్వామీ! ఆ రూపంలో దర్శనమివ్వకు!" అని వేడుకున్నాను.

అల్లవరంలో ఉండగా ఒక రోజున కలలో "ఎక్కడెక్కడి నుండో పాములు వచ్చి మంటలలో పడటం" కనిపించింది. మళ్లీ చాలా రోజుల తర్వాత కలలో ఇలా శ్వేతనాగు కనిపించడం శుభసూచకంగా అనిపించింది.

స్వామి పుట్టిన రోజుకు పుట్టపర్తి వెళ్లి వచ్చిన తర్వాత మద్రాసు వెళ్ళాను అక్కడికి స్వామి వచ్చారు. అక్కడ రెండుసార్లు స్వామి దర్శనం అయింది కాని, మాట్లాడలేదు. నా మనసులో నిలుపుకున్న స్వామి నా మనసులోనే మాట్లాడుతున్నారు. చాలా తృప్తిగా ఉంది.

నాకొక ప్రత్యేకమైన స్థానం ఇవ్వటానికే నా చేత కొన్ని పనులు

చేయిస్తున్నారు. పది మందీ మెచ్చేదీ, న్యాయమైనదీ అయినచోటు కోసం కోరుకుంటున్న నాకు అటువంటిది ఇచ్చే ప్రయత్నంలోనే స్వామి ఉన్నారు. ఏ రోజుకు ఆ రోజు జరుగుతున్నవి వ్రాస్తున్నాను.

**17.12.1985**

వైజాగ్‌లో శివుడు వాళ్ళింట్లో ఈ రోజు ఉదయం సాయి ప్రేరణతో పాయసం చేశాను. సత్యసాయి, లక్ష్మిఫొటోలకు, షిరిడీ సాయి ఫొటోకు గులాబి పువ్వులు పెట్టి, షిరిడీ బాబా వద్ద పాయసం కూడా పెట్టి ఈ పనులకు అర్థం 1986 జనవరి మొదటి వారంలో తెలుస్తుందని శివుడితో చెప్పాను.

క్రిందటి సం॥ డిశంబర్ 15వ తేదీన నేను, మా మేనల్లుడు సూరిబాబు శ్రీశైలం వెళ్లటం ఆ సాయంత్రం శివుడికి మేమిద్దరం అభిషేకం చెయ్యటం, 16వ తారీఖున ఉదయం భ్రమరాంబకు కుంకుమ పూజ చేయడం, 17వ తేదీన నేను, మణి షిరిడీ బాబా గుడిలోని షిరిడీ బాబాకు సహస్రనామ పూజ చేయటం, సరిగ్గా అదే తారీఖులలో ఇక్కడ ఇలా జరగటం చాలా ఆశ్చర్యంగా ఉన్నది. "వెంట్రుక పట్టుకుని కొండ ఎక్కుతున్నామా? అని అనిపిస్తున్నది. మన నమ్మకమే మనసు దైవం దగ్గరు చేరుస్తుంది. స్వామి లీలలు పుట్టపర్తి నుంచి వచ్చాక వ్రాయటం లేదుకానీ 15వ తేదీ డిసెంబరు నుంచి మళ్లీ వ్రాస్తున్నాను. ఇది సాయి ప్రేరణ!

**18.12.1985**

ఉదయం రెండుసార్లు అతి మెల్లగా గంట కొట్టినట్లు వినిపించింది. అది ఎక్కడో కాదు! నాలోనే! భ్రాంతి కాదు స్పష్టంగా విన్నాను. తెనాలిలో ఉండగా, ఫిబ్రవరిలో ఇలాగే ఎక్కడో గంట కొట్టినట్లు శబ్దం వినిపించింది.

కాని, ఈ రోజు నాలోనే వినిపించింది. ఏమీ తెలియని నాకు ఇదేమిటో అర్థం కాలేదు.

**21.12.1985**

సుజాత ఈ రోజు హైదరాబాదు నుంచి వచ్చింది. మణి "ప్రెగ్నెంటు" అని చెప్పింది. ఫోను ద్వారా ముందుగా తెలిసిన కబురే అయినా మళ్ళీ అది చెపుతుంటే ఓంకార నాదంలా హాయిగా చెవికి సోకింది. ఈ శుభవార్త కోసం పన్నెండు నెలలుగా ఎదురు చూస్తున్నాము. ఈ రోజు మరపురాని రోజు. ఆనందం పట్టలేక విపరీతంగా ఏడ్చాను. నా దుఃఖం అంతా స్వామి కోసం. నా కోరిక తీర్చిన స్వామికి నేను ఇచ్చేది అదే!

"స్వామీ! నిన్ను విడిచి ఈ ప్రపంచంలో ఇమడలేక పోతున్నాను. నీ బిడ్డను నీలో చేర్చుకో! అర్థం లేని, గమ్యంలేని జన్మలు ఎన్నో ఎత్తాను. ఇప్పటికి తెలుసుకున్నాను. ఇదే కడపటి జన్మ కావాలి. అనుగ్రహించు".

నా సాయి ప్రభలు మూలమూలలా వెలగాలి. పదిమంది కోసం నా బ్రతుకు. నా కోసం కాదు. నా నోట అనేక మాటలు పలికిస్తున్నావు. వీటికి అర్థం నువ్వే తెలియచెయ్యాలి. ఒక పిచ్చిది మాట్లాడిన మాటలుగా పది మందీ అనుకునేలా చెయ్యవనీ, నా జన్మ సార్ధకత పొందేలా అనుగ్రహించమనీ వేడుకుంటున్నాను.

మనం ఇద్దరం వేరని అనుకోవటం లేదు. ఇద్దరం ఒక్కటే. నన్ను తీర్చిదిద్దుకో. ఎంతోమంది గురువుల అవసరం లేకుండానే నాకు ఆత్మ జ్ఞానాన్ని బోధించావు. భగవంతుని చూపించావు. ఆయనలో లీనం అయ్యాను. నాకు వేరే గురువుతో పని లేదు. తృప్తిగా ఆత్మానందాన్ని అనుభవిస్తున్నాను. నిన్ను

ఇప్పటికే ప్రజలు బాగా గుర్తించారు. ఇంకా మారుమూలల్లో కూడా నీ ప్రకాశం పడి చీకట్లు తొలగాలి.

నా పాపాలు తొలగించు! నాకు జన్మనిచ్చిన జగన్మాత ఋణం తీర్చుకునే భాగ్యాన్ని కలుగచెయ్యి! ఒక మంచి పనికి నన్ను ఉపయోగించుకో! అంతా నా వాళ్ళే. నాకంటూ ప్రత్యేకించి ఎవరూ లేరు.

★ ★ ★

ఒక రోజున బల్లపై తల పెట్టుకుని విపరీతంగా స్వామి కోసం దుఃఖిస్తూ 'స్వామీ! నా కన్నీటితో నీ పాదాలు కడగాలని అనుకున్నాను. ఇలా కన్నీళ్ళన్నీ వ్యర్థం అయిపోతున్నాయి కదా! అని బాధపడుతుంటే స్వామి "ఈ విశ్వమంతా నా పాదమే కదా! ఎక్కడ పడినా ఆ కన్నీరు నా పాదాలు కడిగినట్లే" అని తెలియచేశారు. ఆ రోజునే మధ్యాహ్నం సూరి బాబుద్వారా పోస్ట్‌లో స్వామి పాదుకలు ఫొటో రూపంలో నాకు చేరినాయి.

ఒకరోజు సాయంత్రం మూడు గం॥లకు కర్పూర జ్యోతి కనిపించింది. భ్రమ కాదు స్పష్టంగా చూశాను. అలా జ్యోతి కనిపించేముందు – "ఎంతో తపశ్శాలులకే దైవం కనిపించటం దుర్లభం. అటువంటిది నాలాటి అజ్ఞానికి ఇది సాధ్యమా!" అని అనుకున్న వెంటనే కర్పూర జ్యోతి కనిపించింది. ఇది భ్రమకాదు. ఇటువంటి సంఘటనలే నన్ను దైవం వద్దకు చేరుస్తున్నాయి.

తర్వాత 1985 డిసెంబరు నెలాఖరుకు నేను వైజాగ్ నుంచి అల్లవరంలో మా ఆఖరు అమ్మాయి సుధ ఇంటికి వెళ్ళాను.

**2.1.1986**

మణి "తను ప్రెగ్నెంటేనని డాక్టరు నిర్ధారణగా చెప్పినట్లు" ఉత్తరం

వ్రాసింది. ఈ శుభవార్త కోసం పన్నెండు నెలలుగా ఎదురు చూస్తున్నాము. స్వామి నా మొర ఆలకించి తాను నాకు తెలియ చేసిన ప్రకారం వస్త్రం ప్రసాదించబోతున్నాడు. నేను శివుడికి 17.12.1985న జనవరి మొదటి వారంలో తెలుస్తుందని చెప్పిన విధంగా జనవరి మొదటి వారంలోనే మణి ప్రెగ్నెంటు" అన్న శుభవార్త స్వామి తెలియచేశారు.

మణి వాళ్ళ ఇంట్లో 11.12.1984న బాత్‌రూమ్‌లో స్నానం చేస్తుండగా "మణికి పుట్టబోయే కొడుకు నాకు వస్త్రం ప్రసాదిస్తాడని" స్వామి తెలియచెయ్యటం, వెంటనే నేను బయటకు వచ్చాక మణితో "నాకు వస్త్రం ఇచ్చేది ఎవరే?" అని అనటం, అది "నాకు పుట్టబోయే కొడుకా!" అనటం, ఆ రోజు నుంచీ ఈ శుభవార్త కోసం అదీ నేనూ స్వామిని వేడుకుంటూ ఉండటం జరిగింది. మా కోరిక ఇప్పటికి ఫలించింది. స్వామికి ఇవ్వటానికి నాదంటూ ఏమున్నది? ఆత్మార్పణ అయిపోయింది. పది మందికీ పనికి వచ్చే పనులు చేస్తూ, స్వార్థరహితంగా శేషజీవితం గడిపి, అందరికీ తల్లి అయిన జగన్మాతను చేరటమే!

అమ్మా! నిన్ను విడిచి ఎన్నో జన్మలు అయ్యింది. ఇప్పటికి నిన్ను తెలుసుకున్నాను. త్వరగా నీ ఒడిలో చేర్చుకో అమ్మా!

శ్రీ సత్యసాయిబాబా నా కోరిక తీర్చారు. నా గురువు శ్రీ సత్యసాయి బాబాకి కన్నీటితో అభిషేకం చేశాను. ఆనందంతో నా నోటి నుంచి ఇక ఏ మాటలూ రాలేదు.

సాయి సద్గురువు నాలో ఉన్న దైవాన్ని చూపించారు. నాలోని దైవాన్ని చూసుకుని హృదయంలో ప్రతిష్ఠించుకున్నాను. దైవం ఉన్న చోట సృష్టి అంతా ఉంటుంది. అంటే పవిత్రమైన నదులన్నీ నాలోనే ఉన్నాయి. నా హృదయం

ఆనందంతో పొంగి పవిత్రమైన నదుల జలం నా కన్నీటి రూపంలో ప్రవహించింది. అభిషేక ప్రియుడైన సాయీశ్వరునికి ఆ జలాలతో అభిషేకం చేశాను. ఈ సత్యం ఎవరు నమ్మినా నమ్మకపోయినా నాకు నష్టం లేదు.

**12.1.1986**

సాయి ప్రేరణతో ఈ రోజు వెంకాయమ్మగారికి (అల్లవరం) ఆమె కోరిక మీద మంత్రోపదేశం చేశాను. ఆవిడ నాకు పాద నమస్కారం చేశారు. స్వామీ! నాకు ఏ అర్హత ఉందని ఈ నమస్కారాలు స్వీకరించను? ఇవి నాకు కాదు నీకే!" వెంకాయమ్మగారు మంత్రోపదేశం పొందిన రోజు రాత్రి ఆమెకు "తాను వెండిబాటలో వెళుతున్నట్లుగా" కలవచ్చిందని చెప్పారు.

ఈరోజు నా పుట్టినరోజు. ఈ రోజుకి 50 ఏళ్ళు నిండినాయి. నేను యువనామ సం॥ పుష్యశుద్ధ విదియ శుక్రవారం 1935వ సం॥ డిసెంబర్ 27వ తేదీన గుంటూరు జిల్లా రేపల్లెలో రాత్రి 12 గం॥లకి జన్మించాను. నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు కీ॥శే॥ లక్ష్మీనరసమ్మ, కీ॥శే॥ ద్రోణావఝ్ఝల రామకృష్ణయ్యగారు.

నా పుట్టిన రోజున శ్రీ సత్యసాయి బాబా నా చేత ఆర్తితో అడిగిన ఆమెకు మంత్రోపదేశం చేయించారు. ఒక అజ్ఞానికి ఇంత అర్హత ప్రసాదించారు. సాయి అనుగ్రహానికి పాత్రురాలైనాను. నా సద్గురువు సాయి పాదములకు కన్నీటితో అభిషేకం చేశాను.

**14.1.1986**

ఈ రోజు రాత్రి కలలో స్వామి కనిపించారు. 'స్వామిని' ప్రేమ సాయి పుడతాడా!" అని అడిగాను. "పుడతాడు" అని బాబా చెప్పారు. నేను

తన్మయత్వంతో ప్రేమా! ప్రేమా! అని ఏడ్చాను. "స్వామీ! మీకు ముందే ఈ విషయం తెలుసా?" అని అడిగితే "తెలుసు" అని స్వామి చెప్పారు.

21. 1. 1986 అల్లవరం నుంచి మద్రాసు వెళ్లాను. అప్పుడు బాబా మద్రాసు వచ్చారు. ఆయన అక్కడ ఉండగా వెళదామని మద్రాసు వెళ్లాను.

**24. 1. 1986**

సాయంత్రం బాబా దర్శనం కోసం వెళ్ళినప్పుడు స్వామి తన సూచనల ప్రకారం వేరే రూపాలలో దర్శనం ఇచ్చారు. మనసులోనే స్వామీ! ఈ సారైనా నీ పాదాలు తాకి, కన్నీటితో నీ పాదాలు కడగాలి" అని అనుకున్నాను. కన్నీరైతే వచ్చింది కాని స్వామి తన పాదాలు ఇవ్వలేదు. కానీ, కొండంత తృప్తి.

స్వామినాలో ఉన్నా, నేనూ తనూ ఒకటే అయినా ఒక్కసారి నన్ను స్వయంగా పలకరిస్తే అదొక తృప్తి.

1986 జూలై 13వ తేదీన స్వామి సూచించిన విధంగా స్వామి అనుగ్రహంతో ప్రేమ సాయి రఘురామ్ జన్మించాడు. ప్రేమసాయి రఘురాం పుట్టిన తర్వాత రాణిగంజ్‌లోని షిరిడీబాబా గుడిలో ఎర్రగులాబీలతో సహస్రనామార్చన పంచాక్షరి జపిస్తూ చేశాను.

1985లో ఒకసారి వైజాగ్‌లో వైకుంఠ ఏకాదశినాడు ఉదయం శివుడు వాళ్ళింట్లో చాలా నీళ్ళు తలపైన పోసుకుని తలస్నానం చేయాలని అనిపించింది. ఈ మాట యశోదతో చెపితే తను నీళ్లు తోడి పోస్తానని చెప్పింది. "నాకు కావలసినన్ని నీళ్ళు నువ్వు తోడలేవులే" అని అన్నాను.

ఆ తర్వాత ప్రేమసాయి రఘురాం పుట్టాక బాలసారె ముందు రోజున (1. 8. 86) విపరీతంగా కుంభవృష్టి కురిసింది. ఆ వానలో తడుస్తూ చాలా

సేపు మణీ వాళ్ళింట్లో పెరటిలో గచ్చుకడిగాను. ఎంతకీ వర్షంలో నుంచి ఇవతలికి రావాలని అనిపించలేదు. ఆ తర్వాత స్వామి ఇలా తెలియచేశారు. "నీకు కావలసినన్ని నీళ్లు ఎవరూ తోడిపొయ్యలేరు అన్నావు కదా! అందుకే ఇలా కుంభవృష్టిలో స్నానం చేయించాను!!"

★ ★ ★

1986లోనే ఒకరోజు మా పెద్దమ్మాయి ఇంట్లో వచ్చిన కలలో "కృష్ణ పరమాత్మ నోటి నుంచి పెద్ద జలధార. ఆ జలధారలో నేను ఆనందంతో కేరింతలు కొడుతూ స్నానం చెయ్యటం" కనిపించింది.

"అది జలధార కాదు... అమృతధార... అమృత ధారలలో నిన్ను ముంచెత్తాను" అని స్వామి తెలియచేశారు.

1985లో స్వామి అరవయ్యవ పుట్టిన రోజుకు వెళ్ళినపుడు పుట్టపర్తిలో ఉన్నన్ని రోజులూ "స్వామీ! అందరికీ తిరిగి వెళ్ళటానికి వాళ్లకంటూ ఇళ్లు ఉన్నాయి. నేను ఎక్కడికి వెళ్ళనయ్యా! అందరూ అన్నీ డబ్బు పెట్టి కొనుక్కుంటున్నారు. ఇక్కడికి నేను భక్తి ధనంతో నిన్ను కొనుక్కోవటానికి వచ్చాను. నాకు నువ్వే కావాలి" అని ఏడ్చేదాన్ని. నన్ను వైజాగ్ నుండి తీసుకువెళ్లి ఏ చెట్టు క్రిందనైనా ఇంత చోటు చూపిస్తే నా కర్మఫలం అనుభవిస్తూ, నీ పిలుపు కోసం ఎదురు చూస్తూ నా శేషజీవితం గడుపుతాను. తిరిగి ఏ పిల్లల ఇంటికీ వెళ్ళనంటే మళ్లీ అయ్యప్ప భజన ప్రేరణతో అల్లవరం పంపుతున్నావు. జనవరి 15వ తేదీ దాకా అక్కడ ఉంటాను. తర్వాత అక్కడ ఉండను. ఎక్కడో అక్కడ నాది అన్న ఇంత చోటు చూపించు. చూపిస్తావన్న నమ్మకంతోనే నీ ఆజ్ఞగా అక్కడికి వెళుతున్నాను.

"నువ్వు వస్త్రం ఇచ్చినా కట్టుకోను. ఏ ప్రేరణ అయితే నాలో కలుగ చేసావో అదేవిధంగా మణికి పుట్టిన బిడ్డ చేతి వస్త్రమే తీసుకుంటానని పుట్టపర్తిలో నీ దగ్గర ప్రార్థించి, పన్నెండు నెలలు ఎదురు చూసిన నాకు, నీ మాట నిలబెట్టుకుని వస్త్రం ప్రసాదించబోతున్నావు. అలాగే ఉండటానికి చోటు కూడా చూపించు. నువ్వు తప్ప ఎవ్వరూ లేని అనాధని. అనాధరక్షకుడివి నువ్వు! ఈ అనాధను అక్కున చేర్చుకుని చోటు నివ్వు. ఆడది ఒంటరిగా ఉండలేదని ఆలోచించకు. నువ్వు ఉండగా ఒంటరిదాన్ని ఎలా అవుతాను? నాకు ఇంత చోటు చూపించు. లేదా నా కర్మలు తొలగించి నన్ను నీలోకి చేర్చుకో. ఎప్పటికయినా నేను నీలో ఐక్యం కావలసిన దానినే. నిన్ను విడిచి వెయ్యి జన్మలు అయింది. నీ అనుగ్రహంతో నా గమ్యం ఏమిటో నేను చేరుకోవలసిన చోటు ఎక్కడో ఈ జన్మలో తెలుసుకున్నాను.

1986 జులై 13వ తేదీన స్వామి సూచించిన విధంగా ఆయన అనుగ్రహంతో ప్రేమసాయి రఘురాం జన్మించిన తర్వాత మణిని, బాబుని తీసుకుని హైదరాబాదు నుండి వైజాగ్ వెళ్ళాను. కొద్దిరోజులు వాళ్ళు నా దగ్గర ఉండి వెళ్ళారు. తర్వాత నాకు వైజాగ్‌లో ఉండాలని అనిపించలేదు. నేను కోరుకున్న విధంగా కాలేజి, కాన్వెంటు మా అమ్మాయి పెట్టుకున్నా ఆ జీవితంలో కూడా ఇమడలేకపోయాను. మళ్ళీ ఒంటరిగా ఉండాలన్న కోరిక బలమై నాకు చాలా అశాంతిని కలిగించింది.

ఆ సమయంలో మా మూడవ అమ్మాయి సుజాత చాలా ఓర్పుతో నన్ను కంటికి రెప్పలా చూసుకున్నది. నేను అడగకుండానే నా కొద్దిపాటి అవసరాలు తీర్చేది. మా అల్లుడు శాంతిసాగర్ కూడా నన్ను కన్నతల్లిలా భావించి నా మనసును కష్టపెట్టకుండా ప్రవర్తించేవారు.

నాకు స్వామి పాటలు వినటం కోసం ఒక టేప్ రికార్డరు కొన్నారు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి అంతగా బాగుండకపోయినా వాళ్ళ ఖర్చులు కొన్ని తగ్గించుకుని నాకు చెప్పకుండా కొని తెచ్చారు. ఇదంతా వ్రాయటానికి కారణం ఏమిటంటే వాళ్ళు నన్ను అంత ప్రేమగా చూసుకున్నా నేను ఉండలేకపోయాను. ఆ పరిస్థితిలో ఒంటరిగా ఎక్కడ ఉండాలా అని చోటుకోసం ఆవేదన పడుతున్న సమయంలో మా చెల్లెలు ప్రసన్న "ఒక ఆశ్రమంలో ఉండటానికి అవకాశం ఉందేమోనని అక్కడి వాళ్ళని అడిగితే ఆశ్రమంలో వాళ్ళు చెప్పిన పనులు చేస్తూ, వాళ్ళ పద్ధతి ప్రకారం ఉండాలని" చెప్పారుట. "అలా ఆశ్రమంలో ఉండలేవని" మా చెల్లెలు చెప్పింది.

ఎక్కడైనా ఉండాలంటే నాకు వచ్చే రూ. 300 పెన్షను డబ్బులో ఎక్కువ అద్దె పెట్టలేను. ఏం చెయ్యాలి! అని నాలోని సాయికి వినిపించేలా మౌనంగా రాత్రి పగలు దుఃఖించే దాన్ని నాకు ఇంత చోటు ప్రసాదించమని. ఒకరోజున అశోక్‌నగర్‌లో మణీ వాళ్ళ ఇంట్లో ఉన్న నా దగ్గరికి ప్రసన్నం వచ్చి నాతో "మా పెరట్లో బాత్‌రూము ఉన్నది దానికి కిటికీ పెట్టించి ఇస్తాము. ఆ గదిలో ఉంటావా" అని మామరిది వేణుగారు అడగమన్నారని చెప్పింది. ఆ మాట వినగానే నా ఆనందానికి అంతులేదు.

నా మరిది శ్రీ వేణుగోపాల్‌గారు, చెల్లెలు ప్రసన్న పెద్దమనుసుతో నాకు ఆ గది ఇచ్చారు. వాళ్ళ ఋణం తీర్చుకోలేనిది. మాటల ద్వారా వ్యక్తం చేయలేనిది. మా చెల్లెలు వాళ్ళ ఇల్లు మెహిదీ పట్నం (హైదరాబాద్)లో ఉన్నది. అక్కడికి వెళ్ళి ఆగది చూసివచ్చాను.

మొట్టమొదటిసారి 1984లో గురు పూర్ణిమకి వెళ్ళినప్పుడు స్వామిని "ఆరడుగులచోటు" కోసం ప్రార్థించాను. సరిగ్గా మా చెల్లెలు ఇంట్లో గది

ఆరడుగులే ఉన్నది. స్వామిలీల! అడిగిన చోటును ప్రసాదించిన స్వామి యందు ఇంకా నమ్మకం వృద్ధి చెందింది.

1988 జూన్ 19వ తేదిన ఆ గదిలో గృహప్రవేశం చేశాను. ఆ సమయంలో మా అబ్బాయి, కోడలు, మనుమలు కూడా ఉన్నారు. మా చెల్లెలి కుటుంబ సభ్యులతోపాటు అందరం స్వామికి హారతి ఇచ్చాము. మా చెల్లెలు పులిహోర పాయసం చేసి అందరికీ ప్రసాదంగా ఇచ్చింది. చాలా ఆనందంగా అనిపించింది.

మా మరిది శ్రీవేణుగోపాల్‌గారు సహృదయంతో ఆ గదిలో ఉండటానికి అవసరమైన సదుపాయాలు చేయించారు అక్కడ ఉన్నప్పుడు మా చెల్లెలు నాకు కావలసిన సామాగ్రిని ఇవ్వటమేగాక నేను ఎప్పుడు వెళ్ళినా కన్నతల్లికి పెట్టినట్లు భోజనం పెట్టేది. నాకోసం ఎవరైనా వచ్చినా వాళ్ళని ప్రేమగా ఆదరించేది. అటువంటి చెల్లెలిని ప్రసాదించిన దైవానికి, ఆదరించిన మరిదిగారికి నేను ఏమివ్వగలను! ఏమిచ్చినా అది తక్కువే!

స్థలం కోసం ఎంతో పోరాడానేకాని తీరా ఆ గదిలో కూడా స్వామి నన్ను స్థిరంగా ఉండనివ్వలేదు. వైజాగ్‌లో కొన్నాళ్ళు, హైదరాబాదులో మణి ఇంట్లో కొన్నాళ్ళు, కొన్నాళ్ళు ఆ గదిలోనూ ఉంచేవారు.

ఒకరోజు మణి ఇంట్లో ఉండగా "అందరూ సమాధిస్థితి అని అంటూ ఉంటారుకదా! నాకు అలాటి స్థితి కలగటం లేదేమిటి?" అని వేదన పడ్డాను.

"మనసును భగవంతుని యందు లగ్నంచేసి, ఫలాపేక్ష లేకుండా కర్మలుచేస్తూ సుఖదుఃఖములను సమంగా భావించ గలగటమే సమాధిస్థితి అని" స్వామి తెలియచేశారు.

ఈ సాధన సమయంలో స్వామి నాకు వాక్కును ప్రసాదించారు. కొన్ని స్వామి నా చేత చెప్పించినవి జరిగాయి. ఒకరి పెళ్ళి ఫలానా టైముకు జరిపిస్తానని నా ద్వారా స్వామి చెప్పించారు. అన్న ప్రకారం ఆ టైముకు ఆ అమ్మాయికి వివాహం అయ్యాకే 1988లో నేను ఆ గదిలో ప్రవేశించాను.

1986లో కూడా డిసెంబరు 27లోపున ఒక అమ్మాయి వివాహం జరుగుతుందని స్వామి చెప్పించారు. డిసెంబరు 10వ తేదీ వరకూ కూడా ఏ సంబంధమూ నిశ్చయం కాలేదు. అన్నమాట ప్రకారం డిసెంబరు 27లోపల (డిసెంబరు 27 నా పుట్టినరోజు) వివాహం జరగకపోతే తిరిగి రానని పుట్టపర్తి వెళ్ళిపోయాను.

అన్నమాట ప్రకారం సరిగ్గా డిసెంబరు 24 ఆ అమ్మాయికి వివాహం నిశ్చయింపబడిందని మా అమ్మాయి నాకు పుట్టపర్తికి ఉత్తరం వ్రాశాకే నేను పుట్టపర్తి నుంచి తిరిగి వచ్చాను. డిసెంబరు 24న ఆమె వివాహం జరిగింది. కేవలం పదిరోజుల వ్యవధిలో సంబంధం కుదిరి ఆమె వివాహం జరగటం స్వామి చేసిన అద్భుతలీల!

ఇదే విధంగా మరికొన్ని సంఘటనలు కూడా స్వామి నా ద్వారా సూచించిన విధంగా జరిగాయి.

ఈ విధంగా నేను చెప్పినవి కొన్ని జరుగుతున్న సమయంలో మా పెద్దన్నయ్య శ్రీ ద్రోణావఝుల సుబ్బరాయ శాస్త్రిగారు నాకు ఒక ఉత్తరం వ్రాస్తూ అందులో సాధనలో కొన్ని సిద్ధులు వస్తాయి. ఆ సిద్ధులను అశుద్ధంగా చూడాలనీ, విడిచి పెట్టాలనీ" వ్రాశారు. ఆ ఉత్తరంలోని కొన్ని వాక్యాలు ఈ విధంగా ఉన్నాయి.

"నీ పరిస్థితి గురించి మణి ద్వారా తెలిసింది. నాకు చాలా సంతోషం కలిగింది. నీ పూర్వజన్మ సంస్కారము ఎంత గొప్పదో! మనము ఒక తల్లి కడుపున పుట్టి ఋణానుబంధముగా కలిసినాము. నీవు అట్టి నివృత్తి మార్గమును కలిగి అటూ ఇటూ కూడా ముప్పై తరముల వారిని (ఏడు తరములు కాదు) సంస్కరించు శక్తి నీలో కలిగినందుకు చాలా సంతోషము (నిన్ను స్తోత్రము చేయుటకు కాదు). నాలో కలిగిన ఆత్మానుభూతి ఇట్లు వ్రాయించినది. మేము చిన్నతనము నుండి కొంత దైవభక్తితోనూ, తర్వాత కొంచెము ఎక్కువగాను దైవారాధనలూ, జపములూ చేసినను ఆత్మసందర్శనలో పసివారముగా ఉన్నాము.

నీకు ముఖ్యంగా వ్రాయునది నీకు ఈ శక్తి కేవలము ఎన్నో పూర్వజన్మల సంస్కారముచే వచ్చినది. ఈ జన్మలో ఫలించినది. సిద్ధులు కూడా కలుగవచ్చును. కనుక నీవు ఆ సిద్ధుల జోలికిపోకు. నిరంతరము ఆత్మ నిష్ఠలోనే గడుపుకొనుచు ఆనందించుము'.

అలా అన్నయ్య ఉత్తరం వ్రాసిన దగ్గర నుండీ "నాకు సిద్ధులు వద్దు... నువ్వే కావాలి" అని ఏడిచే దాన్ని ప్రతిక్షణం. క్రింద పడి దొర్లిదొర్లి ఏడుస్తుంటే గచ్చంతా తడిసిపోయేది. అదే సమయంలో నేను ఒకరికి చెప్పిన టైముకు వివాహం జరగలేదు. ఆ కారణంగా నేను చాలా బాధపడ్డాను. ఏడ్చాను. ఆ గదిలో కూడా ఉండలేకపోయాను.

'సిద్ధుల నుంచి నిన్ను కాపాడి, ఆత్మనిష్ఠలో స్థిరంగా ఉంచి సర్వత్రా నన్ను దర్శించటం కోసమే అలా నీ చేత చెప్పించాను. కర్మ పరిపక్వం అయ్యాక ఆ వివాహం జరుగుతుంది" అని స్వామి తెలియపరచారు. 1994లో ఆ వివాహం కూడా జరిగింది. అది జరిగిన తర్వాత గదిలో నిశ్చింతగా ఉన్నాను.

★ ★ ★

ఎప్పటికప్పుడు స్వామి బాహ్యదృష్టి నుంచి నా మనస్సును మళ్ళించి నన్ను అంతర్ముఖంగా నడిపించారు. సిద్ధుల వల్ల వచ్చే కీర్తి ప్రతిష్ఠలూ, డబ్బూ అన్నీ నా సాయి కృష్ణుని కంటే ఎక్కువ కాదు.

తర్వాత నా పెన్షన్ వెయ్యి రూపాయల వరకూ పెరిగింది. నా భర్త న్యాయమైన సంపాదన ద్వారా లభించే పెన్షనులోనే నా కనీస అవసరాలు తీర్చుకుంటూ కొంత డబ్బు ఇతరుల కోసం ఖర్చు పెడుతున్నాను.

★ ★ ★

ఒకసారి పుట్టపర్తి వెళ్ళినపుడు అక్కడ కలలో "స్వామి చిన్ని కృష్ణుడిలాగా కనిపించారు. నెమలిపింఛం, మురళి, అన్ని ఆభరణాలు ధరించి ఉన్నారు. నేను ఆ చిన్ని కృష్ణుడిని ఎత్తుకున్నాను. స్వామీ! నాకు అష్టైశ్వర్యాలు ప్రసాదించవా! కృష్ణా! అని అడిగాను. ఆయన తన చేతిలోని మురళిని అటూ ఇటూ తిప్పేసరికి నాకు వంటి నిండా సొమ్ములు వచ్చాయి. బాగా అలంకరింపబడ్డ గోపికలాగా అయ్యాను. ఇంతలో నేను 'స్వామీ! 1985 జనవరి ఒకటవ తేదీన నీ అనుగ్రహంతో వంటి మీద ఉన్న కొద్ది పాటి వస్తువులను కూడా తీసివేశాను. వదిలి వేసిన నగలను ఎలా ధరించను? నాకు తెలియక అష్టైశ్వర్యాలు అని అడిగాను. ఈ నగలేవీ నాకు వద్దు అని విపరీతంగా ఏడ్చాను".

తెల్లవారాక ఒక పుస్తకం చదువుదామని తీస్తే అందులో "అష్టైశ్వర్యాలు అంటే అమ్మపాదాలే" అని ఉన్నది. అది చదివిన తర్వాత నా ఆనందానికి అంతులేదు. అప్పటి నుంచీ "అమ్మా! నాకు నీ పాదాలే కావాలి" అని ఆర్తితో ప్రార్థించాను.

★ ★ ★

ఒకసారి గదిలో పడుకుని ఉండగా "స్వామీ! నాకు తెలియక ఆరడుగుల స్థలం ఇవ్వమని నీతో స్థలం కోసం పోరాడాను. కాని, విశ్వమంతా నిండిన చైతన్యాన్ని ఆరడుగుల స్థలానికి పరిమితం చెయ్యటం సాధ్యమా!" అని అనిపించింది.

★ ★ ★

పుట్టపర్తి వెళ్ళి వచ్చిన దగ్గర నుంచీ ఎన్నో ఆధ్యాత్మిక అనుభవాలు కలుగుతున్నాయి. ఈ అనుభవాలకి అర్థం ఇంకెవరినీ అడగనని నిర్ణయం తీసుకున్నాను. ఆ నిర్ణయానికే కట్టుబడి ఉన్నాను.

స్వామి వద్దకు వెళ్ళి వచ్చిన తర్వాత జరుగుతున్న ఆత్మానుభవాలు ఆయన అనుగ్రహంతోనే జరుగుతున్నాయన్న విశ్వాసంతో జగద్గురువుగా ఆయన ఫొటో పెట్టుకుని సాధన చేస్తున్నాను. ఇప్పటికీ తానే నా గురువు అన్న సత్యాన్ని బయటకి తెలియచెయ్యలేదు. ఇంత వరకూ ఎన్నిసార్లు పుట్టపర్తి వెళ్ళినా నాతో మాట్లాడలేదు. కాని, అప్పుడప్పుడు కలలలో దర్శనం ఇస్తున్నారు. ఎదురుగా మాట్లాడకపోయినా మనసులోనే నా అనుభవాలకు అర్థం తెలియజేస్తున్నారు.

★ ★ ★

ఈ సాధనలో ఎన్నోసార్లు మాయ నన్ను పీడించటం, దీని వలన స్వామికి దూరమవుతానేమోనన్న బాధ కలిగేది. మనసు చెప్పిన విధంగా నడవటం తప్ప నాకు ఎవరూ ఈ యోగం గురించి చెప్పలేదు. అందుచేత అప్పుడప్పుడు పుస్తకాలలో చదివే విషయాలు, నేను ఆచరిస్తున్న విషయాలు ఒకటే అవటం వలన నేను వెళ్తున్న మార్గం సరైనదేనని నమ్ముతూ ముందుకు సాగిపోతున్నాను.

స్వామి నా మనసును అంతర్ముఖం చేశాక ఎన్నో అద్భుతమైన

అనుభవాలు జరిగాయి... జరుగుతున్నాయి. ఇదంతా నా గురుదేవులు సాయి ఆశీర్వాద బలం. ఉపనిషత్తుల సారం అంతా మానసిక గురువై నాలో నింపారు. "నేను ఎవరు?" అని పిచ్చిదానిలా అన్వేషిస్తున్న సమయంలో "నేను" కూడా "విశ్వవిరాట్ స్వరూపిణినే"నని తెలియచేశారు.

గదిలో ఒక్కదాన్నే ఉండి, వండుకుని ఒంటరిగా తింటున్నప్పుడు "స్వామీ! ఒంటరిగా భోజనం చేస్తున్నాను. నలుగురికీ పెట్టి తినే అదృష్టం నాకు లేదు" అని బాధపడేదాన్ని అయితే దీనికి స్వామి ఇచ్చిన సమాధానం.

"ఆత్మను తెలుసుకున్న నీవు వండిన పదార్థాన్ని జఠరాగ్ని రూపంలో ఉన్న పరమాత్మకు నివేదన చేసి "నేను తినటం లేదు. నేను వండటం లేదు" అన్న సత్యభావనతో భుజిస్తున్నావు. ఈ కారణంగా నువ్వు సమస్త జీవులకు అన్నం పెడుతున్నావు. ఇక ఒంటరిగా భుజించటం ఏమిటి? జీవత్వం ఎక్కడుంది? నీవే పరమాత్మ స్వరూపం అయినప్పుడు?"

★ ★ ★

ఒకసారి భద్రాచలం వెళ్ళినప్పుడు గోదావరిలో స్నానం చేసే ముందు బ్రాహ్మణుడు "సంకల్పం చెబుతాను. పేరు, గోత్రం చెప్పండి" అన్నాడు. నాకు గోత్రనామాలతో స్నానం చెయ్యాలి అని అనిపించలేదు. ఏం చెయ్యాలో తెలియని స్థితిలో స్వామి "నేను" అన్న అహం పోయిన తర్వాత ఉన్నది ఒకటే "అహంబ్రహ్మ" అన్న భావనతో స్నానం చెయ్యమన్నారు.

★ ★ ★

ఒకసారి గదిలో పడుకుని ఉండగా "స్వామీ! చాలామంది ఇళ్ళల్లో నీ ఫొటో నుంచి విభూతి వస్తూ ఉంటుంది. నేను కూడా ఎంతో కొంత భక్తితోనే ఉంటున్నాను కదా! మరి నా గదిలో నీ ఫొటోలో నుంచి విభూతి రాదేమిటి?

నా భక్తి లోపమా?" అని బాధపడుతూ ఉంటే స్వామి "నా ఫొటోలో నుంచి విభూతి వస్తే ఫొటోనే చూస్తారు. అందుచేత నా విభూతిని నీ నుంచి ప్రకటిస్తానని" తెలియజేశారు.

★ ★ ★

1984లో గురుపూర్ణిమకు పుట్టపర్తి వెళ్ళి వచ్చిన తర్వాత స్వామి సద్గురువుగా ఆధ్యాత్మిక బాటలో నన్ను ఇలా నడిపిస్తున్నారు. ఆత్మనిష్ఠలో మానసికంగా దివ్యానుభూతులు పొందుతూ ఆత్మానందంలో ఉన్నాను. స్వామి మానసికంగా చెప్పినట్లు ప్రేమసాయి రఘురామ్ జన్మించాడు. స్వామి చెప్పిన విధంగా కొన్ని పనులు జరుగుతున్నాయి. బాబు పుట్టిన తర్వాత స్థిమితంగా ఉన్న నాలో అనుకోని మార్పులు కొన్ని జరిగాయి. నేను స్థిరత్వం కోల్పోయి చంచలంగా ఉన్నాను. ఈ పరిస్థితిలో సాయికి దూరం అవుతానేమో నన్నభయంతో "స్వామీ! మీకుదూరం అయి బ్రతకలేను. అలాగని ఈ పరిస్థితిని ఎదుర్కొనే శక్తి లేదు. ఈ మాయ నుంచి తప్పించమని నాగురు దేవుని ప్రతిక్షణం తలచుకుంటూ కొంత కాలం వైజాగ్‌లో మా మూడవ అమ్మాయి సుజాత వద్ద, కొంత కాలం మా ఆఖరి అమ్మాయి సుధ వద్ద విజయనగరంలో, మరి కొంతకాలం హైదరాబాదులో మా రెండవ అమ్మాయి మణి ఇంట్లో, మరికొంత కాలం మెహిదీపట్నంలో నా గదిలో, ఉన్నచోట ఉండకుండా 1992 వరకూ గడిపాను. కానీ ఈ ఏడేళ్లు కూడా స్వామి ఆధ్యాత్మిక బాటలో అనేక అనుభూతుల ద్వారా ఉన్నత శిఖరాలకు తీసుకు వెళుతూ, తన దివ్య శక్తితో నా కర్మను తొలగించి చంచల స్థితి నుంచి అచంచల స్థితికి తీసుకువెళ్ళారు.

1986 నుండి 1992 వరకూ ఎవరి ఇంట్లో ఉన్నా వాళ్ల ఇళ్లలో సాయి సేవగా భావించి నేను చేయగలిగిన పనులు చేసేదాన్ని. ఆధ్యాత్మిక పుస్తకాలు కూడా ఏమీ చదివేదాన్ని కాదు. పుస్తకాలు చదవటం కన్నా ఇంటి పనులు

చేయటంలో ఆసక్తి ఎక్కువగా ఉండేది. సినిమాలు చూసేదాన్ని. చివరికి పిచ్చిదాన్ని అయి స్వామిని పొందలేనేమోనన్న వేదనతో తరచు విపరీతంగా ఏడిచేదాన్ని. గురుదేవా! ఈ స్థితి నుంచి బయట పడవెయ్యమని అనేక విధాలుగా స్వామిని వేడుకునే దాన్ని. స్వామి తన కృపాదృష్టితో నా కర్మను తొలగించి గురువుగా నాకు ఆత్మజ్యోతిని దర్శింపచేశారు.

★ ★ ★

1992 ఆగస్ట్‌లో స్వామి హైదరాబాద్ వచ్చి వెళ్ళిన తరువాత సెప్టెంబరులో కృష్ణా పుష్కరాలకి నా జన్మస్థలమైన రేపల్లె వెళ్లి మా ఇలవేల్పు అయిన మోరతోట ముక్తేశ్వరస్వామి సన్నిధిలో పుష్కరస్నానాలు చేశాను. మా అక్క, బావగార్లలో శివపార్వతుల దర్శనం అయింది. కృష్ణలో వాళ్ళ పాదాలు కడిగాను. ఇదంతా నా గురుదేవులు శ్రీశ్రీశ్రీ భగవాన్ సత్యసాయి బాబావారి సంకల్పంతోనే జరిగింది. బాబా కృప వలన ఆయన భౌతికంగా పుట్టపర్తిలో ఉన్నా స్వయం గురువై ఇదంతా ఇక్కడ చేయించారు. కలలో మా పెద్దన్న గారు శ్రీ సుబ్బరాయ శాస్త్రి ద్వారా నాకు మంత్రదీక్ష ఇప్పించారు. అందుకే నా గురుదేవుని మా అన్నగారిలో దర్శించుకుని, గురుదేవుని పాదాలను పవిత్రమైన కృష్ణానదీ జలాలలో కడిగి నీళ్ళు శిరసున జల్లుకున్నారు.

1987లో స్వామి ప్రేరణతో చెప్పులు వదిలేశాను. చాలామంది చెప్పులు ఎందుకు వేసుకోరని అడిగేవారు. కారణం తెలియదు. స్వామి వద్దని చెప్పారని చెప్పేదాన్ని. ఒకసారి స్వామీ! చెప్పులు ఎందుకు వేసుకోవద్దని అన్నావు? అందరూ ఎందుకు వేసుకోరని అడుగుతున్నారని' అడిగాను. హృదయభాషలో స్వామి "భూమి అమ్మ స్థూల రూపం. అంతర్ముఖులై యోగసాధనలో ఉన్న సాధకులు చెప్పులు వేసుకోకూడదని' చెప్పారు"

★ ★ ★

1992వ సం॥ ఆగస్ట్ నెలలో శ్రీ సత్యసాయి నిగమాగమ కళ్యాణ మంటపం ప్రారంభోత్సవానికై స్వామి హైదరాబాద్ వచ్చి నాలుగు రోజులు ఉన్నారు. ఆ నాలుగు రోజులూ స్వామి దర్శనం లభించినా ఈసారైనా మాట్లాడతారేమోనన్న ఆశతో ఉన్న నన్ను పలకరించలేదు. “నన్ను కాలరాసి, కాళ్ళ తన్ని వెళ్ళారని” బాధ పడుతూ విపరీతమైన దుఃఖంతో వైజాగ్ వెళ్ళాను. కాలరాసి, కాళ్లతన్ని వెళ్ళారని నేను పడుతున్న బాధకు మళ్లీ స్వామే చక్కగా అర్థం తెలియజేశారు.

“కాలరాసింది నీ అహంకార మమకారములను, రాగ ద్వేషములను, అవి పోయిన తర్వాత ఉన్నది శుద్ధత్వమే కదా! కాళ్ళ తన్న లేదు. శుద్ధ చైతన్య స్వరూపంగా మారిన తర్వాత కాళ్ళతన్నినా ఎక్కడికి నెట్టి వేయబడతావు? ఉన్నది అంతా విరాట్ స్వరూపంకదా! నీ గురు చరణ కమలాల వద్దనే ఉన్నావు”.

ఈ విధంగా స్వామి తెలియ చేసింది 28.1.93 ఉదయం 11 గం॥లకి స్వామి ఆ విధంగా నా పూర్వజన్మకర్మ ఫలాన్ని పూర్తిగా తుడిచి పెట్టి వెళ్ళారు. స్వామి తలచుకుంటే కర్మ బంధాలను తొలగింపగలరనే విశ్వాసం నాకు కలిగింది.

**మణికి వ్రాసిన ఉత్తరం**

“... ఎప్పటి నుంచో కృష్ణుడి బొమ్మ కొనాలని కోరిక, ఆ కోరిక ఇప్పటికి తీరింది. బొమ్మలు చేసే వాళ్ళ దగ్గరికి వెళ్ళి ఆర్డరు ఇచ్చి చేయించాను. రెండున్నర అడుగుల ఎత్తులో విగ్రహం బాగున్నది. దీపావళి రోజుకి నా చిన్ని కృష్ణుడు విగ్రహరూపంలో వచ్చాడు. నా గురువు బాబా ఫొటోను పక్కన పెట్టి, ఆ స్థానంలో కృష్ణ విగ్రహాన్ని పెట్టుకున్నాను. తర్వాత ఆ విగ్రహంలో నుంచి గురు... గురు అని శబ్దం వచ్చింది.

నా గురువును పక్కన పెట్టి కృష్ణుని విగ్రహం పెట్టి తప్పు చేశానేమోనని చాలా బాధ పడ్డాను. అయితే స్వామి ఇలా తెలియచేశారు.

“గురువుగా శిష్యునికి దైవాన్ని చూపించటం గురువు బాధ్యత. అందువల్ల నీకు దైవాన్ని చూపించి నేను పక్కకు తప్పుకున్నాను. కాని గురువు దైవం ఒక్కటే. మాలో బేధం లేదు. కాబట్టి బాధ పడవద్దు” అని తెలియచేశారు.

పని అయిన తర్వాత రోజంతా నా కన్నయ్యతోటే గడుపుతున్నాను. వాడే నా లోకం. నా తండ్రిని విడిచి బయటకు వెళ్ళాలని లేదు. అయినా బైట తిరగటానికి నాకు పనులేమి ఉంటాయి? నా మనసంతా ఆ చిన్ని కృష్ణుడి చుట్టూ తిరుగుతున్నది. దేని గురించి ఆలోచించే తీరిక లేదు. ఎన్నేళ్ళగానో ఎదురు చూస్తున్న సాయి కృష్ణుడు వచ్చాడు (ఆగస్ట్ 1992లో స్వామి హైదరాబాద్ వచ్చారు కానీ ఆయన పాదాలు ఇస్తే ఇక వదలనని భయం. అందుకే కాళ్ళకి చుట్టుకున్న నన్ను నిర్దయగా కాళ్ళ తన్ని వెళ్ళి పోయారు. (అంటే పలకకుండా వెళ్ళిపోయారు) కాని, నా తండ్రికి నేనంటే ప్రేమ. అందుకే ఆయన విగ్రహ రూపంలో వచ్చి నా మధుర ప్రేమకు కట్టుబడి నాతో ఉండిపోయాడు. స్వామి అంటారు కదా “తనది కోటి తల్లుల ప్రేమ అని” ఆ మాట అక్షరసత్యం. నా పరిపూర్ణమైన ప్రేమ నా సాయి కృష్ణుడికే. నా సాయి నాతో మాట్లాడక పోయినా ఫరవాలేదు. ఆ విగ్రహమే స్వామిగా భావించి నా చిన్ని కన్నయ్యకు నా కన్నీటితో అభిషేకం చేస్తూ నా హృదయ ఫలం చిన్ని కృష్ణునికి నివేదించుకున్నాను. గంగలా ప్రవహించే నా కన్నీళ్ళతో భగవంతుడే పునీతుడవుతున్నాడు.

మణీ! భక్తుని కన్నీటికి అంతశక్తి ఉన్నది. నా మాటలు అర్థం చేసుకునే శక్తి నీకు మాత్రమే ఉన్నది. ఈ ఉత్తరం నీ ఒక్కదాని కోసమే. ఎవరి కోసమూకాదు. కర్మ నశిస్తే కాని భగవంతుడిని చేరలేము. నా కర్మ నశించింది.

స్వామిని అనంత విశ్వంలో చూసుకుని, నాది కాని ఈ దేహంలోని జీవాత్మ జీవించి ఉండగానే అనంత తత్త్వంలో కలిపి వేసుకున్నాను. మిగిలింది ఈ కట్టే టైము వచ్చినప్పుడు బండెడు కట్టెలలో ఒక కట్టెగా కాలి బూడిద అయి ఈ విశ్వమంతా వ్యాపిస్తుంది. నా దేహం ఉన్నది కానీ నేను లేను. నన్ను ఈ అనంత విశ్వంలో చూడు. నీలో చూసుకో. అమ్మకాని అమ్మని రమ్మని బలవంతపెట్టకు.

భగవంతుడి పిలుపు వచ్చే వరకూ ఎదురు చూస్తూ ఈ శేష జీవితం గడుపుతాను. "స్వామి వస్త్రం ఇవ్వాలి.. ఎక్కడ ఉండాలో చెప్పాలి" అన్న ఆలోచన కూడా రావటం లేదు. "ఆయన మాట్లాడితే గుర్తింపు ఉంటుంది. నలుగురికీ చెప్పాలంటే. వాళ్ళకి నా మీద విశ్వాసం ఉంటుంది" అని అనుకునే దాన్ని. కాని, నాకు ఎవరి గుర్తింపు వద్దు. నన్ను నేను తెలుసుకునే శక్తి స్వామి ప్రసాదించారు. అజ్ఞానిని జ్ఞాన మార్గాన నడిపించిన నా గురు దేవుని పాదాలను అంతటా చూసుకుని తరిస్తాను. తత్త్వం తెలుసుకున్నాను. చాలు. ఈ దేహం ఉన్నంత వరకూ ఏదో ఒక పని చెయ్యాలి. అది ఇక్కడే చేస్తున్నాను. నాకు పనిలో ఉన్న ఆనందం పుస్తకాలు చదవటంలో లేదు. ఎంత ఆత్మతత్వంలో ఉన్నా కొన్ని లౌకిక వ్యవహారాలు, మాటలు తప్పవు కదా! ఇళ్లల్లో ఉన్నందుకు. స్వామిని పూర్తిగా నమ్మి సాయి బాటలో ప్రయాణం చేస్తున్నాను. నమ్మిన నన్ను అన్యాయం చెయ్యరన్న విశ్వాసంతో ముందుకు పోతున్నాను. ఓడినా.. గెలిచినా ఆయనే 'నేను' అన్నది లేదు.

**23.1.1993**

రాత్రి కలలో "ఒక ఏనుగు తొండంతో నన్ను చుట్ట చుట్టి పండు ఆరగించినట్లు నోట్లో పెట్టుకోవటం" కనిపించింది.

ఈ కలకి అర్థం స్వామి 27.1.1993న ఇలా తెలియచేశారు. "ఆకు చాటుపిందెలాగా నిన్ను కాపాడి "ఉపనిషత్ సారంతో" నిండిన నీ హృదయఫలాన్ని నేను ఏనుగు రూపంలో స్వీకరించాను. వ్యర్థ పదార్థం నీలో లేదు కాబట్టి నిన్ను పూర్తిగా ఆ రూపంలో స్వీకరించాను" అని అద్భుతంగా తెలియచేశారు.

అద్భుత మూర్తి లీలలు అద్భుతం! నీ పాదాలు తప్ప ఏమైనా నాకు తృణప్రాయమే!

**25.1.1993**

రాత్రి కలలో "ఇంద్రధనస్సు" కనిపించింది.

ఏడు రంగుల హరివిల్లును చూస్తూ తన్మయస్థితిలో ఉండగా ఇల్లంతా ఇంద్రధనస్సు రంగులతో నిండిపోవటం కనిపించింది.

"అద్భుతమైన దృశ్యం!"

ఈ కలకు అర్థం ఏమిటని ఆలోచిస్తుంటే స్వామి దానికి అర్థం అద్భుతంగా తెలియజేశారు.

"నా కృపా దృష్టి నీపైన పడింది. నీ జీవితం సప్త వర్ణాలతో ప్రకాశించే సమయం ఆసన్నమైంది. ఆ హరివిల్లును నేనే. నేనే ఆ విధంగా నీకు దర్శన మిచ్చాను".

1985 జులై నెలలో సాధన సమయంలో ఒకసారి వైజాగ్‌లో శివుడు వాళ్ళింట్లో నా చేతికున్న బంగారు గాజులను వాళ్ళ దేవుడి గదిలో తీసి లక్ష్మి ఫొటో వైపు గిరాటుకొట్టి "నాకు లక్ష్మి వద్దు... సరస్వతి కావాలి" అని ఏడ్చాను.

1993లో ఒక రోజున భాగవతంలోని "క్షీరసాగర మథనం" ఘట్టం చదువుతున్నాను. సాయి కృష్ణునికి దీపం పెడదామంటే వత్తులు అయిపోయాయి.

ఇంట్లో ఎవరూ లేరు. తాళం వేసి బజారు వెళ్ళటానికి బద్ధకించి సాయి ప్రేరణతో దారంతోనే వత్తులు చేసి దీపం వెలిగించాను. కనకాంబరం దండ కృష్ణుని మెడలో వేసి చూస్తే వైకుంఠంలోని నారాయణునిలా దర్శనం ఇచ్చారు. మళ్ళీ భాగవతంలోని క్షీరసాగర మథన ఘట్టం చదవటం మొదలు పెట్టే ముందు గురువుకు నమస్కారం చేస్తూ "గురు దేవా! నాకు కీర్తి ప్రతిష్ఠలు వద్దు! భోగ భాగ్యాలు వద్దు! నువ్వు ఏమి అనుగ్రహించినా తీసుకోను. నీ పాదాలు చాలు" అని నమస్కరించాను. ఇదంతా నాకు తెలియకుండానే సాయి ప్రేరణతో అనుకున్నాను.

"పాల సముద్రం మధించగా శ్రీ మహాలక్ష్మి పుట్టింది. ఆవిడకి ఎవ్వరి దగ్గరా ఉండటం ఇష్టం లేక నారాయణుని కోరి ఆయన పాదాల చెంత ఉండిపోయింది. మహాలక్ష్మిని దేవతలు సింహాసనం పైన కూర్చోబెట్టి అభిషేకం చేస్తారు".

ఇదంతా పుస్తకంలో చదువుతుంటే నాలో ఏదో తెలియని ప్రేరణతో నాకు తెలియకుండానే ఏదో జరిగిపోతున్నది. శ్రీమన్నారాయణుని నా హృదయపీఠం మీద ప్రతిష్ఠించుకున్నాను కదా! అందుకే మహాలక్ష్మి నాలోకి ప్రవేశించిందన్న అనుభూతి కలిగింది.

"అమ్మా ... నా హృదయమే సింహాసనం చేసి నిన్ను ప్రతిష్ఠించు కున్నాను. ఏ తీర్థాలకు వెళ్ళి నీకు అభిషేక జలం తీసుకురాను తల్లీ! నా కన్నీటితోనే నీకు అభిషేకం చేసి, నా హృదయమే ప్రమిదగా చేసి భక్తి అనే తైలం పోసి, మనస్సునే వత్తిని చేసి, జ్ఞానాగ్నితో ఆ వత్తిని వెలిగించి నీ ముందు కర్పూరంలా కరిగి నన్ను నీకు నివేదన చేసుకున్నాను తల్లీ! అని ప్రార్థన చేసి హారతి పట్టాను.

నాలో జరిగిన క్షీరసాగర మథనం వంటి అంతర్మథనం వలన లక్ష్మి మళ్లీ ఆవిర్భవించింది. నా హృదయంలో ప్రతిష్టించుకున్న నారాయణుని చేరుకుంది అన్న భావన కలిగింది. లక్ష్మిని నేను అపుడు కాదన్నా తిరిగి నా వద్దకే వచ్చింది.

**19.6.1985**

1985 జనవరిలో మణీ వాళ్ళింట్లో ఒకరోజు ఉదయం బాయిలర్ వెలిగిస్తూ ఉంటే నాకు ఈ విధంగా అనిపించింది. అగ్నిదేవుని ప్రార్థిస్తూ "అగ్నిదేవా! నేను చనిపోయిన తర్వాత ఈ దేహం పూర్తిగా కాలి, బూడిద అయ్యేవరకూ గాలి, వర్షం వంటి ఆటంకాలు కలుగకుండా నిశ్చలంగా కాలిపోయేలా అనుగ్రహించమని" వేడుకున్నాను.

కాని, ఈ రోజు స్వామి తెలియ చేసిన అర్థం –

'భగవంతుడిని చేరుకోవాలన్న నా కోరిక గాలికి ఎగిరిపోయే ఎండుటాకులా, వర్షంకి తడిసి మొలకెత్తే విత్తనంలా కాకుండా, మనసే కోరికలకు నిలయం కాబట్టి మనస్సనేదే లేకుండా జ్ఞానాగ్నిలో బూడిదగా మార్చాలి.

శరీరం అగ్నిలో కాల్చటం కాదనీ, మనసులోని కోరికల్ని దగ్ధం చేసుకోవటం అని నా గురు దేవులు తెలియజేశారు. అప్పుడు దేహ భావనలో అలా అనిపించి, ఇప్పుడు ఆత్మభావనలో ఇలా తెలియజేశారు.

5.2.1995

1986 జులై నెలలో ప్రేమసాయి రఘురాం పుట్టిన ఐదవ రోజున "తైత్తిరీయము", "118" అని మాటలు వినిపించాయి. "ఉపనిషత్తులలో ప్రాచుర్యం పొందినది తైత్తిరీయోపనిషత్తు అని, అది గురు శిష్యుల బాంధవ్యం

తెలియజేసే ప్రముఖమైన ఉపనిషత్తుని" ఒక పుస్తకం ద్వారా స్వామి తెలియజేశారు. ఆ ఉపనిషత్తే నాకు బోధించినట్లు తెలియచేశారు.

★ ★ ★

1994లో విజయదశమి రోజు రాత్రి మా తమ్ముడి ఇంటికి వెళ్ళాను. ఆ మర్నాడు మా మరదలు పూజ చేస్తున్నది. నేను పూజ గది ముందు నుంచి వెళ్తూ ఉంటే ఎందుకో దేవుడి దగ్గర కర్పూరం వెలిగించాలని అనిపించింది. కాని, వెంటనే వెలిగించలేదు. అలా అనిపించిన క్షణం నుంచీ మనస్సు స్థిమితం లేదు. రాత్రంతా నిద్ర పట్టలేదు. చాలా కర్పూరం వేసి పెద్ద జ్యోతిలాగా వెలుగుతుంటే చూడాలని, అది అఖండంగా వెలుగుతూ ఉండాలని ఈ ఆలోచనలతో తెల్లవారింది. అందరితో మాట్లాడుతూ తిరుగుతున్నా నా ధ్యానం మాత్రం ఆ కర్పూర జ్యోతి మీదనే ఉన్నది. సాయంత్రం ఆరు గంటలు అయ్యింది. ఉన్నట్లుండి దేవుడి గదిలోకి వెళ్ళి కర్పూరం వెలిగించాను. తృప్తిగా లేదు. మళ్ళీ మళ్ళీ కర్పూరం వేస్తూనే ఉన్నాను. కానీ, ఏదో అశాంతి.

"గురుదేవా! ఎన్నోసార్లు నా చేత హారతి పట్టించావు. ఎప్పుడూ ఇలా లేదు. సాధనలో అనేకసార్లు అనేక దేవతా మూర్తులకు ఏ రోజు ఎవరు వస్తారో ఆ దేవతామూర్తి పేరు చెప్పి హారతి పట్టించావు. నువ్వు గురువుగా వచ్చే ముందు నా దైవమందిరం నుంచి అన్ని దేవుళ్ళని ఒకరి ద్వారా తీయించి వేరొకరికి ఇప్పించావు. అప్పుడు చాలా దుఃఖించాను. ఎవ్వరికీ చెప్పుకోలేని మూగ బాధని అనుభవించాను. కాని, నువ్వు నా హృదయసారథివై దేవతా మూర్తులన్నింటినీ తిరిగి నా వద్దకు రప్పించి హారతులు పట్టించావు. ఈ హారతి ఎందుకు ఏ దేవుడికి పట్టిస్తున్నావు?" అని నా గురువును వేడుకున్నాను. అప్పుడు నా గురుదేవులు ఇలా తెలియజేశారు.

"గురువుగా ఖండారాధనగా అనేక మూర్తులకు హారతి పట్టించి ఈ రోజు నిన్ను అఖండ స్థితికి తీసుకు వెళ్ళి విరాట్‌స్వరూపుడైన విష్ణుమూర్తికి (పరమాత్మకి) హారతి పట్టించాను. అందుకే ఎంత కర్పూరం వేసినా నీకు తృప్తి కలగలేదు. దేహ భావం వీడి అఖండ జ్యోతిలా నిలిచిపో" అని స్వామి చెప్పిన తర్వాత ఆ కోరిక నశించి ప్రశాంతత వచ్చింది.

ఈ జ్యోతి ఎన్ని జ్యోతులను వెలిగించాలో?

**డిసెంబరు 1993**

కల: ఒక శివాలయంలో నేను, మా మేనల్లుడు సూరిబాబు ఉన్నాము. అక్కడ ఆలయపూజారి కూడా ఉన్నాడు. శివుడి విగ్రహం ముందు రెండు అడుగుల నలు చదరపు రాయి ఉంది. నేను ఆ రాతి మీద గొడ్డలితో కొట్టగా, కొట్టగా దాని నుంచి విపరీతంగా పొగలు వచ్చాయి. ఆ పొగలో ఉక్కిరిబిక్కిరి అవుతున్నా ఇంకా గొడ్డలితో కొడుతూనే ఉన్నాను. ఆ తర్వాత పొగపోయి మంటలు వచ్చాయి. ఇంకా కొట్టగా మంట పోయి రాతి నుంచి చిన్న ముక్క ఊడి కొబ్బరి చిప్ప అవటం చూసి నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించి అక్కడ ఉన్న పూజారితో "ఇలా ఇంతకు ముందు ఎప్పుడైనా జరిగిందా! నిజం చెప్పు" అని ఆనందంతో అడిగాను. "ఎప్పుడూ ఇలా జరగలేదని" పూజారి చెప్పాడు. నేను వెంటనే కొబ్బరి చిప్ప తీసుకుని బయటకు వచ్చాను. నా ఎదురుగా తెల్లని గడ్డంతో, తెల్లని బట్టలతో ఒకాయన కావడి బద్ద భుజాన వేసుకుని వచ్చారు. నేను పరిగెత్తుకుంటూ వెళ్ళి ఆ కొబ్బరి చిప్ప అతనికి ప్రసాదంగా ఇచ్చాను".

కలకు స్వామి తెలియ చేసిన అర్థం – "కలలో కనిపించిన రాయి మాయ. దానిని వివేకము అనే గొడ్డలితో కొట్టగా, కొట్టగా, రజస్తమోగుణములు

బయటకు వస్తాయి. అవే పొగలు, సెగలు, రాగద్వేషములు, కామ క్రోధములు మొదలైన మంటలు పోయాక మిగిలేది శుద్ధ సత్త్వగుణం. అదే తెల్లని కొబ్బరి. శుద్ధమైన సత్త్వగుణంతో భగవంతుని చేరుకుని శరణాగతిని వేడాలి. కావడి బద్ధ వేసుకుని వచ్చిన ఆయన షిరిడీ బాబా. ఆ రూపంలో వచ్చి నా భారాన్ని ఆయన తన భుజాలపై మోస్తున్నట్లుగా తెలియజేశారు. శరణాగతిని వేడిన భక్తుని భారం భగవంతుడు స్వీకరిస్తాడు.

★ ★ ★

1994లో ఒకసారి ఒకరోజున కలలో స్వామి తెల్లని దుస్తులలో కనిపించి "తోట పని చేస్తావా?" అని అడిగారు. "నాకు ఏమి చేతనవుతుంది?" అన్నాను. కలుపుతీస్తావా "కొమ్మలను కత్తిరిస్తావా?" అని స్వామి మళ్ళీ అడిగారు. అవేవీ నాకు చేతకావని చెప్పాను"

"సాధన తర్వాత నువ్వు సాధకునిలోని అహంకార, మమకారములనే కొమ్మలను కత్తిరించి అజ్ఞానాన్ని తొలగించాలి" అని కలకు అర్థం చెప్పారు.

★ ★ ★

1991 డిసెంబరులో విజయనగరంలో ఉండగా స్వామి కలలో కనిపించారు. "స్వామీ! నాకు ఎప్పుడు వస్త్రం ఇస్తావు?" అని అడిగాను. "ఎప్పుడు ఇస్తానో... ఎలా ఇస్తానో చూస్తావుగా!" అన్నారు.

తర్వాత మళ్లీ 1993లో స్వామి కలలో కనిపించి "రెండేళ్ళ తర్వాత వస్త్రం ఇస్తాను" అన్నారు. "అయితే 1995లో ఇస్తారా స్వామీ?" అని అడిగాను. "ఔను!" అన్నారు. తర్వాత తెల్లని దుస్తులలో స్వామి కొండపైకి వెళ్ళిపోయారు.

1993 జూన్ 14వ తేదీన మణీ వాళ్ళ బాబు ప్రేమసాయి రఘురాంకి ఉపనయనం అయ్యింది. వాడికి ఏడవ ఏట వడుగు చేయిస్తానని స్వామి

మానసికంగా ముందే సూచించి అదే విధంగా వడుగు జరిగేలా చేశారు. వడుగు అయిన తర్వాత పదహారు రోజుల పండుగలోగా వటువును తీసుకుని స్వామి వద్దకు వెళ్ళాము. అప్పుడు కూడా స్వామి పలకలేదు.

1993 నవంబర్‌లో మణి వ్రాసిన పుస్తకాలన్నీ చూచి "స్వామీ! ఇవన్నీ ఎప్పుడు వెలుగులోకి తెస్తావు?" అని స్వామి ఫొటో ముందు పెట్టి చాలా దుఃఖించాను. "వెలుగులోనికి రానప్పుడు ఇవన్నీ ఎందుకు రాయించావు! స్వామీ!" అని బాధపడ్డాను. నవంబర్ 19న పుస్తకాలన్నీ స్వామి ఫొటో ముందు పెట్టి హారతి యిచ్చాము. ప్రత్యక్షంగా స్వామి పలుకకపోయినా 1995 ఉగాది పండుగకు మణి చేత తెలుగులో అనువాదం చేయించిన లవింగ్ గాడ్ (శ్రీ సత్యసాయి ప్రేమ సుధా స్రవంతి), సత్యం శివం సుందరం నాల్గవ భాగము, జీవిత పరమార్థము – వేదాంత శాస్త్రము – మూడు పుస్తకాలు విడుదల చేయించి అనుగ్రహించారు.

1993 నవంబర్ 23 స్వామి పుట్టిన రోజుకు రెండు రోజులు ముందుగా స్వామి కలలో కనిపించారు. ఆ కలలో "నేను పుట్టపర్తి వెళ్ళాను. అక్కడ స్వామి ఉపన్యాసం ఇస్తున్నారు. కుడివైపు నుంచి వెళితే స్వామి కనపడలేదు. ఎడమవైపుకు వెళ్ళాను. స్వామి స్పష్టంగా కనిపించారు. నా వైపుకు వచ్చి మూడు గీతల అంచుతో (ఆకుపచ్చ, ఎరుపు, మరొక రంగు) ఉన్న ఒక చీర ఇచ్చారు. అక్కడ ఉన్న వాళ్ళతో "నేనిచ్చే చీర కోసం కొన్నేళ్ళుగా ఈమె ఎదురు చూస్తున్నది" అని చెప్పారు. నేను స్వామితో "స్వామీ కాషాయరంగును ఇస్తానన్నారు కదా! ఇలా ఇచ్చారేమిటి?" అన్నాను. ఆయన నవ్వుతూ "నువ్వు ఇంకా మారలిగా!" అన్నారు. "ఔను! స్వామి! ఇంకా నేను మారాలి" అన్నాను. తర్వాత స్వామి కూర్చుని ఉన్నారు. కన్నీళ్లతో స్వామి పాదాలు కడిగాను. స్వామి చాలా ఆనందంగా ఉన్నారు.

స్వామి నాతో "నిన్ను ప్రేమించే వాళ్ళు చాలా మంది ఉన్నారు. నాకు ఎవరూ లేరుగా!" అని జాలిగా అన్నారు. "అదేమిటి స్వామీ! నాకు ఎవరున్నారు? నిన్ను ప్రేమించే వాళ్ళు ఎందరో ఉన్నారుగా!" అన్నాను. తర్వాత స్వామి కుర్చీలో శక్తి రూపంలో దర్శనమిచ్చారు. స్వామి కారు ఎక్కి వెళ్ళబోతుంటే ఆయన పాదాలు గట్టిగా పట్టుకున్నాను. ఆయన మృదువుగా పాదాలు విడిపించుకుని కారులో వెళ్ళారు".

**9.2.1995**

"మణికి పుట్టబోయే కొడుకు వస్త్రం ప్రసాదిస్తాడు" అని వినిపించిన మాటలతో "వస్త్రం" మిషగా స్వామి నన్ను సాధనలో పెట్టారు. ఈ ఆధ్యాత్మిక సాధనలో ఎన్నో అనుభవాలు పొందిన తర్వాత కలలో వస్త్రం గురించి కొన్ని సూచనలు ఇచ్చి "1995లో వస్త్రం ప్రసాదిస్తాను! ఎలా ఇస్తానో... ఎప్పుడు ఇస్తానో వేచి చూడు!" అన్న స్వామి తాను చెప్పిన దానికి అర్థం ఇలా అద్భుతంగా తెలియజేశారు.

"మణి" అంటే విలువైనది. ఈ ప్రపంచంలో అత్యంత విలువైనది భగవన్నామమే!

భగవన్నామాన్ని సతతం ఎడతెగని తైలధారవలె జపిస్తూ సదా మనసును భగవంతుని యందే లగ్నం చేస్తే ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఆ జ్ఞానమే పుత్రుడు "జ్ఞానపుత్రుడు"

జ్ఞానోదయం అయ్యాక మానసికంగా సన్యసించటం అంటే కోరికలను త్యజించం. అప్పుడు నాలోనూ, అందరిలోనూ ఉన్న విశ్వ చైతన్యాన్ని గుర్తించటం జరుగుతుంది. అంతటా నిండిన శుద్ధ చైతన్యమునకు ఏ వస్త్రం చుట్టగలము?

పరిమితమైన స్థూల దేహమునకే వస్త్రం కాని, అపరిమితమూ, అనంతమూ అయిన విశ్వ చైతన్య దర్శనానికి మనసే కాషాయం కావాలి. బాహ్యంగా సన్యసించటం వలన ప్రయోజనం లేదు.

"దేహ భావంతో వస్త్రాన్ని ప్రసాదిస్తానని చెప్పి సాధనలో ప్రవేశపెట్టి, విశ్వచైతన్యమునకు మానసిక సన్యాసమే అసలైన కాషాయ వస్త్రం" అని నా సద్గురువు అత్యంత అద్భుతంగా తెలియచేశారు.

"మణికి పుట్టబోయే కొడుకు ద్వారా వస్త్రం ఇప్పిస్తానని" స్వామి కలిగించిన ప్రేరణ వలన మణికి పుట్టిన ప్రేమ సాయి రఘురాం ద్వారా వస్త్రం ఇప్పిస్తారని అనుకునే దాన్ని. ఇలా నాలో వస్త్రం గురించి ఒక ప్రేరణను కలిగించి, ఆ ప్రేరణ ద్వారా నన్ను అనుగ్రహించి, ఆత్మతత్వాన్ని తెలియచేశారు.

వస్త్రం పొందాలన్న కోరిక బలమై గురువు పట్ల విశ్వాసంతో గురుబోధలు అలకించి, ఆత్మతత్వాన్ని తెలుసుకున్న తర్వాత విశ్వ చైతన్యానికి వస్త్రం అవసరం లేదని తెలుసుకుని, వస్త్రం పట్ల నాకు గల కోరికను త్యజించి మానసికంగా సన్యసించాను. గురుదేవా! నీ ప్రేమ ఎంత విశాలమైనది!

బాబా! మలినం లేని హృదయమే చైతన్యం అని తెలియచేశావు. నీ అనుగ్రహంతో నాలోని చైతన్యాన్ని తెలుసుకున్నాను. నాకు వస్త్రంతో పని లేదు. వస్త్రం కోరిక నశించింది. ఇంక ఎప్పుడూ నిన్ను వస్త్రం అడగను.

ఈ శుభ సందర్భంలో నీకు ఏమివ్వను? కన్నీళ్ళతో కాళ్లు కడగాలన్నా అది నీవే. నేను (అహం) నశించింది. ఉన్నది నువ్వే.

సన్యాసి తనలోని పరమాత్మను చూసుకుని ఆనందిస్తాడు. కాషాయ బట్ట కట్టుకున్నంత మాత్రాన సన్యాసులు కాలేరు.

శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా కలియుగ అవతారం. ఆయనే సనాతన గురువు. నా వంటి అజ్ఞానిని తరింప చేయటానికి సద్గురు రూపంలో నా హృదయంలో ప్రవేశించి స్వయం గురువై అద్వైత స్థితికి తీసుకువెళ్ళి అంతా పరబ్రహ్మ స్వరూపం, వేరే ఏదీ లేదు అన్న పరతత్త్వాన్ని అతి సులువుగా బోధించి "అహంబ్రహ్మ" నేనే ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని అనే స్థితిలో ఉంచిన నా గురు దేవునికి ఏమివ్వగలను? అంతా తానే అయిన స్వామికి ఏమివ్వగలను?

నా బాబాను అందరిలో చూస్తూ, ఆయన సగుణ రూపంతో నా దగ్గరికి వచ్చే వరకూ ప్రశాంతంగా ఎదురు చూస్తాను. సాయి మాతా! కదిలే బ్రహ్మానివి! త్వరగా వచ్చి నాదంటూ మిగిలిన కన్నీటితో (అది కూడా నీదే) నీ పాదాలు కడగాలి. ఈ పేదరాలి కోరిక తీర్చుతల్లీ!

★ ★ ★

మరికొన్ని కలలకు, దృశ్యాలకు స్వామి తెలియచేసిన అర్థాలు.

**5.1.1995**

మా పెద్దమ్మాయి సుమనకి వచ్చిన ఒక కల – "వంకర కాళ్ళతో ఒక స్త్రీ గడపదాటి వెళ్ళటం". ఆరోజున మా అమ్మాయి సుమన పూజ చేసుకుంటూ ఉండగా నాకు ఎందుకో కాసేపు ధ్యానంలో కూచోవాలని అనిపించింది. గురువు అనుగ్రహం వలన ధ్యానంలో ప్రశాంతత వచ్చింది. కొద్దిసేపటి తర్వాత దృశ్యంలో ఒక నల్లని స్త్రీ కనిపించింది. ఉలికి పడి ధ్యానం నుండి లేవగానే మా అమ్మాయి తనకి వచ్చిన కలను గురించి చెప్పింది. నా గురుదేవులు ఈ కలకు అర్థం తెలియచెయ్యగానే బ్రహ్మానంద సాగరంలో మునిగి పోయాను.

1. ఉలికి పడి లేచినట్లు – అంటే జీవుడు అజ్ఞానంలో ఉన్నప్పుడు

గురుకృపతో అజ్ఞానమనే చీకటి తొలగి జ్ఞానోదయం కాగానే వెలుతురు గ్రహించినట్లు.

2. నల్లని స్త్రీ – అనగా "మాయ"

3. వంకర నడక – మనసును భగవంతుని ధ్యానంలో లగ్నం చెయ్యక ప్రాపంచిక విషయాలలో, వక్రమార్గంలో ప్రవేశపెట్టడం.

4. గడపలు దాటటం – ఇంద్రియములను నిగ్రహించి, పంచకోశములను అధిగమించి, మాయను దాటటం.

గత జన్మలలో చేసిన కర్మలు మన జీవితాన్ని వక్రమార్గాన నడిపిస్తాయి. పూర్వ జన్మ సుకృతం వలన సద్గురువు మన జీవితంలోనికి ప్రవేశించి, జ్ఞాన మార్గాన నడిపించి ఆత్మదర్శనం చేయిస్తాడు.

**7.2.1995**

1. దృశ్యం "మోటారు బైకుపై ఒకరు కూర్చుని ఉండగా ఇంకొకరు అగ్ని వెలిగిస్తున్నట్లు" కనిపించింది. భావం – సాధన మార్గంలో పయనించే శిష్యునిలో గురువు జ్ఞానాగ్నిని వెలిగిస్తాడు.

2. దృశ్యం "గోమాత వెల్లకిలా పడుకున్నట్లు" కనిపించింది. భావం – వెల్లకిలా పడుకున్న గోవు నుంచి క్షీరాన్ని పిండటం ఏ విధంగా అసాధ్యమో, అదే విధంగా వక్రమార్గంలో ఉపనిషత్సారాన్ని గ్రహించటం సాధ్యం కాదు.

3. దృశ్యం "మెట్టెలు ధరించిన స్త్రీ ఒకరి పాదాలు పట్టుకుని వేళ్ళాడటం" కనిపించింది.

భావం - భగవంతుని పాదం పట్టుకుని ముక్తి మార్గంలో ప్రయాణించటానికి స్త్రీలు కాని, పురుషులు కాని ఎవరైనా అర్హులే.

4. దృశ్యం “బల్బు వెలగటం”

భావం – జ్ఞాన జ్యోతి ప్రకాశించటం.

“సాధన మార్గంలో ప్రవేశించిన శిష్యునిలో గురువు జ్ఞాన జ్యోతిని వెలిగిస్తాడు. అట్టి సాధకులు సక్రమమైన విధానంలో వేదాంత సారమును గ్రహించి సాధనలో ముందుకు పురోగమించాలి. అలా సాధన చేయటానికి స్త్రీ, పురుషులు ఎవరైనా అర్హులే. ఆ విధంగా గురువు మార్గదర్శకత్వంలో క్రమక్రమంగా సాధన సోపానాలను అధిరోహించ గలిగిన సాధకులు ఆత్మజ్యోతిని దర్శించగలుగుతారు.

సక్రమ మార్గం అంటే ఒక క్రమ పద్ధతిలో అటుపోట్లును తట్టుకుంటూ సాధకులు పురోగమించాలి. అందులో తమకు లభించే సిద్ధులను వక్ర మార్గంలో ఉపయోగించరాదు. తమశక్తిని దుర్వినియోగం చేసుకోరాదు. ఓర్పుతో శ్రద్ధతో సాధనచేసిన వారికి సద్గురు కటాక్షం వలన భగవదనుగ్రహం వలన జ్ఞానజ్యోతి ప్రకాశంలో ఆత్మదర్శనం లభిస్తుంది”.

ఎవరో వస్తామని చెపితే వాళ్ళ కోసం ఎదురు చూస్తూ గదిలో కూర్చుని ఉన్నాను. కొంతసేపటికి తెలియకుండానే ధ్యానస్థితిలో ఉండిపోయాను. సమాధిస్థితి. నా “గురుదేవులు సాయి, నేను, ఎవ్వరూ, ఏ వస్తువూ లేదు. అంతా శూన్యం. ఆ స్థితి నుంచి కొంత సేపటికి బాహ్యస్థితికి వచ్చాను. గురుదేవా! ఇదంతా చంచలమైన స్థితిలో వ్రాసిందికాదు. అది నిశ్చలమైనస్థితి. బాహ్యంలోని ప్రతివస్తువూ పరమాత్మరూపంగా కనిపిస్తున్నది.

సాయంకాలం గిన్నెలు కడుగుతూ ఉంటే "ఒక నీటి బిందువు మహాసముద్రంలో కలిసి పోయింది" అన్న భావన వచ్చింది. 1985లో స్వామి పుట్టిన రోజుకు పుట్టపర్తి వెళుతుంటే "ఒక నీటిబిందువు సముద్రంలో కలిసినట్లు" అన్నమాటలు వినిపించాయి. దీనికి భావం స్వామి ఈవిధంగా తెలియచేశారు.

"జీవాత్మ అనే అమృతబిందువు పరమాత్మ అనే అమృత సాగరంలో కలిసిపోయింది. జీవునకు అమృతత్వం సిద్ధించింది."

జీవుడనే అమృతబిందువు "పరమాత్మ" అనబడే అమృతసాగరం నుండి పుట్టిన వాడేనని తెలియచేశారు.

రాత్రి ఆ ఆరడుగుల గదిలో విశ్వం అంతా నిండిపోయింది. ఎక్కడికో వెళ్ళి ఏదో చూడాలన్న భ్రాంతి లేని స్థితి. తేజస్సు ఇక్కడి నుండే ప్రకాశిస్తున్నదనే దివ్యభావన కలిగింది.

పాదాల వేళ్ళ నుంచి సహస్రారం వరకూ జరజరపాకి విపరీతంగా కుదిపివేసినట్లు శరీరంపైకి లేచినట్లుగా అనిపించింది.

ఉదయం తొట్టిలో మూట ఉన్నట్లు కనిపించింది. ఉప్పు నీటిలో కలిసినట్లు జీవాత్మ పరమాత్మలో కలిసినట్లు స్వామి అర్థం తెలియచేశారు.

గురుదేవా! నిన్ను నాలోనే చూసుకుని, నేను అన్నది పోగొట్టుకొని ఆనందసాగరంలో మునిగి పోయాను కానీ, నిన్ను పొందిన ఆనందం పదిమందికీ పంచేవరకూ నాకు తృప్తిలేదు.

మా మూడవ అమ్మాయి సుజాతకి వచ్చిన ఒక కలకు స్వామి ఈ విధంగా అర్థం తెలియ చేశారు.

"ఈ విశాలమైన విశ్వం ప్రకృతి చేత అలంకరించబడి ఉన్నది. స్వామి దగ్గరకూడిన వారంతా భగవంతునికి ఆధ్యాత్మిక సాధనలో చేరువ అయినవారు. ఈ విశాల విశ్వంలోని స్థలం ఏ ఒక్కరికో ఎంతో కొంత చెందేదికాదు. అది అందరికీ చెందినది. ఆత్మజ్ఞాన మార్గంలో తాము ఎన్నుకున్న ప్రయాణమార్గము, వేగము ననుసరించి జీవులు ముందు, వెనుక తేడాలతో భగవంతుని చేరుతుంటారు.

మంగళకరమైన శుభకరమైన తలపులే జీవునకు మంగళస్నానం. అనేక అహంకారపు మాయపొరలు ఛేదించబడిన తర్వాత తెల్లని శుద్ధ సత్వగుణం శేషిస్తుంది తెల్లని కొబ్బరిలాగా. స్వామికి సమర్పించవలసినది హృదయఫలం. జ్ఞానాగ్నిలో జీవుల కర్మలు దగ్ధం చేయబడి ఆత్మ ప్రకాశిస్తుంది".

ఉదయం నుండి ఎండవేడికి పరితాపం చెందిన జీవులు సాయంకాలం చల్లబడి సేదతీరే విధంగా జ్ఞానాగ్నిలో తపించు యోగులు ఆత్మదర్శనంతో చల్లబడుతారు.

పరమాత్మ తేజస్సును దర్శించి ఆత్మసాక్షాత్కారం పొంది, జీవుడు పరమాత్మ ఒక్కరేనన్న అభేద దర్శనం కలగటం వలన జీవునకు భగవంతుడంటే భయం కాని, వేరు భావంకాని ఉండవు. జీవబ్రహ్మైక్యయోగం సిద్ధించిన తర్వాత కూడా పరమాత్మ శుభదృష్టి జీవుని యందు లగ్నమై ఉంటుంది.

జీవితంలో జీవులు ఎన్నో ఉగాదులు జరుపుకుంటారు. కాని, భగవంతుని పొందటమే జీవితంలో నిజమైన నూతన అధ్యాయం. అదే అసలైన ఉగాది. అట్టి అసలైన నూతన జీవితంలో పరమాత్మ సాక్షాత్కారమే మధురమైనది. అప్పుడు జీవితంలో కలిగే కష్టసుఖాల పట్ల సమభావమే ఉంటుంది. కాబట్టి

చేదు, పులుపుల వంటివి లేవు. అంతా మాధుర్యమే. ఏది సంభవినిచినా అది భగవత్ప్రసాదమే.

పరమాత్మకై పరితపించే వేలకొలదీ జీవులలో ఏ ఒక్కరో ఇద్దరో మాత్రమే భగవంతునికి చేరువ కాగలుగుతున్నారు. సాధన మార్గంలో ఒడిదుడుకులను ధైర్యంగా ఎదుర్కొని, అణిమాది సిద్ధులను విడిచిపెట్టి కేవలం పరమాత్మను మాత్రమే కోరుకున్న వారు సిద్ధిని పొందగలుగుతారు!'

## 1995 గురుపూర్ణిమ

హైదరాబాదు నుండి బయలుదేరి నేను, మా చెల్లెలు ప్రసన్నం, మరిది వేణుగోపాల్‌గారు గురుపూర్ణిమకు పుట్టపర్తికి బయలుదేరి వెళ్ళాము.

ఉదయం నేను, చెల్లెలు ప్రసన్నం స్వామి దర్శనం కోసం మందిరానికి వెళ్ళాము. "పాదుకలు పట్టుకు వెళ్ళిన వాళ్ళందరికీ పాదనమస్కారం ఇస్తారు కానీ ఈ రోజు పాదనమస్కారం ఇస్తే నాకు తృప్తి" అని మా చెల్లెలు అన్నది. ఈలోగా ఎవరో ముందు లైనుకురండి అని మమ్మల్ని పిలిచారు. వెళ్ళి కూర్చున్నాము. స్వామి మా ఎదురుగా వచ్చి నిలబడ్డారు. మా చెల్లెలు పాదనమస్కారం చేసుకున్నది. నాకు పాదనమస్కారం చేసుకోవాలని అనిపించలేదు. (బాబా పాదాలు నా హృదయంలోనే ఉన్నాయన్న ఉద్దేశ్యంతో) "బాబా! పుస్తకం" అన్నాను. (పుస్తకం– అనుభూతుల డైరీ) సమాధానం. చెప్పకుండా నా కళ్ళలోకి చూసి వెళ్ళిపోయారు. 1984 గురుపూర్ణిమ నుంచీ స్వామి సన్నిధికి వెళుతున్న నా దగ్గరకు స్వామి ఇలావచ్చి నిలుచోవటం మొదటిసారి. ఎప్పుడు ఇలా జరగలేదు.

**8.7.1995**

మధ్యాహ్నం ఒంటి గంటకు పర్తివాసి సాయిరాముని పాదుకలు ఊరేగింపుగా బయలుదేరినాయి. మంగళ వాద్యాలు, బాండు మేళం మ్రోగుతుండగా, వెనుక కోలాటం బృందం చక్కగా అడుగులు వేస్తూ, కోలాటం చేస్తూ కోలాహలంగా, కన్నుల పండుగగా ఊరేగింపు బయలుదేరింది. నెమలి వాహనం, స్వర్ణ కిరీటం, బంగారు మురళి, నవరత్న ఖచితమాల, కౌస్తుభమణిహారంతో, ముందు భక్తులు గొడుగులు పట్టుకుని, పాదుకలు శిరస్సున ధరించి అలా భక్త బృందం మెల్లమెలగ్గా నడుస్తూ ఉంటే రెండు గంటల సమయంలో సాయిరాముడు చిరుజల్లుతో భక్తులను అభిషేకించారు. ఏమి అనుగ్రహం స్వామిది!

ఈ దృశ్యం కలియుగంలోని భక్తులకు త్రేతాయుగంలోని రామ పట్టాభిషేక దృశ్యాన్ని తలపింప చేసింది. అది వర్షం కాదు.. సాయి ప్రేమజల్లు!

కీర్తి కిరీటాన్ని ధరించిన స్వామికి స్వర్ణ కిరీటం ఎందుకు? సత్యమే కంఠాభరణమైన సాయికి కౌస్తుభమణిహారం కావాలా! స్ఫటికం లాంటి స్వచ్ఛమైన సాయికి స్ఫటికమాల ఎందుకు? తన క్రీగంటి చూపుతో మన హృదయాలను రంజింప చేస్తున్న కన్నయ్యకు మురళితో ఏమి పని? అవన్నీ తీసుకు వచ్చిన భక్తుల కోరికను మన్నించి వాళ్ళను సాయి కృష్ణుడు అనుగ్రహించాడు.

సాయి రామకోటి పుస్తకాలను సిందూరపు రంగు వస్త్రంతో మూటలు కట్టి తలలపై పెట్టుకుని రామభక్త బృందం నడచి వస్తుంటే వారధి దాటిన వానర సైన్యంలా అనిపించింది. ఆనాడు రామకార్యంలో వానరులు తరిస్తే ఈనాడు సాయి నామంతో భక్తులు తరించారు!

**9.7.1995**

ఉదయం పాదుకలు పట్టుకుని అందరూ కూర్చున్నారు. అలా కూర్చోవటం నాకు ఇష్టం లేదు. కానీ, చి॥ భాస్కరశాస్త్రి (మా అక్కయ్యగారి అబ్బాయి) పాదుకలు నాకు ఇచ్చి కూర్చోమనటం వలన నేను అలా కూర్చోక తప్పలేదు. నా గురుదేవుని ప్రేరణతోనే ఇదంతా జరుగుతున్నదని నిశ్చింతగా ఉన్నాను. స్వామి వచ్చారు. పాదుకలు పట్టుకుని "నీ పాదాలు ఎప్పుడో ఇచ్చావు. మళ్ళీ ఇదంతా ఏమిటి?" అనుకుంటూ కుడి చేతితో నా గురుదేవుని ఎడమ పాదం పట్టుకుని "గురుదేవా! అన్నాను. "మంచిది" అంటూ వెళ్ళిపోయారు. పాదం స్పర్శ కొత్తగా అనిపించలేదు. 1984 గురుపూర్ణిమ రోజున గురువుగా తన పాదం ఇచ్చారు. ఆ స్పర్శ ఇన్నేళ్ళుగా మానసికంగా అనుభవిస్తూనే ఉన్నాను. అందుకే ఇప్పుడు పాదస్పర్శ కొత్తగా అనిపించలేదు. అప్పుడు స్వామి కుడిపాదం నా హృదయ కమలం మీద ఉంచి, సగుణరూపంలో రెండవ పాదం ఇలా 1995 గురుపూర్ణిమకి ఇచ్చారు.

ఆ రోజు రాత్రి వచ్చిన కలలో "నేను ఒక గదిలో ఉన్నాను. గడప లోపల ఉన్న నన్ను చాలా పెద్ద నల్లని ఆబోతు వచ్చి వేగంగా కుమ్మబోయింది. భయంతో నేను గడపదాటి రాకుండా నా బలమంతా ప్రయోగించి నెట్టి వేశాను. కాని, అది మళ్ళీ మళ్ళీ నాపైకి వస్తూనే ఉంది. దాన్ని నెట్టటానికి నా శక్తి చాలలేదు. సాయిరామా సాయిరామా అని పెద్దగా పిలిచాను. అప్పుడు తెల్లని బట్టలతో ఒక వ్యక్తి వచ్చి ఆ ఆబోతును ఖడ్గంతో పొడిచాడు. రక్తం ప్రవాహంగా పారింది" తెల్లవారి ఈ కలకు అర్థం ఏమిటని స్వామిని (మనసులోనే) అడిగాను. స్వామి చెప్పిన సమాధానం (మానసికంగానే)

"పదకొండేళ్ళుగా నన్ను గురువుగా నీ ధ్యానంలో నిలుపుకున్నావు. నీ

పూర్వ జన్మల కర్మ మాయ రూపంలో నీలో ప్రవేశిస్తూనే ఉన్నది. ఈ రోజుతో నీ కర్మ పూర్తిగా తొలగింది. నా రెండవ పాదం ఈ రోజు నీ హృదయకమలంలో పెట్టి పూర్తిగా నిలిచి పోయాను. ఇక ఎప్పుడూ నీలో మాయ ప్రవేశించదు. నేను నిలిచిన చోట మాయకు స్థానం లేదు. ఇక మీదట ప్రశాంతంగా ఉండు" అని తెలియచేశారు.

పదకొండేళ్ళుగా లేని ప్రశాంతత వచ్చింది. శివ పంచాక్షరి అనే నామామృతపు బొట్లు నాలుకకు రుచి చూపించి, ఇన్నేళ్ళూ ఆ నామాన్నే అమృతంలా సేవిస్తూ ఈ రోజున పూర్తిగా కలియుగ దైవమైన సాయి ప్రేమతత్వంలో మునిగిపోయాను. ఇన్నేళ్ళు ఎన్నో అనుభూతులు పొందాను. కాని, ఈ అనుభూతి మనసుకు అందని అతీతమైన స్థితి.

పుట్టపర్తిలోనే మరొక రోజున వచ్చిన కల "గోవు పొదుగు నుండి నేను స్వయంగా నోటితో గోక్షీరాన్ని త్రాగుతూ, ఆపాలని పుక్కిట పట్టి సాయిని ఆ పాలతోనే అభిషేకిస్తున్నట్లు కనిపించింది." కలకు తెలియచేసిన భావం – "గోమాత వేదమాత. గోక్షీరమే ఉపనిషత్సారం. స్వయంగా పొదుగు నుండి నేరుగా పాలను త్రాగటమంటే స్వానుభవంతో వేదాంత సారమును గ్రహించటం. పుక్కిట బట్టిన పాలతో సాయికి అభిషేకం అంటే వేదాంత సారమును గ్రహించి, ఆచరణలో ప్రవేశపెట్టి, స్వామిని ఆ వేద వాక్కులతోనే కీర్తించటం..."

## 9.7.1995

ఈ రోజు కలలో "మా నాన్నగారు జరీ అంచు బట్టలతో కుర్చీలో కూర్చుని ఉండటం" కనిపించింది. నేను "నాన్నగారూ! మీరు జీవించే ఉన్నారా?" అంటూ ఆయన దగ్గరకు వెళ్ళాను. ఆయన వద్ద ఎనిమిది సం॥ల పాప ఉన్నది. తర్వాత ఆయన నాకు షిరిడీ బాబాలా కనిపించారు.'

కలకు తెలియచేసిన భావం – "బాబాయే మన తండ్రి, ఆయనే ఈశ్వరుడు, మాయకు వశుడై జీవుడు ఎన్నో జన్మలు ఎత్తి, చివరకు తాను, భగవంతుడు వేరు కాదని తెలిసిన తర్వాత భగవంతుని కోసం తపించి, గురువు అనుగ్రహంతో జ్ఞాన మార్గాన మాయను తొలగించుకుని, ఆర్తితో అసలైన తండ్రి అయిన పరమాత్మను చేరటం".

**13.7.1995**

సాయంత్రం భజన తర్వాత స్వామి బయటకు వచ్చి మందిరం వరండాలో నిలుచున్నారు. వాతావరణం చాలా ప్రశాంతంగా ఉన్నది. సంధ్యా సమయం. స్వామిని ప్రశాంతంగా చూస్తున్నాను. ఉన్నట్లుండి స్వామి సుమారు ఏడు అడుగుల ఎత్తులో, ఎత్తుకు తగిన లావుతో, ఎంతో ప్రశాంతంగా కనిపించారు. స్వామి చాలా పెద్దగా కనిపిస్తున్నారు అని అనుకునే లోపల "విశ్వవిరాట స్వరూపం నీకు చూపిస్తున్నాను. ఇన్నేళ్ళుగా విరాట్స్వరూపాన్ని ధ్యానిస్తున్నావు. అందుకే ఈ దర్శన భాగ్యాన్ని కలుగ చేస్తున్నాను" అని స్వామి తెలియచేశారు.

ఆ ఆనందం వర్ణించలేనిది. మాటలకు అందనిది. ఆ విరాట్స్వరూపాన్ని దర్శిస్తూ అంతా మరిచిపోయాను. తర్వాత స్వామి నన్ను మళ్ళీ మాములు స్థితికి తీసుకువచ్చారు.

అదే రోజు కనబడిన మరొక దృశ్యం –

"ఏడు (7) అంకె, ఒక పాదం మీద పువ్వు పడటం, ఒక పాదం నా వైపు పెట్టటం".

ఈ దృశ్యానికి స్వామి తెలియచేసిన అర్థం – "మనది ఏడడుగుల

సంబంధం. నన్ను భర్తగా కూడా ఆరాధించావు. కాబట్టి ఈ రోజు నుంచి నిన్ను భరించే వాడుగా నీ హృదయంలోకి అడుగు పెట్టాను. ఒక పాదం మీద పువ్వు పడటమంటే నీ హృదయపుష్పాన్ని స్వీకరించాను.

నా రెండు పాదాలూ నీ హృదయంలో బంధించబడ్డాయి. ఈ రోజు నుంచి ధర్మ మార్గాన స్థిరత్వంతో ముందుకు పోతావు" అని తెలియచేశారు.

14.7.1995న బయలుదేరి 15.7.1995న పుట్టపర్తి నుండి హైదరాబాద్‌కు వచ్చాము.

**30.10.1995**

తెల్లవారు ఝామున కల –

"నేను ప్రశాంతంగా ప్రవహిస్తున్న గంగ ఒడ్డున ఉన్నాను. గంగ అవతలి ఒడ్డున తెల్లని పూలతో పొదరిల్లు. దానిలో పెళ్లి కొడుకు, పెళ్ళికూతురు. అప్పుడే వివాహం జరిగింది. తెల్లని లిల్లీపూలతో విరబూసిన చెట్టు. ఒక బాలుడు ఆ చెట్టు మొదలు పట్టుకుని ఊపుతుంటే జలజల పూవులు రాలటం, అక్కడ ఒక పెద్ద ముత్తయిదువ".

భావం – మనసు ఉరకలు వేసే ప్రవాహంలాటిది. సద్గురువు అనుగ్రహంతో సాధకుడిలోని వృత్తులు అరికట్టబడి, ఒడిదుడుకులు లేని జీవితం పొందినప్పుడు ప్రశాంతమైన నదిలా అతని జీవితం సాగుతుంది. అప్పుడు లౌకిక వ్యవహారాలు అంతరించి భగవంతుని మీద మనసు లగ్నం అయి అతని పొందుకోరి జీవుడు తపిస్తాడు. తపస్సు ద్వారా అతనిలోని దైవీ గుణాలు వికసించిన కుసుమాలై ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లుతాయి. అప్పుడు సుగుణములనే పుష్పాలు వివాహ వేదికగా మాయ తొలగిన జీవుడు

అనంతరాముని దర్శించి పరమాత్మలో లీనం కావటమే జీవాత్మ, పరమాత్మల కళ్యాణం.

"బాలుడు చెట్టు మొదలు పట్టుకుని తెల్లని లిల్లీ పూలు రాల్చటం" అంటే బాల దీవెనలు బ్రహ్మదీవెనలు.. తాను సృష్టించిన బిడ్డ తనను చేరుకున్నాడన్న ఆనందంతో సృష్టికర్త అయిన బ్రహ్మ ముక్తి పొందిన తన బిడ్డని పూలతో అభిషేకించి ఆశీర్వదించటం. ఆ పెద్ద ముత్తైదువ "సాక్షిగా నిలిచిన జగన్మాత".

★ ★ ★

కల – "తిరుపతి కొండ, మణి పట్టు చీరతో కొండ ఎక్కుతానని అనటం, నేను విలువైన పట్టుచీరతో కొండ ఎక్కవద్దని అనటం" –

భావం – "దేహ భావంతో విలువైన పట్టుబట్ట కట్టుకుని కొండ ఎక్కటం కాదు. దేహ భావం పోగొట్టుకుని, ఆత్మను తెలుసుకొని "నేను దేహాన్నికాను.. ఆత్మను" అన్న దృఢచిత్తంతో ఆధ్యాత్మిక శిఖరాన్ని చేరుకుని, సర్వవ్యాపకుడైన విష్ణుమూర్తిని దర్శించి, ముక్తికాంతను చేపట్టి, విశ్వానికే అధినేతగా నిలిచి మోక్ష సామ్రాజ్యానికి ఏలిక కావాలి".

పంచేంద్రియములు పని చేసినంతకాలం ఆత్మదర్శనం కాదు. కోరికలే సర్పాలు. వాటిని బంధించి, పంచేంద్రియములను అదుపులో పెట్టి ఆత్మజ్యోతిని దర్శించాలి.

★ ★ ★

ఎన్ని బంధాలైనా వదులుకోగలము. కానీ, భగవంతునితో ఏర్పడిన అనుబంధాన్ని మాత్రం తెంచుకోలేము. తెంచుకుని జీవించలేము. ఆకు చెట్టుని

అంటి పెట్టుకుని ఉన్నంత వరకే పచ్చగా ఉంటుంది. చెట్టును వదిలి పెడితే క్రిందపడి దుమ్ముధూళిలో పడిపోతుంది.

ఎంత మందికి దగ్గరై ఎంత ప్రేమను పొందినా అది స్వల్పమే! ఒక్క భగవంతుని ప్రేమ మాత్రమే పూర్ణమైనది. మానవులుగా పుట్టినందుకు దైవ ప్రేమను పొందటమే విశేషం. అశాశ్వతమైన ప్రేమలు శాశ్వతం అనుకుని సాయి ప్రేమకు దూరం కావద్దు.

కర్మఫలం అనుభవిస్తూ అదే శాశ్వతం అనుకోక మాయ నుంచి బయట పడటానికి సాయి పాదాలు పట్టుకోండి. సుఖదుఃఖాలు రెండింటినీ సమంగా భావించి జీవన పోరాటం సాగించటం మన ధర్మం. ధర్మపోరాటంలో జయం ధర్మానికే! ఎన్ని అడ్డంకులు వచ్చినా ఎదురు నిలిచి, పోరాడి ధర్మాన్ని కాపాడండి. సాయి మాత ప్రేమ కోటి తల్లుల ప్రేమ. ప్రేమమూర్తి ప్రేమకు దూరం కాకండి. సాయి ప్రేమను శంకించకండి. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ – ఈ నాలుగుదారులలో ఏదో ఒక దారిలో ప్రయాణం చేసి “బృందావన విహారి”కి దగ్గరకండి.

మాయే సత్యం అనుకుని ‘గమ్యం’ తెలియక తిరుగుతున్న నన్ను పూర్వజన్మలో చేసుకున్న పుణ్యం సాయి పాదాల చెంతకు చేర్చింది. నా గురుదేవులు శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా నన్ను జ్ఞాన మార్గంలో నడిపించి భక్తుడు, భగవంతుడు ఒకటేనని తెలియ చేశారు.

సాయి అనుగ్రహించే వరకూ సాయి పాదాలు గట్టిగా పట్టుకోండి ప్రయత్నం చెయ్యండి. పట్టువిడవకండి. తర్వాత సాయికృష్ణుడే మనని పట్టుకుంటాడు. ఇది నా అనుభవాల పంట నుండి పొందిన అమృతఫలం. సాధకులై సాయి బాటన నడవండి.

"గురుదేవా! పరిపూర్ణుడువైన నువ్వు పరిమితమైన నన్ను పరిపూర్ణంగా తీర్చిదిద్దినందుకు నీకు ఏమివ్వను? అయినా ఇచ్చేవాడివే కాని పుచ్చుకునే వాడివి కాదు. అందుకే సృష్టి అంతా నాలో నే ఉన్నదని తెలియచేసిన నీకు, నిన్ను చూసిన ఈ కళ్ళు పవిత్రమై నాలోనే ఉన్న నదులు కన్నీటి ద్వారా ప్రవహించి నీ పాదాలు కడగటానికి సిద్ధంగా ఉన్న ఈ సమయంలో ఇంకా ఆలస్యం చేయక సగుణరూపంలో నా ఎదుట నిలువవా ప్రభూ!

నా గురువు ఋణం తీర్చుకునే సమయం ఆసన్నమైంది. నా సాయి కృష్ణుడు, పుట్టపర్తి నిలయుడు నా శోకాన్ని భరించలేక కదిలే బ్రహ్మమై నా ఎదుట నిలబడే శుభ సమయం ఆసన్నమైంది.

గురు చరణాలను శిరస్సున ధరించి, నాలోని చైతన్యాన్ని జాగృతం చేసిన నా గురుచరణ కమలాలను జ్ఞాన దృష్టితో స్పృశిస్తూ సాయి దేవుని దివ్య ఆశీస్సులతో, శివశక్తి స్వరూపమైన సత్యసాయి నా ద్వారా పలికించిన సత్యాలు సాయి సంకల్పంతో వ్రాస్తున్నది కూడా నేను కాదు. ఆయనే అంతటా నిండిన చైతన్యం!

అయితే ఈ సత్యాలను శ్రద్ధ, భక్తి వివేకం లేని చోట తెలియచెయ్య కూడదని స్వామి నాకు అనుభవ పూర్వకంగా తెలియచేశారు. ప్రతి విషయాన్ని ఇంత సూక్ష్మంగా, అనుభవ పూర్వకంగా తెలియచేస్తున్నట్టి సద్గురువును పొందిన నా అనుభూతిని మాటల ద్వారా వ్యక్తం చేయలేను. ఎవరికి వారు ఈ అనుభూతిని స్వయంగా పొందాలంటే సద్గురు పాదాలను పట్టుకుని విడవకండి. ఈ అనుభూతిని స్వయంగా పొందండి.

గురుదేవా! అరుణోదయం తర్వాత ప్రకాశినిచే సూర్యునివలె జ్ఞానమును, అజ్ఞానమును రెండింటిని పోగొట్టుకుని స్వయం ప్రకాశమైన ఆత్మను

పరమాత్మలో లయింపచేసిన తర్వాత గురుశిష్యులుగా "ఇద్దరు" లేరు. ఉన్నదంతా ఒక్కటే చైతన్యం. కాని, ఈ దేహం ఉన్నత వరకూ గురువును స్మరించుకుంటూ బ్రహ్మానంద సాగరంలో మునిగి, కర్మలు చేస్తూ తామరాకు మీద నీటి బొట్టు లాగా లోకంలో సంచరిస్తున్నా. దేనిలోనూ చిక్కుకోక (సంబంధం లేకుండా) శేష జీవితాన్ని గడిపి, ఉచ్ఛ్వాస నిశ్వాసలు ఆగిపోయాక అప్పుడు యోగి ఎక్కడికో వెళ్ళిపోడు. అంతా నిండిన చైతన్యంలో లీనం అవుతాడు. అదే పరమమైన ముక్తి.

**18.12.1995**

1984లో మొదటిసారిగా గరుపూర్ణిమకి వెళ్ళి వచ్చిన తర్వాత బాబాను సద్గురువుగా భావించి, ఫోటో పెట్టి, సాయి నామాలు చదువుకుంటూ ఉండగా ఒకరోజు "ఇక నేను నూనె దీపాలు పెట్టను" అని తీసి వేసిన తర్వాత అలా ఎందుకు చేశానా అని చాలా బాధపడ్డాను. దుఃఖించాను. పోనీ దీపం పెడదామంటే మనసు ఒప్పుకునేది కాదు. తర్వాత 1985లో మా బావగారి అబ్బాయి తనికెళ్ళ చంద్రశేఖర్ ఇంట్లో మొదటిసారిగా భగవద్గీత చదువుదామని (ఇంతకు ముందు ఎన్నడూ భగవద్గీత చదవలేదు) పేజీ తియ్యగానే "భగవంతునికి నూనె దీపాలు కాదు పెట్టడం, జ్ఞాన మార్గాన వెళ్ళి, ఆత్మజ్యోతిని దర్శించాలని" వ్రాయబడి ఉన్నది.

అప్పటి నుండి ఆత్మ జ్యోతిని దర్శించటం కోసం చాలా తపన పడేదాన్ని. దీపావళి వచ్చిందంటే చాలు "స్వామీ! నూనె దీపాలు వెలిగించటం మాన్పించావు (చాలా అరుదుగా ఎప్పుడైనా దీపం పెట్టించేవారు స్వామి). అజ్ఞానాన్ని పోగొట్టి, జ్ఞాన జ్యోతిని దర్శించే భాగ్యం కలుగ చెయ్యమని" నా గురువును ప్రార్థించే దాన్ని. అప్పుడప్పుడు దృశ్యరూపంలో జ్యోతిని చూసేదాన్ని, కాని తృప్తి లేదు.

ఈ సం॥ 23.10.1995 దీపావళి రోజున మా రెండవ అమ్మాయి మణి ఇంట్లో గదిలో పడుకుని ఏకాగ్రతతో (ఎంత మందిలో ఉన్నా స్వామి అనుగ్రహంతో నా మనసును ఏకాగ్రతలోనే ఉంచేవారు) "గురుదేవా! ఈ దీపావళికైనా జ్యోతి దర్శనం చేయించు! ఈ సం॥ పుట్టపర్తిలో గురు పూర్ణిమ రోజున నా దగ్గరికి వచ్చి కూడా ఎదుట చెప్పకుండా ఎప్పటిలాగే మానసికంగా నాలో మాయ పూర్తిగా తొలగినట్లు తెలియచేశావు. ఈ దీపావళి రోజునైనా ఆత్మ జ్యోతిని దర్శించే భాగ్యం కలుగచెయ్యి" అని దుఃఖించాను.

ఆ రోజు రాత్రి రెండు గం॥లకు నాలోనే జ్యోతి దర్శనం చేయించారు. చిన్న ప్రమిదలో దీపం నూనెతో వెలుగుతున్నది. "హృదయమనే ప్రమిదలో భక్తి అనే చమురు పోసి, వైరాగ్యమునే వత్తిగా చేసి, జ్ఞానాగ్నితో జ్యోతిని వెలిగించాలి" అని శాస్త్రాలు చెపుతాయి.

నా పూర్వజన్మ సుకృతం కంటే నా మీద బాబాకున్న ప్రేమ వలననే ఇలా నేను ఆత్మజ్యోతిని దర్శించగలిగాను.

గత పన్నెండు సం॥లలో ఎన్నిసార్లో పుట్టపర్తి వెళ్ళాను. ఎన్నిసార్లు వెళ్ళినా బాబా పలుకకపోవటం, పలకలేదని నేను దుఃఖించటం, సాయి పలకకపోయినా మొండిగా వెళుతుండటం, మాట్లాడలేదని బాధపడేదాన్ని. "పలుకే బంగారమాయెనా! కోదండపాణి" అని రామదాసు పాడినట్టు నేను పాడలేను. కాబట్టి నా చేతనైన పద్ధతిలో స్వామి కోసం పగలు, రాత్రి ఏడవటమే ఈ జన్మలో నేను చేసింది. ఈకారణంగానే స్వామి నన్ను అనుగ్రహించారు.

విశ్వాసంతో శరణువేడితే సాయి మన కోరిక ఏదైనా తీరుస్తారు. నశించేవి ఏవీ నేను స్వామిని కోరలేదు. కాని, పూర్వజన్మ కర్మ ఫలములు

కొన్ని ఈ జన్మలో అనుభవించి, చివరికి నాలోనే ఉన్న నా సాయి రాముని దర్శించాను.

"సాయి భక్తులారా! అన్నింటి కంటే విలువైన సాయినే కోరుకోండి! సాయి పలికినా, పలకకపోయినా వెంట పడండి. సాయికి మనమీద అనుగ్రహం కలిగే వరకూ బాబా చుట్టూ తిరగండి. భౌతికమైన కోరికలైతే వెంటనే అనుగ్రహిస్తారు. మనం కోరుకున్నది భగవంతుడిని కాబట్టి పరీక్షలు పెట్టి ఏడిపిస్తారు. నటన సూత్రధారి కాబట్టి ఎన్నో నాటకాలు ఆడతారు.

మీరు పట్టిన పట్టు వీడకుండా వుంటే ఆయనే దిగి వచ్చి, దివ్యత్వాన్ని ప్రసాదించి, దీవెనలు అందజేస్తారు. ఇది నా అనుభవపూర్వకమైన సత్యం.

సాధకులారా! సాగిపొండి! ఆధ్యాత్మిక ఉన్నత శిఖరాలవైపు. అక్కడ సత్యసాయి బాబాను దర్శించండి.

నమ్మిన వాళ్ళకి "దేవుడు" బాబా, నమ్మని వాళ్ళకి "దొంగ" బాబా. నేను కూడా "దొంగబాబా" అయితే నా పూజవ్యర్థం అని అనుకున్న దాన్నే.

కానీ, ఆధ్యాత్మిక బాటలో మహోన్నత శిఖరం చేరిన తర్వాత పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబాయే అక్కడ శివశక్తి రూపంలో దివ్యతేజస్సుతో సాక్షాత్కరించారు.

అదే సత్యం శివం సుందరం!

**ఒకరోజు స్వామిని ప్రార్థిస్తూ వ్రాసుకున్న వేదన**

"అఖండ జ్యోతి స్వరూపా! అచ్యుతా!

ఈ అబల ఆవేదనకి అంతం లేదా! ఆదరించి నీ అండన చేర్చుకోవా! అనంతా! అంతటా నిండి ఉన్న నీ దివ్య స్వరూపం చూస్తున్న నాకు

సగుణరూపంలో సాక్షాత్కరించి దివ్య ఆనందాన్ని ప్రసాదించవా! అనంతా! ఆ ఆనందంలో కార్చే నా కన్నీటిని పన్నీరుగా మార్చి నీకు అభిషేకించే శుభ సమయం ఎప్పుడు? ప్రభూ!

అందినట్టే అంది అందకుండా నాతో ఆడుతున్నావా? అఖిలేశ్వరా! నా అంతరంగ మథనంలోంచి ఆవిర్భవించిన అది నారాయణా! అశ్రునయనాలతో నిన్ను చూడలేక ఆ కన్నీటి బిందువులను మంచి ముత్యాలుగా జార్చి, ఆ ముత్యాలతో నిన్ను అభిషేకించి, ఆ అభిషేక మూర్తిని కళ్ళనిండా చూస్తున్న నన్ను ఆదరించి అక్కున చేర్చుకునేదెప్పుడు ప్రియా కృష్ణా!

అనంతకోటి నీ నామాలను స్మరిస్తున్న నన్ను ఆదరించేదెప్పుడు? నీ దివ్యమంగళ స్వరూపాన్ని చూస్తున్న నన్ను మాయలోకి నెట్టి ఆనందిస్తున్నావా తండ్రీ! పూర్వ వాసనలతో నా మనసు నిండిన క్షణాన నీ ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా వాటిని చెదరగొట్టు విశ్వేశ్వరా! చీకటిలోకి వెళుతున్న నన్ను నీ జ్ఞాన కిరణంతో చీకటిని చెదరగొట్టి జ్ఞాన మార్గాన నడిపించి ఆశీర్వదించు.

సద్గురు సాయినాథా! పూర్వజన్మ సుకృతం నన్ను నీ వద్దకు చేర్చిన క్షణం నుంచీ గురువై జ్ఞాన మార్గంలో నడిపించి, సంసార బంధాలు తెంచి, తిరిగి సంసారంలోకి నెట్టి వినోదిస్తున్నావా సాయికృష్ణా! పుస్తక జ్ఞానం లేని నాకు ఆత్మ సాక్షాత్కారం ప్రసాదించి అంతా నిండి ఉన్న నీవు విశ్వవిరాట్స్వరూపంగా నా ధ్యానంలో నిల్చి ఏమీ తెలియనట్టు నాటకం ఆడుతున్నావా! నటన సూత్రధారీ? మురారీ!

నిన్ను చేరటం సేవ ద్వారా సులభం అని తెలియ చేసిన నీ సందేశాన్ని సందేహించక, సేవే దైవంగా భావించి, ఏ పుస్తకాలు చదవక, ఏ బంధాలు పెట్టుకోక విశ్వాసంతో ఉన్న నన్ను ఇంటి సేవకే పరిమితం చేశావా సాయీశ్వరా!

కడుపు తీపి, బంధు ప్రేమ అన్నిటి మీదా మమకారం లేకుండా చేసి బంధాలు తెంపి మళ్ళీ సంసార బంధంతో ముడి వేశావా! తండ్రీ, ముడిని విప్పి ముక్తిని ప్రసాదించు సదాశివా!

**సాధన సమయంలో కలిగిన భావములు:-**

"పవిత్రమైనటువంటి పరమ పద సోపానాలు ఎక్కటానికి దైవ సహాయం కావాలి. సాయే మన దైవం. బాబాయే మన ఈశ్వరుడు".

★ ★ ★

"ఆత్మ స్వరూపమైనటువంటి జీవుని నడిపించే శక్తి పరమాత్మకే ఉన్నది. ఆయనే శ్రీకృష్ణుడు"

★ ★ ★

"ఆత్మను చూడాలంటే శ్రీ సత్యసాయి పదకమలముల వద్దకి చేరి సాయి బోధామృతాన్ని త్రాగి, తరించి, ఆత్మని దర్శించండి"

★ ★ ★

"సంసారమనే బండిని లాగటం సామాన్యుడికి సాధ్యం కాదు. మన సద్గురు సాయిని ఎన్నుకోండి. సాయే కృష్ణపరమాత్మ. కృష్ణపరమాత్మయే సారధియై సంసారరథాన్ని మంచి మార్గాన నడిపించి మోక్షాన్ని ప్రసాదిస్తాడు".

★ ★ ★

"ధర్మాన్ని నశించకుండా కాపాడండి. కైవల్యం కావాలంటే సత్యసాయి బాబా పాదాల వద్ద లభిస్తుంది".

★ ★ ★

"ధర్మం నశించి భూమాత వివస్త్రయై నడివీధిన పడింది. హింసను

అరికట్టి మంచికి స్థానం ఇవ్వండి. మీ హృదయాన్ని ద్వేషమనే విషంతో కాకుండా ప్రేమ అనే అమృతంతో నింపండి"

★ ★ ★

"సాయిని నువ్వు ప్రేమిస్తే పది మందీ నిన్ను ప్రేమిస్తారు. ఒక మంచి మాట నువ్వు మాట్లాడి పదిమంది చేత మాట్లాడించు. అదే దైవం మెచ్చిన మాట".

★ ★ ★

"షిరిడీ సాయిని చూడని వాళ్ళు శ్రీ సత్యసాయిని చూడండి. ఆయన ఈయన ఒక్కరే. దైవం ఎక్కడో లేదు. శ్రీ సత్యసాయి బాబాయే ఆ దైవం. దైవం మన కళ్ళ ముందే ఉన్నా తెలుసుకోలేని అజ్ఞానులు. జ్ఞాన నేత్రంతో శ్రీ సత్యసాయిని చూడండి... చూసి తరించండి".

★ ★ ★

సాయి అవతార పురుషుడు. మన పూర్వజన్మ సుకృతం కొద్దీ లభించిన సద్గురువు. ఆయన పాదాల చెంత చేరి నమస్కరించండి".

★ ★ ★

"సత్య, ధర్మ, ప్రేమ, శాంతి, అహింస – అదే సాయి మార్గం. ఆ మార్గాన మీరు నడిచి మిగతా వాళ్ళను కూడా నడిపించండి. పరమాత్మ ఆశీస్సులను పొందండి".

★ ★ ★

'దైవం ఎక్కడో లేదు. మనలోనే ఉన్నాడు. జ్ఞాన జ్యోతి వెలుగులో ఆత్మని చూడండి. ఆత్మే పరమాత్మ".

★ ★ ★

"మంచి పని చేయటం కష్టం. అయినా దాని ఫలితం అద్భుతంగా ఉంటుంది. మంచి, చెడు రెండు మార్గాలు. వివేకంతో మంచి మార్గాన్ని ఎన్నుకోండి. అమృతం ఎక్కడో లేదు. గీతే మన అమృత భాండం. గీతామృతాన్ని సేవించి, మోక్షం పొందండి – తరించండి"

★ ★ ★

"సత్యసాయే కృష్ణుడు. సాయికృష్ణుని చరణ కమలాల చెంత చేరి గీతామృతాన్ని సేవించి ఆత్మను పరమాత్మలో కలపండి".

★ ★ ★

"కళ్ళకు కనిపించే దైవాన్ని కాదని కనిపించని దైవం కోసం కష్టపడకండి. సాయీశ్వరుడే మనదైవం. బాబాను కొలిస్తే అన్ని దేవతా మూర్తులను కొలిచినట్లే. శ్రీసాయి బాబాయే పరమాత్మ. సాయికి చేసే పూజలు ఈశ్వరునికి చెందుతాయి. బాబాను అనుమానించి, అవమానాల పాలుకాకండి".

★ ★ ★

"సాయి అవతార పురుషుడు, ప్రేమ స్వరూపుడు. సాయి ప్రేమామృతంలో ఉక్కిరిబిక్కిరి అయిన వాడు తప్పక దైవ సాక్షాత్కారాన్ని పొందుతాడు. ఇది సత్యవాక్కు! నమ్మిన వాడికి ఎన్నటికీ చెడు జరగదు".

★ ★ ★

"తృప్తి ఉంటే అన్నీ ఉన్నట్లే. కోరిక నశిస్తే అన్ని కోరికలు తీరినట్లే. అందిన దానితో ఆనందించండి. అందని దానికై ప్రాకులాడి దుఃఖించకండి".

★ ★ ★

"సాయిని మీరు పూజించినా, దూషించినా, సాయికి ఒక్కటే. మీరు

మాత్రం దుఃఖితులు కాకండి. అమ్మ ఒడిలో దొరికే తృప్తి, ఆనందం శ్రీ సాయి ఒడిలో దొరుకుతుంది. ఆయన ఒడిలో ఆ ఆనందాన్ని పొందండి".

★ ★ ★

"భక్తి యోగంతో మీలోని ఆత్మన దర్శించండి. దేహమే దేవాలయం. ఆత్మే పరమాత్మ."

★ ★ ★

"భక్తి యోగంతో కుండలినీ శక్తిని మేల్కొలిపి, బ్రహ్మ జ్ఞానాన్ని పొంది జీవాత్మను, పరమాత్మలో ఐక్యం చెయ్యండి. దైవశక్తి సతతం కురిపించే అమృతధారలను పానం చేసి మోక్షం పొందండి".

★ ★ ★

"త్రికరణ శుద్ధిగా ధర్మాన్ని ఆచరించి, జ్ఞానాన్ని పొంది, మీ మనసుని అమృత భాండం చేసుకుని, భక్తి అనే తెడ్డుతో ఆత్మతత్వాన్ని తెలుసుకొని, సృష్టి, స్థితి, లయ కారుడైన పరమాత్మను దర్శించండి. మిడిమిడి జ్ఞానంతో దైవాన్ని చూడలేరు. పూర్ణ జ్ఞానంతో దైవ సాక్షాత్కారాన్ని పొందండి".

★ ★ ★

"మీరు అన్నింటినీ ప్రేమిస్తే దైవం మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీరు దేనిని దూషించినా దైవాన్ని దూషించినట్టే. ద్వేషం పెంచుకుని దైవానికి దూరం కాకండి".

★ ★ ★

"ఇంద్రియాలలో మనసును ప్రవేశపెట్టి మురికి కూపంలో అనగా అజ్ఞానంతో ఉండటమా? గురుచరణాలను శిరస్సున ధరించి, నామజపంతో అజ్ఞానాన్ని పోగొట్టుకొని జ్ఞానంతో ఆత్మ దర్శనం చేసుకోవటమా!!"

భౌతిక సుఖాలను ఆశించి ఇహలోకంలో సుఖాలను అనుభవించటమా? ... లేక భగవంతుని విభూతిని తెలుసుకోవటమా! సాధకుడు వివేకంతో నిర్ణయించుకోవాలి".

★ ★ ★

"అంతర్దృష్టి లేక అంధులైన వారికి జ్ఞానదృష్టిని ప్రసాదించి, అనంతత్వం వైపు నడిపించే కలియుగ అవతారమూర్తి శ్రీ సత్యసాయిబాబా".

★ ★ ★

"విశ్వ వ్యాపకమైన చైతన్యానికి రూపం లేదు. అంతాశక్తిమయం. అమ్మ శుభదృష్టే అమృతధారలై బిడ్డల (యోగులు) ఆకలి దప్పులు తీరుస్తున్నది.

★ ★ ★

"హృదయమే బృందావనం. గోపాలుడే పరమాత్మ. గోపిక జీవాత్మ జీవాత్మ భావం తొలగిన తర్వాత పదహారు కళలతో వర్ధిల్లు వాడే పరిపూర్ణ మానవుడు. పూర్ణత్వం సిద్ధించిన తర్వాత పరమాత్మతో క్రీడించటమే రాసలీల.

హృదయమే బృందావనం కాగా జీవుడే చైతన్యంగా మారి, పరమాత్మలో బ్రహ్మానందం పొందటమే బృందావన రాసలీల"

★ ★ ★

"వికసించిన దివ్యాత్మ నుండి సహజ పరిమళాలు వ్యాపిస్తాయి".

★ ★ ★

"జ్ఞానాగ్ని జ్వాలలో భౌతిక శరీరం కర్పూరంలా కరిగిపోతుంది".

★ ★ ★

"అజ్ఞాన వీచికలను విజ్ఞాన వీచికలు, తరిమి కొడతాయి"

★ ★ ★

"భౌతిక వాంఛలకు నా మనస్సు ప్రలోభ పడకుండా దానిలోని అసత్యాన్ని తెలియచేసి, దివ్యభావనలోకి తీసుకు వెళ్ళిన ఆ శక్తి అనంతమైనది... అంతు పట్టనిది. అదే నాలోని దివ్య శక్తి. అదే సాయిశక్తి".

★ ★ ★

"మందిరాన్ని అలంకరించాలంటే చెట్ల నుంచి తెచ్చిన పూలు. హృదయమందిరాన్ని అలంకరించాలంటే సుగుణాలే పుష్పాలు".

★ ★ ★

"సాయి ప్రేమ అనే సముద్ర గర్భం నుండి బయటకు లేచిన ప్రేమ తరంగాన్ని నేను. నీటి బడుగ వంటి జీవితాన్ని తామరాకుపై నీటి బొట్టులాగా గడిపి 'నేను' అనేది పోగొట్టుకుని పరమాత్మలో లీనమైన జీవాత్మని".

★ ★ ★

"అజ్ఞానమనే చీకటిని జ్ఞాన భాస్కరుడైన గురువు తన అనుగ్రహ కిరణాల ద్వారా హరింపచేస్తాడు".

★ ★ ★

"నా జీవన చైతన్య స్రవంతి నుండి హద్దులులేని ప్రేమ హృదయాంతర్భాగం నుంచి వెల్లువలై ప్రవహిస్తున్నది. దివ్యాత్మ స్వరూపులారా! ఈ ప్రేమ వాహినిలో మునకలు వెయ్యండి! సత్యసాయిని చేరండి!"

★ ★ ★

"తపశ్శక్తి సంపన్నులు ఏకాగ్రతతో సాయికృష్ణుని దర్శిస్తారు. భక్తులు మధురంగా రాధామాధవ ప్రణయగీతాలు నృత్యం చేస్తూ పాడుతూ కృష్ణునిలో లీనం అవుతారు.

ఋషులు, పండితులు తమ మధుర వాక్కులతో కృష్ణుని స్తుతిస్తుంటారు.

అష్ట భార్యలతో (అంటే అష్టైశ్వర్యాలు) కూడిన శ్రీకృష్ణ పరమాత్మ వారి వారి భావాలకు తగిన విధంగా దర్శనమిస్తాడు".

★ ★ ★

**12.11.1997**

"కృష్ణుడు పట్టు పీతాంబరాలు ధరించి, గిరజాల జట్టుతో, కిరీటం ధరించి, సర్వాలంకార భూషితుడై పంట పొలాలలో నుంచుని ఉన్నాడు. నేను కృష్ణుడి వెనుక కొంచెం దూరంలో ఉన్నాను. కృష్ణపరమాత్మ వెనుకకు తిరిగి నా వైపు చూస్తూ నన్ను తనతో రమ్మని సైగ చేశాడు. నేను కృష్ణుని దివ్య దర్శనంతో ఆనందంగా ఆ శ్యామసుందరుని వెంట వెళ్ళాను".

కలలో ఇలా దివ్య దర్శనం లభించింది.

**13.11.1997**

హైదరాబాదు నుంచి పుట్టపర్తి బస్సులో వెళుతుంటే రాత్రంతా నా కన్నయ్య నన్ను తన వెంట పెట్టుకుని పుట్టపర్తి తీసుకు వెళ్తున్నట్లుగానే ఉన్నది. ఇది కలలాగా అనిపించలేదు. కలలాటి నిజం. సాయి కృష్ణుడు నిజంగానే తన వెంట పర్తి తీసుకుని వచ్చారు. సత్యసాయితో ప్రయాణం మరచిపోలేని దివ్యానుభూతి. మీ వెంట జంట ఉంటానన్న సాయి మాట, నిజం చేశారు.

పుట్టపర్తిలో బస్సు దిగే ముందు "నామం పిప్పరమెంటు లాగా ఘాటుగా తీయగా చేసుకోండి" అని వినిపించింది.

**23.11.1997**

దృశ్యం: బాబా నా వైపుకు బాణం ఎక్కు పెట్టటం దాని చివర చిన్న నీటి బిందువు.

ఈ దృశ్యానికి తర్వాత 21.10.2004న ఉదయం స్వామి బంగారు రథం వద్ద ఉన్నప్పుడు హృదయభాషలో తెలియజేసిన అర్థం “అమ్మ కృపాదృష్టి అమృతబిందువై ఎక్కు పెట్టబడిన బాణంలా సాధకుని హృదయంలో ప్రవేశించి హృదయాన్ని అమృత భాండంగా మారుస్తుంది.

స్వామీ! నన్ను నీ వద్దకు చేర్చుకున్నావు. ఈ ధర్మ పోరాటంలో జయమో, అపజయమో ఏదైనా నాకు ఇష్టమే. ధర్మోద్ధరణకి నన్ను ఉపయోగించుకుంటావో లేక మరణాన్నే ప్రసాదిస్తావో...నీ ఇష్టం. నా తప్పులు సరిదిద్ది కన్న తల్లి ప్రేమను అందించావు. ఈ ప్రేమను రుచి చూసిన నేను నిన్ను కాదని జీవించలేను. నా స్థితిని అర్థం చేసుకుని నన్ను స్థిరంగా ఉంచు. నేను ఎక్కడ ఉన్నా నువ్వు నా వాడివి. అందరి వేదనలు తీర్చే నువ్వు, నా విషయంలో ఇంకా ఈ ఆలస్యం ఎందుకు చేస్తున్నావు?

**29.11.1997**

ఈ రోజు ఉదయం దర్శనంలో 7వ నం. టోకెన్ వచ్చింది. నాకు కలిగిన అనుభూతి... “సాయి సరస్వతీ! నా హృదయ వీణ అపశృతి పలుకుతున్నది. దాని తంత్రులు సరిచేసి సప్తస్వరాలు పలికించు. నాదమే పరబ్రహ్మ స్వరూపం. అమ్మా! వీణా పాణివి! నా మానస వీణని నీవు తప్ప మరెవ్వరు శృతి చేయగలరు? సాయీశ్వరా! కార్తీక మాసం శివసాన్నిధ్యంలో ఉండే భాగ్యం కలుగ చేశావు” అని అనుకున్నాను. వెంటనే స్వామి నొసట విభూతి రేఖలతో దర్శనం ఇచ్చారు. విభూతి సుందరుని అందాలు వర్ణించటం మాటల కందనిది. స్వామీ! నాకు సమాధి స్థితిని ప్రసాదించమని ప్రార్థించాను. శక్తిని ఇస్తున్నట్లు రెండుసార్లు నావైపుకి చేతులు ఊపారు. ఇంటికి తిరిగి వెళ్ళిన తర్వాత ధ్యానస్థితి కలుగుతుందని మానసికంగా తెలియచేశారు.

**29.11.1997**

అమృతమూర్తి అయిన బాబావైపు నా దోసిలిని పట్టి "దీని నిండా అమృతం నింపవా!" అని అడిగాను. స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు. "నీ అణువణువూ అమృతమూర్తినైన" శివశక్తిని నేను నిండి ఉండగా మళ్ళీ అమృతం నింపటం ఏమిటి?" అన్నారు. నాలో ఆ కోరికను కలుగచేసింది, దానికి జవాబు చెప్పింది బాబాయే. అద్వైతస్థితిలో భగవంతుడు, భక్తుడు ఒక్కటే!

**30.11.1997**

ఉదయం మందిరంలో నా ప్రక్కన ఉన్న ఆవిడ "మాటే పాట" అన్నది. మరొక ఆమె "అదే నిజం" అన్నది. నేను ఎప్పుడూ నాకు పాటలు రావు వస్తే పాడుకుంటూ ఉండే దాన్ని కదా అని బాధపడుతూ ఉండేదాన్ని కానీ, ఈ రోజు వాళ్ళ సంభాషణ విన్న తర్వాత అదే నిజం అనిపించింది. సాయి మాత ఇచ్చిన వాక్కుతో మంచి మాటలు మాట్లాడి అవతల వాళ్ళ అజ్ఞానాన్ని (మాయను) తొలగించి జ్ఞాన మార్గాన నడిపించవచ్చున్న భావన నాకు చాలా సంతృప్తిని కలిగించింది. పాటలు రావన్న బాధను స్వామి ఇలా తీర్చారు.

కార్తీక మాసం ప్రశాంతి నిలయంలో స్వామి సన్నిధిలో ఉండి ప్రతి రోజూ పరమేశ్వరుని దర్శనభాగ్యం పొందటం జన్మజన్మల కర్మలు నశించటమేనన్న భావన కలిగింది.

సాయి మాత మానసికంగా ఇలా తెలియచేసింది. "ప్రస్తుతం ఎవ్వరికీ జ్ఞానబోధలు చెయ్యకు. సత్యం చూస్తున్నా సత్యం కాదనే మనుషులు సమయం వస్తుంది. అంత వరకు మౌనంగా ఉండు. నా ఆశీస్సులు ఫలిస్తాయి. నువ్వు కోరుకున్న ఆరడుగుల స్థలంలోనే ఉండు. నేను ఇస్తానన్న వస్త్రం ఇచ్చి నా

మాట నిలబెట్టుకుంటాను. సత్యసాయి సత్యం తప్పడు. సత్యమే నా ప్రచారం. నిశ్చింతగా ఉండు".

అమ్మా! నీ మాట ప్రకారమే ఉంటాను. ఎన్ని కష్టాలైనా భరించి నిన్ను నా హృదయంలో నిలుపుకుంటాను. సత్యం తప్పను. నేను నీ బిడ్డని. నీకు అపకీర్తి తెచ్చే పనులు చెయ్యను.

★ ★ ★

నా చిన్నతనంలో మా అమ్మ నాకు గౌను కోసం బట్ట తీసుకున్నప్పుడు ఆ బట్టలో నుంచి లోపల వేసుకున్న "పెట్టికోటు" కనిపిస్తుందా లేదా అని చూసుకునే దాన్ని. అలా కనిపిస్తే నాకు ఆనందంగా ఉండేది. నా గురుదేవుని అనుగ్రహంతో శరీరం వస్త్రమని, లోని చైతన్యం వెలుగు అని తెలిసిన తర్వాత అంతర్ముఖంగా చైతన్యానుభూతిని పొంది, బ్రహ్మానందంలో ఉన్న నాకు "చిన్ననాటి నా కోరిక నా శరీరంలోని వెలుగు చూడటం కోసమేననీ, అప్పటి నా కోరిక అర్థం లేనిది కాదనీ" ఇప్పుడు తెలిసింది. ఆ చిన్న కోరిక నాలోని వెలుగును చూడటానికి పునాది అయ్యింది.

కాల సర్పం కాటు వెయ్యక ముందే దాని కోరలు తీసివెయ్యాలి. సుఖదుఃఖాలే కాలసర్పపు కోరలు. అంటే సుఖదుఃఖాలను సమంగా అనుభవించాలి. కాలాతీతుడు భగవంతుడు. ఆయనను శరణువేడితే సుఖము, దుఃఖము రెండూ సమంగా అనుభవించే శక్తిని మనకి ప్రసాదిస్తాడు. గురువు అనుగ్రహం కలిగినప్పుడు దేహమనే మన గృహంలో వ్యక్తమయి అక్కర్లేని ప్రాపంచిక విషయాలను తొలగించి దైవచింతన కలిగిస్తాడు. మనలోని దుష్ట శక్తులను సంహరించటానికి జగన్మాత' ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది.

సంసారమనే ఈ బొమ్మలాటలో ఎన్నో విషయాలను సేకరించి నెత్తిన పెట్టుకుని మోయలేని భారాన్ని మోస్తుంటే సద్గురు సాయినాథుడు కృపాసముద్రుడై మన నెత్తిమీద ఉన్న అక్కర్లేని విషయాలు తీసివేసి భారాన్ని తొలగిస్తాడు. మృత్యువు కూడా భగవంతుడే. ఈ సృష్టి ఆది దేవునికి గోళీల ఆట వంటిది. జీవులే గోళీలు. స్వచ్ఛమైన హృదయం కల పవిత్రమైన ఆత్మలను జన్మమత్యు పరంపర నుంచి తప్పించి రక్షిస్తాడు. పాము అంటే కుండలినీ శక్తి. మృత్యువుకు భయపడక సద్గురువును ప్రార్థించి ఆయన అనుగ్రహం పొందితే కుండలినీ శక్తిని యోగమార్గం ద్వారా నడిపించి ముక్తిని ప్రసాదిస్తాడు. జ్ఞాన జ్యోతిని మనలో వెలిగించుకోవటం అంటే ఉన్న వెలుగునే చూసుకోవటం. కానీ, మాయ పొర అడ్డుపడటం వలన లో వెలుగును దర్శించలేము. మాయపొరను సద్గురువు ఒక్కడే తొలగించగలడు. దేహమనే పుట్ట నుంచి వచ్చే కోరికలే పాములు. కోరికలను జయించి అమృతత్వాన్ని పొంది మృత్యువుని జయించాలి. మృత్యువన్నది సహజం. దానికి భయపడకూడదు. పుట్టిన ప్రతి జీవి మృత్యుకోరలలో నలిగిపోవలసినదే. పుట్టుక లేకుండా చేసుకోవటమే మన లక్ష్యం. ఈ లక్ష్యసాధనకు మన సద్గురు సాయినాథుని పాదాలు పట్టుకోవటమే మార్గం. పట్టిన పాదాలు విడవకుండా ఉంటే ఆయనే మనని పట్టుకుంటాడు!

**9.11.1997**

ఉదయం అద్దంలో నా ముఖం కాళికాదేవి రూపంగా కొంచెం క్రోధంగా కనిపించింది. తర్వాత ప్రసన్నంగా అయింది. దీనికి అర్థం స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు.

"అమ్మా! నా రక్తంతో నీకు అభిషేకం చేసి జ్ఞానాగ్నిలో కాలి బూడిదైన నా కోరికల భస్మం నీనొసటన పూసి, నా చర్మం నీకు వస్త్రంగా సమర్పించి, నా

హృదయపుష్పం నీ విరబోసుకున్న కురులలో అలంకరించి, నా అహంకారాన్ని తలవంచి నీ పాదాల ముందు బలి చేసి, నా పేగులను నీ మెడలో హారాలుగా వేసి, నా మాంసమే నీకు నైవేద్యంగా పెట్టి, నా కపాలం నీ కంఠానికి అలంకారం కాగా నా జ్ఞాన జ్యోతి దివ్య వెలుగులో నీ అఖండ రూపం దర్శించి నీలో ఐక్యమయ్యాను సాయి మాతా!

సాధకుడిలోని దుష్టశక్తులను సంహరించటానికి కాళీమాతగా దర్శనం ఇచ్చి, దుష్ట సంహారం తర్వాత సాధకునికి ప్రశాంత ముఖంతో ప్రేమ మూర్తిగా దర్శనం ఇస్తుంది.

**30.11.1997**

దర్శనం సమయంలో అనుభూతిః "నటశేఖరా! నీ నడకలోని అందాలు వర్ణించటం బ్రహ్మకైనా తరమా! నీ రాయంచ నడకలహొయలు చూపించటానికా మొదటి వరుసలో స్థానం ఇచ్చావు!"

"త్రిగుణాల పతాకాన్ని గురుదేవుల పాదాల వద్ద ఎగుర వేద్దామా! శాంతి కపోతాలమై జనారణ్యంలో విహరిద్దామా!"

"సాయీ ఈ బండరాయిలోని మధుర ప్రేమను గుర్తించిన నువ్వు నన్ను అమృతకలశంగా మార్చావా!

"గురుదేవా! కనిపించీ కనిపించని అరవిరిసిన తామర పుష్పాల్లా ఉండే నీ పాదాల మీద జీరాడే పట్టు అంగీ తొలగి నీ పాదాలు వికసించిన తెల్ల తామరలుగా కనిపించాయి. ఈ అదృష్టం నాకు కావాలని కలిగించావా తల్లీ! ఈ తెల్లని కాంతి నా హృదయ మాలిన్యాన్ని తొలగించి కాంతి పుంజంగా మార్చింది.

**3.12.1997**

సాయి మాతకి చేతులెత్తి నమస్కరించటం కంటే చేయి చేయి కలిపి సేవా కార్యక్రమాలు చేపటట్టం అమ్మకి ఆనందం.

సాయి దర్శనం కోసం ముందు ముందుకు పాకటం కంటే సాయి మాత ఆశయాల కోసం ముందుకు సాగటం అమ్మకి సంతోషం.

**4.12.1997**

దృశ్యం: ఒక స్త్రీ నగ్నంగా నిలువెత్తు కొండ మీద పాకుతున్నట్లు, తర్వాత రెండు పాదాలు కనిపించాయి. ఎడమ పాదానికి చిన్నతాడు ఉన్నది. కుడి పాదం కొంచెం దూరంగా ఉన్నది.

భావం: "ఇప్పటి వరకు నడచిన మార్గం సులభంగా దాటావు. ఇక నడిచే మార్గం మోకాటి పర్వతంలా కష్టమైనది. పంచేంద్రియాలు నిగ్రహించి సత్యవాక్కుతో నామస్మరణ చెయ్యి. దేహ భావము మరచిపో. అపనమ్మకంతో ఎడమ పాదం పెట్టి నమ్మకం అనే బంధం తెంపుకున్నావు. తెగిపోయిన తాడును నమ్మకంతో తిరిగి ముడి వేసి, హిమవత్ పర్వతం ఎక్కి శివశక్తి స్వరూపమైన నన్ను దర్శించు. జగద్గురువుగా నా సహాయం ఉంటుంది" అని నా గురుదేవులు మానసికంగా తెలియచేశారు.

**5.12.1997**

శ్రీ వేణుగారి ద్వారా మూడు వారాలు పుట్టపర్తిలో వారి యింట్లో ఉంచావు. ఈ స్థలంలో ఏ మహనీయులు తపస్సు, యజ్ఞయాగాదులు చేశారో అలాటి పరమహంసలు పావనం చేసిన ఇంట్లో భుజించటం, నిద్రించటం,

ధ్యానం చెయ్యటం ద్వారా వాళ్ళ శక్తిని నీ అనుగ్రహం ద్వారా పొందాను. నీ సంకల్ప బలంతో ఈ యాత్ర జయప్రదం అయ్యింది. అమ్మా! నీ సన్నిధి నుంచి పూర్తి విశ్వాసంతో హైదరాబాద్ వెళుతున్నాను. నా గురుదేవులు సత్యసాయి నావెయ్యి జన్మలలో మోక్షసాధనకు ఏఏ గురువులు నన్ను ఈ జ్ఞాన మార్గంలో నడిపించారో వారందరి చేత నాకు ఆశీస్సులు ఇప్పించారు మానసికంగా "స్వామీ భగవంతుడివైన నువ్వే ఆత్మగురువై నన్ను ఆశీర్వదించిన తర్వాత మళ్లీ యింత మంది గురువుల ఆశీస్సులు ఎందుకు?" అన్నాను. స్వామి ఈ విధంగా సమాధానం చెప్పారు. "తల్లికి మించిన దైవం లేదు అయినా తల్లి తన ఆశీస్సులతోపాటు తన బిడ్డకి పది మంది చేత ఆశీస్సులు అందచేస్తుంది. అలాగే నేను ఆ గురువులందరి చేత ఆశీస్సులు అందచేశాను. నేను, వాళ్ళూ వేరుకాదు. నీ వెయ్యి జన్మలలో కూడా గురువుని నేనే" అని హృదయభాషలో తెలియచేశారు.

**13.12.1997**

దివ్యస్వప్నం : "నేను ఒక నదిని పడవ సహాయంతో దాటుతున్నాను. నది మధ్యకు వచ్చేసరికి విపరీతమైన ఈదురు గాలి, పడవ వాడు" పడవ మునిగిపోతున్నది... ఈత వచ్చా?" అని అడిగాడు. "నాకు రాదు అయినా భయం లేదు" అంటూ ఈశ్వర నామం చేస్తూ కళ్ళు మూసుకున్నాను. పడవ ఒడ్డుకు చేరింది అక్కడ అందరూ" మీకు ఇంత శక్తి ఎలా వచ్చింది? అని అడిగారు.

"సంసారం అనే సాగరాన్ని శక్తివంతమైన ఈశ్వర నామంతో సులభంగా దాటవచ్చు" అని చెప్పాను.

**14. 12. 1997**

భావాలు:

1. క్షీర సాగర శయనునికి పాలాభిషేకం ఎందుకు?
2. భక్తుల పవిత్రమైన ఆలోచనలే భగవంతునికి అభిషేక జలాలు.
3. భక్తుని చల్లని హృదయమే భగవంతునికి మంచి గంధపు పూత. వేరే చందనపు పూత ఎందుకు?
4. విశ్వమంతానిండిన పరమాత్మకి చైతన్యమే వస్త్రం అయితే మనం సమర్పించే నూలు వస్త్రం ఎందుకు?
5. ఫాలభాగాన విభూతి ధరించిన వానికి కస్తూరీ తిలకం ఎందుకు?
6. భక్తుల వెన్నలాంటి మనసులను కోరే వానికి పంచ భక్ష్య పరమాన్నాలు నైవేద్యమా?
7. భక్తుడు భగవంతుని ముందు కర్పూరంలా కరిగిపోవాలి. కానీ కర్పూర హారతి వెలిగించటం కాదు.
8. పరమాత్ముని మధురమైన తేనెవంటి వాక్కులతో అభిషేకించాలి. పుట్ట తేనెతో కాదు.
9. అహంకార మమకారములకు దూరమై మాయని తొలగించుకుని స్వచ్ఛమైన మనసును పరమాత్మకు అర్పించాలి. నారికేళం కాదు.
10. పరమేశ్వరునికి నూనె దీపం వెలిగించటం కాదు. దేహభావం వీడి జ్ఞాన జ్యోతిని వెలిగించాలి.

11. వికసించిన మనోభావ కుసుమాలు పరమాత్మకు సమర్పించాలి. కానీ, చెట్ల నుంచి తెచ్చిన పుష్పాలు కావు.

12. భక్తుడు భక్తితో కార్చేకన్నీరే భగవంతునికి పన్నీటి జల్లు.

13. మంచి మనస్సు నుండి వెలువడే సువాసనలే శ్యామసుందరునికి సుగంధ పరిమళాలు.

14. ఈ శరీరమనే బంగారు రథంలోని హృదయ పీఠం మీద ఉన్న పరమాత్మ మనతో తిరుగుతుంటే రథోత్సవాలు ఏమిటి?

15. చేతితో జపమాల తిప్పుతూ మంత్ర జపం చేయటం కంటే పది మందితో కలిసి మంచిగా మాట్లాడటమే అసలైన మంత్ర జపం అవుతుంది.

16. నాలో... అనంతంలో నిన్ను చూస్తున్నాను ప్రభూ!

17. ఓ మనసా! బాహ్య ప్రపంచంలోని వస్తువుల ఆకర్షణకు లోనై అంతరంగంలోని ఆరాధ్యదైవానికి దూరం కాకు.

**15.12.1997**

దృశ్యం: ఆకాశంలో తెల్లని మెరుపు, ఆ మెరుపులో నుంచి గోచీ పెట్టుకున్న సాధువు. ఆ సాధువు ఎవరా అని అనుకునేలోపు ఆయన రమణ మహర్షి అని స్వామి తెలియచేశారు. ఆ విధంగా రమణ మహర్షిని దర్శించటం ఎన్నో జన్మల సుకృతం అనిపించింది.

**20.12.1997**

విన్నమాట "సువర్ణం"

అర్థం: విశ్వమంతా బంగారు కాంతులతో నిండిన ఈశ్వరలింగం.

కంటికి కాటుక అందం. కానీ నల్లని కృష్ణయ్యను నింపుకున్న కళ్ళు మరీ అందం.

**28.12.1997**

భావాలు: నేను మృత్యు గుహలోనికి నెట్టబడటం లేదు. ఆనందధామమైన పరమాత్మ సన్నిధికి చేరుతున్నాను. నా తుది శ్వాసలో నేను వినేది మృత్యుహేల కాదు. కృష్ణ పరమాత్మని ఆనందహేల. నా చివరి క్షణాలలో చూసేది భయంకరమైన మృత్యువును కాదు. ఆనంద స్వరూపమైన కృష్ణ భగవానుని. నేను కౌగిలించుకునేది మృత్యువును కాదు. ప్రేమ మూర్తి అయిన నీల మేఘశ్యాముని. నేను చివరగా వినేది మృత్యు పిలుపు కాదు. పరమాత్మ కృష్ణ భగవానుని పిలుపు.

ఈ ప్రపంచంలో "నా" అన్నది ఏమీ లేకుండా విభూతినై విశ్వేశ్వరునిలో ఐక్యం అయిపోతాను. మురళీధరా! నీ వేణుగానం విన్న నామనసు చైతన్యవంతమై నీవైపు పయనిస్తున్నది.

**3.1.1998**

ఓ మానవులారా! ఇంద్రియాలకు బానిసలై బ్రతుకును వ్యర్థం చేసుకోకండి. దైవానికి బానిసలై బ్రతుకును పండించుకోండి.

**12.1.1998**

1. కోటి వీణలు ఒక్కటై నా గళం నుండి ఆహ్లాదకరంగా కృష్ణనామం వెలువడుతుంటే సర్వవ్యాపకుడవైన నీకు వినిపించటం లేదా ప్రభూ!
2. వేదాలు చదవని నేను నీ కోసం పడే వేదనే వేదఘోషగా ప్రతిధ్వనిస్తోంది.

3. ఉపనిషత్తులు చదవలేదు. కానీ, నీ కోసం నేను కార్చే ప్రతి కన్నీటి బొట్టు ఉపనిషత్సారమై నా హృదయమంతా నిండి అదే విశ్వమంతా నిండింది.
4. కామంతో నిండిన కళ్ళు కమలాక్షుని దర్శించలేవు.
5. మనసులో కోటి కోరికలు కదులుతుంటే నీ నామం చేయలేము రామా!
6. ఆత్మదర్శనం తర్వాత కోరికలు కలుగవు.
7. నిన్ను పొందాలన్న కోరికను తప్ప అన్ని కోరికలూ జ్ఞానాగ్నిలో దగ్ధం చేశాను.

**16.1.1998**

దివ్య స్వప్నం: నా ప్రక్కన ఉఉన్న ఎవరితోనో సూర్యోదయం అదిగో అంటూ రెయిలింగ్ పట్టుకుని దాని ఆధారంతో సూర్యోదయాన్ని చూస్తూ ఆనందంగా ఏ అడ్డంకులూ లేకుండా చివరి వరకూ వెళ్ళి సూర్యుడికి దగ్గరయ్యాను!

'స్వామీ! నాకు ఇంకా ఎప్పుడు విముక్తి? ఫిబ్రవరికి నాకు ఏదో ఒకటి చెయ్యి. ఇంకా ఎంత కాలం నాకీ నిరీక్షణ" అని చాలా దుఃఖించాను. భక్తిరంజని వస్తుందని రేడియో ఆన్ చేశాను. శ్రీ బాలమురళీకృష్ణ పాడిన భక్తి గీతం వచ్చింది." కలవరం ఎందుకు? కలత చెందకు! మరు దినున నీ మనుగడ ఏమిటని బ్రతుకును గూర్చిన భయం ఎందుకు? నిన్ను కాపాడే దొర ఉండగా! నువ్వు మరువక తలచిన చాలు. నిరతము నిన్ను కాపాడు" నా వేదనకు అది స్వామి ఇచ్చిన సమాధానంగా భావించి తృప్తి పడ్డాను.

**17.1.1998**

కట్టెకు సుగంధ పరిమళాల పూత పూయటం వలన భగవంతుని సన్నిధిలో రూపం లేకుండా కాలిపోయింది "అగరుబత్తి"

దేహమనే కట్టె పది కట్టెలలో ఒకటిగా కాలిపోకముందే హృదయంలో దివ్యాలోచనల సుగంధాన్ని నింపి మనస్సు అనే కట్టెను జ్ఞానాగ్నిలో కాల్చి వేయాలి!!

సాయంత్రం 7 గం॥లకు తురీయ స్థితిలో విశ్వచైతన్యాన్ని దర్శించాను.

**20.1.1998**

1997 డిసెంబరు 27న నా పుట్టిన రోజున గీత నన్ను కలిసింది. జనవరిలో స్వామి సేవకు పుట్టపర్తి వెళ్తానని చెప్పింది. అప్పుడు నేను గీతతో... "గీతా! స్వామి నీకు పాదనమస్కారం ఇచ్చినప్పుడు నా గురించి అడగమని" చెప్పాను.

ఈరోజు ఉదయం చాలా అశాంతిగా అనిపించింది. వైరాగ్యం పరిపూర్ణంగా ఉన్నది. జ్ఞాన మార్గాన వెళ్తున్నాను. అయినా ఏదో అశాంతి. ఇంకా నాకు ఏదో కావాలి. ఏదో వెలితి. ఆ స్థితిలో మేడపైకి వెళ్ళాను. మా చెల్లెలుతో మాట్లాడి వాళ్ళ పుస్తకాల ర్యాకులో స్వామీజీ సుందర చైతన్యానందుల వారి భాగవతం చూశాను. అది ఒకసారి చదివాను. కానీ ఈ మధ్య కొద్ది రోజులుగా మళ్ళీ భాగవతం చదవాలని అనిపించింది. అయినా, చదవలేకపోయాను. ఈ రోజు సాయి అనుగ్రహంతో పుస్తకం తెచ్చాను. ఇంతకు ముందు చదువుతున్న జ్ఞానానికి సంబంధించిన పుస్తకాలకి బదులు భాగవతం చదవటం ప్రారంభించాను. సాయంత్రం ఆరు గం॥లకు భాగవతం పారాయణం చేస్తే బాగుంటుందని అనిపించింది. 14 పేజీలు చదివాను.

భాగవతం చదవటం ప్రారంభించిన దగ్గర నుంచి మధురమైన అనుభూతి కలిగింది. వైరాగ్యంతో కాలిపోతున్న నా మనస్సుకి ఏదో చల్లని స్పర్శ సోకినట్లైయింది.

గీత పుట్టపర్తి నుంచి వచ్చి సాయంత్రం నాకు ఫోను చేసింది "శుక్రవారం నాకు స్వామి పాద నమస్కారం ఇచ్చారు. మీరు అడగమన్నట్లే స్వామిని అడిగాను. "అన్నీ" నేను చూసుకుంటానని మీకు చెప్పమని చెప్పారు" అని చెప్పింది. అప్పుడు నా స్థితి ఎలా ఉన్నదో ఆ అనుభూతి మాటల్లో చెప్పలేను. గీత "రామ" వార్తని సీతకు తీసకువచ్చిన 'ఆంజనేయుడి'లా అనిపించింది. భాగవతం ప్రారంభించిన వెంటనే ఇదంతా జరిగింది. నాలో వెలితిని సాయి మాధవుడు తన మధుర ప్రేమతో నింపి ఆనంద సాగరంలో ముంచారు. స్వామి తలచుకుంటే భక్తులకు లోటేమున్నది!

ఉదయం అంతా "స్వామీ.. నేను నీకు ఉన్నానని స్వయంగా ఒక చిన్న మాట తెలియచెయ్యి. ఆ మాట విని నేను చనిపోతానని ఏడిచాను. కానీ, చనిపోతే ఏమున్నది? బాబా! నా కళ్ళు కావాలా తీసుకో... ఈ ప్రపంచంలో అన్నీ చూశాను. అన్నిటినీ మించి నీ అవతారాన్ని చూశాను. ఇంక చూడటానికి ఏముంది? గురుదేవా! గురు దక్షిణగా ఇంతకంటే ఏమివ్వను? నీ ఒక్కమాట కోసం ఏదైనా చేస్తాను. నేను సత్యమే చెపుతున్నానని నీకు తెలుసు. ప్రభూ! నీ ఒక్క చిన్న మాట కోసం జీవిస్తున్నానన్న సంగతి నీకు తెలుసునని నాకు తెలుసు అని దుఃఖించాను. సాయంత్రానికి నా తండ్రి గీతద్వారా చిన్న మాట తెలియచేశారు. కొంత ఊరట కలిగింది. గురుదేవా! త్వరలోనే నన్ను నీ వద్దకు చేర్చుకుంటావన్న విశ్వాసంతో నిన్ను స్మరిస్తూ ఉంటాను.

**27.1.1998**

మోహన్‌గారికి నేను ఉపదేశం చేసిన తర్వాత మోహన్‌గారికి రాత్రి వచ్చిన కల.

"నీళ్ళలో మునిగిన ఏనుగును తాడు సహాయంతో పైకి తీసి పాదాలకి నమస్కరించారట".

ఈ కలకి స్వామి తెలియచేసిన అర్థం "నిర్మలమైన మనస్సు కలిగిన వారికి సద్గురువు ద్వారా నామ "మణి" అనుగ్రహించబడుతుంది. సాకుడు గురువు మీద శ్రద్ధ, భక్తి ఉంచి నామమును సతతం స్మరించటం ద్వారా మదగజం వంటి పశుప్రవృత్తి నశిస్తుంది. సాధకుని నిర్మలమైన మనస్సు స్వచ్ఛమైన తటాకంలా ప్రశాంతంగా ఉంటుంది. ఆ స్థితిలో సాధకుడు 'నామం' అనే తాడును ఆధారం చేసుకుని సాధన సాగిస్తున్న సమయంలో సాధకుని హృదయ సరోవరంలో నుంచి "విఘ్నేశ్వరుడు" వ్యక్తమై సాధకునికి విఘ్నాలు కలగకుండా రక్షకుడై నిల్చినపుడు సాధకుడు ఏ అడ్డంకులు లేక విశ్వమంతా నిండిన హరిని దర్శించి ముక్తిని పొందుతాడు".

సాధకులారా! ఆలస్యం ఎందుకు? హరిచరణ కమలాల వద్ద చేరి ధన్యులు కండి!

**31.1.1998**

"గురుదేవా! ఈ ఆరడగుల గది నాకు బంధంగా అనిపిస్తున్నది" అన్నీ నేను చూసుకుంటానని చెప్పు" అని గీత ద్వారా తెలియచేసినా నాకు తృప్తిగా లేదు. అమ్మా! సాయి మాతా! ఉగాది లోపు నాతో స్వయంగా మాట్లాడు. మాట్లాడతావని నమ్మకం ఉంది. ఏ కారణం చేతనైనా మాట్లాడకపోతే నా కర్మ

ఫలాన్ని అనుభవిస్తూ నీ మీదనే నా మనస్సు ఉంచి, ఈ గదిని వదిలి ఈ విశాల ప్రపంచంలోకి వెళ్ళిపోతాను. "విశ్వాత్మవి!" నీవు లేని చోటులేదు. నేను ఎక్కడ తిరిగినా నాతోనే ఉంటావు. నేను ఎక్కడ ఉన్నా నీ నీడలోనే ఉంటాను. నాకు భయం ఎందుకు?" అమ్మా! ఒక్కసారి మాట్లాడు. తల్లి ప్రేమ పొందలేని బిడ్డగా జీవించలేను. నన్ను క్షమించ లేవా! ఒక్కొక్క రోజు ఒక్కొక్క యుగంలా ఉగాది వరకూ ఎదురు చూస్తాను. క్షమించరాని తప్పులు చేసి ఉంటే ఏ శిక్ష వేసినా భరిస్తాను. కాని, నీ మౌనం భరించలేనమ్మా మౌనం వీడి బిడ్డని ఒడిలోనికి చేర్చుకో సాయి మాతా! నాకు ఆ అర్హత లేకపోతే నీ వద్దకి ఎందుకు పిలిపించుకున్నావమ్మా? ధూళిలో ఉన్న నన్ను ధూళిలోనే ఉంచక జ్ఞాన గంగతో ఎందుకు శుద్ధి చేశావు? చదువురాని నేను ఏ విధంగా నిన్ను ప్రార్థించను? మాయవీడిన నేను మాయలో జీవించలేను. అర్థం చేసుకోవలసిన నువ్వే అర్థం చేసుకోక పోతే ఇంకెవరు నన్ను అర్థం చేసుకుంటారు? పుట్టపర్తి వచ్చి నిన్ను చూడాలన్న కోరిక బలంగా ఉన్నా నీ మౌనం భరించలేక రావటం లేదు. ఏదైనా సూచనను ఇచ్చి పిలిపించుకో. అందరితో మాట్లాడుతూ, తిరుగుతూ ఉన్నా నా ధ్యాస అంతా నీమీదే కదా! సర్వాంతర్యామివి. ఇదంతా నీకు రాయటం ఏమిటి? నీకు తెలియనిది ఏమున్నది? నా వేదన తీర్చుతల్లీ! నిన్ను నా మాటలతో విసిగిస్తే క్షమించు.

**12.2.1998**

విశ్వ కళ్యాణానికై విశ్వాత్ముడైన కళ్యాణ రాముడికి పాయసాన్నం ప్రసాదంగా పెట్టాను. రామా! ధర్మమూర్తివి. ధర్మమార్గాన నడిచి నిన్ను చేరుకోవాలన్న కోరిక తప్ప ఏ కోరికా లేదు. నీకు తెలియనిది ఏమున్నది? సీతారామా! సీత చెర విడిపించి ఆ అమ్మకే అగ్ని పరీక్ష పెట్టావు. నన్ను ఈ

సంసారం అనే చెర నుండి విడిపించి ఏ పరీక్ష పెట్టిన సంతోషంగా స్వీకరిస్తాను. త్వరలో నన్ను నీలోచేర్చుకో సాయిరామా! జ్ఞానాగ్నిలో కాలిపోతున్న నాకు నీ చల్లని ఒడిలో సేద తీర్చుకునే భాగ్యాన్ని కలిగించు. నీ సేవా కార్యక్రమాలలో నాకు చిన్న సేవను ప్రసాదించు. ఉడతాభక్తిగా నీ మనసుకు నచ్చిన విధంగా పరిపూర్ణమైన ప్రేమతో నీ దాసురాలినై సేవ చేస్తాను. కరుణా సముద్రుడివి. నీ దాసురాలిని కరుణించి నన్ను బ్రోవ కదిలిరా పుట్టపర్తి రామా.. నీ మీద విశ్వాసంతో ఉన్నాను.

**25.8.1998**

వినాయక చవితికి పుట్టపర్తి వెళ్ళాను. మొదటి వరుస వచ్చింది. దర్శనం సమయంలో స్వామి నా వైపు చూశారు. ఆ చూపులో అన్నీ నేను చూసుకుంటాను అని చెప్పినట్లు అనిపించింది. నా జన్మ ధన్యం అయింది. 1984లో గురు పౌర్ణిమ రోజున కుండలినీ యోగాన్ని ప్రసాదించి ఈ యోగ మార్గాన నన్ను కంటికి రెప్పలా కాపాడుతూ ఈ వినాయక చవితికి యోగం సిద్ధింప చేశారు. ఇది తెలియచేయటానికే పుట్టపర్తి ప్రయాణం పెట్టారు. గురుదేవా! విశ్వచైతన్యం దర్శింప చేసిన నీకు ఇచ్చేందుకు ఏమున్నది? అంతా ఒకటే అయినప్పుడు.

బస్సులో హైదరాబాదు తిరిగి వస్తుంటే ఇద్దరు స్త్రీలు “నాలో దివ్య తేజస్సును దర్శించినట్లు” చెప్పారు.

**31.8.1998**

సత్యం, ధర్మం ఇవే నా ఊపిరి. నా సత్యాన్వేషణ పూర్తి అయినట్లు స్వామి మానసికంగా తెలియచేశారు. సత్యాన్వేషకులకు మార్గదర్శకురాలిగా నన్ను శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా ఎన్నుకున్నారు. ఇక మీదట సత్యం, ధర్మం,

ప్రేమ, శాంతి నా ఉచ్ఛ్వాస, నిశ్వాసలుగా భావించి, నా గురుదేవులు నాకు ప్రేమతో ప్రసాదించిన ఈ గురుతర బాధ్యతను స్వీకరించి ధర్మ పోరాటంలో నా చివరి శ్వాస విడిచే వరకూ పోరాడి విశ్వచైతన్యంలో కలిసిపోతాను. గురుదేవా! ఈ శుభ సమయంలో నీ ఆశీస్సులు అంతర్వాణి ద్వారా పొందుతున్నాను.

**15.10.1998**

దివ్యస్వప్నం: కలలో స్వామిని చీర ఇవ్వమని అడిగాను. ఇస్తానని అన్నారు. "బాబా... మా అబ్బాయి ఇక్కడే ఉన్నాడు. ఏం చీర తెమ్మంటారో చెప్పండి. మా అబ్బాయి తీసుకు వస్తాడు" అన్నాను. స్వామి ఏమీ మాట్లాడలేదు మళ్ళీ అడిగాను. "అతను తీసుకురావద్దు... నేనే కృష్ణాష్టమికి చీర ఇస్తాను" అని చెప్పి వెళ్ళిపోయారు. స్వామి నాతో మాట్లాడినందుకు చాలా ఆనందపడి అక్కడ ఒక చెట్టు ఉంటే వెళ్ళాను. చెట్టు కింద మూరెడు పొడుగు ఆంజనేయస్వామి విగ్రహం ఉంటే తీసుకున్నాను. బాబా నాతో "దేవుడికి పళ్ళు నైవేద్యం పెట్టావా?" అని అడిగారు. "నువ్వూ నేను ఒకటైనప్పుడు నైవేద్యం ఎవరికి పెట్టాలి?" అన్నాను. ఆ మాటకు స్వామి చాలా సంతోషించి "ఔను! ఇద్దరం ఒకటే" అన్నారు.

**13.11.1998**

దివ్యస్వప్నం: కలలో కంచి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వాములవారు పల్లకీలో ఊరేగుతూ వచ్చారు. ఒక ఇంటి ముందు స్వామి పల్లకీ దిగి వాళ్ళకి పాదనమస్కారం ఇచ్చారు. వాళ్ళు పూలతో పాద పూజ చేశారు. నేను కూడా గన్నేరు చెట్టు నుంచి పూలుకోసి పట్టుకు వెళ్ళాను. స్వామి ఒక గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. నేను స్వామి పాదాల వద్ద పూలు ఉంచాను. స్వామి నన్ను దీవించారు. చాలా వృద్ధులుగా దర్శనం ఇచ్చారు.

కంచి స్వామి జ్ఞానవృద్ధులు. దివి నుండి భువికి దిగి వచ్చిన పరమశివుడు. కలలో కనిపించిన ఈ సుందర కమనీయ దృశ్యం నా జీవితంలో మరపురానిది. నా గురుదేవులు శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా నాకు పెద్ద స్వామి ద్వారా ఆశీస్సులు అందజేశారు. ఇది వ్రాసిన తర్వాత సాయి మాతకు నమస్కరిస్తున్న సమయంలో కంచి కామాక్షి" అమ్మవారుగా దర్శనం యిచ్చారు. ఆనంద భాష్పాలతో అమ్మని అభిషేకించాను.

**24.11.1998**

బాబా నీ పుట్టిన రోజు కానుకగా ఒక సందేశం ఇమ్మని ప్రార్థించాను. దృశ్యంలో 1999 అన్న అంకెలు నేమ్ బోర్డ్ మీద కనిపించాయి. అప్పుడు 1999లో నన్ను తన దగ్గరకి చేర్చుకుంటారని అనిపించింది. (సరిగ్గా నవంబర్ 1999 నుంచి పుట్టపర్తిలో నేను ఇల్లు అద్దెకు తీసుకుని ఉండటం జరిగింది)

**11.12.1998**

దివ్యస్వప్నం: "షిరిడీ సాయి సజీవ దర్శనం ఇస్తారు... షిరిడీ వస్తారా?" అని నన్ను ఎవరో అడిగారు. "షిరిడీ సాయి సత్యసాయి అవతారం కంటే ముందే సమాధి చెందారు. ఇప్పుడు సజీవంగా రావటం ఏమిటి?" అని నేను అంటూ ఉండగానే షిరీడీ సాయి భక్తులతో సజీవ దర్శనం ఇచ్చారు. షిరిడీ వెళ్ళకుండానే!

**1.1.1999**

తెల్లవారు ఝామున నా నుదుటి మీద అగ్నిమంట. ప్రకాశవంతమైన వెలుగు, అందులో నుంచి మెరుపు వచ్చి నుదురు అదిరినట్లు అయింది. ఆ వెలుగులో నుంచి వచ్చిన మెరుపు "శ్రీ లలిత"గా స్వామి తెలియచేశారు.

పేటేరులో మా అక్కయ్య గారి ఇంట్లో ఈ విధంగా అమ్మ సాక్షాత్కారము అయ్యింది. అక్కయ్యగారి ఇంట్లో నాకు లలిత సాక్షాత్కారం అయిన చోట ఆ ఇంటితో సంబంధం ఉన్న పవిత్రమైన ఆత్మలను ఆహ్వానించి అక్కయ్య చేత దివ్యాత్మలకు కర్పూర హారతి ఇప్పించాను. ఇదంతా నా చేత స్వామి చేయించారు. గురుదేవా! ఈ పనులతో నాకు ఎటువంటి సంబంధమూ లేదు. నీ అభీష్ఠం ప్రకారం చేయించావు. నా ఆత్మసాక్షిగా ఇదంతా సత్యం!

నా గురుదేవులు పేటేరు పంపి అక్కడ లలిత సాక్షాత్కారం ఇప్పించాను. అక్కడ అమ్మ దర్శనం విచిత్రంగా ఉన్నది. ఈ జన్మలో నేను ఏ పూజలూ చేయలేదు. సామాన్య గృహిణిని. తపస్సంపన్నులకి కూడా దుర్లభమైన ఈ సాక్షాత్కారం నాకెలా కలిగిందో నా స్వామికే తెలియాలి. అమ్మ దర్శనం చేయించిన నా గురుదేవులకు ఏమివ్వను? ఇద్దరం ఒక్కటే అయిన తర్వాత.

**24.2.1999**

ఉదయం 6 గం॥లకి లేచి వేదనగా పడుకున్నాను.

దృశ్యం: ఒక కాగితం మీద "మాతృమూర్తి" అని ఒకలైను రాసి వున్నది. దీని అర్థం స్వామి తెలియచెయ్యాలి.

**5.3.1999**

మధ్యాహ్నం దృశ్యం: చిన్నికృష్ణుడు కనిపించాడు. రాత్రి కలలో బాలగోపాలుడిని ఎత్తుకుని తిరిగినట్టు కనిపించింది. కిట్టయ్య నవ్వుతూ కేరింతలు కొట్టాడు. పరమాత్మ వద్దకు జీవాత్మ చేరింది.

**9.7.1999**

రాత్రికలలో "విగ్రహంలో నుంచి ఆంజనేయుడు తెల్లని బట్టలతో బ్రాహ్మణుడి రూపంలో వచ్చి నా కుడిచేతిలో తెల్లని, పచ్చని పూలు ఉంచారు.

**26.8.1999**

స్వప్నంలో "ఒకళ్ళు ఈశ్వర స్తోత్రం చదువుతూ చేతులతో "లింగాకారం" చేస్తున్నట్లుగా భావించి బాహ్యపూజ చేస్తున్నారు. అలా కాదు... అంతర్ముఖులై ఆత్మలింగానికి పూజ చేసుకోమని నేను చెప్పాను..."

★ ★ ★

"కృతయుగంలో సత్యదేవుడు, త్రేతాయుగంలో రాముడు, ద్వాపర యుగంలో కృష్ణుడు, ఈ కలియుగంలో షిరిడీబాబా, ఇప్పుడు సత్యసాయిబాబా అన్నీ నేనే" అని స్వామి తెలియచేశారు. ఇది సత్యం. నేను కొన్ని జన్మలుగా ఆరాధిస్తున్న శ్యామసుందరుడే ఈ సాయి సుందరుడు. నా ప్రతి జన్మలో నా సద్గురువు ఈ సత్యసాయిబాబాయే. ఎన్నో జన్మల నాకృష్ణ ప్రేమ ఫలించి నా సాయికన్నయ్య ప్రేమకు దగ్గరయ్యాను.

**27.8.1999**

అమ్మా! ఈ రోజు చాలా వేదనగా ఉంది. నేనెవరో తెలిసీ తెలియనట్లు ప్రవర్తిస్తున్న నీ తీరు భరించలేకపోతున్నాను. పావనమూర్తి అయిన నా తల్లివి. నన్ను క్షమించి త్వరగా పలుకుతల్లీ అమ్మా... గాయత్రీ! నా పంచప్రాణాలూ పంచహారతులుగా నీకు హారతి పడుతున్నాను. అందుకో వెలుగుల తల్లీ! నన్ను నీ వెలుగులో కలుపుకుని బాహ్యంలో ఎందుకు దూరం చేస్తున్నావు? అన్న ప్రకారం నాతో మాట్లాడాలని ఉన్నా నీకు నా కర్మలు అడ్డువస్తున్నాయి. మన

మధ్య ఉన్న అడ్డును తొలగించు. అమ్మా! నువ్వు సత్యం తప్పవు. అలాగే నీ బిడ్డకూడా సత్యం తప్పదు. నా క్షేమం కోరి నువ్వు ఆలస్యం చేసినా నిస్సహాయనై ఏడవటం తప్ప నిన్ను ఎదిరించే శక్తి నాకు లేదు. నీ భక్తురాలిగా పదహారేళ్ళ సాధనను కాదని వేరే జీవితం నాకు వద్దు.

**28.8.1999**

ఉదయం లేస్తూనే సూర్యుని ఎదుట నిలబడి గాయత్రి మంత్రం చదివి కన్నీటితో అర్ఘ్యం ఇచ్చాను. త్రివేణి సంగమంలో కలిసిన అనుభూతి కలిగింది.

**2.9.1999**

ఉదయం స్వామి మందిరంలో దృశ్యాలు... "అగ్ని, జ్యోతి, ఒక అమ్మవారి బంగారు విగ్రహం. స్త్రీ పురుషుల మధ్య స్వామి బంగారు దుస్తులలో దర్శనం ఇచ్చారు". ముందు విగ్రహాన్ని లక్ష్మీదేవి అనుకున్నానను. కాని, తర్వాత శ్రీలలితగా స్వామి తెలియచేశారు. అమ్మపాదాలే అష్టైశ్వర్యాలుగా పదహారేళ్ళు ధ్యానం చేసినందుకు నా గురు దేవులు శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా అష్టైశ్వర్యాలు ప్రసాదించినట్లు తెలియచేశారు. అంటే అష్టలక్ష్ములను నా హృదయంలో ప్రతిష్ట చేశారు. నా తల్లి సాయిమాత నన్ను ఆశీర్వదించే శుభఘడియలు వచ్చాయి. అమ్మా! కన్నీటితో నీపాదాలు కడిగే సమయం ఆసన్నమైంది. అమ్మా! 1984 గురుపూర్ణిమ రోజున నాలో "ప్రేమ బీజం' నాటావు. దానికి భక్తి అనే నీరుపోసి నిన్ను ఆలంబన చేసుకొని ప్రేమ ప్రేమ అంటూ నిన్ను అల్లుకుపోయాను. నీ పర్యవేక్షణలో నా ప్రేమ ఫలించి పుష్పించింది. అమ్మా! ఈ పుష్పం వాడిపోకముందే నీ పాదాలవద్ద ఆశ్రయం ఇవ్వు. అమ్మా! నీ పాదాలు తప్ప ఇంక వేరేదీ ఆశ్రయించి జీవించలేను. అమ్మా! ఒక్కసారినీ పాదాలు నా శిరస్సుమీద సగుణరూపంలో ఉంచమ్మా! ఇంక నిన్ను ఏదీ కోరను.

**4.9.1999**

నిన్నంతా అనుకున్న విధంగా స్వామి చేయలేదని తట్టుకోలేని దుఃఖం వచ్చింది. ఈ దుఃఖం నుంచి విముక్తి చేసి ప్రశాంతత నిమ్మని బాబాను ప్రార్థించాను. ఇల్లు కొనుక్కోవాలో వద్దో తెలియటం లేదు. ఉదయానికి తెలియ చెయ్యమని వేడుకున్నాను. ఉదయం మందిరంలో "ప్రస్తుతం వద్దని" సమాధానం వచ్చింది. ప్రేమస్వరూపుడు, విశ్వప్రేమికుడు సాయి. స్వామి శివశక్తి స్వరూపం. ఎవరో చెపితే తెలిసేదికాదు. ఎవరికి వాళ్ళు సాధనచేసి సాయి తత్త్వాన్ని తెలుసుకోండి. సాయి ప్రదర్శించే విభూతులు కాక సాయిశక్తి యే విభూతి ఆ విభూతిలో ఐక్యం కండి. అమ్మ మన ఆనందంకోసం ఎన్నో ఇస్తుంది. వాటితో తృప్తిపడక అమ్మ ఒడినే కోరండి. ప్రేమమయి అమ్మ ప్రేమలో మునకవేసి సర్వం మరిచి "బ్రాహ్మీస్థితి"లో నిలిచి ఆనందాన్ని పొందండి. రెండు కాని స్థితి "అద్వైతం" మనం కోరుకోవలసినది "అద్వైతాను భూతి".

**8.9.1999**

కల: ఒక నాగుపాము వచ్చింది. వడ్లగంపలో వేశాను. అది పడగవిప్పి జరజర పాకుతూ బయటకు వచ్చి నా శిరస్సు మీద పడగతో ఇష్టం వచ్చినట్లు కాట్లు వేస్తున్నది. నేను భయంతో వణికిపోతున్నాను. తలంతా "షాక్" తిన్నట్లు తిమ్మిరి ఎక్కుతున్నది. దీనికి స్వామి తెలియచేసిన అర్థం – మాయా స్వరూపణి, కుండలినీ శక్తి అమ్మ. సాధనలో ప్రలోభములకు లొంగకుండా ముందుకు సాగే సాధకునికి ఆమె ఆ విధంగా ఆశీస్సులు అందజేస్తుంది.

**9.9.1999**

కల: "నేను ఒక దారివెంట నగ్నంగా శక్తిలాగా వెళుతున్నాను. ఒక తాడు మీద నడుస్తూ తాడును పైకితీశాను. కాని అది తాడులాగాలేదు. పాము

లాగా పొలుసులు పొలుసులుగా ఉన్నది 'తల' లేదు. భయం వేసి వదిలేసి ముందుకు వెళ్ళాను. నేను చాలా శక్తివంతంగా కాళికాదేవిలాగా ఉన్నాను. అలా వెళ్ళి ఒక గర్భగుడిలో ప్రవేశించాను. అక్కడ మబ్బురంగులో, కనుముక్కు తీరుతో ఉన్న అమ్మవారు ఉన్నది దివ్య తేజస్సుతో అమ్మ దర్శనం ఇచ్చింది. ఆ దేవత శ్రీలలిత. అమ్మ నాతో "నువ్వు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తానని" చెప్పి వంగి నానుదుటన సింధూరం బొట్టు పెట్టింది.

**15.9.1999**

వినాయక నిమజ్జనం రోజు నాకు కలిగిన అనుభూతి:-

"సాయీశ్వరునిలో విభూతి సౌందర్యం. అమ్మ పార్వతి (సాయిమాత0లో పుత్ర వాత్సల్యంతో కూడిన ఆనందహేల. తమ పుత్రుడు విశ్వానికే ఆధారభూతుడై భక్తులకు బుద్ధిని సిద్ధిని ప్రసాదించి భక్తుల కోరికలు తీరుస్తున్న తమ ముద్దు గణపతిని చూస్తూ శివశక్తి స్వరూపమైన సాయిమాత కోటి సూర్యుల ప్రకాశంతో బొజ్జగణపతికి హారతి పట్టి, కొబ్బరికాయలు కొడుతుంటే సాయి ముఖంలో ఆనందం వర్ణించేటందుకు మాటలు చాలవు. పుత్రులు జన్మించగానే సరికాదు. బిడ్డలు శీలవంతులై ఆత్మవిశ్వాసంతో పదిమందికీ మార్గదర్శకులై కీర్తి తెచ్చిన నాడే తల్లిదండ్రులకువీ నిజమైన ఆనందం. ప్రతిబిడ్డ గణపతిలాగా తల్లిదండ్రులను పూజించి సాయిమాత ప్రేమను పొందాలి. సాయి జగన్మాతని బుద్ధిని ప్రసాదించమని ప్రార్థించండి. అమ్మ ఆశీస్సులు పొందండి.

**16.9.1999**

దృశ్యం:- "షిరిడీ బాబా ఫొటోలో నుంచి కోదండరాముడు బైటికి వస్తున్నట్లు" కనిపించింది.

షిరిడీ బాబా ధర్మసంస్థాపనకు సూచనగా నాకు రామదర్శనం ప్రసాదించారు.

ఉదయం స్వామి ఎవరో సేవాదళ్‌కి ఉంగరం సృష్టించి ఇచ్చారు. అప్పుడు నాకు కలిగిన అనుభూతి...

"స్వామీ! నాకు జ్ఞాన మణిని ప్రసాదించు! ఉంగరం అయితే ఎవరికీ పంచలేను. జ్ఞానమైతే అడిగినవారందరికీ లేదనకుండా పంచవచ్చు. "అని చాలా ప్రార్థించి జ్ఞానస్థితిని కలుగ చేయమని అడిగాను. భజనసమయంలో దృశ్యంలో ఒక పుష్పం నా ఒడిలో పడినట్లు అయ్యింది. సాయి అనుగ్రహించి ధ్యానపుష్పం ప్రసాదించారని అనుకున్నాను. ఇంటికి వచ్చాక స్వామి అది "ధ్యానపుష్పం కాదు జ్ఞానపుష్పం అని తెలియచేశారు. జ్ఞానమణిని అడిగావు కదా... అదే ప్రసాదించాను" అని మానసికంగా తెలియచేశారు. తర్వాత భోజనం చెయ్యటానికి వెళుతుంటే ఆకాశం వైపుకు చూడమన్నట్లు అయింది. వెంటనే ఆకాశం వైపు చూశాను. ఆకాశం కృష్ణవర్ణంతో ఉన్నది. అదృశ్యాన్ని ఆనందంతో చూస్తున్న నాకు గురుదేవులు ఇలా తెలియచేశారు.

"జ్ఞాని చూసేది సర్వత్ర నిండిన చైతన్యాన్ని. రూపంలేని ఆ నీల మేఘాన్ని నేనే" అని అన్నారు. వెంటనే నా హృదయం దూదిపింజ కంటే తేలికై నీలమేఘశ్యామునిలో కలిసి పోయింది. ఈ దివ్యానుభూతి శాశ్వతమైనది.

★ ★ ★

విశ్వకళ్యాణానికి వేదిక సిద్ధమైంది. జీవాత్మ, పరమాత్మ కళ్యాణానికి జగన్మాతతోపాటు ముక్కోటి దేవతలు సిద్ధంగా ఉన్నారు. తన బిడ్డను హృదయానికి హత్తుకోవటానికి ప్రకృతి మాత పులకించి పోతున్నది. సూర్యచంద్రులు హారతి పట్టటానికి ఉత్సాహపడుతున్నారు. నా తండ్రి షిరిడీ బాబా, నా తల్లి సాయిమాత

దివ్యాశీస్సులు అందచేయటానికి శుభ ఘడియకోసం నిరీక్షిస్తున్నారు. జీవాత్మ, పరమాత్మల కళ్యాణం జగతికే ఆదర్శం!!

★ ★ ★

రాధామాధవుల ప్రేమ జీవులకు ఆధారం, ఆనందం. వారి ప్రేమ దేహ భావం లేనిది. ఓ నేత్రము లారా! కన్నయ్య కోసం బాహ్యంలో వెతికి వెతికి అలిసిపోయారు. గురువు అనుగ్రహంతో నా మనోనేత్రం తెరుచుకుంది. మాధవుడిని చూశాను. ఓ నేత్రములారా! సత్యాన్వేషణలో చాలా అలిసిపోయారు. ఇక బాహ్యంలో వెతికేది ఏదీ లేదు. విశ్రాంతి తీసుకోండి!

★ ★ ★

**19.9.1999**

కల: "ఒకతను పాముని రెండు చేతులతో అడ్డంగా పట్టుకుని తీసుకు వచ్చి నన్ను దీవించమన్నాడు. నాకు అంత శక్తి లేదంటూనే పాముని సాయిరాం.. సాయిరాం అంటూ దాని తల నుండి తోక దాకా నిమురుతూ దీవించాను. అక్కడి వాళ్ళు ఆమెకు శక్తి ఉందని అన్నారు. అక్కడ కొన్ని నల్లని తలకాయలు, కొన్ని రక్తంతో ఉన్నవి ఉన్నాయి. వాటిని కూడా దీవించమన్నారు. దీనికి అర్థం "మాయా, తామనశక్తులు దైవీ శక్తి ముందు తల వంచాయని స్వామి తెలియచేశారు.

దృశ్యం: నలుపు, ఎరుపు, తెలుపు చుట్టూ ఉండి మధ్యలో కాంతి పుంజం.

అర్థం: మూడు గుణాలు దాటిన తర్వాత కనిపించేదే చైతన్యం... అదే వెలుగు.

**23.9.1999**

ఉదయం మందిరంలో భజన సమయంలో స్వామీ! నీ పాదాలు కనిపించాలి" అని అనుకున్నాను. వెంటనే దృశ్యంలో 'దేవాలయ శిఖరం' కనిపించింది. బాబా మానసికంగా ఇలా తెలియచేశారు.

"ఇంకా పాదం ఏమిటి? పాదం పట్టుకుని శిఖరం చేరావు.

**27.9.1999**

"బాబా! నేను అన్ని తీర్థాలు, అన్ని క్షేత్రాలు కాలినడకతో దర్శించి వస్తే మాట్లాడతావా?" అని మనసులో అనుకున్నాను. అప్పుడు స్వామి హృదయ భాషలో "అంతర్ముఖురాలివై నన్ను దర్శించావు. విశ్వరూపంగా కూడా నన్ను దర్శిస్తున్న నీకు ఇవేమీ అక్కర్లేదు. సమయం వచ్చినప్పుడు నేనే మాట్లాడుతాను" అన్నారు.

"యోగాగ్నిలో సర్వకర్మలూ దగ్ధమైనాయి. నేనే చిచ్ఛక్తిని. చావు పుట్టుకలు లేని దానిని. సర్వ వ్యాపిని. నేను లేని చోటు లేదు. అంతా నిండిన వెలుగుని. శివశక్తిని. ఉన్నది ఒక్కటే. రెండు కాని అద్వైత స్థితి. "జగద్గురువు శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా నా హృదయనివాసి అయి, ఆత్మబోధ చేసి, సర్వం ఖల్విదంబ్రహ్మ అని తెలియచేసిన నా గురు దేవుని పాదాలను నా కన్నీటితో కడిగే వరకూ నాకు శాంతి లేదు. అష్టైశ్వర్యాలు, ముక్తి నాకు వద్దు. సాయి మాత పాదమే నాకు సమస్తము. గురువు ఆశీస్సులు లేనిదే పర్తి నుంచి వెళ్ళను. ఎవ్వరికీ పనికిరాని నన్ను చేరదీసి, సరిచేసి అష్టైశ్వర్యాలను ప్రసాదించారు. ఇవి నా కోసం కాదు. నిస్వార్థ బుద్ధితో అందరికీ పంచుతాను.

సత్య... సత్యం... సత్యం..!

**5.10.1999**

సాయంత్రం 6.30 గం॥లకు వాకిట్లో పెద్ద వెలుగు కనిపించింది. అదేమిటో చూద్దామని బయటకి వెళ్ళేసరికి ఆకాశం ఒక పక్క అంతా బంగారు రంగుతో కనిపించింది. వెంటనే మేడ మీదికి వెళ్ళి చూస్తే రెండు ఇంద్రధనుస్సులు చాలా స్పష్టంగా కనిపించాయి. అప్పుడే ఒక పుస్తకంలో సూర్యమండలం కూడా పరమాత్మ స్వరూపమేనని చదివాను. వెంటనే ఆ పై దృశ్యం చూడటం అద్భుతం అనిపించింది. హరివిల్లు కూడా భగవంతుడే కదా! ఇంట్లో ఉన్న దానిని బయటకు పిలిచి సాయి ఈ దృశ్యం చూపించారు. పూర్ణయోగం సిద్ధించిన రోజే ఇంద్రధనుసు చూడటం శుభ సూచకం అనిపించింది. సాయిలీలలు వర్ణించటం మనకు సాధ్యమా!

**8.10.1999**

మందిరంలో నా పాదాలు, అందరి పాదాలు, స్వామి పాదాలు ఒక్కటిగానే కనిపించాయి. అది అద్వైతానుభూతి.

**11.10.1999**

రాత్రి 11 గం॥లకి నా శరీరం ముడుచుకొని పాదం బొటన వేలు నుంచి శిరస్సు వరకు జలదరించినట్లు అయింది. పాదం నుంచి శిరస్సు వరకు ఏదో పాకినట్లై శరీరమంతా కంపించింది.

**15.10.1999**

ఉదయం పూర్ణ చంద్ర ఆడిటోరియంలో యజ్ఞం జరుగుతున్నది. సాయి మాత కుర్చీలో కూర్చున్నది.

అమ్మా! సాయి మాతా! 1984 గురుపూర్ణిమ రోజున ఇదే చోట ఏమీ తెలియని అజ్ఞానిని అయిన నాకు కుండలినీ యోగాన్ని ప్రసాదించి, నాలో జ్ఞానాగ్నిని రగిల్చి, సమస్త కర్మలు దగ్ధం చేసి జీవశక్తిని దివ్యశక్తిగా మార్చి నీ అఖండ జ్యోతిని దర్శింప చేశావు. ఈ జ్ఞానయజ్ఞంలో నాలో ప్రేమామృతం సిద్ధించింది. ఈ యోగం ద్వారా అంతర్మథనంలో వచ్చిన అష్టైశ్వర్యాలతోపాటు అమృతం కూడా యజ్ఞ ఫలదాతవైన నీకే అర్పించాను. అవి నీ వద్ద ఉంటేనే వాటికి విలువ. నాకు మాత్రం నీ పాదాలు చాలు!"

**26.11.1999**

మాధవా! నా హృదయాన్ని ప్రేమ జల్లుతో తడిపి మలినం లేని మనసుకు పూచిన మల్లెలు పరిచాను. సంధ్య చీకట్లు ముసిరినాయి. మల్లెలు విచ్చుకుని పరిమళాలు వెదజల్లుతున్నాయి. నా మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేస్తున్నది. మహనీయుల సత్యవాక్కులనే తేనెతో మాగిన నా హృదయఫలం నీ విందుకై సిద్ధంగా ఉన్నది. ఉపనిషత్సారంతో నిండిన నా వాక్సుధ నిన్ను స్తుతించటానికి తొందరపడుతున్నది. నా మనసు హృదయ సాగరం అట్టడుగు లోతులకు వెళ్ళి ఏరి కూర్చి తెచ్చిన జ్ఞాన మణుల హారం నీ మెడని అలంకరించాలని నా చేతులు ఉబలాటపడుతున్నాయి. నా వెలుగుల రేడు, నా చల్లని కన్నయ్య ఎప్పుడెప్పుడు వస్తాడా అని నా కళ్ళు ఆత్రుతగా ఎదురు చూస్తున్నాయి. నా వెన్న దొంగ ఎటువైపు నుంచి వస్తాడోనని నా కాళ్ళు అటూ ఇటూ పరుగులు పెడుతున్నాయి. జ్ఞానజ్యోతి వెలుగులో నా ప్రేమ మూర్తిని చూడటానికి నా తనువు కర్పూరంలా కరిగి పోతున్నది. ఇక జాగు చేయక నీ మురళీగానంతో నన్ను మైమరపించి నా ఒడిని చేరు శ్యామసుందరా!

**27.11.1999**

దృశ్యం: "జంతికలు" కనిపించాయి!

స్వామి తెలియచేసిన అర్థం:

జ – అంటే జగద్గురువు

ం – అంటే పూర్ణ పురుషుడు

తి – అంటే త్రికాలజ్ఞుడు

క – అంటే కలియుగ అవతారం.

శ్రీచక్రవాసిని సాయి మాతని గురు స్వరూపిణిగా ధ్యానించి జనన మరణ చక్రంలో మళ్ళీ మళ్ళీ పడి జన్మించక మృత్యువును జయించి అమృతత్వాన్ని పొందాలి.

సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను మనం ఆచరించినపుడు స్వామికి అదే పంచామృత స్నానం, ధర్మాచరణే వెలుగు.

ధర్మం నశించి అధర్మం పెరుగుతున్న ఈ కలియుగంలో ఎంతోమంది మహానీయుల త్యాగ ఫలంగా ధర్మదేవత సాయి మాతగా ఆవిర్భవించి ధర్మాన్ని కాపాడుతున్నది. ధర్మదేవతకి స్వాగతం – సుస్వాగతం! యువతీ యువకులారా! ధర్మ రక్షణే జీవితాశయంగా కంకణం కట్టుకుని తరలిరండి! సాయి మాత ఆశీస్సులు పొందండి!

**1.12.1999**

అమ్మా! ఈ తురీయానంద స్థితిలో ఉండి ఎవ్వరికీ పనికిరాక నేను సాధించేది ఏమిటి? పది మందికీ పనికిరాని ఈ శరీర భారాన్ని మోయలేక

పోతున్నాను. కలియుగంలో ధర్మం కాపాడటానికి అవతారం ఎత్తి నువ్వే మా మధ్య తిరుగుతూ శ్రమ పడుతున్నావు. ముక్తి అంటూ నీ భక్తులు స్వార్థ జీవితం గడపలేరు. సాధన అంటూ ఇంకా ఇలా ఎంత కాలం! ఏ సేవా లేకుండా ఎలా ఉండను? త్వరగా పలుకు తల్లీ! సేవను ప్రసాదించమని ప్రేమతో అమ్మని అర్థిస్తున్నాను.

**11.12.1999**

ఉదయం దర్శనంలో స్వామి దూరంగా ఉన్నా ఎంతో సన్నిహితంగా ఉన్నట్లు అనిపించింది. "అమ్మతో తిరునాళ్ళకి వెళ్ళిన బిడ్డకి అక్కడ ఏదో ఒక వస్తువు మాత్రం ఆకర్షిస్తుంది. అమ్మ కొంగు పట్టుకుని వాడు అదే కావాలని మారాం చేస్తాడు. ఇంక ఏ వస్తువు ఇచ్చినా తృప్తి పడడు. చివరికి తల్లిని వేధించి కోరుకున్న వస్తువును పొందుతాడు. అదే విధంగా అమ్మా... సాయి మాతా! ఈ ప్రపంచంలో ఏది కావాలన్నా కొనుక్కోగల ధనం ఇచ్చావు. కానీ, నువ్వు తప్ప ఈ ప్రపంచంలో ఏదీ నన్ను ఆకర్షించటం లేదు. అందుకే నీ కొంగు పట్టుకుని తిరుగుతున్నాను. నిన్ను పొందనిదే ఇక్కడి నుంచి కదలను. ఇంకా నాలో అజ్ఞానం మిగిలి ఉంటే జ్ఞానాగ్నిలో దగ్ధం చెయ్యి. కానీ నాకు దూరం కాకు. మా అమ్మ బంగారు తల్లి! ఈ బిడ్డ కోరిక తీరుస్తుంది!

**15.12.1999**

మధ్యాహ్నం పడుకుని "గురుదేవా, నామిని చూస్తూ నామం, నామం చేస్తూ నామిని చూస్తూ ఏకాగ్రతతో జపం చెయ్యలేక పోతున్నాను. జపం చెయ్యాలని మనసుకు రావటం లేదు. కాని, ఏది చూస్తున్నా నువ్వుగానే కనిపిస్తున్నావని" అనుకున్నాను. వెంటనే ఒక దృశ్యం కనిపించింది". రెండు ఏనుగులు ఒక దానికి ఎదురుగా ఒకటి నిలబడి జపమాలలు ధరించి ఉన్నాయి".

ఈ దృశ్యానికి అర్థం తెలియలేదు. కానీ, సాయంత్రం మందిరంలో మానసికంగా ఇలా తెలియచేశారు. "గజ తెలివి తేటలతో నీ మనసుని నిగ్రహించి సత్యస్వరూపాన్ని తెలుసుకున్నావు. కాబట్టి, జపమాలతో, జపంతో నీకు అవసరం లేదు."

**26.12.1999**

విశ్వమంతా "శివలింగం"గా నేను తప్ప మరెవ్వరూ లేరన్న అనుభూతి కలిగింది.

**4.1.2000**

నా శరీరం ఒక్కసారిగా "జర్కు" ఇచ్చి ముదుచుకుని తిరిగి మాములుగా అయ్యింది. అది వరకు కూడా చాలాసార్లు ఇలా అయ్యింది. కానీ, ఈసారి "(ఓంకారం)" లాగా ముదుచుకున్న భావన కలిగింది.

**6.1.2000**

ఉదయం దర్శనానికి వెళ్ళాలని అనిపించలేదు. కాని, సాయి సంకల్పంతో వెళ్ళాను. మొదటి లైను వచ్చింది. స్వామి చూసీచూడనట్లు వెళ్ళిపోయారు. కానీ, స్వామి కళ్ళు నన్ను వెంటాడుతున్నట్లు అనుభూతి కలిగింది. ఇంటికి వస్తూ కనకాంబరాలు, బంతిపూలు తీసుకు వచ్చాను. స్వామి "పాయసం" చెయ్యమన్నట్లు అనిపించింది. గిన్నెకు పసుపు పూసి, కళ్యాణం బొట్టు పెట్టి పాయసం చేసి అమ్మా! విశ్వకళ్యాణానికి నా వంతు సేవ చేయించుకోమని ప్రార్థించాను.

అమ్మా! పదకొండు గంటల లోపు ఏ రూపంలో వచ్చి ప్రసాదం స్వీకరిస్తావోనని పుస్తకం చదువుతూ కూర్చున్నాను. అలాగే గం॥ 10.45

ని॥లకి "పండ్లు" అమ్మే అమ్మాయి వచ్చి పిలిచింది. పెద్ద బొట్టు పెట్టుకున్నది. స్వామి ఆ రూపంలో వచ్చారని వెంటనే ఆమెకు ప్రసాదం పెట్టి మనసులో సాయి మాతకి నమస్కరించుకున్నాను. ఆమె ప్రసాదం తింటూ "అంతా పెట్టకు.. ఇంకా పది మంది తినాలి కదా" అన్నది. ఎప్పుడూ పది మందికి పెట్టాలని అనుకుంటాను కదా! అందుకే స్వామి అలా పది మంది అని దీవించారని అనిపించింది. "స్వామి ఏ రూపంలోనైనా రావచ్చు". ఈ విధంగా స్వామి ఈ రూపంలో వచ్చి ప్రసాదం తిని నన్ను ఆశీర్వదించి వెళ్ళారు. ఉదయం నుంచి ఇదంతా సాయి ప్రేరణతో జరిగింది. నేను ఈ రోజు అమావాస్య అనుకున్నాను. కానీ, ఈరోజు మార్గశిర లక్ష్మివారం అని తెలిసింది. ఏమీ తెలియని నా చేత సాయి మాత మార్గశిర లక్ష్మివారంనాడు తన సంకల్పంతో ఈ విధంగా చేయించింది. ఎప్పుడూ, ఏ కోరికతో పూజలు చేయని నా చేత అవసరం అయినప్పుడు అమ్మ స్వయంగా చేయించుకుంటుంది. దాని ఫలితం అమ్మకే, నాకు అమ్మ పాదాలు చాలు. అమ్మా! అన్నీ చేస్తావు. కానీ నేను ఎవరో తెలియనట్లు నా ముందు నుంచి వెళ్ళిపోతావు. ఇంకా ఎన్నాళ్ళీ దాగుడు మూతలు? ఇంక భరించే శక్తి నాకు లేదమ్మా! నా తప్పులు క్షమించి నన్ను పలుకరించు!

**10.1.2000**

రాత్రి 9 గం॥కి దృశ్యం. "ధనుర్బాణాలు ధరించి తల మీద శిఖలతో ఇద్దరు మనుష్యులు కనిపించారు. వాళ్ళు కోయదొరలని అనుకున్నాను. కానీ, వెంటనే నా గురుదేవులు "రామలక్ష్మణులు"గా తెలియచేశారు. నా ఆనందానికి అంతులేదు.

**8.2.2000**

ఉదయం మందిరంలో దృశ్యం "బాబా కుంకుమ రంగు అంగీతో

దర్శనం ఇచ్చారు. తర్వాత ఒక చక్రం తిరుగుతుంటే ఒక బాణం వచ్చి తిరుగుతున్న చక్రాన్ని ఆపి వేసింది. అది సాయి మాత వైపు నుంచి వచ్చినట్లు అనిపించింది. "తర్వాత నా గురుదేవులు ఇలా తెలియచేశారు. "నా కర్మలను తొలగించి, నన్ను జననమరణ చక్రం నుంచి తప్పించి ముక్తిని ప్రసాదించినట్లు" అనుభూతిని కలిగించారు.

**22.2.2000**

గురుదేవా! నేను అందరికంటే గొప్పగా ఉండి కీర్తి తెచ్చుకోవాలని కాదు. ఏదైనా సేవ ప్రసాదించు. పేద గొప్ప అనే బేధం లేకుండా అందరితో కలిసి అతి సామాన్యమైన జీవితం గడపాలన్నదే నా ఆశయం. మణికి కలలో "నాకు కర్మఫలం అడ్డు వచ్చిందని" చెప్పావుట. ఈ కర్మ వలన నీకు భౌతికంగా దూరం అయి ఎంత నలిగి పోతున్నానో నీకు తెలియనిది కాదు. నీకు తప్ప ఎవరికి చెప్పుకోను? సాధన చివరిలో స్వచ్ఛమైన పాలలో చిన్న నలుసులా అడ్డు వచ్చిన ఈ కర్మని తొలగించమని ప్రార్థించటం తప్ప ఏమీ చేయలేని స్థితి! నా హృదయ కమలం నీ అనుగ్రహ వీక్షణాలతో వికసించి నీ పాదాల వద్ద చేరే సమయంలో ఈ కర్మని తొలగించి. నన్ను ధన్యురాలిని చెయ్యి ప్రభూ! జ్ఞానగంగలో పునీతమైన నన్ను ఈ కర్మ ఏమీ చెయ్యదన్న విశ్వాసంతో ఉన్నాను. నీ భక్తుల కంఠం వరకూ కూరుకుపోయిన కర్మలని కూడా తొలగిస్తానన్న నువ్వు ఈ చిన్న కర్మ తొలగించలేవా? తొందరగా తొలగించి నా దరి చేదు కృష్ణా!

**4.3.2000**

మందిరంలో అందరి శిరస్సులూ శివలింగాలుగా కనిపించాయి.

**6.3.2000**

మందిరంలో అందరి శిరస్సులూ సహస్రార కమలం లాగా అందులో శ్రీ లలిత సాయిమాతగా కనిపించింది.

**9.7.2000**

దివ్యస్వప్నం: "స్వామి కలలో కిటికీ వద్ద కూర్చుని ఉన్నారు. నేను వెళ్ళి నా సంగతి ఏమిటి చెప్పండి? అన్నాను. "ప్రారబ్ధం" ఉన్నది అన్నారు."

**29.7.2000**

దివ్యస్వప్నం: "అందమైన స్త్రీ ఆభరణాలు ధరించి, అందంగా అలంకరించిన రథం నుండి దిగుతున్నది. రోడ్డు పక్కన ఒక ఆవు పడుకున్నది. దాని చెవిలో ఎవరో నీళ్ళు పోస్తున్నారు. పక్కన ఉన్న వాళ్ళు బ్రహ్మరంధ్రంలో పడేటట్లు నీళ్ళు పొయ్యండి అంటున్నారు".

**3.8.2000**

పులిహోర, పాయసం, పులగం ప్రసాదం చేసి అమ్మని తలుచుకుని తిన్నాను.

29.7.2000న వచ్చిన కల ద్వారా బ్రహ్మరంధ్రంలోనికి శక్తి ప్రవేశించిన అనుభూతి కలిగింది. మధ్యాహ్నం భోజనం చేసే ముందు పైలోకాలలో ఉన్న నా పితృదేవతలందరికీ, ఈ విశ్వం అంతా నిండిన ప్రతి జీవికీ, నేను తిన్న ఆహారం అందినట్లు భావన కలిగి నా ద్వారా పితృదేవతలు తరించారన్న ఆనందంతో కూడిన దుఃఖంతో తృప్తిగా భోజనం చేశాను. నాలోని ముక్కోటి దేవతలు ఈ పవిత్రమైన ఆహారాన్ని సంతోషంగా స్వీకరించారు. నా ప్రాణశక్తి

అగ్నితత్వం నుంచి వాయుతత్వంలో ప్రవేశించి, ఆకాశంలో కలిసి పోయినట్లు, శబ్దం నేను అయినట్లు, శబ్ద తరంగాలు విశ్వమంతా వ్యాపించి ఓంకారము అయినట్లు, ఆ ఓంకారమే నేనైనట్లు అనుభూతి కలిగింది. ఇలా జరగటానికి రెండు రోజుల ముందు ఉదయం మందిరంలో స్వామి దర్శనం తర్వాత ఇలా అనిపించింది... కుమ్మరి మట్టితో కుండని చేసి చక్కగా కాల్చిన తర్వాత ఆ కుండ మీద చిటికె వేస్తే చక్కని శబ్దం వస్తుంది. అలాగే నా మనస్సు జ్ఞానాగ్నిలో దగ్ధం అయినట్లు, నేను ఓంకార శబ్దంగా మారినట్లు అనుభూతి కలిగింది.

**7.8.2000**

క్రిందటి సం॥ అక్టోబరులో కలలో కనిపించి అమ్మ బొట్టు పెట్టి నువ్వు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వస్తానని అన్నది. కాని, నేనే "అమ్మా! నీవు రావాలి అన్నప్పుడు రా. నేను పిలవను అన్నాను. కానీ, ఈరోజు ఉదయం నుంచి అమ్మా! బ్రహ్మరంధ్రంలో శక్తి ప్రవేశించింది. కాబట్టి నువ్వు నా వద్దకి రా" అని ప్రార్థించాను. సాధన పూర్తి అయింది. గురు స్వరూపిణి, శివశక్తి స్వరూపం, సహస్రార కమలంలోని శ్రీ లలిత అన్నీ నా సత్యసాయి బాబాయే. 16 సం॥ నేరుగా పలకరించకుండానే కలల ద్వారా ఈ యోగ మార్గాన నడిపించారు. ఇన్ని సం॥లు యోగ భ్రష్టురాలిని కాకుండా నాకు ఎంతో సహనం, శాంతం, ఓర్పు, శక్తిని ఇచ్చి అమృతత్వాన్ని ప్రసాదించిన నా గురుస్వరూపిణి కుండలినీ మాతకి నన్ను నేను అర్పించుకోవటం తప్ప ఏమున్నది? పరిపూర్ణ యోగం సిద్ధించింది. జై గురు దేవ!

శాంతి... శాంతి... శాంతిః

**10.8.2000**

సాధకుడు గురు స్వరూపణి 'అమ్మ' అనుగ్రహంతో నవావరణలు దాటి బ్రహ్మరంధ్రంలో అమ్మ సాయి మాతతో ఆత్మ స్నానం చేస్తూ, సహస్రార కమలంలోని అమ్మని దర్శిస్తూ, అన్నిటిలోనూ కూడా అమ్మను దర్శిస్తూ తన్మయత్వంతో సుందర చైతన్యంలో కలిసిపోయాడు. సాధకా.. ధన్యజీవివి!

"స్వామీ! మొదటి నుంచి శ్రావణ శుక్రవారం కలశం పెట్టి పూజ చేయటం అలవాటు లేదు. కానీ, నీ అనుగ్రహంతో సహస్రార కమలంలోని బిందుస్థానం అమ్మ అని తెలుసుకున్నాను. ఈ శ్రావణ శుక్రవారం సహస్రార కమలం కలశంగా, దానిలోని బిందువును అమ్మగా మానసిక పూజ చెయ్యనా?" అని అమ్మని అడిగాను. స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు... "సహస్రారంలో అమ్మని దర్శించిన సాధకునికి ఏ పూజలూ లేవు... బ్రహ్మానందంలో ఉండటమే."

**14.8.2000**

మధ్యాహ్నం 'పరమ' అనే మాట వినిపించింది. ఆ మాటకి అర్థం తెలియలేదు. లలితా సహస్రనామం పుస్తకం తీస్తే అందులో "అమ్మ చిచ్ఛక్తి. ఎప్పుడూ ఆనందంగా ఉండేది. ఉత్కృష్టమైన పరమానందం శ్రీ లలిత అని ఉన్నది. స్వామి హృదయ భాషలో ఇలా తెలియ చేశారు. "దుఃఖించకు! నీకు దేనిలోనూ ఆనందం లేదు. ఎల్లప్పుడూ ఉండే పరమానంద స్థితిని కలుగ చేస్తాను".

'పరమ' అన్న మాట స్పష్టంగా వినపడింది. భక్తుడు పరమభక్తిలో భగవంతుని ఎడబాసి ఉండలేడు. దూరం అయి జీవించలేడు. ఏ క్షణంలో

కనుమరుగయి పోతాడోనన్న భయం. అదే పరమ భక్తి. అందుకే పరమాత్మ కోసం అంతదుఃఖం, భగవంతుని మీద పరమ ప్రేమ కలిగి ఉండాలి.

16.8.2000

ఉదయం మందిరంలో నా హృదయమంతా మాతృ వాత్సల్యంతో నిండిపోయింది. నా ఒడిలోకి ఈశ్వర శక్తి, బ్రహ్మశక్తి, విష్ణుశక్తి మూడు శక్తులు కలిసి "బాబు" రూపంలో వచ్చి చేరాయి. నా గురుదేవులు అది 'దత్త దర్శనం'గా తెలియచేశారు. ఈ సృష్టిలోని ప్రతిదీ నా బిడ్డగానే కనిపించింది. చివరికి స్వామి కూడా నా బిడ్డగానే గోచరించారు. నా హృదయమంతా ప్రేమతో నిండి పోయింది. కృష్ణా! ఇన్నాళ్ళూ నిన్ను ఏదో ఒకటి అడుగుతున్నాను. కాని, ఈ రోజు ఏదీ అడగాలని అనిపించటం లేదు. నీ తల్లిగా నా అణువణువూ నీ మీద ప్రేమ వాత్సల్యంతో నిండిపోయింది. ఈ సృష్టికంతటికీ నేనే అమ్మని అని అద్వైత స్థితిలో ఉన్న నాతో "ఈరోజు నుంచీ నీకు మాతృస్థానాన్ని ఇస్తున్నాను. పూర్ణ స్వరూపమే అమ్మ. అది నువ్వే" అని స్వామి తెలియచేశారు. ఆ స్థానం పొందిన నేను "ధన్యజీవిని".

24.2.1999న కనిపించిన "మాతృమూర్తి" అన్న పదానికి స్వామి పైవిధంగా అర్థం తెలియచేశారు.

**19.8.2000**

ఉదయం మందిరంలో "స్వామీ! ఈ రోజు ఏ అనుభూతులూ లేవు" అని మందిరం వైపు చూస్తుంటే ఒక పావురం ప్రశాంతంగా కూర్చుని కనిపించింది. "ఏ ఆలోచనా పెట్టుకోక పావురంలా ప్రశాంతంగా ఉండమని" స్వామి తెలియచేశారు.

ఇంటికి వచ్చి గిన్నెలు కడుగుతూ, ఇల్లు తుడుస్తూ గచ్చు కడిగి శుభ్రం చేస్తూ ఎన్నేళ్ళు గానో మిమ్మల్ని ఎంతో శుభ్రం చేశాను. మీలోనూ ఆత్మ చైతన్యం ఉన్నది. నా బాధ అమ్మకి తెలియ చెయ్యండి అని ఏడ్చాను. "ముక్కోటి దేవతలారా! రాయి, రప్ప, చెట్టు, పుట్ట, ప్రతీ అణువుకీ నాబాధచెప్పి, మీరంతా విశ్వంలోని ప్రతి అణువుకీనాబాధ చెప్పి, మీరంతా సాయిమాతకి నాతో మాట్లాడమని చెప్పండి" అని నా అణువణువూ కదిలేలా ఏడ్చాను. అమ్మా! ఇంక మందిరానికి రావాలని లేదు. నువ్వు నాలోనే ఉన్నావని ఏడుస్తూ మధ్యాహ్నం పడుకున్నాను. నాశరీరమంతా కంపించి, భూమి అంతా కదిలినట్లు కుప్పలా అయి జర్రున పాకినట్లు అయింది. భూకంపం వచ్చి భూమిని కదిల్చినట్లు నాలోనే భూమి కంపించి నన్ను కదిల్చినట్లు అయింది. వెంటనే మెలకువ వచ్చింది. ఆ కంపనకి తట్టుకోలేక పోయాను అమ్మే తట్టుకునే శక్తిని ఇచ్చి కాపాడింది. అమ్మకోసం ఏడ్చిన ఏడుపుకి తట్టుకోలేక నా తపస్సుకి భూమాత కంపించింది. పృధ్వీతత్వం నాలోనే ఉన్నది కాబట్టి ఆ కంపన నాలోనే జరిగింది. అమ్మ కుండలిని తన బిడ్డ వేదన చూడలేక తాను కూడా బాధతో కంపించి నా ప్రేమకి పులకించి పోయింది. త్వరలో నా వద్దకి వచ్చి నా ప్రేమకి పొంగి పరవశించిపోతుంది.

**24.8.2000**

దృశ్యం : "స్వామినిల్చుని ఉన్నారు. నేను హారతి పడితే ఆ వెలుగు పెద్దదై ఎర్రని మంటలా స్వామిలో కలిసిపోయింది" ఆ వెలుగు "నేనే" నన్న అనుభూతి కలిగింది. ఒక పురుషుడు ఎత్తు ప్రదేశంలో ఉన్న నా వద్దకి వచ్చి నాలో ఐక్యమై, నాలో అతీతమైన ఆనందం కలుగచేశాడు. ఆ పురుషుడే నా ఆరాధ్యదైవం "శ్రీ సత్యసాయి బాబా".

**25.8.2000**

రాత్రి చాలా వేదనగా పడుకుని "స్వామీ! నా వేదన వింటున్నావా? ... లేదా?" అని బాధపడ్డాను. వెంటనే దృశ్యంలో ఒక ఏనుగు చెవులు ఆడిస్తూ" కనిపించింది. ఇదేమిటి? అనుకున్నాను. వెంటనే గురుదేవులు ఇలా తెలియచేశారు ..." నేను నీ వేదన వింటున్నానా ... లేదా! అని అనుకున్నావు కదా! ... అందుకే "వింటున్నాను" అని ఆ రూపంలో చెవులు ఆడించాను.

ముందురోజు సాయంత్రం ఒక ఆమెకు "లక్ష్మీదేవి" ఉన్న లాకెట్టుతో గొలుసు సృష్టించి మెడలో వేశారు. "స్వామీ! నేను ఎలాటి లాకెట్టుతో గొలుసు చేయించుకోవాలని అనుకున్నానో సరిగ్గా అలాటి గొలుసునే ఇచ్చావు. నన్నేమో చేయించుకోవద్దు అన్నావు. నిన్నే సర్వస్వంగా నమ్మి బ్రతుకుతున్నాను. కనీసం మాటన్నా మాట్లాడవు" అనుకున్నాను. అప్పుడు స్వామి ఇలా తెలియచేశారు ..." నీకు నేను ఏమి తక్కువ చేశాను? అష్టలక్ష్ములనే నీ స్వంతం చేశాను. నేనే నీ వాడిని అయ్యాను ఇంతకంటే అదృష్టం ఏమున్నది?" అని హృదయ భాషలో ఎంతో ప్రేమగా తెలియచేశారు. ప్రభూ! ఈ సృష్టిలో ఏది పొందినా ఇంకా ఏదో కావాలనే ఉంటుంది. సృష్టికర్తనే పొందిన తరువాత ఇంక పొందేది ఏమున్నది? సాయి ప్రేమకు నోచుకున్న నేను అదృష్టవంతురాలిని!!

**25.8.2000**

ఉదయం మందిరానికి వెళ్ళాను. నా మనస్సు అద్వైత స్థితిలో ఉన్నది. మందిరంలో ఏది చూసినా "బ్రహ్మము"గానే ఉన్నది. "నేను" అన్నది లేకుండా దానిలో లీనం అయ్యాను. స్వామి దర్శనం ఇవ్వటానికి వచ్చారు. బాబా నా ముందు నుంచి కొంచెం దూరంగా వెళ్ళిపోయారు. వెంటనే నాలో ఏదో ప్రేరణ కలిగింది. భజన అయిన తరువాత ఈ మధ్యనే పరిచయం అయిన వరలక్ష్మితో

"ఈ రోజు నేను ఏది చెబితే అది మాట్లాడకుండా చెయ్యమని" చెప్పాను. అలాగే నంది. కదంబమాల మూడు మూరలు కొనమన్నాను. కొన్నది. "మీ ఇంటికి వస్తానని" చెప్పగానే ఆనందంతో సరేనన్నది. ఇంటికి వెళ్ళిన తరువాత "సేమ్యా పాయసం" చెయ్యమన్నాను. చేసింది. నేను కుర్చీలో కూర్చున్నాను. నా కాళ్ళకి పసుపురాసి, బొట్టు పెట్టి, మెడలో దండ వేసి కన్నీళ్ళతో నా పాదాలు కడిగింది. తరువాత ప్రసాదం తిన్నాను. ఆవిడ వద్ద ఉన్న పింకురంగు చీర బొట్టు పెట్టించుకుని తీసుకున్నాను. ఆ చీర కట్టుకుని మళ్ళీ వెంటనే ఆవిడకి ఇచ్చేశాను. ఈ రోజు దశమి. ఆఖరి శ్రావణ శుక్రవారం. ఈ రోజు గురుపీఠం ఇచ్చి గురుస్వరూపిణిగా మొదటి పూజ వరలక్ష్మి చేత చేయించారు. సాయిమాత నాకు ప్రసాదించిన 'గురు' స్థానాన్ని భక్తిశ్రద్ధలతో నిలుపుకుంటాను. నా ఆత్మ విద్య పూర్తయి గురుపీఠం అలంకరించాను. ఈ శుభ సందర్భంలో నా గురు దేవులకి నా హృదయ పూర్వక నమస్కారములు తెలియచేశాను.

**29. 8. 2000**

ఉదయం మందిరానికి వెళ్ళి "స్వామీ! ఇక నుంచి నాకు కన్న పిల్లలతో, బంధువులతో ఎటువంటి సంబంధమూ లేదు. వాళ్ళు దేహ సంబంధమైన వాళ్ళు. నీ పాదాలకి అంకితం అయ్యాను. నువ్వే నా సర్వస్వం" అనుకున్నాను.

స్వామి వరండాలో నిల్చుని నా వైపు చూస్తున్నారు. స్వామి పాదాలు నా ముందుకు వచ్చినట్లు కనిపించింది. మానసికంగా నా కన్నీళ్ళతో స్వామి తన పాదాలు కడిగించుకున్నారు. ప్రస్తుతం నా కోరిక స్వామి ఇలా తీర్చారు. బాబా! ఎన్ని పుస్తకాలు చదివినా జ్ఞాపకం ఉండవు. అవి చదవటం వలన "నేను సాధనలో నిన్ను తెలుసుకున్నట్లు" ఇంకా తెలుసుకునేది ఏదీ లేదని" అర్థం అయింది. కానీ, గురుదేవా! ఎవరికైనా చెప్పాలంటే చెప్పలేక పోతున్నాను.

చెప్పే శక్తిని ప్రసాదించు. నేను చెప్పేదంతా శివశక్తికి సంబంధించినట్లే ఉండాలని, అవే వ్రాయాలనీ అనుకున్నాను. స్వామి నుంచి నాకు వ్రాసే శక్తిని ప్రసాదిస్తున్నట్లు తెల్లని కిరణాలు నాలో ప్రవేశించినాయి. నా ప్రతిమాట శ్రీ విద్యకు సంబంధించినదై ఉండాలి. అమ్మ జ్ఞాన స్వరూపిణి. జ్ఞాన స్వరూపిణి సరస్వతి నుంచి ఆ వాణి నా నోట పలకాలి. ఆ మాటలు మాయాంధకారంలో ఉన్న బిడ్డలకి వెలుగురవ్వలై మాయపొరలను తొలగించి, లోవెలుగుచూపాలి. నాకు ఇంతకంటే ఏ కోరికా లేదు.

## 30.8.2000

ఉదయం మందిరంలో స్వామి వెళ్ళే త్రోవలో వరలక్ష్మి కూర్చున్నది. స్వామి బయటకు వెళ్ళి వస్తూ ఆవిడ కూర్చున్న వైపు దాకా వచ్చి పక్కకి వెళ్ళిపోయారు. “స్వామీ! నా పాదాలే నీ పాదాలని ఆవిడ నమస్కరిస్తున్నది. ఆమెకు పాదనమస్కారం ఇస్తే బాగుండేది” అని అనుకున్నాను. తరువాత భజన జరుగుతుండగా కళ్ళు మూసుకుని ధ్యానంలో ఉన్నాను. నా పాదాల నుంచి మోకాళ్ళ వరకు పసుపు పచ్చ బట్ట కప్పిన పాదాలు నా నుంచి మందిరం లోకి వెళ్ళి స్వామిలో కలిసిపోయాయి. స్వామీ! నీ పాదాలు నా వద్ద నుంచి వెళ్ళటం ఏమిటి? అనుకున్నాను. స్వామి ఇలా తెలియచేశారు ...” పదహారు సంవత్సరాల నుంచి నా పాదాలు నీ శిరస్సున ఉన్నాయన్న నమ్మకంతో ధ్యానించావు. అందుకే నా పాదాలు నీ దగ్గర ఉన్నాయని తెలియచేయటానికి ఇలా చేశాను. వరలక్ష్మి నీ పాదాల ద్వారా నా పాదాలకు నమస్కరిస్తున్నది.’ నాకు ఎవ్వరు పాద నమస్కారం చేసినా స్వామి పాదాలు అన్న విశ్వాసంతో ఉన్నా అప్పుడప్పుడు అనుమానం వస్తుంది. ఈ రోజు స్వామి “నీ పాదాలు నా పాదాలే” అని దృఢ పరిచారు. నా పాదాలు “అమ్మ పాదాలు” సందేహం లేదు.

నన్ను దైవస్వరూపంగా మార్చిన నీకు ఏమివ్వను? జీవించినంత కాలం నీ పాదాలకు సేవ చేసుకుంటూ ఏ సేవ ఇచ్చినా స్వామి సేవగా భావించి నిస్వార్థంగా చేస్తాను.

**1.9.2000**

వినాయకచవితి రోజు 750 వినాయకుళ్ళని రకరకాలవి తెచ్చి పెద్ద షెడ్‌లో అలంకరించి గణేశ హోమం చేశారు. స్వామి అక్కడికి వచ్చి హోమగుండంలో హోమ ద్రవ్యాలు వేశారు. గురుదేవా! నన్ను కూడా ఈ హోమ గుండంలో ఆహుతి చేసి దివ్యత్వాన్ని వెలికి తియ్యి అని ప్రార్థించాను.

ఓ అగ్నిదేవా! ఎప్పటికైనా ఈ శరీరం నీకు అర్పించవలసినదే. కానీ, జీవించి ఉండగానే నన్ను నీకు అర్పించుకుంటున్నాను. ధర్మ జీవితాన్ని ప్రసాదించి నా శేష జీవితాన్ని ధర్మ ప్రచారానికి ఉపయోగించుకో. గురుదేవా! నీవు చెప్పే నవ విధ పుష్పాలు నీ పాదాల వద్ద సమర్పించాను. నేను చేసే సాధన ఏమీ లేదు. నీకు తెలియనిది ఏమున్నది? సర్వాంతర్యామివి ప్రశాంత చిత్తంతో నీ పాదాల వద్ద ఉన్న నన్ను స్వీకరించి ఆశీర్వదించు. శుభ, అశుభాలంటూ ఇంక నాకు లేవు. ఇక మీదట నాకు పురుడు, మైల అనే దేహ బంధాలు లేవు. నిత్య సత్యమైన పరమాత్మలో కలిసిపోయాను. శుచి, అశుచి రెండూ "నేనే".

★ ★ ★

ప్రభూ! శిఖిపింఛ మౌళీ సాయికృష్ణా! నా వైపుకు నడిచే నీ అడుగుల చప్పుడు వినటానికే ఈ దేహంతో ఉన్నాను. నీ కోసం అట్టడుగు పొరలలోంచి వచ్చే నా పిలుపు అక్షర రూపంలో రాయలేను విశ్వేశ్వరా! ఏ పాండిత్యమూ లేని నేను కేవలం నీ ఉపన్యాసాలు విని వాటిలోని సత్యాన్ని గ్రహించి నువ్వు

సత్యమని నమ్మిప్రేమా! ప్రేమా అంటూ చెట్టూ–పుట్టా రాయి–రప్పాలో, చలించే ప్రతి జీవిలోనూ నిన్ను చూస్తూ పిచ్చి దానిలా తిరుగుతున్నాను. విశ్వమంతా నీ ప్రేమతో నిండి పొంగిపొర్లుతున్నది. నన్ను నిర్లక్ష్యం చేయక త్వరగా రా! గిరిధారీ!

## 4.9.2000

"రాత్రి 11 గంటలకు మామూలు శ్వాసతోపాటు మరొక శ్వాస "రాం" శబ్దం లాగా వచ్చింది. రెండు శ్వాసలు వచ్చినాయని అనుకున్నాను" ఉదయం మందిరంకి వెళ్ళాను. స్వామి బయటకు వెళ్ళటానికి వరండాలో నిల్చున్నారు. "స్వామి అంతర్దృష్టితో నన్ను చూస్తున్నారు. కానీ ఒక్కసారి బాహ్యదృష్టితో చూడండి" అని ప్రార్థించాను. కానీ, చూడలేదు. నా ముందు నుంచి కారులో వెళ్ళిపోయారు. వెంటనే హృదయ భాషలో రాత్రి శబ్ద రూపంలో వచ్చిన శ్వాస గురించి తెలియచేశారు. అది "రామ మంత్రం" అని. ఒకసారి శ్రీ సుందర చైతన్య స్వామిజీ తన ఉపన్యాసంలో శివుడు రామనామం చేస్తాడని చెప్పారు. శివుడు రామనామం చేస్తుంటే నేను శివపంచాక్షరి చేయటం ఏమిటని అనుకున్నాను. ఆ తరువాతే ఇలా జరిగింది. దీనికి నా గురుదేవులు మానసికంగా అర్థం ఇలా తెలియచేశారు. నువ్వు శివ పంచాక్షరి చేయగా, చేయగా నువ్వే శివుడిగా అద్వైతస్థితిలో ఉన్న నీలోంచి ఆ "రామ" నామం వస్తున్నది. ద్వైతం శివపంచాక్షరి చేశావు. అద్వైతంలో శివుడిగా రామనామం చేస్తున్నావు. నువ్వే శివుడివి ... "శివపంచాక్షరి చేసి శివుడిగా అద్వైతస్థితిలో ఉన్న నువ్వు కూడా రామనామం చేస్తున్నట్లే" నువ్వు శివుడివి! నువ్వే శివుడివి! నువ్వే శివుడివి!" అని మూడుసార్లు అన్నారు.

## 9.9.2000

ఉదయం మందిరంలో "ఓం త్రయంబకేశ్వరాయనమః" అన్న నామం

నాలో ఉద్ధృతంగా జరుగుతున్నది. స్వామీ! ఈ నామం ఎందుకు జరుగుతున్నదో అర్థం తెలియచేయమన్నాను. నా ప్రక్కన కూర్చున్న ఆవిడని త్రయంబకేశ్వరుని గుడి ఎక్కడైనా ఉన్నదా?" అని అడిగాను. ఆవిడ "నాసిక్"లో ఉన్నది అని చెప్పి, అక్కడ వరుసగా మూడు లింగాలు ఉంటాయని, గోదావరి నీరు సన్నగా వాటి మీద పడుతుందని చెప్పారు. నాసిక్ షిరిడీకి దగ్గర కనుక షిరిడీ వెళ్ళి రమ్మని స్వామి సందేశం అనుకున్నాను. స్వామీ! నీ ప్రేరణ ఉంటేనే కాని నేను ఎక్కడికీ వెళ్ళలేను. ఈ ప్రయాణం జరగాలని నీ నిర్ణయం అయితే ప్రయాణానికి ఏర్పాటు చెయ్యమని నిశ్చింతగా ఉన్నాను.

17వ తారీఖు మధ్యాహ్నం విన్నమాట "త్రయంబకం నీ జన్మస్థానం" దానికిస్వామి తెలియచేసిన అర్థం. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఉన్నస్థానమే నీ జన్మ స్థానం. నీకు పునర్జన్మ లేదు. ఈ విధంగా "నాసిక్" ప్రయాణం ఆపు చేశారు.

**23.9.2000**

మధ్యాహ్నం విన్న మాట ఒక స్త్రీ "అమ్మా పంచామృతాలు తీసుకో" అన్నది. "స్వామి నన్ను పిలిచి పంచామృతాలు ఇస్తారని అనుకున్నాను. కాని, సత్య, ధర్మ, ప్రేమ, శాంతి, అహింస ఈ ఐదూ నీలో పరిపూర్ణంగా ఉన్నాయి. నీకు ఇచ్చిన పంచామృతాలు ఇవే" అని తెలియచేశారు.

**21.12.2000**

జ్ఞాన కిరణంతో భక్తుని హృదయకమలం వికసించినపుడు అణువణువు వికసించిన కమలాలై అమ్మ సౌందర్యం వెల్లి విరిసినపుడు భక్తుని హృదయం ఆనందంతో పరవశిస్తుంది.

**9.1.2001**

దృశ్యం : "మూడు ఏళ్ళ బాబు నిక్కరు, చొక్కా వేసుకుని వస్తుంటే నేను రెండు చేతులూ చాపి రమ్మని పిలిచాను. వచ్చి ఒళ్ళో కూర్చున్నాడు" బాబు రూపంలో "స్వామి" నా ఒళ్ళో కూర్చున్న అనుభూతి కలిగింది. కన్నయ్యా! ఇలా నిక్కరు, షర్టుతో వచ్చావేంటి? నీ మొలకి మామిడి పిందెల మొలత్రాడు, కాళ్ళకి కడియాలు, అందెలు, గజ్జెలు, మెడలో హారాలు, తలలోనెమలి పింఛము, నొసటన కస్తూరి తిలకము, పట్టు పీతాంబరాలు ధరించలేదు. ఏమిటి?" అన్నాను. సాయికృష్ణుడు ఇలా మానసికంగా తెలియచేశాడు. "రామావతారం, కృష్ణావతారంలో అవన్నీ ధరించాను. కలియుగంలో పేదకుటుంబంలో జన్మించి, సామాన్యుడిగా పెరిగాను. అందుకే ఈ రూపంలో నీ ఒళ్ళో చేరాను."

ఎన్ని జన్మల పుణ్యఫలమో ఇది! బాల్యంలో చూడని నా సాయి కృష్ణుని మానసికంగా దర్శించుకున్నాను.

**20.1.2001**

స్వామి అనుగ్రహంతో "తిరుప్పావై" పుస్తకం చదవటం ఐదు రోజులలో పూర్తి చేశాను. కర్మ, భక్తి, జ్ఞాన, వైరాగ్యం ద్వారా 1984 సంవత్సరం నుండీ నా గురుదేవులు సాధన చేయిస్తున్నారు. కాని, గోపికలది ప్రేమ భక్తి, భక్తికి పరాకాష్ఠ. ఆ పుస్తకం చదువుతున్నంత సేపు నా మనస్సు గోపికల మనస్సు లాగా ప్రేమతో లీనమై కంటి ధారలతో ఆ పుస్తకం పూర్తి చేసి కృష్ణ ప్రేమకి దాసురాలినైనాను. పుస్తకం చదువుతున్నప్పుడు చిన్నప్పటి స్వామి జీవితం గుర్తు వచ్చింది. రాజరికాలు, రాజ్యాలు, జమీందారీలు ఇక ఉండవని తెలిసిన మన "సత్యసాయి" పేద కుటుంబం ఎన్నుకుని భౌతికమైన ఐశ్వర్యం లేకపోయినా జ్ఞాన ఐశ్వర్యం ఉన్న కుటుంబంలో జన్మించారు. అది తల్లిదండ్రులు చేసుకున్న

పుణ్యఫలం. స్వామి చిన్నప్పుడు ఎన్ని కష్టాలు పడ్డారో అప్పటి పెద్దలకి, సమకాలీనులకి తెలుసు. వాళ్ళ ద్వారా, పుస్తకాల ద్వారా మనమూ తెలుసుకున్నాము. విశ్వానికే చక్రవర్తి, అష్టైశ్వర్య సంపన్నుడు, ప్రకృతినే శాసించగల అవతార పురుషుడు "సాయి" చొక్కాకు గుండీ కూడా లేకుండా "తుమ్మముల్లు" పెట్టుకునేవారు. ఎందుకో ఆ సంఘటన గుర్తు వచ్చి మన చిన్ని కన్నయ్య తుమ్మముల్లు విరిచేటప్పుడు బలమైన తుమ్మ ముల్లు చేతికి గుచ్చుకుని, ఆ ముల్లు షర్టుకు పెట్టుకుంటే నిద్రలో గుండెకు ముల్లు గుచ్చుకుని రక్తం వచ్చిందేమోనని నా మనసు చాలా దుఃఖించింది. తట్టుకోలేక "కన్నయ్య ... కన్నయ్య" అంటూగుండె పట్టుకుని విలపించాను. నా కన్నయ్య నా దుఃఖాన్ని చూడలేక తన స్పర్శతో సేద తీర్చారు. ఇది నిజంగా అనుభవించిన సత్యం. తన కోసం దుఃఖిస్తున్న భక్తుల దుఃఖం నా తండ్రి భరించలేడు. అందుకే తన దివ్యదర్శనాన్ని కలల ద్వారా అనుభవింపచేసి ఆనందపెడతాడు. ఎన్ని జన్మల పుణ్యమో ఈ అవతార సమయంలో స్వామి సన్నిధిలో గడపటం మన అదృష్టం. ఇది తెలుసుకుని మన హృదయ క్షేత్రంలో ప్రేమ పండించుకుని స్వామి హృదయంలో చోటు చేసుకుని ఆ మధుర ప్రేమని అందరికీ పంచటానికి సాధకులందరూ సిద్ధంగా ఉండాలి. ఆ అవకాశం స్వామి మన అందరికీ తప్పక అనుగ్రహిస్తారు. ప్రేమ నిండిన హృదయం పారిజాతాలకి నిలయం. అందులో స్వామి మనని విడువక నిల్చి ఉంటారు.

★ ★ ★

గురుదేవా! నీ ఆధ్యాత్మిక వనంలో పూసిన ఈ చైతన్య కుసుమాన్ని స్వీకరించటానికి నా జన్మకర్మలు అడ్డువస్తే వాటిని తొలగించి నీ సన్నిధికి చేర్చుకో. ఈ ఆలస్యం భరించరానిది. సాయీ! నీ కృపా వర్షం నాపై కురిపించి నా తాపం చల్లార్చు!

పెరటి పూతోటలో పూసిన గులాబీని భక్తుడు ముళ్ళున్నాయని కోయక మానడుకదా! ఆ ముల్లుని తొలగించి, వికసించి మంచు బిందువులతో తడిసిన ఆ పూలను నీ పాదాల వద్ద చేర్చి ఆనందించి తన్మయత్వం చెందుతాడు. అలాగే జ్ఞాన కిరణంతో వికసించిన హృదయపుష్పం ప్రేమ అనే బిందువులతో తడిసి నీ పాదాలవద్ద చేరి, నీ స్పర్శకై ఎదురు చూస్తున్నది. నీ భక్తులకై ఎన్నో కష్టాలు పడుతున్న నువ్వు నా కర్మ అనే ముల్లును తొలగించి ఒక్కసారిగా వంగి నీ చేతిలోకి తీసుకో ప్రభూ!

దృశ్యం : "ఎవరో ఏవో పలుకులు వేసి పాలు ఇస్తున్నారు".

"ఆ పలుకులు భగవంతుని 'నామాలని' అవి మధురమైన క్షీరం అని. ఆ నామాన్ని కలకండ పలుకులులా నాలుకతో స్మరించి, జ్ఞానమనే క్షీరాన్ని త్రాగమని స్వామి తెలియచేశారు.

ఇది నాకే కాదు ... భక్తులందరికీ సందేశం!

**31.1.2001**

పరమ పావనమైన సాయీశుని పాదాలు పట్టి విడువకండి
పరమభక్తులారా!
కలిమి లేములందు, కష్టసుఖములందు దృష్టి నిలుపుడు మీరు
శ్రీ సాయి చరణ కమలముల యందు!
భక్తి మీరగ మీరు తనువునే మరచి భజన చేయండి
సాయి భక్తి గీతాలు!
మనని తరియింప దివి నుండి భువికి దిగివచ్చిన
జగద్గురువు శ్రీ సత్యసాయి!

సత్యం ... శివం ... సుందరం ... మూడు కలిసిన త్రివేణీ సంగమమే పుట్టపర్తి ప్రశాంతి నిలయం!

త్రిగుణములను జయించి, త్రివేణీ సంగమంలో మునక వేసి ముక్తి పొందండి. సాయి అవతార కాలంలో జన్మించిన మనం ... మనం కోరుకునేది జీవన్ముక్తి!

**3.2.2001**

ఓ మనసా! కృష్ణ ప్రేమ అనే హృదయపు అట్టడుగు లోతులకు వెళ్ళి, మధుర ప్రేమలో మునిగి, ఆ ప్రేమ ధారలతో మనసును నింపుకుని, ఆ ప్రేమామృతంతో నీల మేఘశ్యాముని అభిషేకించినపుడే కన్నయ్యకి తృప్తి! ఇదే సాయికృష్ణునికి సమర్పించుకునే "మధురభక్తి!"

నల్లనయ్యని దర్శించిన నా కనులకి అంతటా, అన్నింటా ఆ నల్లని వాడే కనిపిస్తున్నాడు.

ఓంకార ప్రణవమంత్రం నా హృదయమంతా నిండి కృష్ణ రూపంగా నిలిచింది.

జ్ఞాన నేత్రంతో నీల మేఘశ్యాముని దర్శించిన నా కనులు పూర్ణ ప్రేమతో నిండి ప్రేమ జల్లులై కుంభవృష్టిగా మారి విశ్వ ప్రభువుని అభిషేకిస్తున్నాయి. అదే సత్యం ... శివం ... సుందరం ...

మాధవా! అన్న పిలుపులోని మాధుర్యంతో నా మనసు నిండిన వేళ ఆ మధుర ఫలాన్ని నా ప్రేమసాయికి సమర్పించి ఆనంద సాగరంలో లీనం అయ్యాను.

నా హృదయం అనే తామరపుష్పం జ్ఞాన భాస్కరుని తేజస్సుతో వికసించి, జ్ఞానంతో నిండిపోయింది. అదే సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ!

నా అనుభూతులు పుస్తకంలా రావాలన్న కోరిక కూడా నశించి మనసు ప్రశాంతంగా ఉన్నది. కోరికలన్నీ నశించి సంకల్ప, వికల్పాలు లేని మనసుతో నా గురుదేవులకు పూర్తిగా శరణాగతురాలినైనాను. నాకు ఏది మంచిదో అదే చేస్తారన్న దృఢ విశ్వాసంతో ఉంటాను.

**5.2.2001**

గురుదేవా! నీ సంకల్పబలంతో నా మనసు అనే బాణాన్ని మోక్షం వైపుకు గురి చూసి సంధించావు. ఈ మోక్ష మార్గంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా నీ ఆశీర్వచనం వలన వాటిని తట్టుకుని అమ్మని దర్శించి మోక్ష ఫలాన్ని అందుకున్నాను నీ అనుగ్రహంతో. మోక్షఫలం నా కోసం కాదు ... అందరికోసం. స్వార్థం లేని నీ బిడ్డని ఆశీర్వదించి సేవని ప్రసాదించు. నా సాయి సేవలో తరించటమే నా లక్ష్యం! ఏ ముక్తీ నాకు అవసరం లేదు. నీవిచ్చిన ముక్తి ఫలం కంటే నీ పాదాలే నాకు శాశ్వతమైన ఐశ్వర్యం ... అది నాకు చాలు!

**6.2.2001**

స్వప్నం : "పూర్ణం బూరె విచ్చి చూస్తే దాంట్లోంచి సన్నని రజనులాగా పిండి పడింది. లోపల ఉడకలేదు అని అనుకున్నాను" ఇంకా నాలో పూర్ణత్వం సిద్ధించలేదేమో అందుకే ఉడకలేదని బాధపడ్డాను. స్వామి దీనికి తెలియచేసిన అర్థం : "అది పూర్ణం బూరె కాదని, అణువుల సమూహంతో నిండిన పూర్ణ స్వరూప బిందువని" తెలియచేసిన తరువాత అద్భుతం అనిపించింది.

**17.3.2001**

సౌందర్యలహరి చదివి అమ్మ కుండలిని మాతను తలుచుకున్నాను. స్వప్నంలో నేను ఒక చోటుకు వెళుతుంటే ఒక సర్పం మెలికలు తిరుగుతూ నా వైపుకు వచ్చింది. అమ్మ సర్పరూపంలో దర్శనమిచ్చింది.

నిన్న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేరు. మా అబ్బాయి ఇంటికి రేపు శంఖుస్థాపన, నా మనసుకి తృప్తిగా ఏదో ఒక అద్భుతం జరగాలి. నిన్నే పొందిన నేను "నీవు"గానే శంఖుస్థాపనకి వెళ్ళాలి అని ఎంతో ప్రార్థన చేశాను. నేను చదువుతున్న సౌందర్యలహరి పుస్తకంలో '481'వ పేజీ తియ్యగానే 'కుంకుమ' వచ్చింది. ఆనందంతో అమ్మ శ్రీ లలితని కన్నీటి ధారలతో అభిషేకించాను. కుంకుమ వచ్చిన విషయం ఇంట్లో చెపుదామని అనుకున్నాను. కానీ, 'అమ్మ' ఇప్పుడు వద్దు. సమయం వచ్చినప్పుడు "నేనే" నీ రూపంలో వ్యక్తం అవుతానని హృదయభాషలో తెలియ చేసింది.

**29.3.2001**

1. సంసారమనే బండి చిక్కులలో పడినపుడు సాయినాధుడు మన బండి సారధి అయి చిక్కుల్లోంచి బైట పడేస్తాడు.
2. ఇరుకు మనసులు ఈశ్వరుని దర్శించలేవు
3. మానావమానాలు భరించినప్పుడే దైవత్వం సిద్ధిస్తుంది.
4. ఉదయభానుని కిరణాలతో మంచుపొరలు కరిగినట్లు మానవునిలో జ్ఞానోదయం కాగానే మాయ పొరలు విడిచిపోతాయి.

**31.3.2001**

దివ్యస్వప్నం : “మా అమ్మ తనతో సముద్రపు ఒడ్డుకు తీసుకు వెళ్ళింది. అవతల ఒడ్డున ఆకాశంలో సూర్యుడు తెలుపు, పసుపు పచ్చ, బంగారు రంగులలో చాలా ప్రకాశవంతంగా అద్భుతమైన వెలుగుతో కనిపిస్తున్నాడు. కానీ, అలా చూడటం తృప్తిగా లేదు. సూర్యునిలో కలసిపోవాలని పిచ్చి కోరిక కలిగింది. మానసికంగా ఆయనలో కలసిపోయాను. తరువాత ప్రశాంతంగా ఉన్నది.

**4.4.2001**

కల : ఆకాశంలో దేవతల దర్శనం అయింది.

**22.9.2001**

సాయంత్రం వరలక్ష్మిగారు నిరుడు ‘చిత్రావతి నదికి’ మీతో రావాలనుకుంటే మీరు వెళ్ళిపోయారు. మీపాదాలు చిత్రావతినదిలో కడగాలని క్రిందటి సంవత్సరం నుంచి నా కోరిక అని బాధ పడింది. రేపు వెళదాము బాధపడకండి అని చెప్పాను. రాత్రి 10 గంటలకు దృశ్యం “నేను పాదాల లోతు నీళ్ళలో ఉన్నాను”.

**24.9.2001**

తెల్లవారు జామున 4 గంటలకు అలారం మోగింది. మందిరానికి వెళ్ళాలనిపించలేదు. ఉదయం దర్శనం ఎప్పుడూ మానను. అలాంటిది బద్ధకించి మళ్ళీ పడుకున్నాను. స్వామి తట్టి లేపి “వరలక్ష్మి నీ పాదాలు కడుగుతుంది … వెళ్ళు … వెళ్ళు” అని “రాత్రి దృశ్యంలో నీ పాదాలు నీటిలో ఉన్నట్లు చూపించాను కదా!” అన్నారు. వెంటనే లేచి మందిరానికి వెళ్ళాను.

మొదటి లైను వచ్చింది. స్వామి నా వైపు రెండుసార్లు చూశారు. నేను, వరలక్ష్మి ఉదయం 7.30కి చిత్రావతికి వెళ్ళాము. సూర్యోదయం అద్భుతంగా ఉంది. సూర్యుని చుట్టూ వెన్నముద్దలాగా వెలుగు, తరువాత గులాబి, పచ్చ, నీలం, నలుపులతో అమ్మ గాయత్రి మా కోసం వచ్చిందా అన్నంత ఆనందం కలిగింది. ఆకాశం పచ్చని పసుపు పూసినట్లు బంగారు రంగులో ఉంది. ఆ దృశ్యాన్ని వర్ణించటానికి మాటలు చాలవు.

గాయత్రీ మంత్రం చదువుతూ, నన్ను గాయత్రీ దేవిగా భావించి వరలక్ష్మి పాదాలు కడిగింది. తరువాత నది ఒడ్డున భాగవతం పారాయణ చేసుకుని ఇంటికి వచ్చాము. వెంకట సుబ్బమ్మగారు వాళ్ళ ఇంటికి రమ్మని నన్ను ఒక సంవత్సరం నుంచీ పిలుస్తున్నారు. అనుకోకుండా నన్ను వరలక్ష్మిని సాయంత్రం వాళ్ళ ఇంటికి తీసుకు వెళ్ళారు. తరువాత "అమ్మా! నీవు గాయత్రీ సరస్వతి అమ్మవారివి! నీ పాదాలు కడగాలని అన్నది" అని వాకిట్లోకి తీసుకు వెళ్ళి పాదాలు కడుగుతున్న సమయంలో సూర్య భగవానుడు వాళ్ళ గుమ్మంలోకి వచ్చినంత దగ్గరగా చాలా ప్రకాశవంతంగా ఉన్నాడు. ఉదయం గాయత్రీ దేవిగా వరలక్ష్మి చేత, సాయంత్రం సరస్వతిగా వెంకట సుబ్బమ్మ చేత పాదాలు కడిగించారు. పాదాలు కడిగి, హారతి పట్టి, కళ్ళకు అద్ది, అమ్మా! నువ్వు, స్వామి, గాయత్రి ముగ్గురూ వేర్వేరుగా మాకు కనిపించటం లేదు. మీ ముగ్గురూ ఒక్కటే అని ఇద్దరూ ఆనందపడ్డారు. మీ నోట స్వామి పలికించారని, ఇది సత్యం అవుతుందని వాళ్ళతో అన్నాను. తరువాత ఆమె ప్రేమతో పెట్టిన తీపి తిని ఇంటికి వచ్చాను.

నా గురుదేవులు ఒక సంవత్సరం నుంచీ వాళ్ళలో ఈ కోరిక పెట్టి ఒకేరోజు ఉదయం, సాయంత్రం ఇద్దరి చేతా పాదాలు కడిగించి, నువ్వు నేను

వేరు కాదు, ఇద్దరం ఒక్కటేనని వాళ్ళ ద్వారా తెలియచేశారు. ఈ రోజు ఇదంతా చేయించటానికే స్వామి నన్ను లేపి మందిరానికి పంపించి, మొదటి లైను తెప్పించి, నన్ను దగ్గర నుంచి చూసి వెళ్ళారు. స్వామి దృష్టి శుభదృష్టి. ఈ రోజు నా జన్మలో మరిచిపోలేనిది. సువర్ణాక్షరాలతో వ్రాసుకోవలసిన రోజు. ఎన్ని జన్మల పుణ్య ఫలమో !

31.3.01 న వచ్చిన స్వప్నంలో సూర్యుడిలో మానసికంగా కలిసినట్లు తెలియచేసి, ఈ రోజు వాళ్ళ ద్వారా స్వయంగా గాయత్రీ దేవిలో కలిసిపోయిన అనుభవాన్ని కలుగ చేశారు.

**10.8.2001**

ఉదయం మందిరంలో స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు. "నా సంకల్పంతో నిన్ను ఇక్కడికి తీసుకు వచ్చి పది మందికి పనికి వచ్చే పరికరంగా తీర్చిదిద్దాను. నా సంకల్పం వృధా పోదు. ఫలిస్తుంది. నిశ్చితంగా ఉండు."

**4.10.2001**

మందిరంలో స్వామి దర్శన సమయంలో లైన్లలో తిరుగుతూ హృదయభాషలో ఇలా తెలియ చేశారు. "గురుదేవుని పదకమలాల నుంచి గంగ, యమున ప్రవహిస్తుంది. అది గంగా యమునల సంగమం. అందులో అంతర్లీనంగా సరస్వతీ నది ప్రవహిస్తుంది. అది జ్ఞాన వాహిని. అందులో జ్ఞాన స్వరూపిణి అయిన నీవు కలిసిపోయావు. ఇడ, పింగళ, సుషమ్న, సుషుమ్నా మార్గం ద్వారా నాలో చేరిపోయావు. 1984 గురుపూర్ణిమ రోజున నీకు కుండలినీ యోగాన్ని ప్రసాదించి, 18 సంవత్సరాలు గురువుగా సుషుమ్న మార్గం ద్వారా

షట్చక్రాలు దాటించి, నాలో ఐక్యం చేసుకున్నాను. నీ వెయ్యి జన్మల తపస్సు ఫలించి, యోగం ప్రాప్తించింది. ధన్యురాలివి ! ఈ శుభ సమయంలో నీకు నా ఆశీస్సులు. మానసికంగా తెలియచేస్తున్నాను. త్వరలోనే పది మంది ముందు నిన్ను ఆశీర్వదిస్తాను. ఆనందంగా ఉండు"! అని తెలియజేశారు.

గురు చంద్రమా! నీ ఆశీస్సులు ఫలించి నా కన్నీటితో నీ పాదాలు కడిగి ఆ పాదాల వద్ద పూజా పుష్పమై రాలిపోతాను.

★ ★ ★

మందిరంలో కాన్వెంటు పిల్లలకు మిఠాయిలు పంచుతున్నారు. నేను మానసికంగా ఇలా అనుకున్నాను. "స్వామి ! నాకున్న కొద్ది డబ్బులతో మిఠాయిలు కొనిపిల్లలకు పంచుతాను" అని అనుకొని తరువాత మళ్ళీ ఇలా అనుకున్నాను. "విశ్వమే సాయి ప్రేమ మందిరం, ప్రేమాలయంలోని బిడ్డలకి సాయి కృష్ణ నామమనే మిఠాయిని నాలుకకి రుచి చూపిస్తాను. ఆ మధుర నామంతో వాళ్ళని ప్రేమమూర్తులుగా తయారు చేయటమే మామూలు మిఠాయి కంటే విలువైనది. దీనికి డబ్బుతో పనిలేదు. ఏమీ లేని పేదరాలిని. కాబట్టి కృష్ణ నామం అనే మిఠాయిని నేను జీవించినంత కాలం బిడ్డలకి పంచుతాను" ఇప్పుడు ఇలా అనుకుంటే తృప్తిగా ఉన్నది !!

**21.10.2001**

ఉదయం మందిరంలో స్వామి డ్రైవర్లకు ఒకళ్ళకి గొలుసు, ఇద్దరికి ఉంగరాలు సృష్టించి ఇచ్చారు. అందరికీ బట్టలు, స్వీట్లు ఇచ్చి వాళ్ళతో ఆనందంగా ఫోటోలు తీయించుకున్నారు. సాయంత్రం స్వామిని చూస్తూ ఇలా అనుకున్నాను... "స్వామీ ! వాళ్ళ సేవకి మెచ్చి భౌతికమైన వస్తువులను ఇచ్చి సంతోష పెట్టావు. నీ చేతులతో ఇవ్వబట్టి వాటికి వెలకట్టలేము. నా నోటి

నుంచి అప్రయత్నంగా స్వామిని "డ్రయివరు బాబూ !" అని పిలిచాను. వెంటనే బాబా ! ఇలా పిలిచానేమిటి?" అని అనుకుని కానీ, నువ్వే అలా పిలిపించుకున్నావు. నేను కాదు. అలా పిలుస్తుంటే నాకు చాలా ఆనందంగా, నువ్వు నాకు ఇంకా చాలా సన్నిహితంగా ఉన్నట్లు, ఆ ప్రేమ పూరితమైన పిలుపులో మన మధ్య ఉన్న పలుచని పొర తొలగిన అనుభూతి కలిగింది. ఆ పిలుపు నీకు ఇష్టం అయింది. కాబట్టే పుస్తకంలో వ్రాయించుకున్నావు.

ఎన్ని జన్మల నుండి నా జీవిత రథసారథివై నన్ను నడిపిస్తున్నావో నాకు తెలియదు. 1985 తెనాలిలో ధ్యానంలో వెయ్యి జన్మలని చెప్పావు. నువ్వు చెప్పావు కాబట్టి అది నిజం అయిఉంటుంది. ఈ జన్మలో 1984 జులై గురుపూర్ణిమ నుంచీ నా దేహమనే కారుకి డ్రైవరువయి సత్యమార్గంలో నడిపిస్తున్నావు. నీకు ఇవ్వతగ్గ వస్తువు నా వద్ద ఏమీ లేదు. నువ్వు నాకు పంచిన ప్రేమ తప్ప. ఆ వెలకట్టలేని ప్రేమ కానుకను తిరిగి నీకే ఇస్తున్నాను. అందుకో ! నాలోని అర్థభాగమైన ఈశ్వరా ! నిన్న, ఈ రోజు ఉపన్యాసాలు నన్ను చాలా ఉత్తేజ పరచినాయి. వెంటనే లేచి "నీవు చెప్పిన సత్యంలో నిలిచి, సత్య ప్రచారం చేస్తానని నీ వద్దకి వచ్చి చెప్పాలని" నా మనసు తొందర పెట్టినా, అది సమయం కాదని, సత్యమే నా వద్దకు వస్తుందన్న విశ్వాసంతో ఉండిపోయాను.

ప్రభూ ! నా హృదయం ఈ సత్యప్రకాశాన్ని భరించలేక పోతున్నది. సత్యపు వాకిళ్ళు తెరువు ! గురువు అనుగ్రహం కోసం చూస్తున్నాను. ఆలశ్యం చేయకు ! ఆలస్యం అమృతం విషం అంటారు. వడివడిగా నా దరి చేరు కృష్ణా! ఈ వెలుతురు ప్రవాహానికి కర్మ అనే అడ్డుకట్ట వేయకు. ఆ కట్లన్నీ తెంచుకుని నా సత్య ప్రకాశం నన్ను ముంచెత్తి వెల్లువై ప్రవహించక ముందే నన్ను

ఆశీర్వదించు ప్రభూ ! సత్యహరిశ్చంద్రుడు సత్యంలో నిలిచి అన్ని పరీక్షలనీ ఎదుర్కొని పాసయినట్లు ఈ రోజు ఉపన్యాసంలో చెప్పావు. ఆ సందేశం నా కోసమే అని, పరీక్ష పాసయ్యానన్న ఆనందంతో ఉన్న నన్ను నిరుత్సాహ పరచక విజయ దశమి నాటికి క్రొత్త జీవితాన్ని ప్రసాదించు. గమ్యం చేర్చిన డ్రైవరు బాబూ ! మాటలు రాని ఈ పరమానంద స్థితిలో ఏమి వ్రాయను?

**26.10.2001**

మా అమ్మాయి సుధ పుట్టపర్తి వచ్చింది. ఉదయం మందిరంలో మొదటి లైనులో దర్శనానికి వెళ్ళాము. స్వామి రావటానికి ఇంకా కొంచెం సమయం ఉన్నది. "పాదాలు మాత్రమే ఉన్న ఫోటో కొని ఈ రోజు సుధ చేత పెట్టించమని" మానసికంగా తెలియచేశారు. సాయి గీతకి ఆపిల్ తినిపిస్తూ తొండం మధ్య నుంచి మా వైపు చూశారు. ఇంటికి వస్తూ పాదాలు ఉన్న ఫోటో కొన్నాను. నేను అనుకున్నట్లుగానే ఫోటో దొరికింది. పాదాలు పెట్టటానికి పీట కొన్నాను. పీట మీద వెయ్యటానికి కాషాయరంగు బట్ట కొనాలనుకుంటే "ఈ మధ్య కాషాయరంగు "నాప్‌కిన్" కొన్నావు కదా! అది వెయ్యమని" మానసికంగా తెలియచేశారు. ఆనందంతో ఇంటికి వస్తుంటే ఒకతను ఇత్తడి సర్పాన్ని పళ్ళెంలో పెట్టుకుని భిక్షకు వచ్చాడు. శుభసూచకం అనిపించింది. రు.5 భిక్ష వేసి ఇంటికి వచ్చాము. భాస్కరంగారితో ఈ రోజు స్వామి మా ఇంట్లో ఒక లీల చూపిస్తారు మీరూ రండి అంటే ఆనందంగా వచ్చారు. ఖర్జూరం పళ్ళు, అరటి పళ్లు ప్రసాదం తెచ్చారు. పాదాలు ప్రతిష్ఠించిన రోజు తొలి ప్రసాదం ఆవిడ ద్వారా స్వీకరించారు. సుధ అమ్మవారికి, అయ్యప్పకి, స్వామికి హారతి పాటలు పాడింది. భాస్కరం గారిచేత హారతి పట్టించాను. మా ముగ్గురి సమక్షంలో పాదప్రతిష్ఠ వైభవంగా జరిగింది. విజయదశమికి నాతో మాట్లాడు. లేకపోతే

నేను తట్టుకోలేను అని ఏడిచాను. తప్పక ఇంటర్వ్యూ ఇస్తారని ఆశగా ఎదురు చూసిన నాకు ఈ లీల ద్వారా కొంత శాంతపరచి సమస్థితిని ప్రసాదించారు. సుధ చేత పాద ప్రతిష్ఠ చేయించటానికే పిలిపించానని మానసికంగా తెలియచేశారు.

మళ్ళీ నా నిరీక్షణ మొదలైంది. దీనికి అంతం ఉన్నదా? స్వామి ఉపన్యాసంలో "అడిగినదేదో అడిగారు. అడిగింది ఇచ్చే వరకు సాధకులు వెళ్ళకండి" అన్నారు. కానీ, స్వామీ ! నిన్ను ఈ జన్మలో ఏమీ అడగలేదు. క్రితం జన్మలో అడిగి వుంటాను. అది నాకు తెలీదు. నువ్వు నాతో కాషాయ వస్త్రం ఇస్తానని చెప్పి నువ్వే సాధన చేయించావు. అది నా కోరిక కాదు. అది నీ కోరిక. తప్పక తీరుస్తావు. సహనంతో వేచి ఉండే శక్తిని నాకు ప్రసాదించు !"

**31.10.2001**

కల : ఒక చోట పురాణం చెబుతున్నారు. నేను ఆ పురాణం చెబుతున్న పండితుడితో "గురువు చెప్పినట్లు వినాలి కదా!" అన్నాను. "ఔను ! వినాలి !" అన్నారు. "అయితే నా గురువు బాహ్యంలో లేరు. అంతరాత్మే నా గురువు" అని అన్నాను. ఆయన వెంటనే "అదృష్టవంతురాలివి! ఆత్మే గురువై ఆధ్యాత్మిక బోధలు చెయ్యటం జీవుడు చేసుకున్న సుకృతం" అన్నారు.

అమ్మ ఆశీస్సుల ప్రభావంతో నాలోని దివ్యశక్తులు వెలికి తీయబడ్డాయి. అవసరమైనపుడు ఆ శక్తిని లోక కళ్యాణానికి ఉపయోగిస్తాను. అమ్మా! నేను మాత్రం ఆ దివ్యశక్తికి తలవంచి వినమ్రతతో ఉంటాను.

తెల్లవారుజామున దృశ్యం "ఆకాశం పూర్ణచంద్రుడు. కొన్ని ప్రకాశవంతమైన నక్షత్రాలు కనిపించాయి. "ఆ దృశ్యం చాలా అద్భుతంగా

అనిపించింది. అది సప్తర్షి మండలమని స్వామి తెలియచేశారు. నిన్నంతా నాలోనే సప్త సముద్రాలు, సప్త ఋషులు ఉన్నారని అనుకున్నాను.

స్వామి ఇలా దృశ్య రూపంలో చూపించారు.

స్వామి జన్మదినం రోజున సాయంత్రం మందిరంలోని జనం "పుట్టలో నుంచి బయటకు వచ్చిన దేవతా సర్పాల పడగల్లాగా" ప్రకాశంతో మెరుస్తున్నట్లు వాళ్ళ ముఖాలు కనిపించాయి. మందిరం అంతా అమ్మ కుండలినీ సౌందర్యంతో నిండినట్లు అనుభూతి కలిగింది. ఆనందంతో ఆ దృశ్యాన్ని చూస్తూ ఉండిపోయాను. నా గురు స్వరూపిణి సాయి మాత నడుస్తున్నప్పుడు వెనుక నుంచి చూస్తుంటే సర్పంలోని కదలికలు కనిపిస్తాయి. ఆకాశంలో మెరుపు మెరిసినప్పుడు తేజోవంతమైన ఆ మెరుపులోని కదలికలుఅమ్మ నడకలా అనిపించినట్లు ఉంటుంది. సాయి మాత మూలాధారంలోని కుండలినీ శక్తి. ప్రశాంతి నిలయంలో అమ్మ అనుగ్రహంతో యోగ మార్గాన షట్చక్రాలు దాటి సహస్రారకమలంలోని అమ్మ శ్రీలలితని దర్శించి సిద్ధి పొందిన యోగులు ఎంత మంది ఉన్నారో అజ్ఞాతంగా ! అలాటి సిద్ధ పురుషుల ప్రకాశం సాయి అనుగ్రహంతో నేను దర్శించానన్న ఆనందం మందిరంలో రెండు రోజులపాటు పొందాను.

**30.11.2001**

కల : నేను, మరొక స్త్రీతో కలిసి నీళ్ళలోంచి వస్తున్నాము. ఉన్నట్లుండి నీటి ప్రవాహం ఎక్కువైంది. నడుము వరకూ నీళ్ళు వచ్చాయి. ఎటు చూసినా నీటి ప్రవాహం. నీళ్ళు కొండల్లోంచి వస్తున్నాయి. అక్కడ ఇద్దరు మగవాళ్ళు తెల్లని దుస్తులలో కనిపించి ఏ క్షణంలోనైనా ఈ నీరు ఊరిని ముంచెయ్యవచ్చు.

ముందుకే వెళ్ళండి" అని చెప్పారు. మేము ఒడ్డుకు చేరుకున్నాము. నేను నా ప్రక్కన ఉన్న ఆమెతో అంటున్నాను...

"అమ్మ చెడును చూసి భరించలేక దుఃఖిస్తున్నది. మనం కోరికలని తగ్గించుకుని భూభారాన్ని తగ్గించాలి. మనుషులకి కోరికలు ఎక్కువై తృప్తి లేక స్వార్థంతో జీవిస్తున్నారు. అందుకే హిమవంతుని పుత్రిక అమ్మ పార్వతి తన వేదనని కన్నీటి రూపంలో ప్రవహింప చేస్తున్నది. శివుని అర్ధాంగి, శివశక్తి స్వరూపిణి అయిన అమ్మ కన్నీరు ఆమె బిడ్డలమైన మనకు క్షేమం కాదు. యువతీ యువకులారా ! సత్యానికి కట్టుబడి, ధర్మాన్ని ఆచరించి, తోటి మానవులని ప్రేమించి మనలోని దుష్ట శక్తులతో పోరాడి, శాంతి మార్గంలో పయనించి, నిస్వార్థంతో అమ్మని చేరి, మీ పవిత్రమైన చేతులతో అమ్మ కన్నీరు తుడిచి భూభారాన్ని తగ్గించండి. అమ్మ కళ్ళ వెలుగులో మీ జీవితాలను పండించుకోండి. సాయి మాత ఆశయాలకి సాయి భక్తులందరూ ముందుకు వచ్చి విశ్వంలోని ప్రతి జీవినీ ప్రేమించి, ప్రేమను పొంది, ప్రేమ సామ్రాజ్యాన్ని స్థాపించండి. అప్పుడు తన బిడ్డలను చూసుకుని అమ్మ ఆనందంతో పొంగిపోవాలి. మన తల్లికోరిక తీర్చి భరతమాత ఋణం తీర్చుకుందాము !

## 1.12.2001

ఉదయం మందిరంలో పిల్లలంతా కాషాయరంగు స్వెట్టర్లు వేసుకుని వచ్చారు. ఆదృశ్యం కనుల విందుగా ఉంది. ఆ డ్రస్సులో పిల్లలంతా స్వామి రూపాలుగా కనిపించారు. స్వామి ప్రేమ బాటలో వీళ్ళు చిరు మొక్కలు "స్వామి ప్రేమ జల్లులలో తడిసి పెరిగి పెద్దవారై శాఖోపశాఖలుగా విస్తరించి, స్వామి ప్రేమతత్వాన్ని బోధించే కల్పతరువులా !" అన్న భావన నన్ను ప్రేమసాగరంలో ముంచి వేసింది.

**2.12.2001**

ఉదయం మందిరం నుంచి ఇంటికి వచ్చి ప్రక్కన ఉన్న లక్ష్మిగారి ఇంట్లోకి వెళ్ళాను. ఆవిడ నాతో "స్వామి ఫొటో" లామినేషన్‌కి ఇచ్చాను. 'భాషా' మీ ఇంట్లో పెడతాడు. నేను వచ్చాక తీసుకుంటాను" అని అన్నారు. నేను ఈ ఇంట్లో స్వామి ఫొటో పెట్టలేదు. స్వామీ ! నీ పాదాలు ఎవరి ద్వారా వస్తాయో అనుకుంటే సుధ వచ్చినప్పుడు సుధ చేత పాదాలు పెట్టించారు. ఆ రోజున పాదాలు వచ్చాయి. "స్వామి ఫొటో ఎవరి ద్వారా ఎలా వస్తుందో చూడాలి. నేను మాత్రం కొని పెట్టనని" అక్కడ ఉన్న వరలక్ష్మమ్మ గారు, భాస్కరంగారితో అన్నాను. కానీ, ఈ రోజు లక్ష్మిగారు ఫొటో పెట్టండి అనేసరికి చాలా అద్భుతం అనిపించింది. మొదటిసారి ఆమె ద్వారా ఫొటో వస్తున్నది. ఇది అంతా స్వామి సంకల్పంతోనే జరుగుతున్నది. నా ద్వారా నిర్ణయాలు చేయించేది, నెరవేర్చేది అన్నీ స్వామే. లీలానాటక సూత్రధారి. ఏక్షణం ఏమి చేస్తారో తెలియదు !

**7.12.2001**

స్వామి ఫొటో లామినేషన్ చేయించి భాషా తీసుకువచ్చాడు. అదే సమయానికి సీత వచ్చింది. సీత చేత ఫొటో పెట్టించి హారతి పట్టించాను. తను తెచ్చుకున్న పూలు స్వామికి వేసింది. నేను అన్న ప్రకారం ఈ విధంగా ఫొటో ఇంటికి రావడం మా వాళ్ళంతా చూసి చాలా ఆనందించారు. ఇది స్వామి అద్భుత లీల !

**3.12.2001**

ఈ రోజు 15 లైను వచ్చింది. ఈ రోజు కార్తీక మాసం విదియ

సోమవారం. తిథుల ప్రకారం స్వామి పుట్టిన రోజు. స్వామి పుస్తకం చదువుతుంటే స్వామి గురించి వ్రాసిన సత్యాలు, స్వభావాలు, ఆశయాలు అన్నీ నాలో ఉన్నాయని అనిపించింది. స్వామి అవతారపురుషుడు. ఆయన సంకల్పాలు జరిగి తీరుతాయి. స్వామి నాలోని కొన్ని జన్మల ఉత్తమ సంస్కారాలు లెక్కలోకి తీసుకుని, కొద్ది చెడు సంస్కారాలను తొలగించి, నాలోని దివ్యత్వాన్ని వెలికి తీయాలని సంకల్పించి, మొదటి సారిగా మద్రాసు సుందరంలో 1982లో నా 47 వ ఏట దర్శనం ఇచ్చి, తిరిగి రెండవసారి 83లో దర్శనం ఇచ్చి, 1984 జులై గురు పూర్ణిమకి పుట్టపర్తి రప్పించుకుని నా జీవితాన్ని సుందరనందనవనంగా మార్చారు.

స్వామి దర్శనంతో నాలో నివురు కప్పిన నిప్పులా ఉన్న సంస్కారాలు ప్రకాశించి, చెడు తొలగి అగ్ని సోకిన వస్త్రంలా నేను అఖండ దివ్య జ్యోతిగా స్వామిలో కలిసి పోయాను. నేనే సత్యం... శివం... సుందరం... స్వామి తన పుట్టిన రోజున నాకు ఇచ్చిన వెలలేని కానుక "తను నావాడై నాలో కలిసి పోయారు". నాజన్మ ధన్యమైనది. ప్రపంచంలో వెలకట్టలేని వస్తువు దైవం. ఆ దైవాన్ని పొందిన భాగ్యశాలిని. 18 సంవత్సరాలు గురుచరణ కమలాలను హృదయంలో పూజించిన ఫలితం దైవ రూపంలో నా ఒడి చేరింది. నేనే శివశక్తిని. విభూతి సుందరుడు నా అర్ధభాగం. కల్పవృక్షాన్ని పొందిన నాలో లోటేమున్నది? ప్రేమే చైతన్యం. ఆ చైతన్య వస్త్రాన్ని ధరించిన నేను ప్రేమ స్వరూపిణిని. నా ప్రేమ అనే ఖడ్గంతో మానవులలోని దుష్టభావాలను సంహరించి, ప్రేమ భావనలను వృద్ధి చేసి చైతన్యవంతులను చేస్తాను. శక్తితో సాధించలేనిది ఏమున్నది? ప్రేమే నా శక్తి. గురువు, దైవం, శిష్యుడు మూడూ ఏకమై ఒకటైన అద్వైత స్థితి. ఇదే తురీయానంద స్థితి. మానవుడు మాధవుడుగా మారిన ఈ

శుభ సందర్భంలో విశ్వమే నా స్వరూపంగా, విశ్వగర్భంలోని జీవులందరూ నా బిడ్డలుగా నా అనంత విశ్వ విరాట్స్వరూపంలో దర్శిస్తున్నాను. ఈ శుభ సందర్భంలో చలించేవీ, చలన రహితమైన అన్నిటికీ నా ప్రేమాశీస్సులు.

సర్వే జనాస్సుఖినో భవన్తు. శాంతి శ్శాంతి శ్శాంతిః

ఈ స్థితికి తీసుకు వచ్చిన నా జగద్గురువు శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారికి శిష్యురాలిగా ఏమివ్వను? ఇవ్వటానికంటూ ఏమి మిగిల్చారు? అంతా తానై నాలో నిండిన నా స్వామి నా హృదయ సామ్రాజ్యానికి చక్రవర్తిగా నిలిచిపోయారు. నన్ను తన ప్రేమ మూర్తిగా హృదయంలో నిలుపుకున్నారు. ఇద్దరం ఒక్కటయిన తరువాత ఇవ్వటానికి నేను, పుచ్చుకోవటానికి ఆయన 'ఇద్దరం'లేము. అదే ఏకత్వం. నేనే బ్రహ్మ, నేనే విష్ణు, నేనే శివుడు. అంతా బ్రహ్మమయం. ఉప్పు మూట నీటిలో కరిగిపోయినట్లు నేనన్నది లేకుండా బ్రహ్మానంద సాగరంలో మునిగి కలిసిపోయాను.

**5.12.2001**

దివ్య స్వప్నం : "నేను ఒక గుడిలోకి వెళ్ళాను. అక్కడ చాలా పెద్ద విగ్రహం ఉంది. దానిలో చిన్న చిన్న విగ్రహాలు ఉన్నాయి. ఆ పెద్ద విగ్రహం చూడటానికి అమ్మవారిలా ఉన్నది. ఆ విగ్రహంలో ఎడమ వైపున ఒక స్త్రీ విగ్రహం బిడ్డకు పాలు ఇస్తున్నది. పూజారి ఆ దృశ్యాన్ని నాకు చూపించాడు".

ఉదయం స్వామి ఆ విగ్రహం తన విరాట్‌స్వరూపం అని తెలియచేశారు. బిడ్డకు పాలు ఇస్తున్న స్త్రీ తానేనని, శివశక్తిగా బిడ్డలకి జ్ఞానక్షీరాన్ని ఇస్తున్నానని తెలియచేశారు. నిన్న "నేనే అనంత విశ్వవిరాట్స్వరూపాన్న"ని అనుభూతి కలుగ చేశారు.

**31.1.2002**

దృశ్యం : ఎవరో గాజుబాటిల్‌లో కృష్ణ నీరు ఇచ్చారు. మధ్యాహ్నం దృశ్యం "ఉగరంతో చూపుడు వేలు కనిపించింది".

"నువ్వు పవిత్ర నది లాటి దానివని తెలియచేశారు". ఉంగరం వేలుకి అర్థం "గురువుగ నిన్ను చూసుకుంటున్నాను. నా సంకల్పంతోనే ఇలా జరుగుతున్నది. ఈ విధంగా దేహ సంబంధమైన కొద్దిపాటి అనారోగ్యం, ఋణాలు అన్నీ తొలగిస్తున్నాను. నీ ఆఖరి జన్మలో డబ్బుతోనూ, నీకు సేవ చేస్తున్న వాళ్ళ ఋణాలు శేషం లేకుండా ఋణ విముక్తి చేస్తున్నాను. నిశ్చింతగా ఉండు!"

"స్వామీ! నాకు నువ్వు ఉండగా ఈ శారీరిక బాధలు, ఎందుకు? నువ్వు తగ్గించలేవా?" అని అనుకున్నందుకు పై విధంగా తెలియచేశారు.

**10.3.2002**

ఉదయం మందిరం వరండాలో స్వామి మత్స్య (చేప) రూపంలో దర్శనం ఇచ్చినట్లు భావన కలిగింది. అలా ఎందుకు అనిపించిందో అర్థం కాలేదు.

మధ్యాహ్నం 'నారాయణీయం' చదువుతుంటే అందులో "మచ్చలేని మహనీయుల హృదయంలో మత్స్య రూపంలో వెలుగు "పరతత్వం" అని వ్రాసి ఉన్నది.

**13.3.2002**

దృశ్యం : "వెలుతురు కనిపించటమే బ్రహ్మానంద స్థితి" అన్న అక్షరాలు కనిపించాయి. మందిరంలోని అందరి శిరస్సులు శివలింగాలుగా కనిపించాయి. మధ్యాహ్నం పడుకుని ఈ విధంగా అనుకున్నాను.

"స్వామీ ! ఆకాశంలో ప్రకాశించే సూర్యుడు తన కిరణాలతో చీకటిని పోగొట్టి వెలుతురు ప్రసాదిస్తుంటే నువ్వు భూమిపై జన్మించి జ్ఞాన భాస్కరుడివై నీ జ్ఞాన కిరణాలతో మాలోని అజ్ఞానమనే చీకటిని పోగొట్టి వెలుగును ప్రసాదిస్తున్నావు. జ్ఞాన భాస్కరా ! గురుదేవా ! నీకు శతకోటి నమస్కారాలు".

★ ★ ★

బాలచంద్రుడివై పుడమిపై వెలసి నీ చల్లని కిరణాలతో మా హృదయాలను చల్లపరచి ప్రశాంతిని ప్రసాదిస్తున్న గురు చంద్రమా ! నీకు నమస్సుమాంజలులు. నువ్వే సూర్యచంద్రులై మా కళ్ళ ఎదుట తిరుగుతుంటే అది మా భాగ్యం కాదా ! సూర్యచంద్రుల తేజస్సును మా కళ్ళలో నింపుకున్న మాకు ప్రతి వస్తువూ నీ వెలుగై, చల్లగా కనిపిస్తుంటే, సృష్టిలోని ప్రతి జీవిలోను నిన్నే దర్శిస్తూ అద్వైత స్థితిలో నిలిచి నన్ను నేను మరిచి బ్రహ్మానంద పారవశ్యంలో బ్రహ్మాండమంతా నేనే నిండిపోయాను స్వామీ ! ఇదంతా నా ద్వారా నువ్వు వ్రాసుకున్నావు. గురురత్నమా ! నా నోట పలికిన నీ మాటల రతనాలు హారంగా చేసి నీ మెడలో అలంకరించాను ప్రభూ !

మధ్యాహ్నం దృశ్యం - తెల్లని మల్లెపూల వంటి దుస్తులు ధరించిన కార్యకర్తల మధ్య స్వామి ముఖం మాత్రం చంద్రబింబంలా కనిపించింది. పున్నమి రోజున పూర్ణచంద్రుడవై నాకు దర్శనం ప్రసాదించావు. అది నీ భక్తులపై ఉన్న వాత్సల్యం. నీ దర్శన భాగ్యంతో నా మనసు సేద తీరింది. నా చల్లని మనసును నీకు కానుకగా సమర్పిస్తున్న నన్ను నీ చల్లని కిరణాలతో ఆశీర్వదించు.

**10.7.2002**

స్వప్నం : "ఒక అందమైన ఎనిమిదేళ్ల పాప అన్ని ఆభరణాలు ధరించి నా వద్దకి వచ్చింది. నేను ఆ పాపతో ఏ సంబంధం లేనట్లు నిర్వికారంగా ముద్దు పెట్టుకున్నాను.

1984 లో ఒక స్వప్నంలో “8 సంవత్సరాల పాప పట్టులంగా జాకెట్టు ధరించి ఆభరణాలతో గోడమీద కనిపించింది. తర్వాత మా అక్క కొడుకు మూర్తితో శివాలయంకి వెళ్ళాను.” ఆ కలకి అర్థం పుట్టపర్తి బాబా వద్దకి వెళ్ళిన తర్వాత తెలియచేశారు.

**11.7.2002**

“నిన్న స్వప్నంలో కనిపించిన పాప అష్టైశ్వర్య స్వరూపిణి “బాలా త్రిపుర సుందరి” అని ఉదయం మందిరం నుంచి వచ్చిన తరువాత నా గురుదేవులు తెలియచేశారు. వెంటనే ఆనంద భాష్పాలు కంటి నుంచి ధారగా కారినాయి. “అమ్మా ! బాలవై నాకు ముక్తిని ప్రసాదించటానికి వచ్చావా !” అని చాలా సేపు సమాధి స్థితిలో ఉండిపోయాను.

**12.7.2002**

ఉదయం మందిరంలో ధ్యానస్థితిలో “1985 లో వినబడ్డ అగ్నిశిఖ అన్న మాటకి అర్థం ఇలా తెలియచేశారు...

“పంచతత్వాలు దాటిన తర్వాత యోగి దర్శించేది చిచ్ఛక్తిని. అదే “అగ్నిశిఖ”. అది “నేనే”. విశ్వమంతా నిండిన తేజోరాశిని. అది దర్శించిన తరువాత జన్మలేదు. చర్మ చక్షువులతో నా దేహాన్ని చూస్తున్నారు. కానీ నీ ఉన్నత సంస్కారాల బలం వలన నీ చెడు సంస్కారాలను నీ గురుకృపతో జయించి, అగ్ని సోకిన బంగారంలా శుద్ధి చేయబడి నీ జ్ఞాన నేత్రం తెరుచుకుని నా దివ్య తేజస్సును (అగ్నిశిఖను) దర్శించావు. నువ్వు నా బంగారువి” అని హృదయ భాషలో తెలియచేశారు.

స్వామి నన్ను బంగారూ అని పిలవాలన్న నా పద్ధెనిమిది సంవత్సరాల కోరిక ఈ రోజు తీర్చారు. అద్భుత సాయి అద్భుతాలు ఎన్నో చూసిన మీరు, నా జీవత్వాన్ని దైవత్వంగా మార్చిన అద్భుత సాయి ఈ అద్భుత లీలను స్వామి త్వరలోనే అందరి ముందూ ప్రకటిస్తారు. సత్యం... సత్యం... సత్యం... !

ఉదయం స్వామి దర్శనం తరువాత మందిరంలోకి వెళ్ళబోతూ కొద్దిసేపు మగవాళ్ళ వైపు నుంచున్నప్పుడు హృదయ భాషలో యిలా తెలియచేశారు. “నువ్వు జ్ఞానాన్ని కోరుకున్నావు. నువ్వు కోరుకున్న విధంగా నీలోని మాలిన్యాన్ని తొలగించి నీలోని జ్ఞాన మణిని వెలికి తీశాను. నీజ్ఞాన ప్రకాశం దర్శించి తెలుసుకున్న వాళ్ళు మాత్రం తరిస్తారు. నీ గురు దేవుల వాక్కువృథా కాదు.” అని తెలియచేసి లోనికి వెళ్ళారు. స్వామి ఇలా హృదయ భాషలో ఇంటర్వ్యూలు ఇచ్చి ఎంతో మందిని అనుగ్రహిస్తున్నారు. వాళ్ళ అనుభవాలు చెబితే కాని ఎవ్వరికీ తెలియదు.

గురుదేవా ! నన్ను అనుగ్రహించి జ్ఞానమణిని ప్రసాదించిన నీ కృపకు ఏమివ్వను? నీ చైతన్యంలో కలిసిన తరువాత ఇవ్వటానికి ఏమున్నది? కానీ, గురు శిష్య సంబంధంతో ఏదయినా అడుగు. ఏది అడిగినా ప్రేమతో ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాను. ద్రోణుడు గురు దక్షిణగా ఏకలవ్యుని వేలుని మాత్రమే కోరాడు. కానీ, నేను నా గురువుకు దక్షిణగా నా జ్ఞానమణిని స్వామి పాదకమలాల మధ్య ఉంచుతాను. అక్కడ ఉంటేనే దానికి విలువ. ఏమీ బిడ్డల నుంచి కోరని నా గురుదేవులకు నేను ఇచ్చే ప్రేమ కానుక ఇదే ! ఉదయం అంతా స్వామి అగ్నిశిఖలా విశ్వమంతా దర్శనం ఇచ్చారు. ఈ దర్శనంతో నా జన్మ ధన్యమైంది.

**16.7.2002**

విన్నమాట "చెట్టునుంచి పూలుకోసి మాలకడుతున్నాను". ఆ చెట్టు ఉన్న చోటు ప్రశాంతి నిలయం లాగా కనిపించింది. వీటికి అర్థం స్వామి ఇలా తెలియచేశారు...

"స్వామి కల్పవృక్షం. స్వామి పాదాల వద్దకు వెళ్ళి, మన చెడు గుణాలు ఆయనకి అర్పించి, మంచి గుణాలను ప్రసాదించమని వేడుకుంటే దయగల స్వామి చెడుగుణాలు తొలగించి మంచి గుణాలను ప్రసాదిస్తారు. పరిమిళ భరితమైన సుగుణ పుష్పాలను మాలకట్టి ఆయనకే సమర్పించాలి. స్వామి మన నుంచి కోరే పూలమాల ఇదే. అంటే ఆధ్యాత్మిక తోటలో పూసిన అద్వైత పుష్పాలుగా స్వామి పాదాల వద్దకు చేరాలి. అప్పుడే స్వామికి ఆనందం. ప్రభూ! ఈ అద్వైత పుష్పాన్ని ఎప్పుడు స్వీకరిస్తావు? ఈ నిరీక్షణలో ఈ పూవువాడి, రేకులు ఊడి రాలిపోవటానికి సిద్ధంగా ఉన్న ఈ సమయంలో నన్ను ప్రేమతో అనుగ్రహించి నీ పాదాల వద్దకు చేర్చుకో. గురుపూర్ణిమకి ఈ జ్ఞాన పుష్పాన్ని గురుదక్షిణగా స్వీకరించి ఆశీర్వదించు.

**17.7.2002**

రాత్రి గీత వచ్చింది. ఇద్దరం ఆధ్యాత్మిక విషయాలు మాట్లాడుకున్నాము. ఉన్నట్లుండి గీత "అమ్మమ్మ గారు! మీ శరీరం కాషాయ వర్ణంగా కనపడుతున్నదని" చెప్పింది. వెంటనే నా శరీరం రోమాంచితం అయ్యింది. అలా మూడుసార్లు కనిపించానుట. తను చెప్పినప్పుడల్లా నా శరీరం రోమాంచితం అవుతూనే ఉన్నది.

**29.7.2002**

ఉదయం నుంచి చాలా ప్రశాంతంగా ఉన్నది. ఏది జరగాలో జీవితంలో అదే జరుగుతుంది. పోరాటం అనవసరం. గురుదేవులు నన్ను వల వేసి పట్టి తెచ్చి సాధన చేయించి అద్వైత స్థితికి తీసుకు వెళ్ళారు. నా అణువణువు రసస్వరూపంగా మారిపోయింది. నా ఆనందంలో నేను ఉంటాను. భగవంతుడు రసస్వరూపుడు.

**1.8.2002**

దృశ్యం : సన్న సన్న కన్నాలు ఉన్న "జల్లెడ" కనిపించింది. స్వామిని ఆ దృశ్యానికి అర్థం తెలియ చెయ్యమని ప్రార్థించాను. అప్పుడు స్వామి ఎప్పుడో చెప్పిన మాట జ్ఞాపకం వచ్చింది. భక్తుల్ని తూర్పార పడతాను. తాలు అంతా పోయి, గట్టి గింజలు మిగులుతాయి. ఆ గట్టిగింజలే భక్తులు. జల్లెడకు అర్థం అదే అని స్వామి తెలియచేశారు.

"చెరుకుగడని గానుగ పట్టి రసాన్ని వడకట్టి చెత్తను తీసినట్లు, భక్తుని సాధనలో నల్లగ్గొట్టి, చెడు తొలగించి, వాళ్ళలోని ప్రేమ రసాన్ని వడగట్టి వాళ్ళని విశ్వప్రేమికులుగా తీర్చిదిద్దటమే గురువు లక్ష్యం. మనసాయి జగద్గురువు. మనలను విశ్వ ప్రేమికులుగా తీర్చిదిద్దటానికి దివి నుంచి భువికి దిగి వచ్చిన పరమేశ్వరుడు. ఆయన పాదాల వద్ద చేరి సాయి శిక్షణలో విశ్వ ప్రేమికులుగా తరిద్దాము."

★ ★ ★

ఉదయం మనసులో ఈ భావన కలిగింది.

"శిశువు తల్లి గర్భం నుంచి పుడమి తల్లి ఒడిలోకి వస్తాడు. తల్లిపాల

తరువాత ప్రకృతి మాత ప్రసాదించిన ఫలసాయంతో పెరిగి పెద్దవాడవుతాడు. భూదేవి ఋణం తీర్చుకోలేనిది. భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం అనే పంచభూతాలు మనిషి జీవించటానికి ముఖ్యమైనవి. అలాటి పంచభూతాలను మానవుడు నిర్లక్ష్యం చేస్తున్నాడు. ఇదే మానవుడి పతనానికి కారణం. పంచభూతాలే భగవంతుడు. అవి మనలోనూ ఉన్నాయి. కాబట్టి మనం కూడా భగవత్స్వరూపులమే ఇంద్రియనిగ్రహంతో పంచభూతాలను అదుపులో ఉంచుకుని శక్తివంతులు కండి. తోటి మనుషులను ప్రేమించనివాడు భగవంతుని ప్రేమకు అర్హుడు కాడు. పంచ భూతాలను ప్రేమించండి. ఈ సృష్టిలోని ప్రతి జీవిలోనూ దైవాన్ని చూడండి. ఈ రోజు పొంగలి చెయ్యాలని అనిపించింది. కాని, వెంటనే స్వామి మానసికంగా ఇలా తెలియ చేశారు. “పొంగలి నివేదనకాదు. నీ స్వచ్ఛమైన ప్రేమను విశ్వమంతా పంచు. ప్రేమకు మించిన వస్తువు ఇంకొకటి లేదు” అప్పుడు విశ్వ విరాట్ స్వరూపానికి నా ప్రేమే నివేదన చేశాను. విశ్వరూపదర్శనం చేసుకున్న నేను విశ్వ విరాట్ స్వరూపాన్ని! నాలోపల, బైట అంతా ప్రేమమయం!

**3.8.2002**

“స్వామీ! నువ్వు సగుణ రూపంలో పలుకవు. నేను, ప్రకృతిలోని సంపదలన్నీ అనుభవిస్తూ “శవం”లా జీవిస్తాను. అని అనుకున్న వెంటనే మళ్ళీ ఇలా అనిపించింది. “శివంగా” మారిన నేను మళ్ళీ తిరిగి “శవంగా” ఎలా మారతాను? నేను శివుడనే అని అనుకున్నాను. స్వామి వచ్చి నా ముందు లైనులో కూర్చున్న ఆవిడతో చదువు ... చదువు అంటూ చిరునవ్వు నవ్వుతూ వెళ్ళారు. నా వైపు చూసీ చూడనట్లు చూసి “నీవు శవానివి కావు శివుడివి. అలాగే మననం చేసుకో తొందరలోనే పిలుస్తాను. శాంతంగా ఉండు”. అని

హృదయభాషలోనే తెలియచేశారు. ఆవిడతో చదువు చదువు అని అనటానికి కారణం "నన్ను శివుడు, శివుడు అని మననం చేసుకోమని" ఆ విధంగా తెలియచేశారు.

★ ★ ★

కనిపించిన దృశ్యాలు : "విస్తర్లకట్ట, అగరుబత్తి నుంచి పొగ,
నోటి నుంచి తుంపర్లు రావటం."
స్వామి వీటికి అర్థాలు ఇంకా తెలియచేశారు.
నీ జీవితం వడ్డించిన విస్తరి.
నీ కీర్తి దిగంతాల వరకు "వ్యాపిస్తుంది."

"నీలో "జ్ఞానగంగ" పొంగి ప్రవహిస్తూన్నది. ఆ తుంపర్లు దాని నుండి వచ్చినవే. ఇది సాయివాణి నుండి వచ్చినవి. అవన్నీ జరుగుతాయి. నిశ్చింతగా ఉండు. పంచభూతాలు దాటి నిర్గుణ బ్రహ్మలో కలిసిపోయావు. పంచభూతాలు నీ అధీనంలో ఉన్నాయి" అని గురుదేవులు మానసికంగా తెలియచేశారు.

**15.8.2002**

ఈ రోజు స్వామి దర్శనంతో నా ప్రారబ్ధం తొలగినట్లు అయింది. గ్రహణం పట్టిన చంద్రుడిలా నా ప్రారబ్ధం గురుకృపతో తొలగి, పదహారు కళలతో పూర్ణ చంద్రుడిలా జ్ఞాన ప్రకాశంతో వెలుగుతున్న నా వద్దకి నా గురుదేవులు వచ్చి పూర్ణాశీస్సులు అందజేస్తారు. విశ్వమంతా నిండిన నా హృదయకమలం పరిచి ఉంచాను. త్వరగా నా దరికి చేరు ప్రభూ!

విన్నమాట "చూస్తున్నాను – అన్నీ చేస్తాను".

**11.10.2002**

కలలో "స్వామి గోచీ పెట్టుకుని కనిపించారు". ఇలా కనిపించారేమిటి అనుకున్నాను. స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు. "యోగి వేమనలాగా అలా కనిపించాను."

**12.10.2002**

ఉదయం భాస్కరం గారు వచ్చారు. ఆవిడ వెళ్తూ నాకు పాదనమస్కారం చేసుకుంటుంటే ఆ చేతులలో స్వామి కనిపించారుట. ఆనందంతో కళ్ళనీళ్ళు పెట్టుకుని చెప్పారు ఆ రోజు మూలానక్షత్రం. సప్తమీ తిథి. నవరాత్రులలో నాకు నమస్కారం చేయటం. సాయి మాత ప్రేరణతోనే జరిగింది.

**17.10.2002**

కలలో నేను ఆనందంతో అతీత స్థితిలో ఉండగా స్వామి నన్ను "నువ్వు ఎవరు?" అన్నారు. "నేను దేవుడినని" రెండుసార్లు చెప్పాను. "ఔను" అన్నారు.

**19.10.2002**

నా అంతరంగ "భావకుసుమా"లని నా ప్రేమ జల్లుతో తడిపి "దివ్యనామం" అనే దారంతో మాల కట్టి స్వామి కంఠసీమలో అలంకరించాను. సాయీశ్వరుని జటాఝూటం నుంచి ప్రవహించిన పవిత్ర గంగలో మునకవేశాను.

నీల మేఘశ్యాముని కృపావర్షం నాపై వర్షించబోయే ముందు నా మనసు సప్త వర్ణాల హరివిల్లై నా కన్నయ్య రాక కోసం ఎదురు చూస్తున్నది.

**27.10.2002**

మధ్యాహ్నం కలలో పసిపాప నవ్వుతూ నట్టింట్లో ఆడుకుంటున్నది. ఆ పాప అష్టైశ్వర్యాలు ప్రసాదించే శ్రీ లక్ష్మిలా అనిపించింది. అమ్మ ఐశ్వర్య రూపిణి. నీవు ప్రసాదించే ఈ సిరులన్నీ అందరికీ, నాకు మాత్రం నీ పాదాలు చాలు. ఇది వ్రాస్తుంటే శరీరం అంతా స్వామి స్పర్శతో నిండిపోయింది. ఈ శరీరంలోని ప్రతి అణువు అణువు అమ్మ వెలుగే. ఈ వెలుగే ఆనంద జ్యోతులై ఇంటింటా వెలగాలి.

**5.11.2002**

దృశ్యం : రెపరెపలాడుతున్న "జ్యోతి" కనిపించింది.

"ప్రభూ! నా జీవన జ్యోతి కొడిగట్టి, రెపరెపలాడి ఆరిపోవటానికి వీలులేదు. సాయిశక్తి అనే చమురుతో నింపి దివ్య జ్యోతినై నీ పాదాల వద్ద "అఖండ జ్యోతిలా" నిలిచిపోతాను. సాధకులు ఈ జ్యోతి వెలుగులో పరమపదమైన నీ పాదాల వద్ద చేరి నీ దివ్య జ్యోతిలో కలిసిపోవాలి. మంచిపనికి దైవ సహాయం ఉంటుందని అంటారు. ఆ ఆశతోనే మౌనపోరాటం సాగిస్తున్నాను. ఇకనైనా మౌనం వీడి కదలిరా. ఈ దుఃఖానికి తెరవెయ్యి. నా కర్మలు తొలగించు. నన్ను నమ్మించి నీ దరి చేర్చుకుని నీవు లేకపోతే బ్రతకలేని స్థితిని కల్పించి వేడుక చూస్తున్నావా వెన్నదొంగా! నీ సొత్తునని, నిన్ను వీడి ఎక్కడికీ వెళ్ళనని తెలిసి నన్ను బంధించి వేడుక చూస్తున్నావా? ఎక్కువ కాలం నీతో మాట్లాడకుండా ఉండే శక్తి నాకు లేదు. నా ప్రేమ మూర్తివి. ప్రేమ, ప్రేమ అంటావు. పరిపూర్ణమైన ప్రేమను నింపుకుని నీ కోసం జీవిస్తున్న నన్ను నిర్లక్ష్యం చేస్తున్నావు. నువ్వు తప్ప నాకెవరు దిక్కు? త్వరగా నాదిక్కుకురా. ఆశతో, వేదనతో ఎదురు చూస్తున్నాను."

## 9.11.2002

1985లో వైజాగ్‌లో కాలేజి, కాన్వెంటు పెట్టిన ఇంట్లో పెరటిలో తులసిమొక్క పెట్టి పసుపు, కుంకుమ బొట్లు పెట్టి చుట్టూ నీళ్ళు జల్లి ముగ్గులు పెట్టే దాన్ని. ఒకరోజున ఇలా అనిపించింది. తులసి మొక్క ఉన్న చోట షామియానా వేయించి నా ఆత్మీయులను పిలిచి భోజనాలు పెట్టాలని అనుకున్నాను. కానీ, అలా జరగలేదు. తరువాత ఒకసారి హైదరాబాద్ వెళ్ళి మళ్ళీ వచ్చేసరికి తులసి మొక్క నిలువునా ఎండిపోయింది. చాలా బాధ అనిపించింది. తరువాత ఆ ఇల్లు ఖాళీ చెయ్యటం జరిగింది. భోజనాలు పెట్టాలన్న కోరిక అలా ఉండిపోయింది.

కానీ, ఈ రోజు 14 సంవత్సరాల తరువాత స్వామి ఇలా తెలియచేశారు. "తులసి మొక్క వద్ద భోజనాలు పెట్టలేదు. అన్న బాధ నీకు ఉన్నది కదా! ఆ కోరిక ఇంకొక విధంగా తీరుతుంది. నీలో చెడును తొలగించి నిన్ను పవిత్రమైన తులసిలాగా పవిత్రురాలని చేశాను. నీ సన్నిధిలో చాలా మంది నీ చేత్తో భోజనం చేస్తారు. ఇలా చెయ్యటానికే ఆ విధంగా తులసి ఎండిపోయింది. అది నా సంకల్పమే. అది త్వరలోనే జరగుతుంది." ప్రతిరోజూ భోజనం చేస్తూ "ప్రభూ! నేను తినే ప్రతి మెతుకూ పది మంది తినాలన్న కోరిక నీవు తీరుస్తున్నందుకు ఆనందంగా ఉంది."

## 15.11.2002

స్వప్నం : "కాషాయరంగు బట్టలతో స్వామి పాదాల నుంచి భుజాల వరకు కనిపించారు. తల కనిపించలేదు. ప్రక్కన తెల్లదుస్తులతో వలంటీరు వెంటరాగా స్వామి వెనుక నుంచి దర్శనం ఇచ్చారు. తరువాత చంద్రబింబం మూడు వంతులు మాత్రమే ఉండి చుట్టూ కాషాయరంగుతో చంద్ర దర్శనం అయ్యింది."

**20.11.2002**

ఉదయం స్వామి తన చేతుల మీదుగా అందరికీ చీరలు ఇస్తున్నారు. "స్వామీ! నాకు చీరెలు ఇస్తానని, అవసరమున్నా ఇవ్వటం లేదు. అవసరం లేని వాళ్ళకి ఇస్తున్నావన్న భావన ఉండేది. కానీ, ఈ రోజు ఆ భావన లేదు. స్వామిలో నేను ఉండి, ఇద్దరం ఒక్కటై తల్లిబిడ్డలకు ఇస్తున్న భావన కలిగింది. వాళ్ళంతా నా బిడ్డలుగా కనిపించారు. ఇవ్వటంలో ఎంత ఆనందం ఉన్నదో స్వామి అనుభవ పూర్వకంగా తెలియచేశారు. ప్రభూ! ఈ చేతులు ఇచ్చేవే కానీ పుచ్చుకునేవి కావు. మొదట నుంచీ ఎవరు ఏమి ఇచ్చినా తీసుకునే స్వభావం లేదు. ఈ స్వభావాన్ని ఇంకా సంస్కరించి తీర్చిదిద్దారు.

★ ★ ★

ఉదయం దర్శనానికి వెళ్ళాను. మందిరంలో, స్వామి వచ్చిన తరువాత "స్వామీ! తలతో దర్శనం ఇవ్వలేదేమిటి కలలో?" అని మనసులో అనుకున్నాను. "నా ముఖం చూపించకుండా చంద్రదర్శనం చేయించాను. ఆ చంద్రబింబం నేనే కదా!" అని తెలియచేశారు. స్వామి అనుగ్రహించి అర్థం చెబితేనే కాని తెలియదు. తరువాత భజన జరిగింది. నా మనస్సు అతీత స్థితిలో ఉండి ఆనందంతో దుఃఖిస్తూ కూర్చున్నాను. 'ప్రభూ' నీ కోసం ప్రేమాగ్ని జ్వాలలతో దహించుకుపోతున్న నాపై నీ ప్రేమ జల్లు కురిపించి నా తాపాన్ని చల్లార్చు. అగ్నిగుండంలో ఉన్న నన్ను నీ వరద హస్తంతో పైకి తియ్యి. ప్రేమ అనే సుడిగుండంలో ఉన్న నాదరిచేరి ఒడ్డుకు చేర్చు. నీ కోసం ప్రేమా ప్రేమా అంటూ ఊబిలో ఉన్న నన్ను నీ ప్రేమపాశంతో పైకి తియ్యి. ప్రేమ అనే అగ్ని జ్వాలలు నన్ను దహించి వేస్తున్నాయి. నీ ఒడి చేరకుండానే శిథిలమైపోతున్న నా దేహాన్ని నీ ఒడి చేర్చుకో. విభూతి సుందరా! దేహమనే భ్రాంతిని వీడి

జ్ఞానాగ్ని శిఖలో దగ్ధమైన నా విభూతి నీ విభూతిలో కలసిపోనివ్వు చంద్రశేఖరా!" అంటూ ప్రార్థించాను.

స్వామి ఈ విధంగా తెలియచేశారు ... "నువ్వు గురువు – గురువు అంటూ సుఖంలో, దుఃఖంలో ఆర్తితో నిస్వార్థంతో సత్య, ధర్మ, శాంతి. ప్రేమలతో నేను పలకకపోయినా నాచుట్టూ విసుగు, విరామం లేకుండా పద్దెనిమిది సంవత్సరాల నుంచి తిరుగుతున్నావు. పూర్ణ చంద్రుడైన నీ గురు తేజము నీ వద్దకు వచ్చే సమయం ఆసన్నమైంది. ప్రేమతో కూడిన నీ నీరిక్షణ ఫలిస్తుంది. నీ ప్రేమ మూర్తి నీ మీద మూడు వంతుల అనుగ్రహంతో ఉన్నారు. అందుకే మూడు వంతులు మాత్రమే ఉన్న చంద్ర దర్శనం అయింది. ఆ ఒక్క వంతు అనుగ్రహం నీకు ప్రసాదించి నీకు పూర్ణచంద్రుడినై దర్శన, స్పర్శన, సంభాషణ భాగ్యాన్ని కలుగచేస్తాను. నీ తపస్సు ఫలించే సమయంలో నా కోసం ఆరాటంతో అశాంతిగా ఉండకు. నీ శాంతమే రక్ష" అని బోధించారు. గురుదేవా! నీకు నా శతకోటి ప్రణామాలు!

## 25.1.2003

రాత్రి స్వప్నం – "ఒక పెళ్ళి జరుగుతున్నది. అక్కడ ఒక పురుషుడు నోటితో శబ్దం చేస్తున్నాడు. అది మ్యూజిక్ లాగా వస్తున్నది. అక్కడ కొంత మంది స్త్రీలు ఒకే వయసులో ఉన్నారు. వాళ్ళు లలితా సహస్ర నామాలకి అర్థం తెలియచేస్తూ నృత్యం చేస్తున్నారు."

ఉదయం మందిరంలో స్వామి కలకి అర్థం తెలియచేశారు. "ఆ స్త్రీలు పదహారు కళలతో వర్ధిల్లుతున్న అష్టలక్ష్ములని, సాధకుడు ప్రణవ మంత్రస్వరూపిణి గాయత్రీ మంత్రాన్ని (శ్రీలలిత) తైలధార లాగా ప్రేమతో జపిస్తుంటే అష్టలక్ష్ములు ఆనంద తాండవ చేస్తున్నారు." అమ్మ శ్రీ లలిత అనుగ్రహం పొందిన వాళ్ళ

పాదాలను ఆశ్రయించుకుని అష్టైశ్వర్యాలు ఉంటాయి. కానీ సాధనలో సిద్ధిపొందిన మహాత్ములకు అమ్మ పాదాలు తప్ప అష్టైశ్వర్యాలతో పని ఏమున్నది? అమ్మ పాదాల నుంచి స్రవిస్తున్న ప్రేమామృతంలో లీనం అయిన మహాత్ములు ధన్యజీవులు!

**20. 8. 2003**

కలలో "ఒక బ్రాహ్మణుడిని మీకు వేదాలు తెలుసుకదా! కుండలినీ యోగం గురించి తెలుసా?" అని అడిగాను. "తెలియదని" అన్నాడు. నేను "ఆ మార్గాన వెళ్ళానని" ఆయనతో చెబితే "అయితే మీరు అందరిలో భగవంతుడిని చూస్తున్నారా?" అని అడిగారు. "చూస్తున్నాను. అక్కడ కనిపించే బర్రెలోనూ మీలోనూ కూడా భగవంతుడిని చూస్తున్నాను" అని చెప్పాను. "అయితే మీకు సాక్షాత్కారం అయ్యింది" అని చెప్పారు.

కలలో చిన్నికృష్ణుడు తన చిన్నచిన్న పాదాలతో నృత్యం చేస్తున్నాడు. నేను ఆ పాదాలకి పారాణి పెట్టి, గజ్జెలు కట్టి ఫొటో తీయమని అన్నాను. నిన్నంతా స్వామీ! నా హృదయం మీద నీ పాదాలతో మర్దన చేసి నా కర్మని తొలగించమని ప్రార్థించాను. నా ప్రార్థన ఆలకించి నా కన్నయ్య కలలో ఆ తాండవ నృత్యం చూపించాడు. ఆ చిన్నిచిన్ని పాదాలు అలా నాట్యం చేస్తుంటే చూడటం ఎన్ని జన్మల పుణ్యమో! నృత్యం చేస్తుంటే అరిపాదాలు చిన్నచిన్నగా కనిపిస్తుంటే పరవశించి పోయాను. జన్మధన్యం అయ్యింది. సాయికృష్ణా! ఐదు కృష్ణాష్టములు గడిచిపోయాయి. నువ్వు భౌతికంగా నా దగ్గరికి రాలేదు. ఈ బాధ భరించలేక నా హృదయం బ్రద్ధలవుతున్నది. మళ్ళీ కృష్ణాష్టమి వరకూ నీ కోసం నిరీక్షించలేను. నువ్వు నా హృదయంలో వ్యక్తం కావడమే కృష్ణాష్టమి. అదే నిజమైన కృష్ణాష్టమి! ఇక ఆలస్యం చేయకు. నా దరి చేరు ప్రభూ!

**28.8.2003**

1984లో స్వామి వస్త్రం ఇస్తానని తెలియచేసిన రోజున "స్వామీ! ఉన్న చీరలన్నీ దొంగలు ఎత్తుకు పోయినా ఏక వస్త్రంతో ఉంటాను. కాని, కొనుక్కోను" అని స్వామి సన్నిధిలో ప్రతిజ్ఞ చేశాను. దానికి అర్థం స్వామి ఈ రోజు తెలియచేశారు. భగవంతుడు మాయ పొరలు తొలగించినప్పుడు చైతన్యమే ఏకవస్త్రంగా సాధకుడు ఆత్మభావనలో ఉంటాడు. (ఏకవస్త్రం అంటే చీరకాదు).

**14.2.2003**

నిన్న మధ్యాహ్నం స్వామి లీలకు సంబంధించిన ఉత్తరం జిరాక్స్ తీయించటానికి వీధిలోకి రాగానే బంతిపూల తట్టని నెత్తిన పెట్టుకుని ఒక పూలమ్మి నన్ను చూసి "పూలు బాగున్నాయా?" అంటూ వెళ్ళి పోయింది. "పూలు బాగున్నాయి ... కొంటారా?" అని అడగవలసింది" "పూలు బాగున్నాయా?" అంటూ వెళ్ళి పోయింది. "పూలు బాగున్నాయి ... కొంటారా? అని అడగవలసింది" పూలు "బాగున్నాయా!" అని వెళ్ళిపోవటం ఆశ్చర్యం అనిపించింది. స్వామి ఆమె రూపంలో నేను చూపిస్తున్న లీలలు బాగున్నాయా? అని అడిగినట్లు అయ్యింది. స్వామి లీలలు పరిమళ భరిత పుష్పాలే కదా! అందుకే స్వామి పూలమ్మి రూపంలో నాకు దర్శనం ఇచ్చారు. స్వామి ఏ రూపంలోనైనా భక్తులకి దర్శనం ఇస్తారు. కానీ, ఆయన దయతో మనకి తెలియచేస్తే తప్ప మనం తెలుసుకోలేము.

**20.2.2003**

'స్వామీ! భక్తులు నీ వద్దకు వచ్చి, నీ బోధలు వింటున్నా వాళ్ళల్లో మార్పు రావటం లేదు" అని బాధపడ్డాను. స్వామి మానసికంగా ఇలా

తెలియచేశారు ...” ఇక మీదట నువ్వు కూడా నాతోపాటు ఈ జగన్నాటకాన్ని చూడు. అంతేకాని ఈ ప్రపంచంతో సంగమము పెట్టుకోకు. ప్రపంచం సినిమా తెరలాటిది. జీవులు ఈ తెర మీద వాళ్ళ వాళ్ళ జన్మ సంస్కారాలను బట్టి వాళ్ళ వాళ్ళ పాత్రలను సమర్థ వంతంగా పోషించి నిష్క్రమిస్తారు. నా అనుగ్రహంతో నీలోని దోషాలను తొలగించి ముక్తిని ప్రసాదించాను. ఈ జగన్నాటకాన్ని భగవంతుని లీలగా దర్శించు. సుఖ దుఃఖాలకి, రాగ ద్వేషాలకి అతీతంగా ఉన్న నిన్ను సమయం వచ్చినప్పుడు నాలో లయం చేసుకుంటాను. అంతవరకు నేనునీకు అనుగ్రహంగా ప్రసాదించిన నీ పాత్రను సమర్థవంతంగా పోషించు. నిన్ను విశ్వకళ్యాణానికి ఒక పరికరంగా ఉపయోగించుకుంటాను.”

సాయి మాట “అనుగ్రహపు” మూట. ఆ మూటలో ఎన్నో విలువైన కానుకలు ఉన్నాయి. స్వామిని సందేహించక దరిచేరి ఈ మూటలోని విలువైన ఆధ్యాత్మిక సత్యాలనే ఆణిముత్యాలను స్వంతం చేసుకోండి. అవతారం చాలించే సమయం దగ్గర పడుతున్నది. ఆలస్యం చేయక సాయి పాదాల వద్ద చేరి సత్యబాటలో నడవండి. సాయి సత్యవాటికలో పూసిన ఈ పుష్పం స్వామికే అంకితం!

**4.3.2003**

ఈ రోజు భాస్కరంగారు మందిరంలోకి వెళితే స్వామి కుర్చీలో కూర్చుని వున్నారుట. స్వామి ఆమె చెవిలో నా గురించి “ఆవిడ ఎవరనుకున్నావు?” జగన్మాత, మహారాజ్ఞి” అని చెప్పి “ఆవిడ పాదాలకి నమస్కరించుకో” అన్నారుట వెంటనే ఆవిడ వచ్చి నా పాదాలకి నమస్కరించుకున్నారు.

ప్రభూ! నీ నుంచి ఈ బిరుదులు ఏమీ ఆశించటం లేదు. నువ్వు ఏ చిన్న సేవైనా ఇస్తే ఆ సేవలో తరిస్తాను. ఆశయాలే తప్ప ఆశలులేవు.

**6.3.2003**

రాత్రి నిద్ర పోయే ముందు స్వామిని ఇలా ప్రార్థించాను. మణిచేత వ్రాయించిన "సత్యసాయి ప్రేమసుధా స్రవంతి" స్వామి పాదాల వద్ద పెట్టి "ప్రభూ! ఆ పుస్తకంలో కొన్ని వాక్యాల క్రింద పసుపురంగుతో కొన్ని గీతలు ఉండటం, ఆదిలక్ష్మి గారికి నా గదిలో శాంతి ఉందని తెలియచెయ్యటం, వాళ్ళ గురువు గారు, నువ్వూ, నేనూ ఒకటేనని చెప్పటం, భాస్కరం గారికి నా గురించి" మహారాజ్ఞి జగన్మాత"గా తెలియచేయటం ... అవన్నీ నిజమా! నువ్వు స్వయంగా చెప్పక అలా నాకు వాళ్ళ ద్వారా తెలియచెయ్యటం. అంతా అయోమయంగా ఉన్నది. నేనేమిటో కల ద్వారానైనా కనీసం తెలియ చెయ్యమని" ప్రార్థించాను. షిరిడీ బాబా ఫొటో కుర్చీలో పెడుతుంటే పెట్టవద్దన్న సందేశం స్వామి నుంచి వచ్చింది. వెంటనే తీసి పడుకున్నాను.

కలలో "మందిరంలో స్వామి ఉన్నారు. నేను గడప ఇవతల ఉన్నాను. మెల్లగా గడపదాటి స్వామి పాదాల వద్ద కూర్చుని పాదనమస్కారం చేసుకున్నాను. వెంటనే స్వామి నా శిరస్సు మీద చెయ్యి పెట్టి విభూతితో అభిషేకం చేశారు. మాట్లాడలేదు. పద్దెనిమిది సంవత్సరాలుగా స్వామి చుట్టూతిరుగుతున్నాను. ఇన్నాళ్ళకి అనుగ్రహించారని ఆనందంతో కూడిన దుఃఖంతో ఎవరికో చెబుతున్నాను" మెలకువ వచ్చింది.

ఉదయం మందిరానికి వెళుతూ స్వామీ, ఎవరికైతే జగన్మాత, మహారాజ్ఞి అని చెప్పారో ఆవిడకి ఈ కల మొదట చెప్పాలని అనుకున్నాను. ఈ రోజు 9వ లైను వచ్చింది. సంఖ్య బాగుంది. మందిరంలోకి వెళ్ళి కూర్చున్నాను. నా ప్రక్కన భాస్కరం గారు వచ్చి కూర్చున్నారు. ఆమెకు 9వ నెం. లైనే వచ్చిందట. అంతా స్వామి సంకల్పం. నేను అనుకోవటం, ఎప్పుడూ లైనులో కలవని ఆమె

కలవటంతో ఆవిడకి స్వామి సన్నిధిలో కల చెప్పాను. ఈ విధంగా కల "సత్యం" అని తెలియచేశారు.

స్వామి దర్శనానికి వచ్చినపుడు మానసికంగా ఇలా తెలియచేశారు ... "నీలో షిరిడీ బాబా అంశ ఉన్నది. అందుకే నీకు విభూతితో అభిషేకం చేశాను. అందుకే కుర్చీలో షిరిడీ బాబా ఫోటో పెట్టనివ్వలేదు. నీకు, నాకు, షిరిడీ బాబాకి తేడా లేదని అన్నారు."

గురుదేవా! వండిన అన్నం నిలవ ఉంచితే పాసిపోతుంది. "ఆలస్యం అమృతం విషం" అన్న సత్యవాక్కు నీకు తెలియనిదా? త్వరలో నీ బిడ్డకి న్యాయం చెయ్యి.

విశ్వ గర్భంలోని 'అణువు'ను నేను. గురు దేవుని సన్నిధిలో మాయ తొలగి జ్ఞాన ప్రకాశంతో విశ్వమంతా నేనుగా కనిపించాను!

నేనే సృష్టి, స్థితి, లయ కారిణిని. విశ్వమంతా నిండిని శివశక్తిని, నాకు వేరుగా ఏదీ లేదు. విశ్వమంతా నిండినవిభూతిని. నా దరి చేరండి బిడ్డలారా! ఆలస్యం చేయక. నా ప్రేమ వాహినిలో మునక వేసి, మృత్యువును జయించి ముక్తి పొందండి.

**18.3.2003**

గురువై అక్షర జ్ఞానం లేని నన్ను ఇహం నుండి పరంకి నడిపించావు.

స్వామి అనుగ్రహంతో అద్వైత స్థితి అనుగ్రహించబడి అన్నిటికీ అతీతంగా ఉన్న నాకు పుట్టపర్తి వదిలి ఎక్కడికీ వెళ్ళాలని లేదు.

**1.4.2003**

ప్రేమే దైవం. ప్రేమే నేను. ప్రేమ శక్తితో చెయ్యలేనిది ఏమీ లేదు. ఈ ప్రేమ శక్తితో నేను అనుకున్నది సాధిస్తాను. ప్రేమ నిండిన నా హృదయంలో ప్రేమ జ్యోతియై స్వామి ప్రేమజల్లులు కురిపిస్తారు. ఈ జల్లులతో తడిసి మానసిక శాంతిని పొందటానికి సాయి బిడ్డలు ఎంతో మంది నిరీక్షిస్తున్నారు. స్వామి త్వరలో నాతో మాట్లాడి, ఆ ప్రేమ బిందువులను నా వద్దకి చేర్చి నా ద్వారా వాళ్ళకి ప్రేమామృతం అందిస్తారు. ఆ రోజు అతి త్వరలో రానున్నది. సాయి ప్రేరణతో వ్రాసింది సత్యం అవుతుంది.

**10.4.2003**

దృశ్యం : 'చెత్త' లాంటి ప్రదేశంలో "చెప్పులు" కనిపించాయి. "అవి చెప్పులుకావు, అరణ్యవాసంలో లతలు, తీగలు అల్లుకున్న పచ్చిక మీద నడుస్తున్న రాముని పాదాలు. అది చెత్తకాదు" అని స్వామి తెలియచేశారు. శ్రీరామనవమి రోజున రాముని పాదాలు కనిపించటం స్వామి అనుగ్రహం.

**12.4.2003**

విన్నమాట "నువ్వు లక్ష్యాన్ని వెంబడించి వెళుతుంటే జ్యోతి దాని వెంబడే వస్తుంది."

**30.4.2003**

అవతార పురుషుడు, జగద్గురువు, తల్లితండ్రి తానే అయి తెర వెనుక నుండి మా జీవితాలను నడిపిస్తున్న శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా వారి దివ్యానుగ్రహం నాకూ, నా దేహానికి బిడ్డలైన పిల్లల మీదకూడా ఉన్నది. ఆ బిడ్డలను తన పరికరాలుగా చేసుకుని సేవ చేయించుకోమని జన్మనిచ్చిన తల్లిగా

నా గురుదేవులను ప్రార్థిస్తున్నాను. అప్పుడే నా జన్మకి ధన్యత. ఆధ్యాత్మిక సంపదే ఆ బిడ్డలకి నేను ఇచ్చే కానుక.

ప్రశాంతమైన నా కళ్ళు కారు మబ్బులై ప్రేమ వర్షించే మేఘంలాగా ఉన్నాయి. త్వరగా వచ్చి ఈ ప్రేమ బిందువులను స్వీకరించు.

**3.1.2004**

స్వప్నం : "స్వామి మందిరం వైపుకు వెళ్ళి మందిరం ముందు ఉన్న వేప చెట్టు ముందు నించుని దర్శనం ఇచ్చారు."

సాయంకాలం అనిల్‌కుమార్ స్పీచ్ విన్నప్పుడు తెలసింది "ఆ రోజు వైకుంఠ ఏకాదశి అని, స్వామి నాకు ఉత్తరద్వార దర్శనం ప్రసాదించారని." అప్పుడు నా ఆనందం మాటలకందనిది. ఏ శాస్త్రం తెలియదు. స్తోత్రాలతో పూజ చేయటం చేత కాని నాకు వైకుంఠ వాసుడు సాయి కృష్ణుని రూపంలో దర్శనం ప్రసాదించిన స్వామికి ఏమివ్వను? నా సుకృతం కంటే నా గురు దేవుల కృపా దృష్టే ఈ దర్శనానికి కారణం. ఇంత దివ్య దర్శన భాగ్యం గురించి పంచుకోవాలని ఉన్నా నమ్మేది ఎవరు? నీవు నాతో సగుణ రూపంలో మాట్లాడే వరకు ఈ మధురమైన దివ్యానుభూతులు నా హృదయంలో దాచుకోవలసిందే. ఇవన్నీ అసత్యాలు కావని నువ్వే ఋజువు చెయ్యాలి.

సత్యధర్మ శాంతి ప్రేమ అహింసా మార్గాలలో నడిచి విశాల భావాలతో చైతన్య స్ఫూర్తిని కలిగి హృదయ కమలంలోని పరమాత్ముని జ్ఞానమణి దీపంలో దర్శించి జీవన్ముక్తిని పొందటమే మానవ జీవిత లక్ష్యం. అదే ఉత్తర ద్వార దర్శనం!

**6.1.2004**

ఉదయం 3వ లైను వచ్చింది. స్వామి పాదాలతోపాటు అరికాళ్ళు దర్శించే భాగ్యం కలిగింది. స్వామి పాదాల నుంచి వచ్చిన కాంతి కిరణాలు దర్శించిన నాకు కలిగిన అద్వైత భావాలు.

1. స్వామి పాదాల నుంచి వచ్చిన కాంతికిరణాలు నన్ను స్పృశిస్తే నా కనుల నుంచి ప్రసరించిన సూర్య, చంద్ర కిరణాలు స్వామి పాదాలను స్పృశించాయి. స్వామి ఈ కిరణాల స్పర్శతో పులకించారు. భక్తుల స్పర్శ స్వామికీ ఆనందమే.

2. స్వామి అనే కల్పవృక్ష నీడలో తరించే భక్తులు కల్పవృక్షాలైతే ఆ నీడలో భగవంతుడు విశ్రాంతి తీసుకుంటాడు.

3. భగవంతుడి నుంచి వెలువడే చైతన్యతరంగాలు భక్తుని చుట్టినప్పుడు భక్తుని ఆనందం మాటలకి అందనిది.

4. భక్తుని ఆనందపు సాగరంలో భగవంతుడే మునక వేస్తాడు.

5. మన నిత్యానందమే స్వామికి పరమానందం.

6. గురుదేవులు బోధించిన గీతామృతంతో హృదయం నిండి ఆ అమృత వాక్కులతో నిన్ను అభిషేకించే తరుణంలో ఈ ఆలస్యం ఏమిటి?

7. ఆత్మజ్యోతినై నిన్ను దర్శిస్తున్న నాకు పది మందిని వెలుగు బాటలో నడిపించే సేవ అనుగ్రహంగా ప్రసాదించవా?

8. సాయీ! నువ్వు ప్రసాదించిన జ్ఞానంతో కవితా మాలికలు అల్లి నీ మెడలో అలంకరించాను. ఆ కవితామాలికల సౌరభాల మత్తులో ఆ

స్పర్శ నీకు చల్లనై, ఆ చల్లదనంలో నీవు మంచు కప్పిన ఈశ్వర లింగంలా కనిపిస్తున్నావు. కేదారేశ్వరా! నా జ్ఞాన నేత్రం నుండి వెలువడే కిరణాలతో నీపై మంచుకరిగి నీ నిజ రూప దర్శనం చేసుకుంటున్నాను శివా!

దృశ్యాలు : "ఒక స్తంభం కదిలించటం, కొన్ని కాగితం ముక్కలు గాలిలో ఎగరటం, నీళ్ళు వార పోయటం".

వీటికి స్వామి తెలియచేసిన అర్థాలు ...

"అది సనాతన ధర స్థూపం అని, నా చేత స్వామి వ్రాయించిన అనుభవాలు పుస్తక రూపంలో వస్తాయని, భగవంతుడు ప్రేమ రథంలో ఊరేగుతూ వస్తుండగా నీళ్ళు తీసి వారపోయటం" (అంటే దిష్టితియ్యటం) అని తెలియచేశారు.

**6.1.2004**

సాయంత్రం మందిరం నుంచి రాగానే కుర్తాళం పీఠాధిపతులు పంపించిన "స్వయం సిద్ధకాళి" ఫొటో రూపంలో ఇంట్లో ప్రవేశించింది. ఈ రోజు పుష్య పౌర్ణమి. మంగళవారం నాలోని దుష్టశక్తులను సంహరించి, దివ్యశక్తులను వెలికి తీసిన నా గురురు స్వరూపిణి సాయి మాత స్వయం సిద్ధకాళి రూపంలో నాకు జయం ప్రసాదిస్తూ సంధ్యా సమయంలో నాలోని సిద్ధ వస్తువు సిద్ధింపచేసి పూర్ణచంద్రుడిలా ఇంట్లో ప్రవేశించింది. ఇది వ్రాస్తున్న సమయంలో ఆదిలక్ష్మిగారు వచ్చి "మీ ముఖం తేజస్సు"గా ఉందని అన్నారు.

ధర్మస్థూపం కదిలింది అంటే "సనాతన సారధి" సాయికృష్ణ నా వద్దకి వచ్చే తరుణం ఆసన్నమైంది అని అనిపించింది.

**20.1.2004**

మందిరంలో స్వామి దర్శనం ముందు కలిగిన భావాలు.

1. సనాతన సారధీ, నీరాక మా కంటి వెలుగు రేఖ. ఆ అదృష్ట రేఖ మా నుదుటి రాతను చెరిపి వేసింది ప్రభూ!

2. నీ దర్శనం మాకు "మార్గదర్శకంగా" సనాతన ధర్మం" వైపు నడిపించింది. నీ సంభాషణ మాకు బంగారు భూషణంగా కంఠాన నిలుపుకున్నాము.

3. నీ చిరునవ్వులు ఆధ్యాత్మిక సిరులై మా ఇంటిలో జ్ఞానమణులుగా ప్రకాశిస్తున్నాయి. సాయిమాతా!

4. నీ చూపులు వెలుగు కిరణాలై మాలోని అంధకారాన్ని పోగొట్టి వెలుగుని చూపించాయి.

5. నీ పదకమలాల వద్దకు నన్ను చేర్చుకుని జ్ఞానగంగలో ముంచి నీ విశ్వరూప దర్శన భాగ్యాన్ని ప్రసాదించావు కృష్ణా!

6. ప్రభూ! మూలాధారంలోని విఘ్నేశ్వరుని దర్శించి అమ్మ ఆశీస్సులతో అమ్మ కుండలినీ శక్తిని తెలుసుకుని, అమ్మ వెలుగు బాటలో హృదయ కమలంలోని సర్వవ్యాపి నారాయణుని దర్శన భాగ్యంతో లలాటంలోని జ్ఞాన నేత్రం తెరచుకుని, ముక్కంటి అనుగ్రహంతో శిఖరాగ్రంలోని చిచ్ఛక్తి వెలుగులో శ్రీ లలితాంబను దర్శించి "జగన్మాత"లో లీనమై బ్రహ్మానంద సాగరంలో మునిగిపోయాను.

శిఖర దర్శనంతో ముక్తిని పొంది, మోక్ష సామ్రాజ్యానికి ఏలికనై సృష్టి, స్థితి, లయలను చూస్తూ నిర్వికారంగా నిలిచి ఈ అనంత వైభవాన్ని తిలకిస్తూ నువ్వే నేనుగా నిలిచి ఉన్నాను పరమాత్మ స్వరూపంగా!

గురుదేవులు ప్రసాదించిన "విరాట స్వరూప దర్శనం"తో నా జన్మ ధన్యమైంది. నీకు ఇవ్వదగిన వస్తువు ఏమున్నది నా వద్ద? వెలకట్టలేని పరమాత్మ తప్ప. అదే నీకు సమర్పించే వెలలేని కానుక. నువ్వైన నేను, నేను నశించి నీలో కలిసిపోయాను.

సద్గురువు ఆశించే అపురూప కానుక శిష్యుడు అద్వైత స్థితిలో నిలవటమే!

**22.1.2004**

విశ్వ ప్రభువు కృష్ణుని రాకతో వెలుగు వచ్చింది. వెలుగు నిండిన కన్నులతో వెన్నుని దర్శించాను.

కన్నయ్యా! కారాగారంలో జన్మించి నీ దివ్యశక్తితో కారాగారం తలుపులు తెరచి, రేపల్లె చేరి, యశోదానందుల ఇంట దీపమై వెలిగి వారి హృదయాలను ఆనందంతో నింపావు. రేపల్లెకే వెలుగువైనావు.

నల్లనయ్యా! నా భక్తితో నిన్ను నా హృదయంలో బంధించాను. నీ శక్తితో కారాగారం కవాటాలను తొలగించి రేపల్లె చేరావు కానీ, నా హృదయ కవాటాలను తెరిచి బయటకు రావటానికి నీ శక్తి చాలదు. భక్తుడి శక్తి ముందు భగవంతుడి శక్తి పని చెయ్యదు. కాబట్టి నీవు నాకు బందీవై ఉండటమేను! భగవంతుడికి దాసుడు భక్తుడు కానీ భక్తికే దాసుడు పరమాత్మ!

**25.1.2004**

దృశ్యం 'స్వామి ముఖం నా నాలుకతో నాకిన అనుభూతి కలిగింది'. దీనికి అర్థం స్వామి ముఖం అమృత భాండంగా భావించి అమృతాన్ని స్వయంగా స్వీకరిస్తున్నాను.

1. నా అణువణువూ మంచుతో తడిసిన గడ్డిపూవై నీ పాద స్పర్శతో తరించాను.

2. నా తనువు నీకై విరహాగ్నిలో కాలిపోతున్నది కృష్ణా! చల్లని చందనంలాంటి నీ స్పర్శతో నా విరహాగ్నిని చల్లార్చు మాధవా!

3. మోడు వారిన నా జీవితం నీ కృపా వర్షపు జల్లులతో తడిసి చిగిర్చి, పుష్పించి, మోక్ష ఫలాలతో కల్ప వృక్షంగా మారింది. ఈ ఫలాలను బిడ్డలకు పంచాలన్న నిస్వార్థ కోరిక తప్ప ఇంకే ఆశా లేదు కృష్ణా!

**27.1.2004**

దృశ్యం : "గుండ్రని ఆకారంలో బంగారు రంగు" కనిపించింది.

అది సువర్ణ లింగంగా స్వామి తెలియచేశారు.

**29.1.2004**

స్వామీ! నన్ను ఇంకా పరీక్ష పెడుతున్నావా? "అమ్మ ఇబ్బంది పడకుండా 2000 వడ్డీ వచ్చే ఏర్పాటు చేస్తాను అని విజ్జిఫోను చేసినట్లు మణి ఉత్తరం రాసింది. బాబా! డబ్బు అవసరానికి సరిపడ అంటే ఉండటానికి, తినటానికి, మందులకి ఉంది. ఈ డబ్బు చాలు ప్రభూ! ఈ ప్రపంచంలో డబ్బుతో కొనుక్కునే అవసరం లేకుండా చేశావు. చీరలా ... నగలా? ఏం కావాలి నాకు? నువ్వు తప్ప. నువ్వు మాట్లాడని ఈ జీవితం దుర్భరంగా ఉన్నది. ఈ ప్రపంచంలో నువ్వు తప్ప నాకు ఎవ్వరూ లేరు. ఆ మాట నువ్వే తెలియచేశావు. నాది కాని డబ్బు తీసుకుని ఎవరికి ఇవ్వాలి? అది నాకు ఇష్టం లేదు. ధర్మ విరుద్ధమైన పనులు చెయ్యను. అందరినీ వదులకుని, నిన్ను విశ్వసించి, నీ నీడన జీవితం

గడుపుతున్న నాకు లోటు ఏమున్నది? ఎన్ని ఉన్నా నువ్వు నా వద్దకు రాకపోయినా తరువాత అంతాలోటే!

**1.2.2004**

కన్నయ్యా! వెన్న దొంగిలించి అందరికీ పంచే దొంగవైతే నేను నీలోని జ్ఞాన మణులు, దొంగిలించి అందరికి పంచే గజ దొంగని!

ఈ జీవన చైతన్య స్రవంతిలో పరతత్వాన్ని తెలుసుకుని పరమహంసనై అమ్మ పాదాల వద్ద పరమానందంతో తేలియాడుతున్నాను.

**2.2.2004**

ఉదయం మందిరంలో నా గురుదేవులు ఈ విధంగా ప్రార్థన చేయించారు. ఇంద్రా! నా యోగ సాధనలో ఇంద్రియాలు సమస్థితిలో ఉండటానికి సహాయపడిన నీకు నా హృదయపూర్వక నమస్కారాలు తరువాత పంచభూతాలను తలచుకుని వాటికి కూడా ప్రేమపూర్వక నమస్కారాలు తెలియచేశాను. దర్శనంలో ఐదవ నెంబరు టోకెన్ వచ్చింది. పంచేంద్రియాలను, పంచభూతములను తలచుకోవటం 5వ నెం॥ రావటం స్వామి అనుగ్రహం. దర్శన సమయంలో స్వామి తల అటుతిప్పుకున్నారు. పాత విద్యార్థులకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇంటికి వచ్చి "స్వామీ! నాకు ఇంటర్వ్యూ అక్కరలేదు. దేహంతో నీ వద్దకి వచ్చి వాళ్ళలా మాట్లాడే అవకాశం నాకులేదు. కాబట్టి హృదయభాషలో తెలియచెయ్యి. ఈ వేదన భరించలేకుండా ఉన్నాను. కలలో అయినా కనింపించు లేకపోతే మందిరానికి రానని చాలా బాధపడుతూ పడుకున్నాను. స్వామి నా మొర ఆలకించి కలలో కనిపించారు.

**5.2.2004**

స్వామీ, నీ కొంగు బంగారాన్నై నీవెంటే తిరుగుతున్నాను. ఆత్మనే చూస్తూ, ఆత్మనేవింటూ, ఆత్మతో మాట్లాడుతూ, ఆత్మ భావంతో తిరుగుతున్నాను. ఆత్మతప్పవేరే వస్తువులేదు. ఈ ఆత్మజ్ఞానం నా గురుదేవులు నన్ను అనుగ్రహించి ప్రసాదించిన దివ్యజ్ఞానం.

1. స్వామిని చూస్తుంటే ఇలా అనిపించింది ... స్వామికి జుట్టే కిరీటం. వేరే కిరీటం ఎందుకు? స్వామి వెంట్రుకలు సర్పాలను పోలి ఉంటాయి. అవి నిజంగా జాతిసర్పాలు. సర్పాల శిరస్సున మెరిసే మణులే స్వామి శిరస్సున కిరీటంగా అమిరాయన్న మధుర భావన ఆనందంగా, తృప్తిగా ఉన్నది!

2. అమ్మముఖం పడగైతే ఆ పడగపై వెలకట్టలేని మణి ఉంటుంది. అదే "జ్ఞానమణి". అంతర్ముఖులైన యోగులు దర్శించి, తరించి ఆమణి ప్రకాశంలో లీనమై మోక్షాన్ని పొందుతారు.

3. అమ్మా! సాయిమాతా! ఈ శరీరమనే కుండని జ్ఞానాగ్నిలో కాల్చి, స్వచ్ఛమైన పాలవంటి హృదయంలో నమ్మకమనే కుదురు ఉంచి, భక్తి అనే కవ్వానికి విశ్వాసమనే తాడుచుట్టి కృష్ణ నామాన్ని జపిస్తూ పాలుచిలికి వెన్నతీశాను. కన్నయ్యా! ఈ వెన్నను ఆరగించి అందరికీ పంచి ఈ శరీరమనే కుండని పగలకొట్టు.

4. గొల్ల భామల ఇళ్ళలో దూరి ఉట్టి తాళ్ళను త్రెంచి, కుండలో వెన్నను తిన్నావు. అలాగే మా బంధాలను తెంచి మా హృదయ భాండంలోని మధురమైన వెన్నను ఆరగించు వెన్నదొంగా!

**8.2.2004**

కలలో ఒకరికి నా అనుభూతుల పుస్తకం ఇచ్చాను. చాలా ఆనందంగా చదివారు. కొన్ని పైకి రాగయుక్తంగా చదివి నాతో "ఇవి అగ్ని" అన్నారు.

"అగ్ని" అంటే నా వేదనాగ్ని లోంచి వచ్చిన అక్షరాలే. ఈ పుస్తకం "అద్వైతామృతవర్షిణి".

**13.2.2004**

గోపాలా! గోవర్ధనగిరి ఎత్తి గోపాలురను, గోవులను రక్షించినట్లు నా కర్మ అనే కొండను తొలగించి నన్ను రక్షించలేవా!

కల "బావిలోంచి నీళ్ళు తోడుతున్నాను. బాగా లావుగా ఉన్న త్రాడు పురివిడి బాల్చీ బావిలో పడింది."

జీవుడు చేసుకున్న కర్మలు విడిపోయాయి అన్నభావన కలిగింది.

**14.2.2004**

ప్రశాంతి నిలయం

సత్యం ... శివం ... సుందరం"

1. మానవుడు సత్యాన్వేషి అయినప్పుడు శివుని మంగళకరమైన శుభదృష్టి సాధకుని పై పడి విశ్వమంతా సుందరంగా కనిపిస్తుంది. అదే ఆత్మ సౌందర్యం. ఆత్మ సాక్షాత్కారం తరువాత హృదయ ప్రశాంతి నిలయంకాగా సత్యాన్వేషి బ్రహ్మానందంలో లీనమౌతాడు.

2. భక్తుని హృదయమే కైలాసశిఖరం కాగా శివుడు దానిపై ఆనంద తాండవం చేస్తాడు.

3. ప్రేమ నిండిన హృదయంలో విశ్వమంతానిండిన అఖండ ప్రేమ జ్యోతిగా స్వామి దర్శనం ఇస్తున్నారు.

4. వేదాలు పఠించలేదు. భగవద్గీత పారాయణ చేయలేదు. స్తోత్రాలు రావు. అయినా వేదమాత సాయి నా జీవితం భగవద్గీతగా మార్చింది.

5. సాయి మాత కృపతో మాటలే రాని నేను మంత్ర ద్రష్టనయ్యాను చదువురాని నేను ఆత్మబోధనలు చేస్తున్నాను.

**15.2.2004**

దృశ్యం – "నడివయస్సు స్త్రీ పాత చీరకట్టుకుని చేతిలో చెప్పులు పట్టుకుని నడుస్తుంటే ఎవరో గొడుగు పట్టారు." దీనికి అర్థం స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు. ఆ స్త్రీ "నేనేనని, అవి స్వామి పాదుకలని" పంతొమ్మిది సంవత్సరాలుగా (19) స్వామి పాదుకలు పట్టుకుని తిరుగుతున్న నాకు స్వయంగా స్వామి గొడుగు పట్టి, నా వెంట తిరుగుతున్నారని తెలియచేశారు. ఎప్పుడూ "స్వామి నా పాదాల కింద గులాబీలు పరిచి నన్ను నడిపిస్తున్నారని" అంటూ ఉంటాను. కానీ, ఈ రోజు గొడుగు పట్టి నీ వెంట తిరుగుతున్నానని స్వామి తెలియచెయ్యగానే గురుకృపకు నా హృదయం ప్రేమతో నిండి పోయింది. భక్తులను కంటికి రెప్పలా కాపాడుతూ భక్తులకు సేవ చేయటమే భగవంతునికి ఆనందం. భక్తులు అమ్మకి బిడ్డలు. ఆబిడ్డల ఆలనపాలన చూడటమే అమ్మకి ఆనందం. సాయి మాతకి బిడ్డలమైన మనం ధన్యులం!

**15.2.2004**

సాయంత్రం స్వామి విద్యార్థులందరిని చుట్టూ కూర్చోపెట్టుకుని వాళ్ళతో ఆనందంగా గడిపారు. నేను ఇలా ప్రార్థించాను ... "స్వామి! నేను నీ

ఆధ్యాత్మిక విశ్వ విద్యాలయంలో ఒక విద్యార్థిని. నన్ను ఎప్పుడు అలా దగ్గరికి పిలిచి ఆనందంలో ముంచుతావు? అంతవరకు నువ్వు ఎంతచేసినా నాకు తృప్తిలేదు."

**19.2.2004**

నిన్న శివరాత్రి రోజున ఉదయం సాయి సంకల్పంతో స్వామికి దగ్గరగా కూర్చుని స్వామి నుంచి వచ్చిన "సువర్ణలింగం" చూశాను.

కాని, నాకు శివరాత్రి లేదు. నేనే శివుడిని ... నేనే శివుడిని. నా లోని బంగారుకాంతులు విశ్వమంతా వ్యాపించినాయి. నేనే "హిరణ్యగర్భుడిని" ... నేనే "శివశక్తి" ని ... నేనే "అంబని".

**లింగోద్భవం ('శివరాత్రి') 18.2.2004**

పుడమి తల్లి పురిటి నొప్పులతో బాధ పడుతుంటే భక్తుల హృదయం బాధతో నిండి దుఃఖించారు. అమ్మ నోటి నుంచి సువర్ణ లింగం బంగారు కాంతులు విరజిమ్ముతూ భూమిపై పడిన వెంటనే ప్రకృతి పులకరించింది ... పరవశించింది. లింగోద్భవం చూసిన భక్తుల హృదయం పరవశించి, ఆనంద సాగరంలో ఓలలాడారు. లింగోద్భవం తరువాత సాయి మాత కళ్ళలో కోటి సూర్యకాంతులు ప్రకాశించాయి. స్వామి "మూడు టన్నుల బరువు నాలోంచి బయటికి వచ్చింది. రేపటి నుంచి బాగా తిరుగుతాను" అని ప్రకటించారు. ఆ మాట అందరికీ సంతోషాన్ని కలిగించింది.

అమ్మా! 1982లో నీ దృష్టి నాపై పడి నాలోని సత్యం దినదినాభివృద్ధి చెంది నా మనస్సు సత్యంతో నిండి పోయింది. నా సత్యాన్ని ప్రకటించి నా గుండెలోని బరువును తగ్గించు.

**22.2.2004**

విన్నమాట "ఐహిక సుఖాలు కొద్దిగా అనుభవించవచ్చు" అని స్వామి చెప్పారు.

**5.3.2004**

కలలో "పింకు రంగులో ఒక పాప పుట్టింది. ఒళ్ళంతా ఏ మాలిన్యం లేక కడిగిన ముత్యంలా ఉన్నది. బొడ్డు లేదు నేను ఎత్తుకుని ఒక చెంబుడు నీళ్ళు పోసి అక్కడి వాళ్ళతో పాప ఏ మాలిన్యం లేకుండా పుట్టింది అని చెప్పాను."

ఈ కలకి స్వామి తెలియ చేసిన అర్థం ...

"ప్రేమ పసిబిడ్డలా అమాయకంగా పింకు రంగులో ఏ మాలిన్యం అంటకుండా, ఏ బంధాలు లేకుండా పవిత్రంగా ఉంటుంది. అదే విశ్వ ప్రేమ... ప్రేమే దైవం.

**4.4.2004**

రామాయణంలో రామజననం చదివి నిద్రపోయాను. కలలో "కుల్వంతుహాలు" లో యజ్ఞం జరుగుతున్నది. యజ్ఞగుండం వద్ద చాలా కొద్ది మంది కూర్చున్నాము. స్వామి అక్కడికి వచ్చి మా ప్రక్కన నిలుచున్నారు. కొద్దిసేపు ఉండి వెళ్ళిపోయారు. యజ్ఞం జరిగే చోట ఒక పక్క పాయసం దొన్నెలలో ఉంచారు. ఎవరో చినిగిన దొన్నె తెచ్చి స్వామికి ప్రసాదం పెట్టమన్నారు. చినిగిన దొన్నెతో పాయసం పెట్టడం ఏమిటి? అన్నాను. నేను దొన్నెలో పాయసం కడుపు నిండా తిన్నాను. నా జ్ఞాన యజ్ఞం ఫలించిందన్న ఆనందం కలిగింది.

స్వామి పుట్టపర్తిలో దేహంతో లేకపోయినా బాధ అనిపించటం లేదు. స్వామి చైతన్యం అంతా నిండి అణువుఅణువు ప్రకాశంతో వెలిగిపోతున్నది. నా గది అంతా చైతన్యవంతంగా ఉన్నది ఏమి ప్రశాంతత? ఇది ఒంటరి తనం కాదు. రామ చైతన్యంలో లీనం అయి ఆత్మారామునితో కూడిన ఆనందం భగవంతుడు ఎలాంటి ప్రశాంత వాతావరణంలో నన్ను ఉంచాడు! ఈ ప్రశాంతత వదిలి ఎక్కడికి వెళ్ళాలని లేదు. ఇంద్రియ నిగ్రహంతో కోరికలను జయించి పూర్ణవైరాగ్యంతో రాముని సన్నిధిలో ఏ అలజడి లేని ప్రశాంత జీవితం గడుపుతున్నానంటే అది నా గురుదేవుల అనుగ్రహం.

**6.4.2004**

స్వప్నం "స్వామి భక్తుడు ఒకరు ఒక పుస్తకం వ్రాశాడు. అతన్ని ముట్టుకుంటే శక్తి వస్తుంది. నేను వెళ్ళి అతన్ని ముట్టుకుంటాను. నాకు శక్తి వస్తుంది" అని ఒకతను నాతో అన్నాడు. అప్పుడు నేను అతనితో "ముట్టుకుంటే శక్తి రాదు అందరిలోనూ దివ్యశక్తి ఉన్నది. అది మీలో ఉన్నది, నాలోనూ ఉన్నది. కానీ, మీరు మాయవలన తెలుసుకోలేదు. నాకు మాయ తొలగింది తెలుసుకున్నాను" అని చెప్పాను.

**15.4.2004**

స్వప్నం : "ఒక ప్రదేశంలో రెండు గుడులు ఉన్నాయి. అక్కడ ఒంటి రెక్క మందార చెట్లు ఆకు కనిపించకుండా ముదురు ఎరుపురంగులో ముఖ్‌మల్ బట్టలాగా మెరుస్తూ మృదువుగా ఉన్న పూలు విరగపూసి ఉన్నాయి. ఆ రంగుపూలు నేను ఎన్నడూ చూడలేదు ఆ పూలన్నీ కోసి అక్కడున్న గుడిలో అమ్మవారికి అలంకరించి, నా చేతిలో ఉన్న నీళ్ళ బిందెలో నుంచి నీళ్ళు జల్లి వేరే గుడిలకి వచ్చాను. గుడిలోకి రాగానే షిరిడీ బాబా నా వద్దకి వచ్చారు.

వెంటనే నా వద్ద ఉన్న నీళ్ళ బిందెలో నుంచి నీళ్ళు పోసి బాబాకి అభిషేకిస్తున్నాను. అలా కొద్ది సేపు అభిషేకించిన తరువాత బాబా కొంచెం కోపం నటిస్తూ చాలు... చాలు అన్నట్లు వెళ్ళిపోయారు. షిరిడీ బాబా దర్శనం అద్భుతం అనిపించింది తరువాత సత్యసాయి బాబా ఫొటోలో నుంచి పాలు, పసుపు వస్తున్నాయి".

నేను ఎప్పుడూ షిరిడీ బాబాని తండ్రిగా, సత్యసాయిని తల్లిగా అనుకుంటాను. డిశంబరు 1984 వ సంవత్సరంలో విశాఖపట్నంలో పోర్టు వద్ద ఉన్న షిరిడీ బాబా గుడిలోని విగ్రహంలో నుంచి దివ్య తేజస్సుతో దర్శనం ఇచ్చారు. తరువాత మా అమ్మ గురు స్వరూపణి, జగన్మాత అయిన సాయి మాత వద్దకి పంపించి ఆధ్యాత్మిక శిక్షణ ఇప్పించారు. నా తల్లి సాయి మాత కంటితో చూడక, నోరువిప్పి మాట్లాడక నన్ను అంతర్ముఖురాలిని చేసి తన దివ్య నేత్రం అయిన మూడవ కన్ను తెరిచి నాలోని మాలిన్యం తొలగించి ఆత్మ సాక్షాత్కారం చేయించింది. అమ్మా! నీకు ఏమివ్వను? నువ్వు ప్రసాదించిన ఈ జ్ఞానం అందరికీ నీ అనుగ్రహంతో పంచటం తప్ప. అమ్మ క్రమశిక్షణలో దివ్య ప్రేమను పొంది, ఆ ప్రేమజల్లులో నా తండ్రి షిరిడీ బాబాని అభిషేకించాను. మీ వంటి తల్లిదండ్రులను పొందటం ఎన్ని జన్మల సుకృతం! తల్లీ సాయి మాతా! తండ్రీ షిరిడీ బాబా! మీ ఇద్దరినీ నా పవిత్రమైన కన్నీటితో అభిషేకిస్తున్నాను. నా ప్రేమలో మునక వేయండి.

1984 డిశంబరులో మణికి వచ్చిన కల "అందంగా పూలతో అలంకరించిన ఓడలో నేను గిరగిర చుట్టూ తిరుగుతుంటే నా వంటిన వున్న వస్త్రం స్వామికి చుట్టుకోవడం కనిపించింది".

ఆ కలకి 2004లో స్వామి తెలియ చేసిన అద్వైతానుభూతి – "దేహమనే ఓడలో జీవాత్మా, పరమాత్మ కలిసి ఉంటారు. జీవాత్మ సుగుణములనే పుష్పములతో పరమాత్మ పాదాలను అలంకరించినప్పుడు జీవుడు గుణరహితుడై చైతన్యవంతుడైన తరువాత జీవ చైతన్యం పరమాత్మ చుట్టూ గిరగిర తిరుగుతూ పరమాత్మ చైతన్యంలో లీనం అవుతుంది. నా వంటిన ఉన్న వస్త్రం స్వామికి చుట్టుకోవటం అంటే చైతన్యం అనే వస్త్రం స్వామిని ఆలింగనం చేసుకోవటం బాహ్య శరీరంతో కాకుండా సూక్ష్మ శరీరంతో ఆలింగన భాగ్యం కలుగ చేసిన నా గురుదేవులకి ప్రేమాంజలులు సమర్పిస్తున్నాను.

**2.5.2004**

స్వామి మాట్లాడటం లేదని చాలా వేదన పడుతూ ఉన్నాను. ఒక దృశ్యం కనిపించింది ''పొలాల్లో కుక్క ఉన్నది'' పొలంలో కుక్క కనిపించిందేమిటని అనుకున్నాను. స్వామి దానికి ఇలా అర్థం తెలియచేశారు. "పొలంలో ఉన్నది కుక్క కాదు... నక్క అని, పంట కొచ్చిన పొలం నక్కల పాలయినట్లు (అంటే ఈన కాచి నక్కల పాలయినట్లు) ఆధ్యాత్మిక పంట అనుభవంలోకి వచ్చిన తరువాత అనుమానాలతో ఆధ్యాత్మిక అనుభూతులకు దూరం కావద్దని" దృశ్యం ద్వారా తెలియచెప్పారు.

**28.8.2004**

"భోగం అంటే భౌతిక సంపదలతో దేహ భావంతో భోగం అనుభవించటం కాదు. నిజమైన భోగం  భగవంతుడితో కూడి ఉండటమేను నువ్వు నాతో కూడి నిజమైన భోగం అనుభవిస్తున్నావు" అని స్వామి మానసికంగా తెలియచేశారు.

**8.9.2004**

ఈ కృష్ణాష్టమికి ఆరు కృష్ణాష్టములు అయినాయి అయినా స్వామి తను కృష్ణాష్టమికి యిస్తానన్న వస్త్రం యివ్వలేదు. వస్త్రం కారణంగా అయినా నా వద్దకి వస్తారన్న ఆశతో వున్నాను. కానీ స్వామి రాలేదు, రాలేదన్న బాధతో చాలా దుఃఖించాను. తర్వాత స్వామి ఈ విధంగా తెలియచేశారు.

"కృష్ణాష్టమికి తను ఇస్తానన్న వస్త్రం జ్ఞాన ప్రకాశం అని, 1995 లో జ్ఞానమణిని ప్రసాదించానని, ఇప్పుడు దాని ప్రకాశాన్ని వృద్ధి చేస్తానని, 2005 సంIIకి ప్రకాశం ఎక్కువ అవుతుందని, ఆ ప్రకాశానికి చాలా మంది దగ్గరయి నీ ద్వారా బోధనా మృతాన్ని విని అనుభవించి తరిస్తారని" హృదయ భాషలో తెలియచేశారు.

ఆరు కృష్ణాష్టములు అయిన తరువాత ఈ విధంగా తెలియచేసి తృప్తినిచ్చారు. ఇకపై కృష్ణాష్టమికి వస్త్రం కోసం ఎదురు చూసే అవసరం లేదు. ప్రకాశాన్ని వస్త్రంగా ఇచ్చారు ధ్యనురాలిని గురుదేవా! నీ కృప అనంతమైనది ప్రభూ!

"ఈ వస్త్రం రంగు పోదు. మాలిన్యం అంటుకోదు దాని ప్రకాశం తరగదు, చిరగదు. అతుకులు వేసుకుని కట్టుకునే పనిలేదు. జీర్ణమయ్యే వస్త్రం కాదు. ఆర వేసుకునే పని లేదు. దొంగలు పట్టుకెళ్ళలేరు. ఏక వస్త్రం దీనిని పొందిన తరువాత రెండో వస్త్రం కట్టుకునే పనిలేదు. సాలెవాడు నేసిన వస్త్రం కాదు. భగవంతుడి దివ్యహస్తం నుంచి వెలువడిన చైతన్య కిరణాలే ఈ వస్త్రానికి దారపు పోగులు భగవంతుడే సాలెవాడయి తన భక్తురాలి కోసం నేసిన ఈ దివ్యవస్త్రం వెలకట్టలేనిది. ఎవ్వరూ కొనుక్కొలేనిది దీని ఖరీదు "వైరాగ్యం" అమ్మా! సాయిమాత! వెలకట్టలేని నా ప్రేమకి నీ ప్రేమనే తిరిగి వస్త్రంగా

ప్రసాదించావా! తల్లీ! నా ద్వారా నీ కీర్తిని, నీ దివ్య ప్రేమని, నీ అనంతమైన శక్తిని తెలియచేయటానికి నన్ను ఎన్నుకుని నన్ను తరింపచేశావా! అమ్మా! ఈ శుభ సమయంలో నా కన్నీటితో నీ పాదాలు కడుగుతున్న నీ ప్రియ భక్తురాలు రుక్మిణికి ఆశీర్వాద బిందువులు అందచెయ్యి. సాయిమాతా! ఇదంతా స్వామి ప్రేరణతో వ్రాసిన అనుభూతి.

సత్యం ....... సత్యం .... సత్యం ....

**11.9.2004**

రెండు రోజుల క్రితం నా పాదాలు నీళ్ళలో కనిపించాయి. నీళ్ళు చాలా తేటగా ఉన్నాయి. అది శివుని జటాజూటం నుండి భువికి దిగిన పావనగంగ. ఆ గంగలో ఉన్న నా పాదాలు పరమ పవిత్రమైనవి. పూజనీయమైన శివశక్తి పదకమలాలు ముక్తిని ప్రసాదించే దివ్యచరణాలు. స్వామి సేవలో తరిస్తున్న నేను పది మందిని సత్యమార్గంలో నడిపించే మార్గదర్శకురాలిని. నేనే సత్యం... శివం.... సుందరం.... సృష్టిలో అంతా ఆనందమే ఏది చూసినా సత్యమే అదే శుభం అదే సుందరం! ఆనందోబ్రహ్మ! సర్వేజనా స్సుఖినోభవంతు శాంతి శ్శాంతి శ్శాంతిః

సాయి చెప్పింది చేస్తా చేసిందే చెప్తా అంతా సాయిమయం.

**21.10.2004**

ఈ రోజు దుర్గాష్టమి కదా స్వామీ! నేను ఏ ఆయుధాలకి పూజ చెయ్యాలి అనుకుంటే ప్రేమ అనే ఆయుధాన్ని ఆరాధించమని, అందరిని ప్రేమ అనే ఆయుధంతో దగ్గరకి చేర్చుకోమని హృదయ భాషలో తెలియచేశారు.

**29.11.2004**

స్వప్నం : "నేను ఎవరినో పాయసం వండి పెట్టమని అడిగాను"

ఈ రోజు సాయిమాత పుట్టిన రోజు తిథుల ప్రకారం ఈ విషయం మందిరంకి వెళ్తే కాని తెలియలేదు. తిథి ప్రకారం జరిగిన అమ్మ పుట్టిన రోజు ఎంతో ప్రశాంతంగా అయింది. బొబ్బట్లు పంచారు ఇంటికి వచ్చిన తరువాత స్వామి పాయసం గురించి ఇలా తెలియచేశారు. నాలోని స్వామికి తన పుట్టిన రోజుకి నా చేత పాయసం చేయించుకుని తినాలనిపించి ఆ కోరిక నాదిగా ఇద్దరం ఒక్కటే కాబట్టి నాకే కలగచేశారు. అందుకే నా చేత పాయసం తన ప్రేరణతో చేయించారు. అంటే తనే స్వయంగా చేసుకున్నారు. గిన్నెకు పసుపు కుంకుమతో బొట్టుపెట్టి పాయసం చేసి ఎవరయినా వస్తే సాయి మాతగా ప్రసాదం పెట్టాలనుకున్నాను. తొమ్మిది గంటలకు ఆదిలక్ష్మిగారు వచ్చారు. ఆమె రూపంలో సాయిమాత వచ్చింది. ఆమెకు ఆనందంగా ప్రసాదం పెట్టి పాదనమస్కారం చేసుకున్నాను నా తల్లి నా చేత తనే చేసుకుని తనే తిన్నది. ఈ లీల అద్వైత స్థితికి పరాకాష్ట.

**1.12.2004**

మా తమ్ముడి కొడుకు వివాహానికి స్వామి ప్రేరణతో టికెట్టు కొనుక్కున్న తర్వాత వెళ్ళాలనిపించలేదు.

ప్రభూ! సాయంత్రం నుంచీ నా హైదరాబాద్ ప్రయాణం గురించి ఆందోళనగా ఉన్నది. నిన్ను వేధించానని అనుకోక కలలో కనిపించో ఏదైనా నిదర్శనం చూపించో  హైదరాబాద్ పంపించు. లేకపోతే నేను వెళ్ళను కానీ, నా దేహంతో నువ్వు వెళుతున్నావని తెలిసినా మళ్ళీ ఈ ప్రయాణం గురించి

ఆందోళనగా ఉన్నది. నేను వేసే ప్రతి అడుగూ నీ ప్రేరణతోనే వేస్తున్నానన్న విశ్వాసం, నమ్మకం నాకున్నది. బాబా! సత్యం, ధర్మం, నా ఉచ్ఛ్వాస నిశ్వాసలు కాబట్టి ఈ ప్రయాణం కూడా సత్యంగా ఉండాలి గురుదేవా పూర్ణంగా నిన్ను నమ్మాను. నువ్వు పూర్ణంగా నన్ను నమ్మి ఈ ప్రేమ బాటన నడిపిస్తున్నావు. నా చేత తప్పు చేయించవు అయినా తీరా ప్రయాణానికి సిద్ధం అయిన తరువాత నా మనసు ఎందుకు శంకిస్తున్నది? నీ ప్రేరణతో పైదంతా వ్రాయించి నా దృఢ విశ్వాసాన్ని, నీపై ఉన్న నమ్మకాన్ని పది మందికీ తెలియచేసి నా గురుభక్తి ఎలాంటిదో తెలియచేయటానికి వ్రాయించి ఉంటావు. గురుదేవా! ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని ఎదుర్కొని నా గురుభక్తిని నిరూపిస్తాను. ఈ ప్రపంచంలో ఏ వస్తువూ నన్ను ఆకర్షించటం లేదు. ఈ విషయం నీకు తెలిసి నన్ను నీ దరికి ఎందుకు పిలవవు? అమ్మా! దయ చేసి నన్ను ధన్యురాలిని చెయ్యి త్వరగా నా దగ్గరకిరా సత్యాన్ని నిరూపించు ఆలస్యం చేయకు.

**3.12.2004**

2వ తా॥ బదులుదేరి 3 తా॥ ఉదయం హైదరాబాద్‌లో మా తమ్ముడు శర్మ ఇంటికి 6 గం॥కి వచ్చాను. అక్కడ వాళ్ళు నాకు ఊహించని విధంగా స్వాగతం పలికారు. గుమ్మం వద్దకి రాగానే చెల్లెలు ప్రసన్న చెంబుతో నీళ్ళు తెచ్చి గుమ్మంలో వారపోసి కాళ్ళుకడిగింది. మరదలు దుర్గ వెండి పళ్ళెంలో ఎర్రనీళ్ళు పోసి దిగతుడిచింది. తమ్ముడు శర్మ అష్టలక్ష్మి చెంబుతో కొబ్బరికాయ ఉంచి చుట్టూ మామిడి మండలు పెట్టి పూర్ణకుంభంతో ఎదురు వచ్చాడు. దుర్గ చెల్లెలు సావిత్రి పళ్ళెంలో కర్పూరం వేసి హారతి పట్టింది. ఇంట్లో సన్నాయి కేసెట్ పెట్టారు మంగళ వాద్యాలు మ్రోగుతుండగా ఇంట్లోకి వెళ్ళాను. నలుగురు ఆపిల్ పళ్ళు ఇచ్చిన పాద నమస్కారం చేసుకున్నారు. నేను ఊహించని

విధంగా ఇదంతా జరిగింది. నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందం కలిగి కంటి వెంట ఆనంద బాష్పాలు రాలాయి. గురుదేవా! ఇదంతా నీ ప్రేరణతో జరిగింది. ఈ స్వాగతం నాకు కాదు. నాలోని నీకు ఈ లీలకి అర్థం నువ్వే తెలియ చేస్తామన్న విశ్వాసంతో ఉన్నాను. నా రూపంలో స్వామి అక్కడికి వచ్చారన్న ఆనందంతో ఉన్నాను.

స్వామి అక్కడి నుంచి ఏదో ఊరు పంపుతానని మానసికంగా తెలియచేసి హైదరాబాద్ నుంచి పుట్టపర్తికి టికెట్ కొననివ్వలేదు. స్వామి షిరిడీ వెళ్ళు అని మానసికంగా తెలియచేసి 6.12.04 నన్ను సూరిబాబుతో షిరిడీ పంపించారు నా గురుదేవులు "త్రయంబకం" నా జన్మస్థలం అని తెలియచేసిన తరువాత ఇప్పుడు దేహంతో షిరిడీ నుంచి త్రయంబకం పంపించారు. అక్కడ బ్రహ్మ విష్ణు మహేశ్వరుల దర్శనం చేసుకున్నాను.

మా అమ్మ సాయి మాత, నా సాధన తరువాత నాన్నగారు షిరిడీ బాబా వద్దకు పంపింది. నాన్నగారూ! మా అమ్మ నా హృదయమంతా ప్రేమ నింపి మీ వద్దకి పంపింది. నా ప్రేమాశ్రువులతో మిమ్మల్ని అభిషేకిస్తున్నాను. నన్ను ఆశీర్వదించి ప్రేమ బాటలో నడిపి నన్ను ఒక పరికరంగా వాడుకోండి. మీ బిడ్డ కోరిక త్వరలో తీర్చండి పది మందికి పనికి రాని నేను ఈ దేహంతో తిరగలేను. నా ప్రార్థన ఆలకించండి మీ రక్షణలో ఈ అజ్ఞానిని జ్ఞానమణిగా తీర్చిదిద్దారు. ఈ ప్రకాశం ఆగదు. వెల్లువై ఈ విశ్వమంతా ప్రకాశంతో నిండిపోతుంది.

సత్యం ... సత్యం ... సత్యం ...
పరుస వేది ఇనుమును బంగారంగా మార్చినట్లు
నా స్పర్శ అజ్ఞానిని జ్ఞానిగా మారుస్తుంది

నా దృష్టి పడిన చోట మాయపొరలు తొలగిపోతాయి.
నా మాట హృదయంలోని రాగద్వేషాలు పోగొట్టి
హృదయమంతా ప్రేమామృతంతో నింపి వేస్తుంది.

నా తల్లి సాయిమాత, నా తండ్రి షిరిడీ బాబా ముక్కోటి దేవతల ద్వారా నాకు దివ్యాశీస్సులు ఇప్పించారు. గురుదేవా! నీ బిడ్డ ధన్యజీవి!

**26.12.2004**

ఈ రోజు దత్తజయంతి హృదయ భాషలో స్వామి ఇలా తెలియచేశారు. "కోరుకుంటే వచ్చేది కాదు. నీ పూర్వజన్మ పుణ్యం వలన నా కృపావర్షం నీ మీద పడి ఈ అద్భుతాలు జరుగుతున్నాయి. ఇది నా సంకల్పం నిశ్చితంగా ఉండు ఏం జరుగుతున్నా అది నాకే చెందుతున్న అతీత భావనలో ఉన్నావు. సమస్థితిలో ఉన్న నీకు కోరుకుండానే అన్నీ సమకూరుతాయి. ఎన్ని వచ్చినా నీవి కానట్లు అలౌకికానందంలో ఉంటావు. నీ గురువు ఆశీస్సులతో నీ ముందు జీవితంలో ఎన్నో అద్భుతాలు ఎవ్వరూ ఊహించనివి జరుగుతాయి. "నా స్థానం నీకు ఇస్తాను" నువ్వు నా బంగారువి.

అమ్మా! సాయిమాతా! నీ ఒడిలో పసిబిడ్డలాగా బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ అన్నిటికీ అతీతంగా ఉండేలాగా అనుగ్రహించి ఆశీర్వదించు.

**30.3.2005**

"స్వామి! నువ్వు మాట్లాడనిదే ఈ ఇల్లు విడిచి ఎక్కడికీ వెళ్ళాను. నా నిజ స్థానం నువ్వు వెలసిన ఈ పుట్టపర్తే. నీతో కూడిన ఈ స్వర్గం విడిచి నన్ను పంపకు ప్రభూ! నీకు దూరం అయి బ్రతకలేను. నా తండ్రీ! ఎన్ని ఆత్మానుభూతులు ఇచ్చినా, కొంత మంది ద్వారా నా స్థితి తెలియచేసినా నాకు

"తృప్తి" లేదు. ఈ ఉగాదికి పలికి ఆనంద ఉగాదిని చెయ్యి. పట్టిన పట్టు విడువను త్వరగా నాదరి చేరు రాధాలోలా!

**4.4.2005**

మందిరంలో మొదటి లైను రాకపోయినా ఈ రోజు స్వామి తన సంకల్పంతో నన్ను ముందుకు రప్పించి మూడుసార్లు నా వైపు స్పష్టంగా చూసి, తన అపారమైన కృపాదృష్టితో నన్ను అనుగ్రహించారు. 1984 గురుపూర్ణిమ నుంచి స్వామి వద్దకు వస్తున్నాను. ఇంత స్పష్టంగా ఎప్పుడూ చూడలేదు. 1999 నవంబరు 10 నుంచి స్వామి నన్ను అనుగ్రహించి ఇక్కడ స్థిర నివాసం ఏర్పాటు చేశారు. ఈ ఆరు సంవత్సరాలు అప్పుడప్పుడు క్రీగంట చూడటం, నా సందేహాలను తీర్చటం, అవసరమైన ప్రయాణాలు చేయించటం జరుగుతూ ఉండేది. కానీ, ఈ రోజు మూడు సార్లు ప్రత్యేకంగా కన్ను రెప్ప వెయ్యికుండా కొన్ని క్షణాలు చూడటం ఇదే మొదటిసారి. కొద్ది రోజులుగా పడుతున్న వేదనకి ఆ శుభదృష్టే నాకు సమాధనం అయ్యింది. ఆనందంతో నా కంటి వెంట ఆనందబాష్పాలు ధారలు కట్టాయి. ఆ కన్నీటి బిందువులే పుష్పాలుగా నా సాయికృష్ణ శిరస్సును అలంకరించాయి. నా కన్నీటి బిందువులే ప్రేమపుష్పాలై నా స్వామికి ప్రేమాభిషేకం చేశాయి కృష్ణా! ఈ శుభదృష్టి చాలదు. నీ మధుర వాక్కులతో నన్ను పలుకరించి ధన్యురాలిని చెయ్యి అప్పుడే నేను నీ ఆనందడోలికలలో సర్వం మరచి మహాతురీయానందంలో శాశ్వతమైన యోగనిద్రలో నీలోలయించి పోతాను కృష్ణా!

ఈ పార్థివ నామ సంవత్సర ఉగాదికి నీ ప్రకాశమే నూతన వస్త్రంగా ధరించిన నన్ను నీ పదకమలాల వద్దకు చేర్చుకుని 'నూతన' జీవితాన్ని ప్రసాదించు సాయిమాతా!

చావు పుట్టుకలు లేని సచ్చిదానందమే నేను
గురుకృపతో అమృతత్వం సిద్ధించిన నేను
అనంత ఆత్మతత్వంతో సనాతన సారధినై
సాగిపోతాను సనాతన ధర్మం వైపు

రండి బిడ్డలారా! నాతో సనాతన ధర్మమార్గంలో నడిచి అమృత పుత్రులు కండి!

**26. 7. 2005**

దృశ్యం "ఒక స్త్రీ కుర్చీలో కూర్చుని నేను రానా అన్నది. రమ్మని చెప్పాను. నా వద్దకి వచ్చింది. తర్వాత పట్టీలు పెట్టుకుని పసుపు పూసుకున్న రెండు పాదాలు కనిపించాయి. తరువాత రాలిపడుతున్న పారిజాత పుష్పాలు. తరువాత సుధ రెండు కుందులలో జ్యోతులు వెలిగించింది."

సాయంత్రం స్వామి బయటికి వెళ్ళటం వలన దర్శనం కోసం బయట నిలబడి "స్వామీ! పుస్తకాలు మణి వస్తే ఫెయిర్ చేయించమంటావా?" అని అనుకుంటూ నిలుచున్నాను స్వామి వెళుతూ నా వైపు స్పష్టంగా చూశారు. మూడు నెలల తరువాత స్వామి నా వైపు స్పష్టంగా చూడటం ఈ రోజే చాలా ఆనందంగా ఉన్నది దృశ్యానికి అర్థం "అమ్మ నా వద్దకి వచ్చింది. నా అద్వైత అనుభవాలు పారిజాత పుష్పాలై పరిమళాలు వెదజల్లుతూ అమ్మ పాదాల వద్దకు చేరినాయి. ఈ అద్వైతానుభవాలు జ్యోతులై సాధకులకు వెలుగుబాట చూపి ముక్తిని ప్రసాదిస్తాయి."

**6. 8. 2005**

దృశ్యం "తాళం చెవి"

స్వామి ఈ దృశ్యానికి తెలియచేసిన అర్థం

"ఇన్ని సంవత్సరాలు నేను ప్రసాదించిన జ్ఞానం నీ హృదయ పేటికలో భద్రపరచి ఉంచాను. సమయం వచ్చింది ఇక తాళం తీస్తాను."

**7.8.2005**

రాత్రి స్వప్నం : "నేను సముద్రం ఒడ్డున ఉన్నాను. అక్కడికి షిరిడీ బాబా ఒక కిరీటం, దుస్తులు తెచ్చారు. కిరీటం ఇత్తడిది చాలా బరువుగా ఉన్నది. అవి నా కోసం తెచ్చారు. "బాబా! నేను కాషాయం బట్టలు కదా అడిగింది! ఇవి తెచ్చావేమిటి?" అని అడిగాను. "ఐతే కాషాయం బట్టలు తెస్తాను" అన్నారు. "బాబా నీ వద్ద డబ్బులు లేవు కదా! నేను ఇస్తానని" అన్నాను. "సరే!" అని వెళ్ళిపోయారు వెళుతూ ఒక మనిషిని సముద్రంలో వేశారు. అది పైకి తేలింది. ఎవరో ఫొటో తీస్తే వెలుగులా వచ్చింది. తరువాత సత్యసాయి బాబా "కాషాయరంగు బట్ట తాను" చేతి కింద పెట్టుకుని తెచ్చారు. "బాబా నేను డ్రెస్సు కుట్టించుకోను కదా! ఇది తెచ్చారేమిటి?" అని అడిగితే 'ఐతే చీరె కట్టుకో!' అని వెళ్లిపోయారు. ఇత్తడి కిరీటం బరువుగా ఉండి దేవుడి మందిరం ముందు పెట్టాను.

**8.8.2005**

ఉదయం 7 గం॥కి మందిరంకి వెళ్తూ "అద్వైతామృత వర్షిణి పూర్తి అయింది, నన్ను, మణిని ఇంటర్వ్యూకి పిలిస్తే బాగుండునని" అనుకున్నాను మేము మందిరంలోకి వెళ్ళిన వెంటనే స్వామి వచ్చి కారు దిగకుండానే బయటకు వెళ్ళారు. మేము కూడా బయటకు వచ్చేసి రోడ్డు "ప్రక్కన నిలుచున్నాము. జనం ఎక్కువ లేరు. స్వామి పెద్దగా ఆలస్యం చేయకుండా కాలేజీకి వెళ్ళి వచ్చారు. స్వామి కారు మా దగ్గరకిరాగానే నేను "స్వామీ! పుస్తకం పూజా పుష్పంగా స్వీకరించమని" దోసిలి పట్టి అడిగాను. నా కళ్ళలోకి చూసి రెండుసార్లు

చేయెత్తి ఆశీర్వదించారు. మణిని కూడా చూశారు. మా మనసులు ఆనంద తాండవం చేశాయి. ఈ అనుభవం మరువలేనిది! ఇంటర్వ్యూకి పిలుస్తారన్న నమ్మకంతో ఉన్న మాకు అనుకోని విధంగా బయటనే ఇంటర్వ్యూ ఇచ్చారు. నా గురుదేవులకు ప్రస్తుతం న్ను ఇంటర్వ్యూకి పిలవటం ఇష్టంలేదు. సమయం కోసం చూస్తున్నారు నా నిరీక్షణ ఫలిస్తుంది.

తొమ్మిది రోజులపాటు పుస్తకం పూర్తి చేయించి ఊహించని విధంగా మమ్మల్ని ఆశీర్వదించారు. ఇది ఒక అద్భుత లీల! స్వామీ! నీకు మా హృదయ పూర్వక పాదాభివందనాలు.

**కలకు అర్థం :**

షిరిడీ బాబా కిరీటం ఇవ్వటం అంటే నాకు కీర్తే కిరీటం. ఒక వ్యక్తిని సముద్రంలో వేస్తే అది తేలటం అంటే మన జన్మకర్మలను బట్టి జన్మ వస్తుంది. సంసారమనే సముద్రంలో మునిగిన జీవుడు తన కర్మలు నశించిన తరువాత గురు దృష్టి పడి గురుకృపతో సంసార సాగరం నుంచి పైకి తేలతాడు. జీవుడు జీవత్వం నశించి (అంటే నేను జీవుడిని అనే అజ్ఞానం) ప్రకాశిస్తాడు.

స్వామి త్వరలో నన్ను బయటపెట్టి నా ఆత్మ ప్రకాశానికి దగ్గరగా పది మందిని చేర్చి నాకు కీర్తిని ప్రసాదిస్తారు. ఈ కీర్తి స్వామి కంటే ఎక్కువ కాదు. రాబోయే కీర్తి ప్రతిష్టలన్నీ నా స్వామికే “అంకితం”.

నా సాధన మొదట్లో ‘ఐ’ అన్న మాట వినిపించింది. ఆ మాటకి అర్థం ‘ఐ’ అంటే ఐరన్, ఐరావతము అనీ అనుకున్నాను. నా సాధన పూర్తి అయిన తరువాత స్వామి ‘ఐ’ కి అర్థం ఈ విధంగా తెలియచేశారు. ‘ఐ’ అంటే నేను, నేనే!

**17.10.05**

మధ్యాహ్నం : చాలా వేదనగా ఉన్నది. స్వామీ! నువ్వు ఒక్కసారి మాట్లాడు. నీ మౌనం భరించలేను అని చాలా ఏడ్చాను. మగతగా నిద్ర పట్టింది విన్నమాట "సమాప్తం" అయింది.

**27.11.05**

రాత్రి కలలో ఒక దేవుడి మందిరం ముందు సన్నగా, పొడువుగా, మోకాళ్ళ వరకు గావంచా కట్టుకుని ఒక సాధువులాటి వ్యక్తి నిలుచుని ఉన్నాడు. "నా అనుభవాల పుస్తకం పేరు సుందరం" చదవమని అన్నాను. అతను నా పేరు "సుందరం" అన్నారు. కానీ, నా పుస్తకంలో పేరు మీది కాదని అన్నాను. అతను ఆ పుస్తకాలు 'రీసెర్చి'కి పనికి వస్తాయని అన్నారు. కానీ ఆ సాధువు తానేనని, సుందర సాయిగా తెలియచేశారు.

**2.12.05**

మధ్యాహ్నం దృశ్యం "కోతికాలు ఎవరో పట్టుకున్నారు" మధ్యాహ్నం "స్వామీ! నా మనస్సు స్థిరత్వం లేకుండా కోతిలాగా ఉంటే ఆ మనస్సును నీ స్వాధీనం చేసుకుని త్వరగా నా దరి చేరు" అని ప్రార్థించాను. తరువాత ఇలా పై దృశ్యం కనిపించింది.

"కోతిలాటి నీ మనస్సును ఎప్పుడో నా స్వాధీనం చేసుకున్నాను. కొత్తగా మళ్ళీ స్వాధీనం చేసుకోవటం ఏమిటి? నేను నీ వద్దకు రాలేదన్న బాధతో పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తున్నావు నీదరి చేరే సమయం ఆసన్నమైంది. ప్రశాంతంగా ఉండు".

స్వామి ఫొటోను చక్కగా పూలతో అలంకరించి, అగరవత్తులు

వెలిగించాను. ఇల్లు ఎంతో ప్రశాంతంగా స్వర్గంలో ఉన్నట్లుగా ఉన్నది. మనసంతా స్వామి మధుర ప్రేమతో నిండిపోయింది. "కృష్ణా! నిన్ను చూడకుండా ఒక్కక్షణం కూడా ఉండలేను ఈ విరహవేదనను భరించలేను. ఇంత విరహవేదనకు గురి చేసి వినోదిస్తున్నావా? మదనగోపాలా! నా హృదయం ప్రేమాగ్నిలో కాలిపోతున్నది. త్వరగా వచ్చి ఈ అగ్నిని నీ చల్లని స్పర్శతో చల్లపరుచు. నీ ఆలస్యంతో నన్ను పిచ్చి దానిని చేయకు" అని దుఃఖిస్తున్న సమయంలో అనుకోకుండా భాస్కరమ్మ సనాతన సారధి పుస్తకం తీసుకుని నాకు ఇవ్వటానికి వచ్చింది. నేను "ఈ ఇల్లు స్వర్గంలా ఉన్నది" అన్న వెంటనే "ఔను!" అంటూ నన్ను ముద్దులు పెట్టుకుని ఎంతో ఆనందపడింది. నాకు కూడా చాలా ఆనందం కలిగి తన్మయత్వం చెందాను.

ఆమె వెళ్ళిన తరువాత కొంత సేపటికి స్వామి హృదయ భాషలో "నీ వేదన చూడలేక, నీ ప్రేమకు పరవశించి నీ పవిత్రమైన నిర్మల ప్రేమకి తట్టుకోలేక ఆ రూపంలో వచ్చాను. త్వరలో నా నిజరూపంతోనే నీ వద్దకు వస్తాను" అని తెలియచేసిన తరువాత నా స్థితి వర్ణనాతీతం.

భగవంతుడు ఏ రూపంలో అయినా రావచ్చు. వచ్చి భక్తుడి వేదనను తానే తీరుస్తాడు.

ఇదంతా భక్తుడికి భగవంతుడి మీద ఉన్న మధురప్రేమ భక్తి. భక్తుడి దేహాతీతమైన ఏకాత్మభావనలోని "పరమప్రేమ" మాలిన్యమంటని నిర్మల ప్రేమ.

**12.12.05**

"స్వామీ! జ్ఞానయజ్ఞం పూర్తి అయింది. యజ్ఞం ఫలంగా 2006 జనవరి నాటికి నువ్వునానోట పలికించిన సత్యం నిజం చేసి సీతకి చి॥ మణికంఠ

ధర్మసాయిని ప్రసాదించు, సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ ఈ నాలుగు నలుగురు బిడ్డలుగా ఇస్తానన్నావు. ముగ్గురిని ఇచ్చావు. ధర్మం కూడా బిడ్డగానే కావాలి. 1986లో మొదటిసారి, 1987లో రెండవసారి చి॥సీతకి తప్పక బిడ్డ కలుగుతాడని రాజరాజేశ్వరి సన్నిధిలో, తరువాత మాణిక్యాంబ సన్నిధిలో నా నోట నీవు పలికించిన సత్యం ఫలించాలి స్వామీ! ఈ మధ్య కలలో కనిపించి "సీతకి కొడుకు పుట్టడు" అని చెప్పావు ప్రభూ! నీకు అసాధ్యమైనది ఏదీ లేదు. నీ సంకల్పబలంతో ఏమైనా చెయ్యగలవు. 1984 నుంచి సత్యధర్మ ప్రేమ శాంతి అనే మూల స్తంభాలను ఆధారంగా చేసి ఈ ఆధ్యాత్మిక బాటను నడిపించావు. ధర్మం అనే స్తంభం లేకుండా ఆధ్యాత్మికంగా ఉన్నత శిఖరం చేరినా పునాది లేని గోడలా సత్యం నిలవదు. మనిషి జీవించటానికి ఉచ్ఛ్వాస, నిశ్వాసలెంత ముఖ్యమో ఈ ఆధ్యాత్మిక బాటకి సత్య ధర్మాలు అంత ముఖ్యం. నాలుగు వేదాలు నాలుగు బిడ్డలు అన్న నువ్వు ఆయువుపట్టు అయిన ధర్మాన్ని బిడ్డగా ఇవ్వకపోతే నాకు నువ్వు ప్రసాదించిన శ్రీవిద్యకు అర్థం లేదు. ధర్మం లేని విద్య శ్రీవిద్యకాదు. నాలుగు వేదాలను బిడ్డలుగా ఇచ్చి, నన్ను పరిపూర్ణురాలిని చేసి, నానోట వేదవాణిని పలికించు, ధర్మ సంస్థాపనకు నన్ను ఒక పరికరంగా వాడుకుని నా జన్మకు అర్థం కలిగించు. సీతకు నా ద్వారా మాట ఇచ్చింది నువ్వే. అయినా నా నోట పలికావు కాబట్టి ఇది జరగని రోజున నేను జీవించటం వ్యర్థం. వ్యర్థ పదార్థంగా భూమికి భారంగా ఉండలేను. సత్యం తప్పి జీవించటం కంటే మరణించటం మేలు అన్న నీ సత్యవాక్కును ఆచరణలో పెడతాను మరణభయం లేదు.

న్యాయమూర్తీ! న్యాయం, ధర్మం ఆలోచించి నీ బిడ్డకి ఏది ధర్మమో అదే చెయ్యి. నీ బిడ్డని పది మందికీ పనికివచ్చే పరికరంగా వాడుకుంటావో లేక అజ్ఞాతంగా ఉంచుతావో నిర్ణయం నీది. భగవంతుడే న్యాయనిర్ణేతగా

తీర్పు చెబుతున్నప్పుడు అన్యాయానికి చోటు లేదు. భగవంతుడు తీర్పు చెప్పే సమయం ఆసన్నమైంది. ధర్మం గెలుస్తుంది. ధర్మానికి మరణం లేదు.

భగవాన్ జగద్గురువు శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా నా గురువు. 21 సంవత్సరాలు ఆధ్యాత్మిక మార్గంలో నడిపించి అనేక రకాల పరీక్షలు పెట్టి విజయాలనే ప్రసాదించారు. నా ప్రతి విజయం వెనుక భగవాన్ అదృశ్యహస్తం నన్ను ఆశీర్వదిస్తూనే ఉన్నది.

ఇది చివరి పరీక్ష. ధర్మానికే పరీక్ష! ధర్మ దేవత ధర్మానికే పట్టం కడుతుంది.

గురుదేవా! నీ న్యాయమైన తీర్పుకి మానవులే కాదు ముక్కోటి దేవతలు, ప్రకృతిలోని చలించేవి, చలన రహితమైనవి సృష్టియావత్తూ ఎదురు చూస్తున్నది. నువ్వు చెప్పే తీర్పు ధర్మంగానే ఉంటుంది. నీ బిడ్డననే అర్హత కలిగించు!

**12.12.2005**

ఈ రోజు ఉదయం మందిరంలో నా అనుభూతి "బాలభానుని నులి వెచ్చని కిరణాలు నా శరీరాన్ని స్పృశిస్తుంటే సాయి గాయిత్రి స్పర్శతో నా శరీరం పునీతం అయ్యింది. సూర్యకిరణాలు కూడా అమ్మ నుంచి వచ్చినవే కదా! గాయత్రీ మాత తన తేజోవలయంతో నన్ను చుట్టి నాకు రక్షగా నిలిచింది. అది అగ్ని వలయం ఇంక ఏ దుష్టశక్తీ నన్ను సమీపించదు. అమ్మ రక్ష నాకు శ్రీరామరక్ష. అదే సాయిశక్తి. ప్రేమే నేను. నేనే ప్రేమ."

**13.12.2005**

పార్థివ నామ సంవత్సరం. మార్గశిర మాసం. కృత్తిక నక్షత్రం త్రయోదశి, వర్జ్యం లేదు.

ఉదయం 7 గం. 30 ని.లకు బాబా ఫొటో ముందు కూర్చున్న నాకు షిరిడీ బాబా ఫొటో పెట్టాలని అనిపించింది. షిరిడీ బాబా ఫొటో పెట్టాలన్న కోరిక తీవ్రమై భాస్కరమ్మని తీసుకుని సాయిస్టోరుకి వెళ్ళాను. నేను తెల్లని దుస్తుల్లో ఉన్న ఫొటో కొనాలని అనుకున్నాను. కానీ, అక్కడ కాషాయదుస్తుల్లో ఉన్న ఫొటో ఉండటం వలన వేరే స్టోరుకి వెళ్ళాము. అక్కడ అసలు షిరిడీబాబా ఫొటోనే లేదు. కాషాయ దుస్తుల్లో ఉన్న ఫొటో పెట్టటమే స్వామి నిర్ణయం అనుకుని భాస్కరమ్మని మొదటి షాపుకు వెళ్ళి ఆ ఫొటోనే తెమ్మని చెప్పాను. ఆవిడ తెచ్చారు. త్రోవలో స్వామి హృదయభాషలో ఇలా తెలియచేశారు. 8.8.05న కలలో షిరిడీ బాబా నీకు దుస్తులు తెస్తే కాషాయరంగు కదా నేను అడిగింది. ఇవి తెచ్చారేమిటని అడిగావు కదా! అందుకే కాషాయ దుస్తులు ఉన్న ఫొటోనే నీ చేత కొనిపించి ఆ దుస్తులతో ఉన్న ఫొటో రూపంలో నీ ఇంట్లోకి వచ్చారు. ఆ కాషాయ దుస్తులే నీకు ఇస్తాను" అని చెప్పిన తరువాత తెల్లని దుస్తులతో ఫొటో కొనలేదన్న బాధ తీరింది. ఇంటికి వచ్చి భాస్కరమ్మ, నేను ఫొటో పెట్టి హారతి పట్టాము.

సేమ్యా పాయసం స్వామి ప్రేరణతో గిన్నెకు పసుపు, కుంకుమ పెట్టి చేశాను.

నిన్న రాత్రి ధర్మసాయిని ప్రసాదించమని వ్రాయించి ఉదయం షిరిడీ బాబా ఫొటో పెట్టించడం స్వామి "అద్భుతలీల". నా తండ్రి షిరిడీ బాబా, ఫొటో రూపంలో ఇంట్లో మొదటిసారిగా ప్రవేశించారు. నా తల్లీ తండ్రీ నన్ను ఆశీర్వదించే సమయం ఆసన్నమైనది.

**15.12.05**

ఉదయం 5.30 గం॥లకు ఆదిలక్ష్మి ఈ రోజు "దత్త జయంతి" అని

పాద నమస్కారం చేసుకున్నారు. ఆవిడ చెబితేకాని ఈ రోజు దత్తజయంతి అని నాకు తెలియదు. 14 తా॥ సాయంత్రం వీధిలోకి చేమంతులు వస్తే మూడు మూరలు కొన్నాను. షిరిడీ బాబా ఫొటోకి పూలు పెట్టి అలంకారం చేసి దత్త జయంతికి ముందే షిరిడీ బాబా (నా తండ్రి) ఫొటో రూపంలో వచ్చారని ఆనందంతో ఉన్నాను. చీరెకొని బీబీకి పెట్టమని స్వామి హృదయభాషలో తెలియచేశారు. మందిరంకి వెళ్ళి అక్కడ నుంచి స్టోరుకు వెళ్ళి స్వామి ధరించే రంగు చీరకొన్నాను. అక్కడ ఒక ఫారిన్ స్త్రీ "నైస్ కలర్" అంది. స్వామి ఆవిడ ద్వారా అన్నట్లు భావించి తృప్తిగా చీర తీసుకున్నాను. బయట నుంచీ స్వామి దర్శనం చేసుకున్నాను.

ఉదయం 8 గం॥లకి గిన్నెకు పసుపు పూసి కళ్యాణం బొట్టు పెట్టి సేమ్యా పాయసం చేసి విశ్వకళ్యాణానికి నన్ను ఒక పరికరంగా పది మందికి పనికి వచ్చే విధంగా వాడుకొమ్మని నా గురుదేవులను ప్రార్థించాను. మొదటి ప్రసాదం ఏ రూపంలో వచ్చి తీసుకుంటారో అని అనుకున్నాను. 'బీబీ'కి చీర పెట్టి మొదటి ప్రసాదం పెడదామని అనుకున్నాను. కాని, బీబీ ఇంట్లో లేదు. ఎక్కడికో వెళ్ళింది. 11 గం॥ వరకు చూశాను. స్వామి హృదయభాషలో 'మొదటి ప్రసాదం ఆది లక్ష్మికి పెట్టు. ఉదయం ఆ రూపంలోనే వచ్చి నీకు దత్త జయంతి అని తెలియచేసిందని చెప్పిన తరువాత వెంటనే ఆదిలక్ష్మిని పిలిచాను. ఆవిడ వచ్చారు. ఆవిడ చేత హారతి పట్టించి ప్రసాదం పెట్టాను. ఆవిడను పంపించటానికి గుమ్మంలోకి వెళ్ళాను. అక్కడ బీబీ ఉన్నది. మొదటి ప్రసాదం స్వామి చెప్పినట్లు ఆది లక్ష్మి రూపంలో వచ్చి ప్రసాదం స్వీకరించారు. ఇది జరిగిన తరువాతే బీబీ రావటం నాకు, ఆదిలక్ష్మికి ఆశ్చర్యం వేసింది. బీబీని కుర్చీలో కూర్చోమని చీరపెట్టి, హారతి పట్టి ప్రసాదం పెట్టాను. షిరిడీ బాబా ఆ

రూపంలో వచ్చి చీర కట్టుకున్నారు. ఏ రూపంలోనయినా రావచ్చు. బీబీలో షిరిడీ బాబానే చూసుకొని చాలా ఆనందించాను. ఈ రోజు స్వామి అనుగ్రహించిన లీల అద్భుతం! మరచిపోలేనిది.

**26.12.05**

ఉదయం మందిరం నుంచి వచ్చిన తరువాత చాలా దుఃఖించాను. "స్వామీ! నా 70వ జన్మదినోత్సవానికి నువ్వు మాట్లాడి నన్ను, నన్ను నమ్మిన వాళ్ళని. ఆనందపెట్టు ఈ ఆలస్యం భరించలేనిది. నా జీవిత చరిత్ర ముగించు" అని వేడుకున్నాను. తరువాత స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు.

"రచయిత ఒక నవల వ్రాస్తాడు. ఆ నవల ఎప్పుడు, ఏ విధంగా ముగించాలో అతనికి తెలుసు. పాఠకులు ముగింపు కోసం తొందరపడక ఎదురు చూడాలి. అదే విధంగా నీ చరిత్ర ఎప్పుడు ముగించాలో నాకు తెలుసు. నువ్వు తొందరపడినంత మాత్రాన ముగింపు జరగదు. సహనంతో నిరీక్షించు. ముగింపు ఏ క్షణంలోనైనా జరగవచ్చు. ఆ క్షణం కోసం ఎదురుచూడు."

అని స్వామి తెలియచేసిన తరువాత స్వాతివాన కోసం ఎదురుచూసే ముత్యపు చిప్పలా ఆ క్షణం కోసం నా నిరీక్షణ ప్రారంభం అయింది.

**27.12.2005**

ఈ రోజు నా 70వ జన్మదిన సందర్భంగా నా గురుదేవులకు హృదయ పుష్పం సమర్పించాను. ఈ రోజు ఉదయం స్వామి దర్శనం ఇవ్వలేదు. నాకు ఏమీ బాధ అనిపించలేదు. విశ్వమంతా నిండిన నా స్వామిని నా హృదయంలో దర్శించుకుని తృప్తి పడ్డాను.

**27.12.2005**

క్రిస్మస్ సందర్భంగా స్వామి మందిరాన్ని అలంకరించారు. ఉదయం వాళ్ళు అలంకరించిన వాటిలో ఒక నక్షత్రం నేను కూర్చున్న చోట పడి ఉన్నది. తీసుకోవాలా ... వద్దా? అని సందేహించి నేను తీసుకోకపోయినా వాళ్ళు ఎలాగా తీసి పారేస్తారని స్వామి ప్రేరణతో నాతో తెచ్చుకున్నాను. నక్షత్రం గురించి స్వామి ఇలా వ్రాయించారు.

“దివి నుండి భువికి దిగిన తారా ... నయనతారా! నీ నయనాల కాంతులు విశ్వమంతా వ్యాపించాయి. నీ నయనకాంతి కిరణాలు పడిన వ్యక్తిలో మాయ తొలగి హృదయమంతా వెలుగు నిండి ఆ వెలుగులో నన్ను దర్శిస్తారు. తారా ... 'నయనతారా!'

నా 70వ జన్మదిన సందర్భంగా నా గురుదేవులు ప్రసాదించిన వెలలేని కానుక సేవ “మానవుడిని మాధవుడిగా మార్చటం” ఈ నెల 13వ తేదీన షిరిడీ బాబా ఫోటో రూపంలో వచ్చారు. నా తల్లి సాయిమాత, నా తండ్రి షిరిడీ బాబా. ఇద్దరూ కలిసి జరిపించిన నా జన్మదిన వేడుక అత్యంత వైభవంగా వాళ్ళ సన్నిధిలో జరుపుకుని, వాళ్ళ దివ్యాశీస్సులు పొందటం నేను చేసుకున్న జన్మజన్మల సుకృతం కంటే వాళ్ళ దివ్యప్రేమే నాకీ అర్హతను ప్రసాదించింది.

నా ప్రియమైన తల్లిదండ్రులారా! మీకు నా హృదయపూర్వక పాదాభి వందనములు! త్వరలో నన్ను మీ వద్దకు చేర్చుకోండి.

స్వామీ! నువ్వు అందర్నీ 'బంగారూ' అంటావు. నేనూ అలాగే పిలవనా! అన్నాను. స్వామికాదు కాదు! సింగారం!” అన్నారు. సింగారం ఏమిటి స్వామి! అన్నాను. “బంగారూ అంటే బంగారం. నేను బంగారం పంపిస్తాను. వాళ్ళని చక్కగా పుటం పెట్టి మాలిన్యం తొలగించి జ్ఞానవంతుల్ని చేసి వాళ్ళని

జ్ఞానమణులతో సింగారించు. మానవునికి వైరాగ్యమే సింగారం. ఉత్తబంగారం కంటే మణి పొదిగిన బంగారానికే విలువ ఎక్కువ. మానవుడు జ్ఞాన, వైరాగ్యము లనే ఆభరణములను సింగారంగా ధరించటమే నిజమైన ఆభరణాలు. ఆ మానవుడే భగవంతునికి నిజమైన భక్తుడు."

**1.1.2006**

తిథుల ప్రకారం ఈ రోజు నా 70వ జన్మదిన సందర్భంగా స్వామి మాట్లాడతారని అనుకున్నాను. కాని, స్వామి మౌనమే వహించారు. వేదనతో ఉన్న నాకు మధ్యాహ్నం దృశ్యంలో "ఒక గొడుగు, గొడుగులో ప్రకాశిస్తూ ఒక మణి" కనిపించింది. స్వామి తెలియచేసిన అర్థం. "నువ్వు జ్ఞానమణివి. నా నీడలో నీవు ప్రశాంతంగా ఉండు. 70వ జన్మదిన సందర్భంగా భగవంతుడు తప్ప ఎవ్వరూ ఇవ్వలేని వెలలేని కానుక ఇవ్వబోతున్నాను. విశ్వాసంతో ఎదురు చూస్తూ ఉండు!"

**5.1.2006**

మధ్యాహ్నం విన్న మాట "చింతపండు పులుసు పొయ్యి" అర్థం – 'చింత' వద్దు, 'పండు' – జ్ఞానం పండింది, "పులుసు పొయ్యి" – ప్రేమరసాన్ని అందరికీ పంచు."

క్షీరసాగర మథనంలో విషము, అమృతము రెండూ వచ్చాయి. విషము శివుడు పానం చేసి, అమృతం దేవతలకు పంచాడు. నీ అంతరంగ మథనంలో మంచికి, చెడుకు జరిగిన పోరాటంలో ఈశ్వరుని కృపతో చెడు సంహరింపబడి, నీ హృదయం అమృతంతో నిండిపోయింది. విష్ణుమూర్తి దేవతలకు అమృతం పంచినట్లు నీలోని జ్ఞానామృతాన్ని దైవం కోసం పరితపించే వాళ్ళకు పంచు."

"సాయి కృష్ణుడు నాకు ఇచ్చే వెలలేనికానుక తాను నా వాడు కావటమే." భక్తుడు, భగవంతుడు ఒక్కటి కావటమే భక్తికి పరాకాష్ఠ. భక్తుడికి ఇంతకంటే ఏమి కావాలి?

"పరమ ప్రేమలో లీనం అయిన భక్తుడు ధన్యజీవి."

ఓ భక్తుడా! ఈ విశ్వంలోని ప్రతి అణువు, సృష్టిలోని జీవరాసులన్నీ నీకు శతకోటి వందనాలు ప్రేమతో సమర్పిస్తున్నాయి. నీ దివ్య ఆశీస్సులు అందచెయ్యి" గురుదేవా! నీ పరమ ప్రేమలో లీనం అయిన నేను ధన్యురాలిని. నీ పాదపద్మాలకు నా నమస్కారములు.

**12.2.2006**

"సాయి శిరోజాలు శక్తివంతమైన చైతన్య కిరణాలు. ఆ కిరణాలు విశ్వమంతా వ్యాపించిన చైతన్య జ్యోతులు. ఈ జ్యోతులు ప్రతి మానవ హృదయంలో అఖండ జ్యోతులై వెలిగి విశ్వమంతా శివశక్తి మయం కావాలి. సత్యసాయి కీర్తి దేశదేశాలు వ్యాపించి విశ్వమంతా సాయిమయం కావాలి. ఈ జగమంతా ప్రేమాలయం. సత్యసాయికి నిలయం.

మానవుడిలో రాగం, ద్వేషం, అహంకారం, నాది అన్న మమకారం, స్వార్థం అనేవి పంచమహాపాతకాలై (పంచమహాపాతకములకి స్వామి తెలియచేసిన కొత్త అర్థం) మానవుని దానవునిగా చేసి పాతాళంలోకి అణిచి వేస్తున్నాయి.

ఓ మానవుడా! స్వార్థం వీడి నీలోని వ్యక్తిత్వం వికసింపచేసిన నీ మావనత్వపు పరిమళాలు విశ్వమంతా వ్యాపించి సుగంధ పరిమళాలను వెదజల్లుతాయి.

**15.1.2006**

రాత్రి స్వప్నంలో భాస్కరమ్మతో “లలితాదేవికి రేపు కుంకుమ పూజ చేద్దాము రండి” అని చెప్పాను.

18వ తేదీ బుధవారం మా అమ్మాయి మణి, కోడలు అన్నపూర్ణ పుట్టపర్తి వచ్చారు. అన్నపూర్ణకి నా కల విషయం చెప్పి లలితా దేవికి కుంకుమ పూజ చెయ్యమని చెప్పాను. తను ఢిల్లీ నుంచి లక్ష్మి, సరస్వతి విగ్రహాలు తెచ్చానని, అవి తన “పర్సు”లోనే ఉన్నాయని, వాటికి పూజ చేస్తానని చెప్పింది. లక్ష్మి, సరస్వతులను స్వామి పాదాల ముందుకుర్చీలో పెట్టి అన్నపూర్ణ శ్రద్ధతో లలితాదేవి నామాలు చదువుతూ పూజ చేసింది. 18వ తేదీ బుధవారం, 19వ తేదీ గురువారం పూజ జరిగిన తరువాత మధ్యాహ్నం “సాయిమాతా! లలితాదేవికి కుంకుమ పూజ చెయ్యమని లక్ష్మి సరస్వతులకు చేయించావేమిటని ప్రార్థించాను. అప్పుడు స్వామి హృదయభాషలో ఇలా తెలియచేశారు.

1983వ సంవత్సరంలో ఆ విగ్రహాలు తీయించి, ఎవరికో ఇప్పించినప్పుడు అవి ఇంట్లోంచి వెళ్ళిపోయాయని చాలా ఏడ్చావు. తరువాత 1984వ సంవత్సరం జులైలో గురుపూర్ణిమకి నువ్వు మొదటిసారి పుట్టపర్తి వచ్చి, వెళ్ళే ముందు నా ఫొటోకొని తీసుకువెళ్ళావు. ఆ ఫొటో పెట్టే ముందు 1983వ సంవత్సరంలో శివుడు, పార్వతి మరికొన్ని ఫొటోలు పెడితే అవి కూడా తీయించేశాను. ఆంజనేయుడైనా నిలుస్తాడని పెడితే అదీ తీయించాను. తరువాత లక్ష్మి, సరస్వతి, షిరిడీ బాబా ఫొటోలు కూడా తీయించాను. అవన్నీ తీయించింది. “నేనే” అని అప్పుడు నీకు తెలియదు. ఈ ఫొటో అయినా నిలుస్తుందో లేదోనని అనుకుంటూ నా ఫొటో పెట్టుకున్నావు. గురువుగా వచ్చి నీ చేత ఇరవై యొక్క (21) సంవత్సరాలు సాధన చేయించి, అద్వైత స్థితికి

చేర్చాను. గురువే దేవుడిని చూపించాలి. దేవుడే గురువుగా వచ్చి తీయించిన ఫోటోలను 2006 సంవత్సరంలో అన్నీ నీకు చేరుస్తాను. అందుకే నీ 70వ జన్మదినానికి షిరిడీ బాబా ఫోటో నీ చేతే తెప్పించి డిశంబరు 2005లో పెట్టించాను. ఇప్పుడు అన్నపూర్ణ చేత లక్ష్మి, సరస్వతి విగ్రహాలు తెప్పించి పూజ చేయించాను."

అని తెలియచేసిన తరువాత నా ఆనందం కన్నీటి ధారలుగా ఆ తల్లులను అభిషేకించాయి.

**7.2.2006**

కుర్తాళం పీఠాధిపతులు పంపిన స్వయం సిద్ధి కాళీ ఫోటో, సామవేదం షణ్ముఖశర్మగారు ఇచ్చిన లలితాదేవి ఫోటో కుర్చీంలోచి తీసి గోడకు పెడదామని మేకులు కొట్టించాను. పర్వతం ఎత్తుకున్న ఆంజనేయుడి ఫోటో ఒకటి మేకులు పెట్టమని స్వామి బీబీ ద్వారా చెప్పించారు.

ఆంజనేయుడి ఫోటో కొందామని వెళ్ళిన నాకు త్రోవలో సుబ్బలక్ష్మి గారు కనిపించి వాళ్ళింట్లో "ఆంజనేయుడి ప్రసాదం" అని చెప్పి బూరెలు పెట్టారు. ఆంజనేయుడి ఫోటో కోసం తిరుగుతన్న నాకు ఆ విధంగా ప్రసాదం పెట్టించడం స్వామి లీల!

సంజీవని పర్వతం ఎత్తుకున్న ఆంజనేయుడి ఫోటో 'లామినేట్' చేయించి తెచ్చాను. పదవ తారీఖు శుక్రవారంనాడు అనుకోకుండా మా మనవడు జోగేంద్ర, అన్నపూర్ణ పుట్టపర్తి వచ్చారు. స్వామి సంకల్పంగా భావించి జోగేంద్ర చేత ఫోటో పెట్టించి హారతి పట్టించాను. స్వామి వాడిని ఎన్నుకొని, బ్రహ్మచారి చేత ప్రాణ ప్రతిష్ఠ చేయించారు. ఇక్కడికి ఒక్క రోజు కోసం ఢిల్లీ నుంచి రప్పించి స్వామి "అద్భుతలీల" ప్రదర్శించారు.

తరువాత స్వామి హృదయభాషలో ఇలా తెలియచేశారు. “నేను తీయించిన ఆంజనేయస్వామి ఫొటో తిరిగి ఈ రోజు నీకు ఇచ్చాను. ఈ ఫొటో శాశ్వతంగా నీతో ఉంటుంది. ఆ రోజున నీవు ఎంత ఏడ్చావో నాకు తెలుసు! ఏడిపించటం, నవ్వించటం సాయికి సరదా! నేను ఏమి చేసినా నన్ను నమ్మి నా పాదాలను విడువని నీ భక్తి నన్ను ఎంతో ఆనంద పెడుతున్నది. త్వరలోనే నీ వద్దకి వచ్చి నిన్ను ఆనందంలో ముంచి తేలుస్తాను. నేను ప్రేమ శక్తికి దాసుడను!”

**19.2.2006**

“స్వామి కారు దిగుతున్న ఫొటో కొనాలని ఎప్పటి నుంచో కోరిక. అటువంటి పెద్ద ఫొటో ఒకటి కొని లామినేషన్ చేయించాను. ఫొటో తీసుకుని సాయంకాలం ఇంటికి వెళుతుంటే అనుకోకుండా భాస్కరమ్మ కనిపించారు. ఆవిడని ఫొటో పట్టుకోమని చెప్పాను. పూలుకొని ఇంటికి వచ్చాక ఆవిడని గుమ్మంలోనే ఉండమని, గుమ్మంలో నీళ్ళు జల్లి, ముగ్గువేసి పసుపు, కుంకుమ చల్లి, ఫొటోరూపంలో స్వామి వచ్చి కారు దిగుతున్నారన్న ఆనందంలో ఎర్రనీళ్లు తీసి కొబ్బరికాయ కొట్టాను. మేము ఫొటో ఇంటికి తెచ్చిన వెంటనే సుబ్బలక్ష్మి గారు వచ్చారు. ప్రమీల కూడా వచ్చింది. నేను, వాళ్ళు ముగ్గురూ కలిసి స్వామిని ఇంట్లోకి తీసుకుని వచ్చి కొత్త కర్చీఫ్ మీద ఫొటో పెట్టి హారతి పట్టాము. భాస్కరమ్మ పూలదండ తెచ్చివేశారు. సుబ్బలక్ష్మి గారు అరటి పళ్ళు తెచ్చారు. అవి ప్రసాదంగా పెట్టాను.

జనవరి 18, 19వ తేదీలలో అన్నపూర్ణ లక్ష్మి, సరస్వతులకు పూజ చేయటం, మళ్ళీ నెల తిరగకుండానే ఈ నెల పదవ తేదీన ఆంజనేయస్వామి ప్రతిష్ఠ, 19వ తేదీ స్వామి కారు దిగుతున్న ఫొటో పూజలందుకోవటం, అంతా

క్రమబద్ధంగా జరిగింది. శివపార్వతులు, లక్ష్మి, సరస్వతి చిన్న ఫొటోలు కొని స్వామి పాదాల వద్ద పెట్టాను. అంతా స్వామి సంకల్పం. నేను పోగొట్టుకున్న దేవతామూర్తులన్నీ రావటం, నా గురుదేవులు రావటం అంతా స్వామి "మాస్టర్ ప్లాన్!"

**25.2.2006**

రాత్రి స్వప్నం. "ఒక గుడి, ఆ గుడిలో దేవత కాళీమాత అనుకుంటాను. అక్కడ నేను, ఒక పురుషుడు ఉన్నాము. అతను బాగా బలిసి నల్లగా నిగనిగలాడుతున్న గొఱ్ఱెపోతును తెచ్చి తల నరికాడు. తల తెగి పడింది. రక్తం చింది నాపై పడింది. తరువాత ఒక నల్లని బట్ట ఉయ్యాలలా పట్టుకుని గొఱ్ఱెపోతు శరీరాన్ని ఆ బట్టలో వేసి కత్తితో ముక్కలు, ముక్కలుగా నరికాడు. ఆ 'కల'కి అర్థం తెలియలేదు.

రాత్రి పది గంటలకి దృశ్యం "ఒక ధనస్సు బాణం లేకుండా కనిపించింది." బాణం లేదేమిటి? అనుకున్నాను.

**26.2.2006**

శివరాత్రి రోజు మందిరంలో స్వామి కూర్చుని ఉండగా "స్వామీ! ఈ శివరాత్రికి నాకు సందేశం ఏమిస్తావు" అని అనుకుంటూ కూర్చున్నాను. స్వామి హృదయభాషలో ఇలా తెలియచేశారు.

నిన్న "కలలో కనిపించిన "బాగా బలిసిన గొఱ్ఱెపోతు తల నరకటం" అంటే మాయకమ్మిన మనసు తలబిరుసుతనంతో నేను, నేను అంటూ ప్రవర్తిస్తుంది. అదే అహంకారం, ఆ అహంకారం అనే తలను తీసివేయటం, గొఱ్ఱె శరీరాన్ని ముక్కముక్కలు చేసినట్లు అహంపోయిన మనస్సుని ముక్కలు

ముక్కలు చేసి మనసు లేకుండా చేయటం అని కలకి అర్థం తెలియచేశారు. నల్లని బట్టతో ఉయ్యాల అంటే మాయకమ్మిన మనసు స్థిరత్వంలేక అటూ ఇటూ ఊగుతుంది.

బాణం లేని ధనుస్సుకి అర్థం – నువ్వు నీ మనస్సుని బాణంలా మోక్షమే లక్ష్యంగా నా వైపుకు ఎక్కు పెట్టావు. నీ మనసు నా వశం అయింది. నీ లక్ష్యం నెరవేరింది. అందుకే బాణం లేని ధనుస్సును చూపించాను. ఇప్పుడు నీ మనస్సు పూర్తిగా నా వశం అయింది. నువ్వు అమనస్క స్థితి (మనసు లేని స్థితి)లో ఉన్నావు. ఇదే నీకు నేను ఇచ్చే సందేశం."

ముక్తిని ప్రసాదించిన నా గురుదేవుల పాదపద్మాలకు సహస్ర కోటి నమస్కారాలు.

కృష్ణా! ఏకాంత సేవలో తనువునే మరచి విశ్వమంతా నిండిన నీతో అణువు అణువు పులకించి పరితప్త హృదయంతో నిన్ను చేరి ఆనంద రసానుభూతితో రసస్వరూపుడైన నీలో కలసిపోయాను మదనగోపాలా!

**8.8.2006**

స్వామీ! రేపు మహారుద్రయాగం కదా! నాకేదయినా సూచన ఇవ్వమని ప్రార్థించాను. కలలో "పెద్దహాలులో గోడకి పట్టెడు లావున ఒక గాజుగొట్టం సుమారు మూడు మీటర్ల పొడుగున ఉన్నది. దానిలో గోధుమ వన్నెరంగు సర్పం ఉన్నది. గొట్టంలో నుంచి బంగారు కాంతులు. కొంచెం పింకురంగుతో గాజుగొట్టం ప్రకాశిస్తున్నది. అక్కడే ఉన్న మా అమ్మ నన్ను సర్పం దగ్గరకి రమ్మని పిలిచింది."

**10.8.2006**

కలకి అర్థం – గాజు గొట్టం అంటే స్ఫటిక లిగం అని, సర్పం అంటే అమ్మ చైతన్యశక్తి అని, బంగారు కాంతులు అంటే విశ్వమంతా నిండిన గాయత్రీ మాత నుంచి ప్రకాశించే బంగారురంగు చైతన్య కిరణాలని, గులాబీ రంగు అమ్మ ప్రేమకి చిహ్నం అని" తెలియచేశారు. తల్లితండ్రి గురువుదైవం అంటారు. మా అమ్మ రూపంలో సాయిమాత నన్ను పిలిచింది.

**20.8.2006**

మందిరంలో దృశ్యం "ముక్కుకు తాడు వేసినట్లు, ఆ తాడు తెగినట్లు" కనిపించింది. "పొగరుమోతు గొడ్డుకు ముక్కుకు తాడు వేసి దారికి తెచ్చినట్లు నీకు ఆ విధంగా త్రాడు వేసి నా దగ్గరకి తెచ్చుకున్నాను. నిశ్చింతగా ఉండు" అని అర్థం తెలియచేశారు.

గురుదేవా! విశ్వాధారీ! ఈ విశ్వమంతా నీ అఖండ సచ్చిదానంద రూపంగా దర్శిస్తూ ఆత్మానందంలో ఉన్నాను. నేను ఉన్న ఈ నివాసమే నీ ప్రేమాలయంగా భావించి సంతృప్తితో ఉన్నాను.

**29.8.2006**

షష్ఠి, స్వాతి నక్షత్రం. మంగళవారం నా పాదాలు అమ్మ పాదాలుగా పసుపు, కుంకుమలతో అలంకరించి రాత్రి 9 గం 20 నిమిషాలకి ప్రతిష్ఠించాను. స్వామి ప్రేరణతో జరిగిన అమ్మ పాద ప్రతిష్ఠతో నాకు ఎటువంటి సంబంధమూ లేదు.

గురుదేవా! నీ అనుగ్రహంగా భావించి నిర్భయంగా ఉన్నాను. ఎందుకంటే చేసింది నువ్వే. దేహం నేనుకాను. కాబట్టి నీ పాదాలు నీవే

ప్రతిష్టించుకున్నావు. దీని ఫలం కూడా నీదే. కర్మచేశాను. ఆ కర్మ ఫలితం నీదే. నీకే అర్పించాను.

**25.9.2006**

మధ్యాహ్నం దృశ్యం – "రెండు పాదాలు. దారం పాదాలకు చుట్టుకుని ముడిపడినట్లు" కనిపించింది. దానికి స్వామి తెలియచేసిన అర్థం "ప్రేమ సూత్రంతో నా పాదాలు బంధించావు."

**26.9.2006**

మధ్యాహ్నం 3 గం॥ స్వప్నం "నా మీద మాత్రం వర్షం పడింది" స్వామి తెలియచేసిన అర్థం "నీపై నా కృపా వర్షం అమృతధారలై కురుస్తున్నది. అది వెల్లువై నిన్ను ముంచెత్తుతుంది."

ప్రభూ! నీ కృపకి పాత్రురాలినైన నేను అదృష్టవంతురాలిని. కృష్ణా! నన్ను అమృత పుత్రికను చేశావా! ఈ శుభ సందర్భంలో నీ పాదపద్మాలకు శతకోటి నమస్కారాలు.

**19.11.2006**

స్వామి హృదయభాషలో "నన్ను బిందు స్వరూపిణి అమ్మగా శ్రీచక్రంలో బంధించానని" తెలియచేశారు.

మహిళాదినోత్సవం రోజున "స్వామీ! నా పాత్ర ఏమిటి?" అని మనసులో ప్రార్థించాను. అందుకు సమాధానంగా హృదయభాషలో స్వామి పై విధంగా తెలియచేశారు.

ప్రేమే దైవం. ప్రేమ బంధం తప్ప దేహబంధం లేదు. దేహభ్రాంతి పోయింది. నన్ను ఇక్కడ నుంచి ఎలా బయటకు తెస్తారో ఆయన ఇష్టం.

"భ్రాంతి పోతే అంతా బ్రహ్మమే" అని స్వామి చెప్పే మాట అనుభూతికి వచ్చింది. బ్రహ్మలో లీనం అయ్యాను. దేహం ఉన్నది. అది నశించే వరకు ఏ కర్మలు చెయ్యలో ఆ కర్మలు చేస్తూ శేషజీవితం గడుపుతాను. ఈ దేహంతో లౌకిక కర్మలు తప్పవు. కాబట్టి అవి చేస్తూ అలౌకిక ఆనందంలో ఉంటాను "ఆనందో బ్రహ్మ".

స్వామీ! అన్ని బంధాలూ తెంచావు. దేహానికి సంబంధించిన వాళ్ళు ఎవ్వరూ లేని అనాధని. ఇక మీదట నీతోనే బంధం. సర్వస్వం నువ్వే. ఈ దేహంతో ఉన్నంతవరకూ నేను అనాధని కాను. నాకు సాయిమాత ఉన్నదన్న తృప్తితో ఉంటాను. అమ్మా! పరిపూర్ణ శరణాగతితో ఉన్న నీ బిడ్డని ఆశీర్వదించి నీ పాదాల చెంత ఉండనివ్వు.

ఈ రోజు స్వామి దర్శనానికి 80 మంది కాళ్ళు లేక నడవలేని కుంటి వాళ్ళు వచ్చారు. నా భావన "ధర్మ మార్గాన నడవని వాళ్ళే నిజమైన కుంటి వాళ్ళు. వాళ్ళు కాదు."

స్వామి తన 14వ ఏట దేహ బంధాలు లేవని తన అవతార ప్రకటన చేశారు. అప్పటి నుంచి తన లీలల ద్వారా ఎన్నో అద్భుత కార్యాలు తన సంకల్పంతో చేస్తున్నారు. నన్ను జ్ఞానిగా తీర్చిదిద్ది నా 70వ ఏట దేహబంధాలు లేవని తెలియచేశారు. గురుకృపకి తలవంచి నమస్కరిస్తున్నాను. నా చివరి దశలో స్వామి ఎలాంటి అద్భుతాలు నా ద్వారా చేయిస్తారో అది స్వామి నిర్ణయం.

స్వార్థం వీడితే అంతా మహాత్ములే. ధర్మమే నా బిడ్డగా పెంచిపోషించి ధర్మ ప్రచారం చేస్తాను. అదే నా లక్ష్యం. స్వామి సంకల్పంతో నా ఆశ ఫలిస్తుంది. స్వామి ఆశీస్సులతో ధర్మ సాయి జన్మిస్తాడు.

ఏ ధర్మోద్ధరణకి స్వామి అవతరించారో అది నెరవేరే సమయం ఆసన్నమైంది. తను తయారు చేసిన బిడ్డల్ని త్వరలో బయటపెట్టి వాళ్ళ ద్వారా ధర్మప్రచారం చేయిస్తారు. 2007 సం॥ ధర్మంతో ప్రారంభమవుతుంది. సత్యం ... సత్యం ... సత్యం ...

ధర్మదేవతకి స్వాగతం ... సుస్వాగతం.

ఈ మధ్య ఆడుకునే పావులు కలలో కనిపించాయి. గురుదేవా! నా జీవితం వైకుంఠపాళీ ఆటలా సాగుతున్నది. పావు పాము నోట పడకుండా పెద్ద నిచ్చెన ఎక్కి వైకుంఠం చేరితే ఆనందమే కదా! అలాగే ఈ ధర్మ పోరాటంలో నా పావు (నేను) అధర్మం నోట పడకుండా ధర్మమనే నిచ్చెన ఎక్కించి నీ వద్దకు చేర్చుకో ప్రభూ!

కృష్ణా! నువ్వు జైలులో జన్మించినా భగవంతుడివి కాబట్టి జైలు తలుపులు తెరుచుకొని రేపల్లె వెళ్ళి నీ లీలలను ప్రదర్శించి అందరినీ ఆనంద పరచావు. కాని, నేను నీ లాగా ఈ గదిలో నుంచి బయటకు రాలేను కదా! నీ సంకల్పం ఎలా ఉంటే అలా జరుగుతుంది. నీ దివ్యశక్తితో నన్ను బయటకు తీసుకు రావలసిందే. నీ నిర్ణయం ఏదయినా సరే! బయటకు తీసుకు వచ్చి సేవ ఇస్తావో? ... ఈ గదిలోనే ఉంచి ప్రశాంతంగా ఉంచుతావో? నీ అనుగ్రహం కోసం నిరీక్షిస్తూ ఉంటాను.

గురుదేవా! నీ కృపాదృష్టితో నన్ను అజ్ఞానం నుంచి జ్ఞానం వైపుకు నడిపించావు. అమ్మా! సాయిమాతా! ఇప్పుడు నేను జ్ఞానం, అజ్ఞానం రెండూ నీ పాదాల చెంత సమర్పించాను. పసిబిడ్డలకి జ్ఞానం, అజ్ఞానం రెండూ తెలియవు. అమ్మ ఒడిలో ఆనందంతో నవ్వుతూ కేరింతలు కొడుతూ ఆడుకుంటారు.

అలాగే నేను నీ ఒడిలో అన్నీ మరచి ఆనందంగా ఉన్నాను. ఈ ఆనందం శాశ్వతమైనది ... మార్పు లేనిది.

**23.11.2006**

స్వప్నం : "ఒక తెల్లని పెట్టెలో నీళ్ళున్నాయి. దానిలో ఒక గుండ్రని చిన్న బిందువులా తెల్లగా ఉన్నది. ఆ పెట్టె నేను పెట్టుకుని, అక్కడ ఉన్న ఒక స్త్రీతో బిడ్డ ఎదగటం లేదెందుకు?" అని అంటే "నా వద్ద పాలు లేవు" అన్నది. అయితే నా వద్ద ఉన్నాయి. ఇస్తావని చెప్పాను. కాని, ఒక్కస్తనంలోనే పాలు ఉన్నాయి."

స్వామి తెలియచేసిన అర్థం – తెల్లని పెట్టె అంటే స్వచ్ఛమైన హృదయం, దానిలోని నీరు – ప్రేమ జలం, గుండ్రని చిన్న బిందువు జీవుడు. బిడ్డ (జీవుడు) ఎదగకపోవటానికి కారణం. క్షీరం (జ్ఞానం) చాలకపోవటం. ఒక్క స్తనంలోనే పాలుండటం అంటే శివుడు, శక్తి కలసిన ఏక రూపం స్వామిది.

మానవులు జీవుడే దేవుడని తెలుసుకోలేక జనన మరణ చక్రంలో బంధించబడుతున్నారు. గురుస్వరూపిణి అమ్మ సాధకులను అంతర్ముఖులను చేసి శివశక్తి స్వరూపిణి అయిన సాయిమాత తన జ్ఞానక్షీరాన్ని ఇచ్చి జీవుడే దేవుడుగా తెలియచేసి జనన మరణ చక్రం నుంచి తప్పించి ముక్తిని ప్రసాదిస్తుంది.

**1.12.2006**

దృశ్యం "ఒక వృషభం గోమాత దగ్గరికి రావటం."

"గోమాత వద్దకి వృషభం రావటం అంటే ఇక ధర్మం నాలుగు పాదాల నడవటం" అని తెలియచేశారు.

కృతయుగంలో నాలుగుపాదాలతో, త్రేతా యుగంలో మూడు పాదాలతో, ద్వారపయుగంలో రెండు పాదాలతో కలియుగంలో ఒక పాదంతో నడుస్తున్న ధర్మం సత్యసాయి యుగంలో మళ్లీ నాలుగు పాదాలతో నడుస్తుంది. సత్యం ... సత్యం ... సత్యం ...

వేదమాత గోమాతకి అఖండ స్వాగతం, సుస్వాగతం. సాయిమాత బిడ్డలమైన మనం ధర్మ స్థాపనకు శంఖారావం పూరిద్దాము. అధర్మం నశించి ధర్మం గెలుస్తుంది. ధర్మానికి పట్టం కడదాము.

సత్య, ధర్మ, ప్రేమ, శాంతి, అహింస అని అట్టల మీద వ్రాసి ప్రచారం చేయటం కాదు. హృదయంలో ఈ ఐదు ధర్మాలు నింపుకుని, ఆచరించి ప్రచారం చేద్దాము. స్వామి సంతోషంతో వెనకటిలాగా నడిచి మన మధ్య తిరుగుతారు. స్వామిని ఇక మీదట పట్టుకుని, నడిపించే పని లేదు. సత్యధర్మ శాంతి ప్రేమలు మనం ఆచరించిన రోజున, అవే స్వామిని నడిపిస్తాయి. ప్రభూ! నువ్వు మా మధ్య నడుము నిలిపి నిటారుగా నడవాలి. అలా జరగకపోతే మేము సిగ్గుతో తలలు వంచుకోవాలి. అమ్మా! నీ దేహానికి వయసు 81 సం॥లు. 2007 సం॥ నుంచి 18 సం॥ నవ యవ్వనంతో మా మధ్య తిరగాలి. 1944లో ఎంత చలాకీగా తిరిగావో నేను చూడకపోయినా క్యాసెట్లు ద్వారా చూశాను. మళ్లీ నా తల్లి అలా తిరిగి మా కళ్ళకి ఆనందం కలిగించాలి. నా బంగారు తల్లికి శతకోటి వందనాలు! అమ్మా! నేను ఇంకా సాధన చేయాలి అంటే ఈ ఊరు (నీ సన్నిధి) విడిచి కట్టుబట్టతో నా భర్త ద్వారా నాకు లభించే పెన్షను కూడా వదులుకుని వెళ్ళటానికి సిద్ధంగా ఉన్నాను. ఎందుకంటే మా అమ్మ కోసం ఏమయినా చేస్తాను. అలా పరీక్ష పెట్టదలచుకుంటే నీ ఆజ్ఞ నెరవేర్చటానికి నీ బిడ్డ ఎదురు చూస్తూ ఉంటుంది. ఇక ఏ మాత్రం ఆలస్యం భరించలేను.

గురుదేవులు ఏమి చెప్పినా ఎదురు చెప్పక చేసేవాడే నిజమైన శిష్యుడు. స్వామీ! హృదయ భాషలో తప్ప చెప్పవు. నేను ఏమి చెయ్యాలో త్వరగా చెప్పు. ఎదురు చూస్తూ ఉంటాను. నా తల్లి ఈ సాధనలో కఠిన పరీక్ష పెట్టలేదు. పూలబాటలో నడిపించింది.

**4.2.2007**

గురుదేవా! యజ్ఞంలో హోమగుండంలో వేసిన పూర్ణాహుతి ద్రవ్యాలు కాలి బూడిద అయిన తరువాత ఆ బూడిదను (విభూతి) అందరికీ పంచినట్లు నా జ్ఞాన యజ్ఞంలో నా మనసుకాలి బూడిద అయి సత్య ప్రకాశంతో నిండి పోయింది. నా హృదయం. ఈ సత్యాన్ని (విభూతి) అందరికీ పంచిపెట్టు. నా గురువు అనుగ్రహంతో నాలోని సత్యం త్వరలోనే ప్రకటించబడుతుంది.

**2.10.2007**

సాయంత్రం 5 గం॥కు గురుదేవులు సాయి సన్నిధిలో గుజరాత్ నుంచి వచ్చిన భక్తులు శ్రావ్యంగా భజన పాటలు పాడారు. బాలవికాస్ విద్యార్థికి ఏదో సృష్టించి స్వామి యిచ్చారు. "అందరికీ ఇన్నీ ఇస్తారు. నాతో మాట్లాడరు" అన్న భావన నాలో కదిలింది. వెంటనే స్వామి హృదయభాషలో తెలియచేసిన అర్థం – "నేను యిచ్చిన గొలుసు భౌతికమైనది. వెంటరానిది. తాత్కాలికమైన ఆనందాన్ని యిచ్చేది. కాని, వెలకట్టలేని సత్య ప్రకాశాన్ని నీకు కంఠహారంగా ఇచ్చాను. ఆ ప్రకాశం ఎంతో మందిని సత్యమార్గాన నడిపించి శాశ్వతమైన ఆనందాన్ని ఇస్తుంది. నువ్వు భవిష్యత్ జీవితంలో జ్ఞానమణిగా ప్రకాశిస్తావు. సత్యమే నువ్వు. నా ప్రకాశంలో కలిసిపోయే రోజు దగ్గరలోనే ఉన్నది. శాంతితో ఉండు. ఇక మీదట "విశ్వాసంతో, నమ్మకంతో" ఉన్నానని అనకు. అవీ నువ్వూ వేరు కాదు. నువ్వు కల్పవృక్షానివి. నన్ను వేరుగా చేసి ప్రార్థించకు. నువ్వే

దేవుడివి. ఇక మీదట నీ సంకల్పంతో ఏది చేసినా ఫలిస్తుంది. నేను వేరుగా లేను. మన ఇద్దరం ఒక్కటయినాము. నిశ్చింతగా సమయం కోసం ఎదురు చూస్తూ ఉండు."

## 21.10.2007

స్వామి ఈ విజయదశమికి కూడా నాతో మాట్లాడే సూచన కనిపించటంలేదు. నాలో నిన్ను చూసుకున్న తరువాత ఈ ఆలస్యం ఏమిటి? నా హృదయంలో నుంచి సత్యం ప్రకటించు అని ఏడ్చాను. తరువాత రెండు జ్యోతులు కనిపించాయి. ఐదు గంటలకి నాలోకలిగిన "అద్వైతానుభూతి".

"మేరు పర్వత శిఖరం నుండి జాలువారిన సుందర జలపాతం స్వామి" నీరు నారాయణ స్వరూపం అయితే ఆ నీటిలోని శక్తి అమ్మ. అమ్మ శ్రీ విద్యా స్వరూపిణి". "సరస్వతీ దేవి" ధవళ వస్త్రాలతో అంటే దివ్య తేజస్సుతో ప్రశాంతి నిలయంలో భక్తులకు దర్శనం ఇస్తున్న "పరాశక్తి శ్రీలలితా పరమేశ్వరి" – సాయి మాత ఆశీస్సులతో పరతత్వం తెలుసుకోండి. అమ్మ దర్శనం యోగం. ఆ యోగ మార్గాన గురు స్వరూపిణి సాయి మాత అనుగ్రహంతో చైతన్యవంతులై, అమ్మలో కలిసి అమృత పుత్రులుగా మరణం లేని స్థితిని చేరుకోండి."

స్వామీ! విజయదశమి రోజు ఉపన్యాసంలో నువ్వు దుఃఖంతో జీరపోయిన కంఠంతో సత్య, ధర్మములను గురించి మాట్లాడావు. షిరిడీ అవతారంలో బాబా లక్ష్మీదేవి షిండేకి సత్యం, ధర్మం బంగారు నాణేలుగా ఇచ్చారని, అవి సృష్టించి మాకు చూపించి మమ్మల్ని ఆనంద పరిచావు.

స్వామీ! 1982 మద్రాసులో నీ దర్శనం ఇచ్చి వెలకట్టలేని సత్యం, ధర్మం నా హృదయంలో ప్రతిష్ఠించావు. నీ కృపతో సత్య ధర్మాలను ఆచరిస్తూ నువ్వు స్వయంగా మాట్లాడటం కోసం రోజు ఒక యుగంగా గడుపుతున్నాను.

షిరిడీ అవతారంలో లక్ష్మీదేవికి సత్య ధర్మాలు నాణేలుగా యిచ్చి ఈ అవతారంలో సత్యధర్మాలు నాలో ప్రతిష్టించావు. నా జీవితాంతం వాటిని ఆచరిస్తాను.

**25.11.2007**

భవబంధాలు పూర్తిగా ఈ రోజుతో తొలగించి తన బంధంతో ముడి వేసుకున్నారు. నా 72వ ఏట అన్ని బంధాలు తెగిపోయి ఈ రోజు నుంచి సన్యాసిని జీవితం ప్రారంభం అయింది. గురుదేవా! ఈ జీవితం ప్రసాదించిన నీకు శతకోటి వందనాలు.

ప్రభూ! ఎంతో మందికి దాహార్తిని తీర్చావు ... తీరుస్తున్నావు. కానీ, మానవుడికి నీరు ఎంత అవసరమో జ్ఞాన గంగ కూడా అంతే అవసరం. ఎంతో మందికి జ్ఞానగంగతో ఆధ్యాత్మిక దాహాన్ని తీరుస్తున్నావు. నీ అవతారం ముఖ్యంగా వచ్చింది. జ్ఞాన గంగతో మానవుడిని ఆధ్యాత్మిక మార్గాన నడిపించి తరింప చేయటమే నీ ఏకైక లక్ష్యం.

గురుదేవా! ధనం లేని నేను డబ్బుతో ఏ మంచి పనులూ చెయ్యలేను. నీ కృపతో నాలోని జ్ఞానగంగ పొంగి ప్రవహిస్తున్నది. ఈ గంగ తరగని జీవనది. ప్రభూ! నా ద్వారా కొద్ది మంది అయినా జ్ఞానగంగతో ఆధ్యాత్మిక మార్గాన నడిచి నీ కృపకు పాత్రులై నీ దరి చేరి ధన్యులు కావాలి. ఈ వరం నాకు ప్రసాదించు. విశ్వ కళ్యాణానికి నన్ను నీ పాదాల వద్దకు చేర్చుకుని ధన్యురాలిని చెయ్యి!

**26.11.2007**

గురు దేవులు దేహానికి కాషాయవస్త్రం ఇవ్వకపోయినా నా మనసుని అద్వైతస్థితికి తీసుకువెళ్ళి సన్యాసిని చేశారు. నేను ఈ సన్యాసి జీవితాన్ని

ఆనందంగా స్వీకరించాను. మానవుడికి ఇంతకంటే ఐశ్వర్యం ఏమున్నది? పరతత్త్వాన్ని తెలియచేసిన గురు స్వరూపిణి సాయి మాత పదకమలాల వద్ద పరమహంసనై పరమానందంతో ఉంటాను.

**27.11.2007**

సాయిరామా! నీ సీతాన్వేషణలో హనుమని ఎన్నుకొని రామ ముద్రికను హనుమకి ఇచ్చావు. నీ శక్తితో సముద్రం లంఘించి సీత జాడ తెలుసుకుని వచ్చాడు. ఎంతో మంది వానర వీరుల సహాయంతో వారధి నిర్మించి, రావణుని జయించి, సీతని చెరవిడిపించి, అగ్ని పరీక్ష పెట్టి, పునీత అయిన సీతని తీసుకుని అయోధ్య ప్రజలను ఆనందపరచి పట్టాభిషేకం చేసుకున్నావు.

సాయిరామా! ఎన్ని జన్మల నుంచి నీ కోసం దుఃఖిస్తున్నానో నాకు తెలియదు. నీకు తెలుసు. నా దుఃఖ సముద్రం దాటటానికి ఏ వారధీ ఎవరి సహాయంతోనూ నిర్మించనక్కరలేదు.

ఓ శక్తివంతుడవయిన రామా! నా దుఃఖ సముద్రం చాలా శక్తివంతమైనది. నువ్వు తప్ప మరెవ్వరూ దాటలేరు. ఈ కన్నీటిలో నువ్వే ఉన్నావు. ఈ దుఃఖ సముద్రాన్ని దాటి నా వద్దకి రావటానికి నువ్వు ఎక్కడో లేవు. వారధితో పని లేదు. త్వరగా వ్యక్తమై నన్ను చేపట్టి జీవాత్మ, పరమాత్మ కళ్యాణం చేయించు. జీవుడు నేను. పరమాత్మ నీవు. మన కళ్యాణమే సీతారామ కళ్యాణం. విశ్వానికే కళ్యాణం.

ఈ రామేశ్వర ప్రయాణం నీ ప్రయాణం. దేహం మాత్రమే నాది. ఏ కోరికా లేని నాకు ఈ ప్రయాణం నీ సంకల్పంతోనే జరుగుతున్నది. కోదండరామా! నీకు శతకోటి వందనాలు.

బాహ్య బంధాలు వదిలినా మనసులో ఏ మూలయినా ఒక బంధం మిగిలిందా? స్వామీ తెలియచేసి ఆ బంధం తెంపి నాకు విముక్తిని కలగచెయ్యి. కాని ఏ బంధమూ లేదు. నువ్వు పలకకపోవవటమే ఈ అశాంతికి కారణం. త్వరగా నాతో మాట్లాడు స్వామీ!

**29.11.2007**

కల – "స్వామి కొండవస్తున్నదని అన్నారు. ఇంట్లో వీధిలో అంతా కొండ వస్తున్నది" – అంటే అర్థం "అది అరుణాచల కొండ అని" అది అక్కడే కాదు విశ్వమంతా వ్యాపించి ఉన్నది. అంతా శివమయం. అదే జ్యోతిర్లింగం. అది తెలుసుకోవటమే జీవన్ముక్తి"అని స్వామి హృదయభాషలో తెలియచేశారు.

1.12.2007న అరుణాచలం వెళ్ళి కొండపై కార్తీక దీప దర్శనం చేసుకున్నాను.

అమ్మా! గురు స్వరూపిణి సాయి మాతా! దత్త జయంతి రోజున నా నోట భవిష్యవాణిని పలికించావు. నాపై నీ కృప అపారమైనది. అమ్మా! ఇంత అనుగ్రహం నాపై చూపించి ఈ మౌనం ఏమిటి? ధనుర్మాసం గోదాదేవి గోపికలతో నిన్ను చేరటానికి వ్రతం చేసింది. కానీ నేను ఏ వ్రతం చేయటానికి స్తోమతలేని దానిని. సత్యవ్రతమే నావ్రతం. కలియుగంలో ఇంతకు మించి వ్రతం లేదు. ఈ సత్యానికి దూరం కాక నా దరి చేరు తల్లీ!

**26.12.2007**

స్వప్నం – "జ్యేష్టాదేవి ఇనుపకడ్డీ మీద దర్శనం ఇచ్చింది." ఆ విగ్రహం జ్యేష్టలక్ష్మి. నేను జ్యేష్ఠ లక్ష్మి ఇనప గజ్జెల చప్పుడు" అని అంటుండగా మెలకువ వచ్చింది.

"అమ్మా! జ్యేష్ట లక్ష్మీ! ఇనుప గజ్జెల చప్పుడు చేయకు. నా సాధన చివరలో నువ్వు నా లక్ష్యానికి అడ్డుపడకు. దయతో నాకు మంచి చెయ్యి. నేను దైవాన్ని. దైవం చేసే పనులకు సహాయం చేసి మంచి దేవతగా పేరు తెచ్చుకో!" అని ప్రార్థించాను. తరువాత కొంచెం తీపి పొంగలి చేసి ఆ దేవతను తలుచుకొని తిని "అమ్మా! నా ఇంట తీపి తిన్న నువ్వు నన్ను ఆశీర్వదించు! ఆశీర్వదించి బంగారు అందెలచప్పుడుతో నా నట్టింట తిరుగు."

గురుదేవా! ఈ రాసింది అంతా నీ ప్రేరణతోనే. ఇందులో నా సంకల్పం ఏమీ లేదు. అమ్మ జ్యేష్టాదేవీ! చెడుని సంహరించి, మంచికి పట్టంకట్టు. ధర్మమార్గాన పోతున్న నన్ను నీ అనుగ్రహంతో కాపాడి రక్షించు.

గురుదేవా! ఈ రోజు స్పీచ్‌లో నాకు ఏదయినా సందేశం ఇస్తావని అనుకున్నాను. కానీ సూచన ఇవ్వలేదు. నువ్వు చెప్పినట్లు "అహంబ్రహ్మాస్మి" నేనే దేవుడు అన్న స్థితిలో నీ కృప వలన ఉన్నాను. నేను బలహీనురాలిని కాదు. నా ఆత్మస్థైర్యంతో, విశ్వాసంతో నా లక్ష్యం వైపుకు ఎక్కు పెట్టిన బాణంలా వెళ్ళి నా లక్ష్యం సాధిస్తాను. నీ ఆశీస్సులతో నేను సాధించలేనిది లేదు. నా సంకల్ప బలంతో ధర్మాన్ని బిడ్డగా పొందుతాను.

హృదయభాండంలో ప్రేమక్షీరం నింపి నాలోని వేదనాగ్నితో ప్రేమ క్షీరం మరగబెట్టి ఏకాత్మ భావనతో జ్ఞానమనే పెరుగుతో పాలు తోడు పెట్టి, పెరుగు చిలికి నులి వెచ్చని వెన్న కన్నయ్యకు తినిపించి, మాయ వీడి నిర్మలమైన మనసుతో పరమాత్మునితో సంగమించి పూర్ణ సిద్ధిని పొందిన నేను భగవంతుడు ఎక్కడో ఉన్నాడని వెళ్ళలేను.

ప్రభూ! శబరి గురు వాక్యం మీద విశ్వాసం ఉంచి, రామచంద్రుని రాక కోసం అడవిలో రామ నామస్మరణ చేసుకుంటూ ఎదురు చూసింది.

శబరి తపస్సు ఫలించి, రాముడు వచ్చి ఆ తల్లికి దర్శనం ఇచ్చాడు. కాని, ఈ కలియుగంలో ...... ఒంటరిగా ఉన్నా దేహబంధాలు కొన్ని తప్పటం లేదు. వద్దనుకున్నా ఫోన్లు, చుట్టు పక్కలవారితో కొన్ని మాటలు నాకు తప్పటంలేదు. నాకు అద్వైతంలో తప్ప మాట్లాడాలని అనిపించటంలేదు. నువ్వేమో మీరు ఆచరించి అందరికీ చెప్పమంటావు. వినేవాళ్ళు కూడా ఉండాలి కదా! ఒకరిద్దరు ఉన్నా అస్తమానం చెబితే వాళ్ళకీ విసుగే కదా! ఆచరించే వాళ్ళు తక్కువని నీకూ తెలుసు. నువ్వు చెబుతుంటేనే ఆచరించే వాళ్ళు తక్కువ. ఏ గుర్తింపూ లేని నేనెంత? దయగల తండ్రీ! శబరి వద్దకు వచ్చినట్లు నా వద్దకి త్వరగారా! ఈనాటి సాధకుల చుట్టూ కలుషిత వాతావరణం ఎక్కువగా ఉన్నది. శబరి కాలం (త్రేతాయుగం)లో ప్రశాంతమైన వాతావరణం. ఆ ప్రశాంత వాతావరణంలో శబరి తపస్సు చేసుకుంది. ఆ శబరికి నాలా దేహబంధాలు, ఫోన్లు, చుట్టూ మనుషులూ లేని ఏకాంతం. అదృష్టవంతురాలు. నా మనసు అంతర్ముఖమై ఏకాంతంలో ఆత్మారామునితో ఆనందం అనుభవిస్తున్నా కలియుగ ప్రభావం కొంత నా మీద పడుతున్నది. ఈ పరిస్థితుల్లో నువ్వు సమయం ఆసన్నం కాలేదంటే నాగతి ఏమిటి? బాబా! నాకు నువ్వు కావాలి. కావాలి. కావాలి. నీకు నేను ఉన్నాను, ఉన్నాను, బాబా నాకు ఎన్నో సౌకర్యాలు చేశావు. చేస్తున్నావు. కృష్ణా! ఇవి వదులుకొని చెట్టు క్రింద ఉండమన్నా ఉంటాను. నువ్వు నాతో ఉన్నప్పుడు ఎక్కడ ఉన్నా చింత లేదు. పలుకుతావా! లేక ఎక్కడైనా దూరంగా ఉంచుతావా? నువ్వు పలికితే నాకు గర్వంతో కూడిన అహంకారం వస్తుందని నీకు అపనమ్మకమా? నన్ను నీకు అర్పించుకున్న తరువాత వాటికి స్థానం ఎక్కడ? నన్ను అనుమానిస్తే నిన్ను నీవు అనుమానించుకున్నట్లు! సంసారం పిచ్చినించి తప్పించి, నీ పిచ్చి పట్టించి మాట్లాడకపోతే పిచ్చిదాన్నయి పోయి ఎవరికీ పనికిరాని దానినవుతాను. కదలి రావమ్మ! కనకదుర్గమ్మా!

అమ్మా నీకు స్వాగతం! సుస్వాగతం! ఈ గుడి తలుపులు మూసుకుని కూర్చుందామన్నా ఇక్కడ అవదు. నాకు మార్గం చూపించు తల్లీ!

**15.1.2008**

రాత్రి స్వప్నం – "స్వామి వ్రాసిన కథల పుస్తకం కనిపించింది. దానిలో ఒక కథ – అరటి తోట ఏపుగా పెరిగింది. చక్కటి పంట పండింది. కానీ, అరటి పళ్ళు తియ్యగా లేవు అన్నారు. ఎందుకంటే తోటకి మురుగు నీరు పట్టారు. దాని వల్ల పండు రుచి లేదని అన్నారు."

కలకి స్వామి తెలియచేసిన అర్థం – సాధకులు ఎంత సాధన చేసినా బాహ్యంలో తప్ప అంతరంగంలో మార్పు లేదు. నిర్మలమైన వివేకంతో కూడిన ఆలోచనలు లేవు. మనుష్యుల మధ్య మాధుర్యమైన ప్రేమ సంబంధాలు లేవు. అందుచేత హృదయఫలం మధురంగా లేదు. అలాంటి హృదయాన్ని నేను స్వీకరించలేను. మనం రుచి లేని అరటి పండును తినని విధంగా స్వామి ప్రేమ లేని హృదయాన్ని స్వీకరించరు.

నేను తీవ్ర వైరాగ్యంతో 24 సం॥ నుంచి సాధన చేస్తున్నాను. అయినా స్వామి నాతో బాహ్యంలో మాట్లాడడం లేదు. అంటే నా హృదయం పరిపూర్ణమైన ప్రేమతో నిండి మధురంగా లేకపోవటంవలన నన్ను తన వద్దకి పిలవటం లేదా? నాకు ఏమీ అర్థం కావటం లేదు. గురుదేవా! దయచేసి నేను ఏ సాధన చేసి నిన్ను చేరగలనో చెప్పు. ఒక్కక్షణం కూడా నిన్ను వదలి బ్రతకలేని విధంగా నిన్ను నమ్మి ఇక్కడ ఉన్నాను. ఉదయం నుంచీ అందరితో తిరిగి మాట్లాడుతున్నా నా మనసంతా నీ కోసం పిచ్చిపట్టినట్లుగా ఉన్నది. నా లోపాన్ని సరిదిద్ది నీ దరి చేర్చుకో ఈ జన్మకి ఇంతేనని చెప్పు. నువ్వు మాట్లాడే వాళ్ళంతా పరిపక్వత చెందిన అదృష్టవంతులు. నన్ను నీ దగ్గరకు పిలిపించుకుని హృదయభాషలో

ఎన్నో వ్రాయించి చివరికి ఇలా వదిలేస్తావా? కోటి తల్లుల ప్రేమ ఇదేనా? కనీసం సవతి తల్లి కూడా నీలా ప్రవర్తించదు. ఇష్టం లేకపోతే ఇంట్లో నించి గెంటి వేస్తుంది. నువ్వు ఒక్కసారి పిలిచి మాట్లాడి ఈ పుట్టపర్తి నుంచి గెంటివెయ్యి. దిక్కులేని నేను నా కర్మకి ఏడుస్తూ వెళ్ళిపోతాను. ఎక్కడ ఉన్నా తీవ్ర సాధన చేసి మళ్ళీ జన్మకయినా నిన్ను పొందుతాను. ఈ తపస్సు ఆగదు. అంతులేని ప్రయాణాన్ని అంతం చేసే వరకూ సాగిస్తాను. నేను పిరికిదాన్ని కాదు. నా లక్ష్యం నువ్వే. శివశక్తి స్వరూపిణి మా అమ్మ. అమ్మ అనుగ్రహంతో ప్రేమబాటలో ప్రయాణించి అమ్మని చేరతాను.

**17.1.2008**

దృశ్యం : "మణి ఇంట్లో పెరడు అంతా గులాబ్‌జామ్ పాకం జానెడు మందాన పేరుకుపోయింది. అదంతా చేత్తో తీసి ఎత్తుతున్నాను."

ప్రభూ! నా హృదయం 'గులాబ్‌జామ్ పాకం'లా మధురంగా ఉన్నదని 'కల' ద్వారా తెలియచేశావా? అమ్మా! ద్వేషించేందుకు నేను కాని వాళ్ళు ఎవరున్నారు? అందరిలోనూ నేనున్నాను. నన్ను నేను ద్వేషించుకుంటానా తల్లీ! కానీ కొంతమంది మనసు విప్పి మాట్లాడరు. కొంత మందికి నేను ఇష్టం కాదు. అలాంటి వాళ్ళతో కూడా నేను స్నేహభావంతోనే ఉంటాను. అంతర్యామివి నీకు తెలియదా! నా వద్దకు వచ్చి అడిగిన వాళ్ళకి ప్రేమతో చెపుతున్నాను. ప్రభూ! నిన్ను ప్రేమించినంతగా నన్ను ప్రేమించరు. నేను అందరిలోనూ నిన్ను చూస్తూ అందరినీ హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నాను. నన్ను నమ్మని వాళ్ళు, నన్ను ద్వేషించే వాళ్ళు, నాలో సత్యం తెలుసుకుని వస్తారు. నా సహనమే నాకు రక్ష.

సంక్రాంతి పండుగ రోజున సాయంత్రం అందరికీ బాబా ఫొటో ఉన్న కాలెండర్లు పంచారు. ఆ ఫొటో లామినేషన్ చేయించి, గోడకు ఆంజనేయుడి ఫొటో ఉన్న చోట పెట్టి, ఆంజనేయుడి ఫొటో, క్రింద బాబా ఫొటో తీసిన చోట పెట్టాను. స్వామి ప్రేరణతోనే ఇలా చేశాను కానీ అలా చేయటం తప్పేమోనని అనిపించింది.

"నా కంటే నా భక్తులే నాకు ఎక్కువ అందుకే అలా పెట్టించాను" అని స్వామి హృదయభాషలో తెలియచేశారు.

**18.1.2008**

"ఓ నా ప్రియమైన బిడ్డా! నీ హృదయ ఫలం మధురంగా లేదేమోనని, ఇంకా ఏ సాధనలు చెయ్యాలో తెలియక 15 నుంచి నువ్వు పడుతున్న వేదనను గమనిస్తున్నాను. నేను పెట్టిన పరీక్షలన్నింటిలో నువ్వు గెలిచావు. నీ సత్యవ్రతం ఫలించి నీ హృదయ ఫలం విశ్వ ప్రేమతో మధురాతి మధురంగా తయారయింది. రాబోయే కాలంలో చాలా కొద్ది మంది మాత్రమే నీ మధుర ప్రేమలో మునక వేస్తారు. కానీ నీ వద్దకి నీ సత్యబోధలు వినటానికి చాలా మంది చేరతారు. నీ బోధలు మధురాతి మధురంగా వినటానికి హాయిగా, ఆచరించటానికి తేలికగా ఉంటాయి. నేను నీతో పలికిన (భౌతికంగా) క్షణం నుంచీ నీ చుట్టూ మధుర పదార్థం చుట్టూ చేరిన చీమలలాగా చుట్టు ముట్టుతారు. నీకు క్షణం కూడా విశ్రాంతి ఉండదు. కాబట్టి నేను మాట్లాడలేదన్న బాధతో దుఃఖిస్తూ ఉండకు. ప్రస్తుతం హాయిగా విశ్రాంతి తీసుకో. ఈ అవకాశం నీకు ముందు జీవితంలో రాదు. త్వరలోనే నీతో మాట్లాడి నా పరికరంగా నీ ద్వారా మంచి పనులు చేయిస్తాను. నాకున్న కొద్ది మంది జ్ఞానమణులలో నువ్వూ ఉన్నావు. నీకు ఏ సాధనలూ అవసరం లేదు. నువ్వు నా కోసం దుఃఖిస్తూ ఉంటే చూడలేక నేను

ఆనందంగా ఉండలేకపోతున్నాను. నాకెన్నో పనులు. ఆ పనులన్నీ సక్రమంగా చేయాలంటే నువ్వు ఆనందంగా ఉండాలి. ఈ క్షణం నుంచీ ఆనందంగా ఉండు. జన్మ యిచ్చిన తల్లికి ఎన్నో పనులుంటాయి. బిడ్డ ఏడుస్తుంటే తల్లి పనులు చేసుకోగలదా! అలాగే నీ కర్మ తొలగిన వెంటనే నీ వద్దకి వచ్చి శాశ్వతమైన ఆనందం ప్రసాదిస్తాను. ఇన్నేళ్ళూ ఎంతో సహనం, ఓర్పు, విశ్వాసం, నమ్మకంతో ఉన్నావు. ఇంకా కొంచెం ఓపిక పట్టి నిశ్చింతగా ఉండు."

ప్రభూ! హృదయభాషలో పైదంతా వ్రాయించావు. నువ్వు వ్రాయించకపోతే నేను అక్షరం కూడా వ్రాయలేను. నా హృదయ ఫలం మధురంగా ఉన్నదని వ్రాయించావు. నాలుగు రోజలుగా నేను పడుతున్న వేదన పోయింది. వీలయినంత వరకూ ఆనందంగా ఉంటాను. నిన్ను బాధపెట్టను. త్వరగా నా దరి చేరు కృష్ణా!

**30.1.2008**

కల : "నేను ఒక పరీక్ష పాసయినాను. నాకు ఉద్యోగం వచ్చింది."

కలకి అర్థం – "ఇది భౌతికమైన చదువు కాదని, ఆత్మవిద్య అనీ, అందుకే ఆధ్యాత్మిక విశ్వవిద్యాలయంలో ఆధ్యాత్మిక బోధకురాలిగా నిన్ను ఎన్నుకున్నాను. నిశ్చింతగా ఉండమని" స్వామి తెలియచేశారు.

**4.2.2008**

ఆంజనేయ స్వామికి హారతి పట్టిన రోజు రాముల వారి ఫొటో పెట్టాలని అనుకున్నాను. అది స్వామి సంకల్పం. వెంటనే ఫలించింది. ఈ రోజు సాయంత్రం కోదండ రామస్వామి ఫొటో తెచ్చి హారతి పట్టాము.

**5.2.2008**

ఉదయం 6 గం॥ 45 ని॥లకు కాఫీ త్రాగుతున్నప్పుడు స్వామి ఈ రోజు నాగ ప్రతిష్ట చేయమని హృదయ భాషలో తెలియచేశారు. ఈ రోజు త్రయోదశి 9 గం॥ 8 ని॥ల వరకే ఉన్నది. ఈ లోపు నాగ ప్రతిష్ట ఎలా జరుగుతుందని అనుకున్నాను. స్వామి తన సంకల్పబలంతో జరుగుతుందని తెలియ చేశారు.

వెంటనే ఈ విషయం భాస్కరమ్మకి చెప్పి నాగప్రతిమ కొనటానికి చిత్రావతి నది ఒడ్డుకు వెళ్ళాము. వెండి ప్రతిమ నచ్చినట్లుగా దొరకలేదు. ఇత్తడి షాపు వద్దకి రాగానే స్వామి ఇత్తడి సర్పం కొనమన్నారు. వెంటనే ఐదు శిరస్సులు ఉన్న విగ్రహం కొని, భాస్కరమ్మను పట్టుకొమ్మని మందిరంలోకి వెళ్ళాము. స్వామి సంకల్పంతో మా ఇంట్లోకి వచ్చిన ఫొటోలన్నీ ఆవిడ చేతి మీదగానే మా ఇంటికి వచ్చాయి. అందుచేత ఆవిడనే పట్టుకొమ్మన్నాను. స్వామి సంకల్పంతో త్రయోదశి వెళ్ళకుండానే నాగసాయి ప్రతిమతో మందిరంలోనికి ప్రవేశించాము. స్వామి 9. గం. 15కు వచ్చారు. స్వామి రాక ఆనందం కలిగించింది. స్వామి భజన హాలులో ఉండగా స్వామీ! ఒక్కసారి ఇటువైపు చూడమని ప్రార్థించాను. స్వామి ఇటు చూడటమే కాకుండా ఏకంగా భజన హాల్లో నుంచి వరండాలోకి వచ్చి దివ్య దర్శనం ఇచ్చారు. భజన అయ్యాక స్వామి బయటకు వెళ్ళారు. మా ముందు నుంచి వెళుతున్నప్పుడు స్వామికి చూపించాను. కానీ, ఇటు వైపు చూడకుండా వెళ్లారు. బయటికి వచ్చి రెయిలింగు దగ్గర నిలుచున్నాను. స్వామి 10 గం ॥ 15 ని॥లకి వచ్చారు. స్వామి నా చేతిలో ఉన్న విగ్రహాన్ని, నన్ను విప్పారిన దివ్య నేత్రాలతో చూశారు. అది మంగళకరమైన శుభదృష్టి. ఇది స్వామి సంకల్పంతో జరుగుతున్న నాగ ప్రతిష్ట.

ఈ ప్రతిష్టకి బాహ్యంలో ఋత్విక్కులు, మేళ తాళాలు ఏమీ లేవు. స్వామి దృఢ సంకల్పంతో జరుగుతున్న ఈ ప్రతిష్ట విశ్వకళ్యాణం కోసం. నేను భగవంతుడి కోసం పడుతున్న వేదనే వేదమంత్రాలు. నా మంగళకరమైన ఆలోచనలే మంగళ వాయిద్యాలు. ఇంటికి వచ్చి భాస్కరమ్మ చేత విగ్రహం పెట్టించాను. భాస్కరమ్మ చిమ్మిలి చేసింది. నేను సేమ్యా పాయసం చేసి, అటుకులు, పెరుగులో కలిపి ప్రసాదాలు చేశాను. అందరం కలిసి హారతి ఇచ్చాము.

అమ్మా! నాగదేవతా! ఈ రోజు నా గురు కృపతో ఈ ఇంటవెలసినావు. అపారమైన నీ కృపతో ధర్మసాయిని ప్రసాదించు. నీ దివ్యశక్తికి తలవంచి వినమ్రతతో నమస్కరిస్తున్నాను. ఈ విశ్వకళ్యాణంలో నీ ఆశీస్సులు కావాలి. నీ ప్రతిష్ఠతో నా సాధన పూర్తయింది. అమ్మా! నాగదేవతా! స్వార్ధరహితమైన నా కోరిక తీర్చి, నీ యోగశక్తి నిరూపించి విశ్వకళ్యాణానికి నన్నొక పరికరంగా వాడుకో. నా ప్రార్థన మన్నించు తల్లీ.

గురుదేవా! నాగప్రతిష్టతో నా యోగం పూర్తయింది. ఏ స్వార్థమూ లేని నీ బిడ్డ కోరిక తీర్చు. యోగఫలంగా ధర్మసాయిని ప్రసాదించి నన్ను ఆశీర్వదించు.

**6.2.2008**

రేపటి నుంచి మందిరానికి రాకుండా విశ్వమంతా నిండిన నీ రూపం ఇక్కడే దర్శిస్తూ మన ఇద్దరం ఒక్కటే అన్న పూర్ణభావంతో ఉంటాను. నీ సంకల్పం ఇదే అయితే రేపు మందిరానికి రాను. కానీ, నిన్ను చూడకుండా ఉండలేని నన్ను బయటికి ఎలా తీసుకు వస్తావో చూడటం తప్ప ఏమీ చెయ్యలేను. త్వరలో అద్భుత లీల ప్రదర్శించి నన్ను బయట పెట్టు.

మధ్యాహ్నం చాలా వేదనతో స్వామీ సత్యం, ధర్మం రెండు పాదాలుగా

నీ అడుగులో అడుగు వేస్తూ ఎటూ చూడకుండా ఏకాగ్రతతో నీ వెంట నడిచి సత్యధర్మాలను కాపాడుతానని ఏడ్చాను. నా గురుదేవులు నన్ను అనుగ్రహించి జ్యోతి దర్శనం ఇచ్చారు.

**7.2.2008**

ఈ రోజు నుంచీ మందిరంకి వెళ్ళద్దని అనుకున్నాను. రాత్రి సూచన రాలేదు. ఈ ప్రపంచంతో నాకు ఎటువంటి సంబంధమూ లేదని స్వామికి మనవి చేసుకున్నాను.

ఉదయం స్వామి మానసికంగా ఇలా తెలియచేశారు. "నేను మాట్లాడటానికి కొంచెం సమయం పడుతుంది. మందిరానికి మానవద్దన్నారు."

"ప్రపంచంతో సంబంధం లేకుండా ఎలా ఉంటావు? ఈ ప్రపంచం అంతానే కాదు విశ్వమంతా నిండిన అనుభూతిని పొంది ఇప్పుడు ప్రపంచానికి దూరంగా ఉండటం ఎలా సాధ్యం అవుతుంది? ప్రపంచంతో సంబంధం పెట్టుకుని దానికి బందీవి కాకుండా ఉండు. రాగ ద్వేషాలు లేని నీకు ఈ ప్రపంచం బంధంకాదు. ఇంట్లోనే ఉండి నీ అవసరం ఎవరికయినా కావలసినప్పుడు వాళ్ళకి నీ ఆధ్యాత్మిక సేవలను అందించు" అని తెలియచేశారు.

స్వామి అనుగ్రహంతో మందిరానికి వెళ్ళి స్వామిని దర్శించుకున్నాను. దయగల తల్లి నన్ను తన వద్దకు రప్పించుకున్నది.

అమ్మా! సాయిమాతా! ఇంకెప్పుడూ ఇలాంటి నిర్ణయలు తీసుకోను. నీ దర్శనానికి వస్తాను. కానీ, త్వరగా నాతో మాట్లాడు ఇంకెంత కాలం ఈ హృదయభాష?"

**9.2.2008**

నాగప్రతిష్ట రోజు నుంచీ ఇక్కడ యోగశక్తితో (కుండలనీ శక్తి) ఈ గది నిండిపోయింది. ఈ గది శాంతితో కూడిన ప్రేమాలయం. ఇక్కడికి వచ్చిన వాళ్ళని అమ్మ వాళ్ళ అర్హతని బట్టి ఆశీర్వదిస్తుంది. త్వరలో ప్రేమశక్తి ఆకర్షణకి జనం వస్తారు. ఇది శివశక్తి పీఠం. 24 సంవత్సరాలుగా విశ్వమే శ్రీ చక్రంగా లలితాంబికని నిర్గుణ పరబ్రహ్మంగా నా గురుదేవులు శ్రీశ్రీశ్రీ భగవాన్ శ్రీ సత్యసాయి బాబా నా చేత సాధన చేయించి విశ్వమంతా అమ్మగా దర్శనం చేయించారు. నా హృదయ పీఠం మీద సాయి మాత దివ్య పాదాలను ప్రతిష్టించుకొని, కలలో గురుదేవులు ప్రసాదించిన పంచాక్షరిని సతతం ఉచ్ఛ్వాస, నిశ్వాసలతో జపిస్తూ నిర్గుణ పరబ్రహ్మని యోగమార్గాన దర్శించి నేనే పరబ్రహ్మగా నిశ్చల జ్ఞానం కలిగింది. ఇక్కడ శ్రీ చక్రవాసిని లలితాంబికగా భక్తులు నన్ను దర్శించి తరిస్తారు. ఏ రూపంలో కొలిచినా అమ్మ వాళ్ళకి ఆ రూపంలో దర్శనమిచ్చి తృప్తిని ప్రసాదిస్తుంది. నాలోని శ్రీచక్రం జనాకర్షణ శక్తి కలది. నా ప్రేమ శక్తికి చాలా మంది దగ్గరయి ఆనందం అనుభవిస్తారు.

ఇదంతా నా గురుదేవులు హృదయభాషలో వ్రాయించారు. గురుకృపకు పాత్రురాలినైన నేను ధన్యజీవిని.

**16.2.2008**

రాత్రి 11 గంటలకి దృశ్యం "నీళ్ళలో వెన్న తేలుతున్నట్లు ప్రశాంతి నిలయంలో ఎడమవైపు వరండా ముందు కొంచెం దూరంలో ఒక మీటరు వెడల్పు అగ్ని" కనిపించింది.

అర్థం : "నీళ్ళలో వెన్న కలవనట్లు నీకు ఏ కర్మలూ అంటవు. నీ మంత్రశక్తి అగ్నిలా నిన్ను రక్షిస్తుంది. నీకు గురుకృప ఉన్నది."

## 20.2.2008

ఉదయం 8 గం.30 ని.లకు స్వామి సింహాసనం మీద కొత్త బట్ట వేసి హారతి పడదాము. పౌర్ణమి ముందు చతుర్దశి మంచిదేనని అనుకున్నాను. కాని, స్వామి హృదయభాషలో "ఇపుడు వద్దు. 9 గం. 30 ని॥లకు పౌర్ణమి వస్తుంది. అప్పుడు చెయ్యమన్నారు." ఉదయం 7 గం. 43. ని నుంచి 9 గం. 18 వరకు వర్జ్యం ఉన్నది. ఈ టైములో వద్దని చెప్పారు. స్వామి సంకల్పం ప్రకారం సింహాసనంలో బట్టవేయకుండా మందిరానికి వెళ్ళాను. స్వామి ఉదయం ఒక్కొక్క రోజు దర్శనం ఇవ్వటం లేదు. ఈ రోజు వస్తారో రారో అనుకుంటూ స్వామి నీ సంకల్పంతో ఈ వస్త్రం నీ సింహాసనంలో వేస్తున్నాను. దర్శన మివ్వమని ప్రార్థించాను. వర్జ్యం పోయి, పౌర్ణమి వచ్చాక 9 గం 55 ని॥ స్వామి దర్శనం ఇచ్చారు. ఇది అద్భుత సాయి అద్భుత లీల!

ఇంటికి వెళ్ళాక పెసరపప్పు పులగం బెల్లం పొంగలి ప్రసాదం చేసి, సింహాసనంలో వస్త్రం వేసి హారతి ఇచ్చాము.

## 21.12.2008

మధ్యాహ్నం రెండు గంటలకి దృశ్యం "వల" లాటి ఆకారం కనిపించింది. దానిలో చేపలో లేక మనుష్యులో తెలియలేదు. ఒక ఏనుగు డప్పు పట్టుకుని దండోరా వేస్తున్నది."

స్వామి తెలియచేసిన అర్థం – "నీ బోధలు వినటానికి మనుష్యులు రావాలని అనుకున్నావు కదా! చేపలు పల్లె వాని వలలో పడినట్లు గురుస్వరూపిణి అమ్మగా నీ ప్రేమ వలలోకి కొద్ది మంది సాధకులు ప్రవేశిస్తారు. "ఏనుగు" అంటే వినాయకుడు. నీ జ్ఞాన బోధలు వినటానికి రమ్మని స్వయంగా దండోరా వేస్తాడు."

ప్రభూ! నేను ఎంత భాగ్యశాలిని! మాయవలలో పడకుండా రక్షించి నీ ప్రేమ వలలో బంధించావు. నా గురించి స్వయంగా చెప్పకుండా దృశ్యాల ద్వారా ఎంత అద్భుతంగా బోధిస్తున్నావు? నా జన్మజన్మల సుకృతం ఫలించి దక్షిణామూర్తివై మౌన బోధలు చేస్తున్నావు. గురుదేవా! నీకు కోటానుకోట్ల నమస్కారాలు. ఒక వారంగా మాయ కప్పి నాతో ఆడుకుని, నా మొర ఆలకించి మాయ తొలగించి ప్రశాంతతని ఇచ్చావు. ఇక నీ పరీక్షలు చాలు కృష్ణా! నీ సొత్తుని జాగ్రత్తగా కాపాడుకో. భగవంతుడే గురువై నన్ను నడిపిస్తుంటే మాయ ఏమి చేయలేదు. గురువుని శరణాగతి వేడుకుని మాయ నుంచి తప్పించుకోండి.

**26.2.2008**

5వ తేదీ నాగ ప్రతిష్ట తరువాత 20న సింహాసనంలో కొత్త బట్ట వేశాము. ఆ ప్రతిష్ట తరువాత అమ్మ సర్పరూపంలో కనిపించాలని అనుకున్నాను. 25 రాత్రి మణికి కలలో రెండు పెద్ద సర్పాలు కనిపించాయని చెప్పింది. ఉదయం సేమ్యా పాయసం చేసి నాగసాయికి హారతి పట్టాము.

**18.7.2008**

ఈ గురుపూర్ణిమకు నా గురుదేవుల సన్నిధికి చేరి ఇరవై అయిదు సంవత్సరాలు ఉదయం లైనులో కూర్చుని ఉండగా కనిపించిన దృశ్యం "దోసపండు తీగ నుండి విడి పడి నా చేతిలో పడింది."

స్వామి ఈ పూర్ణిమకు కూడా నాతో స్వయంగా పలకలేదు. ఈ బాధ భరించలేనిది. భరించే శక్తి స్వామే ప్రసాదించారు.

**1.8.2008**

ఈ రోజు 4.30 గం॥ నుంచి 6 గం॥ వరకూ సూర్యగ్రహణం 4.30 గం॥కి మందిరానికి వెళ్ళి స్వామి ఎదురుగా కొంచెం దూరంలో కూర్చున్నాను. స్వామి 6 గం॥కు వెళ్ళే వరకూ పంచాక్షరీ జపం చేసుకున్నాను. స్వామిసన్నిధికి చేరిన తరువాత గ్రహణస్నానాలు చేయటం మానివేశాను. కాని ఈ రోజు మందిరం నుంచి వచ్చిన తరువాత గ్రహణ స్నానం చేయాలని విపరీతమైన కోరిక కలిగింది. గాయత్రీ మాతని తలుచుకొని శిరస్సు మీద ఐదుసార్లు నూనె పెట్టుకుని తలంటు పోసుకున్నాను.

గురుదేవా! గ్రహణం విడిచిన సూర్యుడు ప్రకాశించినట్లు పూర్తిగా దేహభావం పోయి నా ఆత్మ కోట్లాను కోట్ల సూర్యకిరణాలతో తేజోవంతమయి ప్రకాశిస్తున్నది. ఈ జీవితం నా కోసం కాదు. అందరి కోసం అన్న త్యాగబుద్ధితో నిండిపోయింది. నాకున్న కొద్ది డబ్బు నా కనీస అవసరాలకి సరిపోతుంది. చందాలు పోగు చేసి మంచి పనులు చేయటం నా స్వభావానికి విరుద్ధం. అంతర్యామివి! నీకు తెలియదా! సుఖశాంతులు ఆధ్యాత్మిక జీవితంలోనే లభ్యమవుతాయి. కాబట్టి నన్ను శక్తిమంతురాలిని చేసి, ఆధ్యాత్మిక సంపద ప్రసాదించి నా ద్వారా పది మందికి పంచిపెట్టు. ఈ గురుపూర్ణిమకి 25 సం॥ పూర్తి అయినాయి. ఇంక ఒక్కక్షణం కూడా నీ బిడ్డ ఆలస్యం భరించలేదు. సగుణ రూపంలో నా దరి చేరి “అహంబ్రహ్మోస్మి” స్థితిలో ఉన్న నాకు నీ దివ్య ఆశీస్సులు అందచెయ్యి నువ్వు అవతార పురుషుడివి. నిన్ను మనస్ఫూర్తిగా నమ్మి దైవంగా కొలుస్తున్నాను. నన్ను ఎన్నుకుని చక్కగా సాధన చేయించి ఇలా నిర్దయగా వదిలి వేయటం ధర్మమా! తల్లీ త్వరలో నా జీవితానికి ఒక అర్థం కలిపించి నన్ను నీ సేవకు ఉపయోగించుకుని నా జన్మ ధన్యం చెయ్యి, సాయిమాతా!

క్షీర సాగర మధనంలో అమృతం పుట్టినట్లు నా అంతరంగ మధనంలో ధర్మం ఆవిర్భవించింది. ఈ కలియుగ ప్రభావం వలన ధర్మం నశించి అధర్మం రాజ్యం చేస్తున్నది. ఈ సమయంలో అమృతం దేవతలకి పంచినట్లు నాలో నుంచి వచ్చిన జ్ఞానామృతం కలియుగ మానవాళికి పంచి, ధర్మస్థాపన చేసి, ధర్మం కాపాడి నీ బిడ్డలను సత్య, ధర్మాల వైపు నడిపించి నీ అవతార సమాప్తిలోపల కృతయుగానికి పునాది వెయ్యి.

అమ్మా! సత్య ధర్మాలు కాపాడటానికి నన్నొక సమిధగా వాడుకో. భౌతికంగా నీవు నాతో మాట్లాడే వరకూ పుట్టపర్తి విడిచి వెళ్ళను. అంతరంగ సాయీ! నా కోరిక తీర్చు. ఈ కోరిక తప్ప ఏ కోరిక లేదన్న సంగతి నీకు తెలుసు హృదయేశ్వరా!

**4.8.2008**

స్వామీ! నాకు మాట్లాడాలని లేదు. మాట్లాడకుండా జరగదు. ఎలాగా? అన్నాను. "మాట్లాడాలని లేకపోవటమే మౌనము. పూర్తి మౌనము పాటించనక్కరలేదు. అందరి మధ్య తిరుగుతూ మౌనంగా ఉండటం సాధ్యం కాదు. వీలైనంత తక్కువగా అవసరమైన మాటలు మాట్లాడు" అని తెలియచేశారు.

**9.8.2008**

ఈ రోజు సాయంత్రం విజయనగరం భక్తులు రోడ్డు మీద ఊరేగుతూ చెక్క భజన, కోలాటంతో పాటు భజనలు చేస్తూ ఉంటే "స్వామీ! ఇదంతా బాహ్యానందమే కదా!" అన్నాను. "ఔను, ఇదంతా వాళ్ళకీ నాకు బాహ్యానందమే కానీ, భక్తులు కార్చే కన్నీరే నాకు హృదయానందం" అన్నారు.

**18.8.2008**

మనసే చంద్రుడు. గ్రహణం విడిచిన పూర్ణ చంద్రుడు విశ్వాన్ని కోటాను కోట్ల చంద్రకిరణాలతో చల్లపరిస్తే నా మనసుకి పట్టిన మాయ అనే గ్రహణం విడిచి మనసు పూర్ణ చంద్రుడిలా సహస్ర కిరణాల చల్లని వెన్నెలతో శాంతితో నిండి, ఆ చల్లని వెలుగులో విశ్వమంతా నిండిన "శాంతిజ్యోతి"ని దర్శించాను. నా హృదయం విశ్వమంతా నిండిన శాంతిజ్యోతి కాగా ఆ జ్యోతి వెలుగులో శాంతి మార్గాన వెళతాను.

చంద్రగ్రహణం విడిచిన తరువాత సాయి ప్రేరణతో తలస్నానం చేశాను. సూర్యుడు, చంద్రుడు మనోనేత్రాలు. సూర్య కిరణాలతో జ్ఞాన నేత్రం తెరుచుకుంటే, చంద్రకిరణాలతో జ్ఞాని హృదయం చల్లబడి పరమానందంలో ఉంటాడు.

**23.8.2008**

స్వామీ! నీవు నాకు అన్నీ ఇచ్చావు. నువ్వే నా వాడివి అయినావు. కానీ, నీకు నేను ఏ విధంగా సేవ చయాలో తెలియటం లేదు. రేపు కృష్ణాష్టమితో 10 కృష్ణాష్టములు పూర్తి అవుతాయి. కృష్ణా! నిన్ను ఏమి అడగను. అడిగితే ఇచ్చేది అమ్మకాదు. అమ్మా! సాయిమాతా! వెలలేని జ్ఞానమణులు ఇచ్చావు. అవి అందరికీ పంచుకో. కృష్ణా! రేపు నీ అడుగులు నా ఇంటిని పావనం చెయ్యాలి. ఆలస్యం చేయకు ప్రభూ!

నా వందనాలందుకో నంద నందనా!
యశోదనే కానీ చల్లచిలికి వెన్న తీసి
వెన్నముద్దలు నీ నోటికి అందించలేనురా కన్నా!

కలియుగ యశోదని నేను, నా హృదయమే వెన్నముద్దరా
ఈ వెన్నను ఆరగించి నా వెతలు తీర్చి వెన్నెల కురిపించరా
వెన్నదొంగా!
యశోదానందుల ఇంట నడయాడిన నందకిశోరా!
నా ఇంట నడయాడి నన్ను ఆనందపరచరా నల్లని వాడా!
బాలసాయిగా కరణం సుబ్బమ్మ ఇంట్లో లీలలు చూపిన చిన్ని
కృష్ణా!
సనాతన సారథివై నన్ను నడిపించిన ఈశ్వరమ్మ తనయా!
నా మానస చోరా!
నా హృదయ సారథివై ఆత్మబోధలు చేసిన లీలా ధారీ!
నా ఇంట నిర్గుణ సాయిగా ఆధ్యాత్మిక లీలలు చూపించిన
హృదయవాసీ!
అందుకో నా ఆనందహేల!
ఇదే నీ కృష్ణాష్టమికి నేను ఇచ్చే వెలలేని కానుక అద్వైతామృతవర్షిణి
నీవు ఇచ్చినదే నీకు తిరిగి కానుకగా ఇస్తున్నాను.
గురుదేవులు ప్రసాదించిన జ్ఞాన సంపద తిరిగి
గురుదేవుల పాదాల చెంత సమర్పించి ఈ కృష్ణాష్టమికి (2008)
కర్పూరంలా కరిగి స్వామిలో లీనం అయ్యాను.

**25.8.2008**

ఈ రోజు మధ్యాహ్నం 3.40 ని॥లకు నా శరీరంలో సర్పం లాగా మూడు మెలికలు తిరిగి శరీరం కంపించింది. ఒక్కసారి శరీరం ముడుచుకుని తిరిగి మామూలుగా అయింది. నిన్న కృష్ణాష్టమి స్వామి మాట్లాడతారని

అనుకున్నాను. కానీ మాట్లాడలేదు. కాని ఈ రోజు హృదయమంతా కృష్ణుడితో నిండిపోయి మాట్లాడలేదన్న బాధ పోయింది. స్వామి పిలుపు కోసం ఎదురు చూస్తూ హృదయానందంతో ఉంటాను.

**24.10.2008**

"గుడి శిఖరాలు కనిపించాయి. ఒక శిఖరం పైన పూర్ణిమ చంద్రుడు తెల్లని పాలవలె చల్లని వెన్నెల కురిపిస్తున్నాడు. పూర్ణిమ రోజు పుచ్చపువ్వులా వెన్నెల కాస్తుంది. కానీ, ఈ వెన్నెల తెలుపు ఎప్పుడూ చూడలేదు. అమ్మ శారద పున్నమి చంద్రుడిలా ధవళ వస్త్రాలతో దర్శనం ఇచ్చిందన్న మధుర భావన కలిగింది." అమ్మ సాయిమాత జ్ఞాన స్వరూపిణి. జ్ఞానం అంటే వెలుగు కదా! జ్ఞానమయి సరస్వతి అద్వైతామృత వర్షిణి గ్రంథాన్ని త్వరలోనే వెలుగులోనికి తీసుకు వస్తుంది.

22.10.2008 సాయంత్రం సాయి సరస్వతి మందిరం వరండాలో కూర్చుని ఉండగా "అమ్మా! నీ పాద దర్శనం పాపాలు తొలగిస్తే, నీ నేత్ర దర్శనంతో మా కర్మలు పటాపంచలయితే, నీ శిఖర దర్శనం మాకు ముక్తిని ప్రసాదిస్తుందని" అనుకుంటూ కూర్చున్నాను. అందువల్లనే స్వప్నంలో సాయి సరస్వతి శిఖర దర్శనంతో పూర్ణచంద్రుడిలా వెలుగుతూ దర్శనం ఇచ్చి ముక్తిని ప్రసాదించింది. ముక్తి కాంతకు త్రికరణ శుద్ధిగా నమస్కరిస్తున్నాను.

**16.10.2008**

స్వప్నంలో పుస్తకం పేజీలలో సర్పం పడగలు పెద్ద పెద్దవి కనిపించాయి. దానికి అర్థం – పడగ అంటే కుండలినీ శక్తి ఈ గ్రంథం "యోగశక్తి"కి సంబంధించినది.

**15.11.2008**

24.10.08న కలలో కనిపించిన శిఖరాలు కృష్ణా జిల్లాలోని శ్రీకాకుళంలోని శ్రీకాకుళేశ్వరస్వామి గుడి శిఖరాలు అని స్వామి తెలియచేశారు. శ్రీకాకుళం మా అమ్మపుట్టిన ఊరు. చిన్నప్పుడు ఆ గుడికి వెళ్ళేదాన్ని. ఈ కల వచ్చిన తరువాత ఆ ఊరు వెళ్ళి శ్రీకాకుళేశ్వరస్వామిని చూడాలని సంకల్పం కలిగింది. అనుకోకుండా నవంబరు 15న బయలుదేరి శ్రీకాకుళం వెళ్ళి నెలలోపలే స్వామి సంకల్పంతో శ్రీకాకుళం ఆంధ్ర మహావిష్ణువును దర్శించాను.

**1.1.2009**

ఉదయం "మౌలాని" గుమ్మం కడిగి ముగ్గు వేసి పసుపు, కుంకుమ చల్లింది. ఎప్పుడూ అలా వెయ్యదు. పాలతనికి డబ్బులు ఇస్తాను. లోపలికి రమ్మంటే వచ్చాడు. 'అమ్మా! చూడలేదు. ముగ్గు తొక్కి వచ్చాను. లోపల అంటింది" అన్నాడు అతను. ఫరవాలేదని చెప్పి యాపిల్ ఇచ్చి, డబ్బు ఇచ్చి పంపాను. తరువాత అనిపించింది. "స్వామి ఏ రూపంలోనైనా రావచ్చు" అని పాలతని రూపంలో పసుపు, కుంకుమతో పాదముద్రలు వేశారని వాటికి నమస్కరించాను. సాయంత్రం ఆ పాదాలలో విభూతి వస్తే బాగుండుననుకొని అది మళ్లీ కోరిక అవుతుందని తుడవబోయి ఈ పాదాలు రాత్రి నిద్ర చేస్తే బాగుంటుందని దానిపై పారిజాతం పూవు వేసి నమస్కరించాను. ఇలా చేయటం తప్పనిపించలేదు. అద్వైతానికి పరాకాష్ట.

**2.1.2009**

సాయంత్రం మందిరంలో స్వామి భక్తురాలు ఒకరు మాటల సందర్భంలో "మాది పొట్టకూటి విద్య, మీది ఆధ్యాత్మిక విద్య" అన్నారు. "మీకు

ఎట్లా తెలుసు?" అన్నాను. "మీ ముఖం చూసి అన్నాను, నా పిహెచ్‌డి డాక్టరేటు కంటే మీదే నిజమైన పిహెచ్‌డి డాక్టరేటు" అన్నారు. నా గురించి ఆమెకు ఏమీ తెలియదు. స్వామి ఆవిడ ద్వారా 2009 సంవత్సరంలో డాక్టరేటు ఇచ్చారు. 1984 నుంచి తానే ఆత్మగురువై నన్ను ఆధ్యాత్మిక బాటలో నడిపించి ఈ సంవత్సరం వెలకట్టలేని కానుక ఇచ్చారు. స్వామి నాతో మాట్లాడటానికి ఇంకా సమయం ఉన్నది కాబట్టి ఆమెను ఎన్నుకుని ఆమె ద్వారా తెలియచేశారు.

స్వామీ! ఏ చదువూరాని, కర్మలలో కొట్టుకుపోతున్న నన్ను ఎన్నుకుని ఈ మార్గంలో ఏ కష్టమూ కలగకుండా నీ అనంతమైన ప్రేమ, వాత్సల్యంతో నడిపించిన నీకు ఏమివ్వను ప్రభూ! నీ మీద ఎనలేని భక్తి, ప్రేమతో నిన్ను ఆరాధిస్తూ ఉంటాను.

గురుదేవా! గురువంటే ఎంతో భయభక్తులు ఉండాలి. కానీ, నేను నిన్ను అమ్మగా చనువుతో నువ్వు పలకలేదన్న బాధతో ఎన్నో విధాల వేధించాను. తెలివి తేటలు లేని నేను అజ్ఞానంతో ప్రవర్తించినా నన్ను క్షమించి నీ కృపతో దైవంగా మలిచావు. ప్రభూ! కిటికీ తలుపులు తీస్తే సూర్యప్రకాశం లోపల చీకటి పోగొట్టి వెలుగు నింపుతుందని అన్నావు. కానీ, నువ్వు మాత్రం జ్ఞాన భాస్కరుడై మూసుకన్న నా హృదయ కవాటాలు నేను తెరవకపోయినా నీ కృపా వీక్షణాలతో నా అజ్ఞానమనే చీకటి తొలగించి నీ వెలుగుతో నింపావు. ఇక్కడ నా తెలివి తేటలు ఏమీ లేవు. గురుకృపకి నోచుకుంటే పురుష ప్రయత్నం అంటూ ఏమీ లేదు. అన్నీ తానై తానే నడిపిస్తాడు. ఎందుకంటే 1982 వరకు స్వామిని చూడలేదు. స్వామి గురించి తెలియదు. కానీ 1984వ సం॥లో నన్ను తన వద్దకి తీసుకువెళ్ళారు. ఈ జన్మలో మాత్రం నాకు తెలిసి ఏమీ అడగలేదు. కరుణా సముద్రుడు సాయిరాముడు. సంసార సముద్రంలో నుంచి

ఒడ్డుకు చేర్చి తనలో లీనం చేసుకున్న సాయీశ్వరుడు. గత జన్మల పుణ్య ఫలం సాయి మాత వద్దకి చేర్చి ఉంటుంది. ఈ జన్మ పాపఫలం పుణ్యఫలంగా మార్చి నాపై అమృతధారలు కురిపిస్తున్న ఆ ప్రేమ మూర్తికి ఏమివ్వగలను? అమ్మా, త్వరగా నా దరి చేరి నీ దానినైన నన్ను త్వరగా నీ ఒడి చేర్చుకో అమ్మా … నీ ఒడి కంటే కోరుకునే ఉన్నత స్థానం ఏమున్నది? అమ్మా … త్వరత్వరగా వచ్చెయ్యి. ఆలస్యం చెయ్యకు వేదన తీర్చే వేదవల్లీ. వేదన తీర్చి ప్రశాంత జీవితం ప్రసాదించి నీ సేవలకి ఉపయోగించుకుని నా జీవితం ధన్యం చెయ్యి. నీకు శత కోటానుకోట్ల ధన్య వాదాలు.

**4.1.2009**

రాత్రి స్వప్నంలో – "స్వామి ఒక ఇంట్లో పల్లకిలో ఉన్నారు. స్వామిని చూడటానికి వెళుతూ ఉంటే స్వామే ఎదురు వచ్చారు. స్వామీ! నాకు బట్టలు ఎప్పుడు ఇస్తారని అడిగితే "జనవరి తరువాత" అన్నారు.

**6.1.2009**

స్వామీ! నువ్వు 4వ తారీఖు కలలో జనవరి తరువాత బట్టలు ఇస్తానని చెప్పావు. కానీ, అది వరకు రెండుసార్లు కలలో ఒకసారి సోమవారం అనీ, ఒకసారి "ఉగాది ఎల్లుండి ఆ రోజు ఇస్తానని" చెప్పావు. అందుచేత జనవరి తరువాత అంటటే నమ్మలేక "నెగెటివ్"గా ఆలోచించి నిరుత్సాహపడ్డాను. కానీ, ఉదయం మందిరానికి వెళుతూ భాస్కరమ్మతో "బిడ్డకి ఆకలై అన్నం అడిగితే వంట సిద్ధంగా ఉంటే వెంటనే అన్నం పెట్టి ఆకలి తీరుస్తుంది. వంట సిద్ధంగా లేకపోతే వెంటనే పెట్టక ఆలస్యం చేస్తుంది. ఈ విషయం తెలియక బిడ్డ అన్నం పెట్టమని అడుగుతూనే ఉంటుంది. కానీ, అమ్మవంట చేస్తూనే ఇపుడు పెడతా, అపుడు పెడతా అంటూ ఉంటుంది. వంట సిద్ధం కాగానే అమ్మ బిడ్డ వద్దకి

వచ్చి ఆకలితో సొమ్మసిల్లి అన్నం అడగలేని స్థితిలో ఉన్న ఆ బిడ్డకు ప్రేమతో అన్నం తినిపించి ఆకలి తీర్చి ఆనంద పెడుతుంది. అమ్మ ప్రత్యక్ష దైవం. అమ్మకి మించిన దైవం లేదు. బిడ్డల భౌతికమైన అవసరాలు తీర్చి, తరువాత భక్తి మార్గంలో నడిపిస్తూ ఆధ్యాత్మిక సిరి, సంపదల నిచ్చే తల్లే నిజమైన మాతృమూర్తి. అటువంటి అమ్మని పొందిన బిడ్డలు సాయిమాత చరణ కమలాల వద్ద చేరి అమ్మ జగజ్జనని కురిపించే ప్రేమామృత ధారలలో అమృత పుత్రులై సాయిమాత సేవలో తరిస్తారు. అద్వైత స్థితిలో ఉన్న నేను అమ్మగా నాదరి చేరిన బిడ్డలను ప్రేమ మార్గాన నడిపించాలన్న ఆశ తప్ప వేరే ఆశ లేదు. మన మందరం సాయి మార్గంలో తరిద్దాము" అన్నాను.

"అన్నం అడిగిన బిడ్డకి ఆలస్యం అయినా అన్నం పెట్టి ఆకలి తీర్చినట్లుగా" సాయిమాత తన సంకల్పంతో నాదరి చేరాలనుకున్న సమయం ఆసన్నం అయ్యే వరకు అదిగో, ఇదిగో అంటూ నన్ను మభ్యపెట్టి ఆలస్యం చేస్తున్నది. జనవరి తరువాత నా వద్దకి వస్తుంది. "నెగెటివ్"గా ఆలోచించక విశ్వాసంతో ఉంటాను.

నేను, భాస్కరమ్మ ఉదయం 8 గం ॥కి మందిరానికి వెళ్లటం వలన ముందు వరుసలో కూర్చునే అవకాశం వచ్చింది. స్వామి ఈ రోజు తొందరగా వచ్చారు. దగ్గరగా దర్శనం అయింది. స్వామి భజన హాలులోకి వెళ్ళి వెంటనే బయటికి వచ్చి వి.ఐ.పి.లు కూర్చున్న తోవకుండా మా ముందు నుంచి వచ్చి మా ముందు ఉన్న సింహం బొమ్మ ముందు 10 ని॥ కూర్చున్నారు. మాకు మూడు గజాల దూరంలో స్వామి కూర్చున్నారు. పది నిమిషాలు అద్భుత దర్శనం ఇచ్చి కారు తన వద్దకి పిలిపించుకుని మా ముందే ఎక్కి స్టేడియంకి వెళ్ళారు. ఉదయిసున్న సూర్యుడి చుట్టూ కాషాయ వర్ణం మబ్బు ఉన్నట్లుగా

కాషాయవర్ణం దుస్తులతో, కోటి సూర్యుల కాంతితో సాయి గాయత్రి భక్తులకు దివ్యదర్శనం ఇచ్చింది.

సూర్యునిలోని వెలుగు అమ్మే కదా! సూర్యమండలం నుంచి సహస్ర కిరణాలతో గాయత్రీ మాతే భక్తుల కోసం దిగి వచ్చిందన్న అలౌకిక ఆనందంతో ఇంటికి వచ్చాను.

పాయసం చెయ్యాలనిపించి కొంచెం పాలల్లో వండిన అన్నం సగ్గుబియ్యం వేసి బెల్లం పొంగలి చేశాను. ఏ రూపంలో స్వామి వచ్చి ప్రసాదం స్వీకరిస్తారోనని మూత పెట్టి సాయంత్రం లోపు ఎవరు వస్తే వాళ్ళకి మొదటి ప్రసాదం పెట్టాలని అనుకుంటూ భోజనం చేయబోతుంటే విజయలక్ష్మి వచ్చి తలుపు కొట్టారు. స్వామి గాయత్రీ మాత రూపంలో వచ్చారని పొంగలి ప్రసాదం పెట్టాను. జగద్గురువు సత్యసాయిబాబా జ్ఞాన భాస్కరుడై నాలో వెలుగు నింపిన నా గురుదేవులు నా చేత స్వయంగా పొంగలి ప్రసాదం స్వీకరించి వెళ్ళారు. స్వామి ఏ రూపంలోనైనా రావచ్చు. "అన్ని రూపాలూస్వామివే". అన్న జ్ఞానం మనకి రావాలి. వచ్చినపుడు అనేక రూపాలలో దర్శనం ఇస్తారు. ఇది నా స్వానుభవంతో అనుభవించి వ్రాసిన సత్యం.

సాయంత్రం మందిరంలో నా ప్రక్కన కమలమ్మ కూర్చున్నారు. "ఉదయం స్వామి ఎవరో ఒక భక్తుడి కోసం బయట అంత దర్శనం ఇచ్చారని" ఆమె అన్నారు. నేను స్వామి అందరి కోసం ఇచ్చారని అన్నాను. "ఒక్క భక్తుడి కోసం నేను దర్శనం ఇస్తే మిగిలిన వాళ్ళకి కూడా ఆ దర్శన భాగ్యం కలుగుతుందని" స్వామి అన్నారుట. వనంలో ఒక్క చందనం మొక్క ఉంటే వనం అంతా చందనం వాసన వస్తుందని చెప్పారుట ఒకసారి స్పీచ్‌లో.

"స్వామీ! నా వేదన భరించలేక నాకు నీ దర్శన భాగ్యం కలగచేశావా" అని ఆనందించాను. దర్శన సమయంలో "స్వామీ! నీ కోసం ఏమయినా చేస్తాను. "ఏం చేయాలి?" అనుకుంటూ కూర్చున్నాను. స్వామి హృదయభాషలో "ఏం చేయవద్దు. నోరు మూసుకుని కూర్చో" అన్నారు. "స్వామీ ... నేను నోరు మూసుకోను. నువ్వు కావాలి ... నువ్వు కావాలి" అంటూ ఉండగా స్వామి సింహం వద్ద కూర్చుని 10 ని॥లు దర్శనం ఇచ్చారు. నా వేదన అర్థం చేసుకుని ఒకరోజు ముందే ఉత్తరద్వార దర్శనం ఇచ్చారు.

ముందే ఎందుకు ఇచ్చారు? అంటే సాయికృష్ణ తన ప్రియ భక్తుల ఆర్తిని బట్టి ముందే ఇచ్చారు. తన నిజ భక్తుల కోసం స్వామి ఏదయినా చేస్తారు.

ఓ భక్తులారా! సాధకులారా! సాయి మాత హృదయాన్ని ప్రేమతత్త్వంతో గెలుచుకుని సాయిమాత అనుగ్రహాన్ని పొందండి.

**13.1.2009**

ఈ మధ్య చంద్రుడిని చూడాలన్న పిచ్చి కోరికతో చంద్ర దర్శనం చేసుకుంటున్నాను.

ఉదయం భోగి, తలంటి పోసుకోవాలి పోసుకోలేదు. సాయి గాయత్రిని తలుచుకుని శిరస్సున ఐదుసార్లు నూనె పెట్టుకుని నా భక్తి తైలధార లాగా ఉండాలని గురు స్వరూపిణి సాయిమాతకి నమస్కరించాను. లైనుకి వెళ్ళాలనిపించి మందిరానికి వెళ్ళాను. 9 నెం. వచ్చింది. మంచి సంఖ్య. నేను కూర్చున్న వైపు ఉదయభానుని కోటాను కోట్ల కిరణాలు నన్ను చుట్టుముట్టినాయి. నాకే కాదు. అక్కడ అందరికీ ఆ కాంతి కిరణాలు తాకినాయి. అద్వైతస్థితిలో

ఉన్న నాకు నా గురుదేవులు ఇలా తెలియచేశారు. “తలస్నానం దేహానికి కాకుండా సూర్యకాంతి కిరణాలతో ఆత్మ స్నానం చేయించాను. అందుకే తలంటి పోసుకోనివ్వలేదు” అని తెలియచేశారు. ఎంతటి అద్వైత మధురభావన! గురుకృప అపారమైనది. వెలకట్టలేనిది. ఈ జన్మలో ఎపుడూ సూర్యోపాసన చేయలేదు. గురుపాద పద్మాల వద్ద మనసు నిలిపి ధ్యానం చేయటం వలన సూర్యోపాసన ఫలితం కలిగింది.

ఇంటికి వచ్చాక చిన్న గిన్నెకి కళ్యాణం బొట్టు పెట్టి పాయసం చేసి, మొదట ఎవరు వస్తే వాళ్ళకి పెట్టాలని అనుకున్నాను. అనుకోకుండా పార్వతి వచ్చింది. పార్వతి వస్తుందని అసలు ఊహించలేదు. పార్వతి నన్ను సాయిమాతగా భావించి తన కొత్త చీర నేను కట్టుకున్న తరువాత కట్టుకుందామని తెచ్చింది. ఇది సాయిమాత సంకల్పంగా భావించి చీర కట్టుకుని తిరిగి పార్వతికి ఇచ్చాను. ఉదయం “స్వామీ! ఈ దేహం జీర్ణ వస్త్రం. నేను కట్టుకున్న చీర కూడా జీర్ణ వస్త్రమే. నశించే దేహానికి వస్త్రం అక్కరలేదు. నీ తేజో కిరణాలతో ఆత్మస్నానం చేసి, నీ తేజోవలయమే వస్త్రంగా ధరించాను. నాకు బట్టలు వద్దు నా వద్దకి ఒక్కసారి రమ్మని” ప్రార్థించాను. కాని బట్టలు వద్దన్నా సాయి మాత పార్వతి రూపంలో వచ్చి చీర ఇచ్చి, పాయసం తాగి నన్ను ఆనంద పెట్టింది. పార్వతి వెళుతూ “స్వామి దర్శనం ఇవ్వలేదు. చిన్న స్వామిని దర్శించుకుందామని వచ్చా”నన్నది. ఇంతవరకూ ఎవ్వరూ ఇలా చిన్నస్వామి అని అనలేదు. ఆ పిలుపు చాలా తమాషాగా అనిపించింది.

మధ్యాహ్నం దృశ్యం – “అస్తమిస్తున్న సూర్యుడు ప్రకాశమైన వెలుతురుతో చల్లగా కనిపించాడు. ఉదయం గాయత్రీమాతగా, సాయంత్రం సంధ్యాదేవిగ సాయిమాత దర్శనం ఇచ్చింది.”

**14.1.2009**

ఈ రోజు ఉదయం, సాయంత్రం స్వామికి దగ్గరగా కూర్చుని దర్శనం చేసుకున్నాను. "ఇన్నర్ వాయిస్" వినటమే "స్పిరిట్యువల్"గా ఉన్నత స్థితి" అన్నారు స్వామి స్పీచ్‌లో, ఆ స్థితిలో ఉన్న నాకు స్వామి సూచన ఇచ్చినట్లయింది "స్వామీ! నీతో బాహ్యంలో మాట్లాడకుండా ఉండలేనని" అనుకున్నాను.

**15.1.2009**

స్వామీ! "నువ్వు మాట్లాడకపోతే నిన్ను చూస్తూ పుట్టపర్తిలో ఉండలేను. నన్ను ఎక్కడికైనా పంపించమని" కంటికీ మంటికీ ఏకధారగా ఏడ్చాను.

"ఎక్కడికి వెళ్ళినా నువ్వు నన్ను విడిచి ఉండలేవు. ఇక్కడ ఏ కష్టమూ లేకుండా అన్ని సదుపాయాలతో పువ్వులా చూసుకుంటున్నాను. దేనికయినా కాలం కలిసిరావాలి. ఏ కాలంలో ఏ పని జరగాలో ఆ కాలం సమీపించగానే ఆ పని జరుగుతుంది. కలిసి వచ్చేకాలంలో నడిచి వచ్చే బిడ్డలాగా నేను నీ వద్దకి వస్తాను. నిశ్చలమనసుతో ప్రశాంతంగా ఉండు. ఏకర్మఫలం అయినా కాలపురుషుడినైన నేను సమయం ఆసన్నంకాగానే ఆ ఫలం అందిస్తాను. నీకు పాపం లేదు. పుణ్యం లేదు. కష్టం లేదు. సుఖం లేదు. బాహ్యానందం లేదు. అన్నింటికీ అతీతమైన నీకు మోక్షఫలం ఇస్తాను. కలిసి వచ్చే కాలం సమీపించింది. విశ్వాసంతో ఇక్కడే ఉండు. ఏ ఊరయినా వెళ్ళవలసి వస్తే నా సంకల్పంతో వెళతావు. నా పిచ్చిపట్టి పిచ్చిదానిలా తిరుగుతున్న నిన్ను చూస్తే జాలి వేస్తున్నది. నా కోసం తపస్సు చేస్తున్న వాళ్ళలో నువ్వూ ఉన్నావు. నేను వచ్చి నీ పిచ్చి వదిలించి నిన్ను జ్ఞానిగా బయట పెడతాను. నీ చుట్టూ చేరిన వాళ్ళు కొద్ది మంది అయినా నీ ఆధ్యాత్మిక బోధలు విని జ్ఞానజ్యోతులుగా ప్రకాశిస్తారు. చదువురాని దానివని సందేహించకు. నీ మానస సరోవరం

నిర్మలంగా ఉన్నది. నీ నిర్మల హృదయంలో శాశ్వతుడనైన నేను నిలిచి ఉన్నాను. నేను నా సంకల్పంతో వచ్చిన వాళ్ళకి వాళ్ళ అర్హతను బట్టి నీలో నించి ఆధ్యాత్మిక బోధలు చేస్తాను. నిన్నున ఆ అద్వైత వారసురాలిగా, నా పరికరంగా వాడుకుంటాను. నా పరీక్షలకి తట్టుకుని, సత్యం ధర్మంలో నిలిచి నమ్మకంతో ఉన్న నా జ్ఞానమణిని వదులకుంటానా? నిన్ను నా రెక్కల మాటున గుడ్డును పొదిగినట్లుగా పొదిగి కాపాడాను. రెక్కలు వచ్చిన పక్షిలా ఈ జనారణ్యంలో స్వేచ్ఛగా అంటే "ఈ దేహం నేనన్న అహంతో కాదు. అహంబ్రహ్మాస్మి నేను దైవాన్ని" అన్న స్థితిలో తిరుగు. భవిష్యత్తులో నీకు ఉన్నత స్థానం ఇస్తాను. ఆ స్థానం జాగ్రత్తగా కాపాడుకో. నీ చుట్టూ వాళ్ళు పూజించినా, దూషించినా వాటికి అతీతంగా ఉండు. ఇప్పటి వరకు గడిపిన జీవితం వేరు. నేను నిన్ను బయట పెట్టిన క్షణం నుంచీ సుడిగాలిలాగా జనం నిన్ను చుట్టుముట్టుతారు. ప్రతి మాటా జాగ్రత్తగా ఆలోచించి మాట్లాడు. నీ మాట శక్తివంతంగా ఉండాలంటే అనవసరం మాటలు తగ్గించి అవసరం అనుకున్న మాట మాత్రమే మాట్లాడి నీ వాక్కు శక్తివంతం చేసుకో. అప్పుడే వాక్శుద్ధితో అన్నమాట జరిగి తీరుతుంది. నా కృప నీకు ఎప్పుడూ ఉండేలా నిన్ను ఆశీర్వదిస్తున్నాను.

ఇట్లు ఆశీర్వాద బిందువులతో

నీ గురుదేవులు సత్యసాయి బాబా

ఇది వ్రాసినప్పుడు మధ్యాహ్నం ఒంటి గంట అయింది.

మధ్యాహ్నం రెండు గంటలకి దృశ్యం – సెల్‌ఫోన్‌లో రెండుసార్లు వెలుతురు వచ్చి, ఒక మెస్సేజ్ వచ్చింది. ఇంగ్లీషులో ఒక మాట "ఫ్లాక్ ఆఫ్" (Flock off) అని ఉన్నది. ఇంగ్లీషు అక్షరాలు వచ్చు కాని, ఆ వాక్యానికి అర్థం తెలియదు. దృశ్యం అసత్యం కాదని తెలుస్తున్నది.

శారదని అడిగితే "ఫ్లాక్ ఆఫ్" అంటే "ఎగిరిపో గుంపుతో కూడి" అని అర్థం చెప్పింది. అద్భుతమని అనిపించింది. 1997లో "శాంతి కపోతాలమై జనారణ్యంలోకి ఎగిరి పోదామా" అని వ్రాశాను. ఇన్నేళ్ళ తరువాత శాంతి దూతవై జనాల మధ్యకి వెళ్ళమని స్వామి సందేశం ఇచ్చారు.

1997లో ఒకామె మందిరంలో పావురం ఎగురుతుంటే నాతో "పావురంలా శాంతి దూతని, మనసు వెన్న, రూపు, చూపు చల్లన, చల్లని వెన్నెల తల్లివి" అన్నది.

## 26.1.2009

ఉదయం స్వామి కోసం చాలా ఏడ్చాను. స్వామీ! రేపటి నుంచి మాఘమాసం. జనవరి తరువాత బట్టలు ఇస్తానన్నావు. ఏ జనవరి తరువాతనో తెలియదు. నాతో మాట్లాడవు, ఎక్కడికీ వెళ్ళనివ్వవు. ఈ జనవరి తరువాతనైనా మాట్లాడు. బట్టలు వద్దు. రేపటి నుంచీ మందిరానికి రాను. రాత్రి కలలో నువ్వు కనిపిస్తే వస్తాను. నీ పాదాల వద్ద ఉన్న నన్ను నిర్లక్ష్యం చేయకు. ఈ స్థితిలో ఏకాగ్రతగా ఉండలేకపోతున్నాను. నీ పాదాల నుండి గంగ, యమున ప్రవహిస్తున్నది. ఈ పవిత్ర నదులలో మునిగి ఉన్నానన్న భావనలో ఉన్నాను.

## 6.5.2009

అమ్మా! ఈశ్వరాంబా! పరమాత్మనే పుత్రుడిగా పొందిన పుణ్యస్త్రీవి. నీ బిడ్డని తల్లిగా మూడు వరాలు కోరినావు. నీ మూడు కోరికలు స్వార్థం లేనివి. అందుకే స్వామి ఆ కోరికలు తీర్చినాడు. విద్య, వైద్యం, నీరు మానవుడికి ఎంత అవసరమో తనని తాను తెలుసుకునేందుకు జ్ఞానం కూడా అంతే అవసరం. నీ పుత్రుడు ఎంతో మంది చేత సాధనలు చేయించి జ్ఞాన పుత్రులుగా

తయారు చేసినాడు. అమ్మా! ఈశ్వరమ్మ! నీ పుత్రుడు అందరికీ అందుబాటులో లేడు. నీ బిడ్డ తయారు చేసిన జ్ఞానులలో నేనూ ఒకదాన్ని, మిగతా వాళ్ళు ఎక్కడెక్కడ ఉన్నారో నాకు తెలియదు. మమ్మల్ని బయట పెట్టి మా ద్వారా కొంత మందికయినా జ్ఞానగంగని పంచమని స్వామికి చెప్పు. స్వామి హృదయంలో అమ్మగా నీకు విశిష్టమైన స్థానం ఉన్నది. ఈ రోజు "ఈశ్వరమ్మ డే"గా స్వామి ఎంతో వైభవంగా జరిపారు. స్వామితో పాటు మేము కూడా ఆనందించాము. ఈ శుభ సందర్భంలో నీ నాలుగవ కోరికగా జ్ఞానగంగ పంచమని నీ బిడ్డని అడుగు. నీకోరిక తప్పక తీరుస్తాడు. ఈ నా కోరిక కూడా స్వార్థం లేనిది. సాయి అవతారంలో ఆయన పరికరంగా ఆత్మబోధ తప్ప ఇంక ఏ సేవా చేయలేని దాన్ని. త్వరలో ఈ సేవని ప్రసాదించమని స్వామికి చెప్పు. ఈ రోజున నువ్వుకోరిన కోరిక తప్పక తీరుస్తాడు. శరీరంతో నువ్వు లేకపోయినా స్వామితో మాట్లాడగల "దివ్యాత్మ"వి. అమ్మా! నీ బిడ్డగా స్వార్థం లేని ఈ వరం నిన్ను అడుగుతున్నాను. నా మీద దయ ఉంచి అనుగ్రహించు. నా కన్నీటితో నీ పాదాలు అభిషేకిస్తున్నాను."

ఉదయం స్వామి ఈశ్వరమ్మ సమాధి వద్దకి వెళుతున్నప్పుడు దగ్గర నుంచి మంచి దర్శనం అయింది. కళ్ళలోకి చూస్తూ "బ్లెస్" చేస్తూ వెళ్ళారు.

"గురుదేవా! నాకు మాతృ స్థానం ఇచ్చిన రోజు నువ్వు కూడా నా బిడ్డగా కనిపించావు. నీకు జన్మనిచ్చిన తల్లి మూడు కోరికలు తీర్చిన విధంగా నువ్వు ఈ తల్లి కోరిక కూడా తీర్చి, నీ అవతారంలో కొద్ది మందినైనా జ్ఞానగంగతో పునీతులను చేసి, నీ పరికరాలుగా వాడుకుని తరింపచెయ్యి. విశ్వజననిగా అడుగుతున్న నా కోరిక తీర్చు."

**8.5.2009**

సాయంత్రం నాకు రెండవ లైను వచ్చింది. స్వామి నా ముందు నుంచి వెళ్ళారు. నా వైపు చూడకపోయినా తన విశాల నేత్రాలతో అందరినీ చూస్తూ వెళ్లారు. దివ్యదర్శనం. నాకు ఈ దివ్యదర్శనం కంటే ప్రపంచంలో ఇంకా ఏమి ఉన్నది. చూడటానికి, ఈ జన్మకి స్వామి కంటే చూసేది ఏమీ లేదు.

**20.7.2009**

"పొదుగు ఎండిపోయిన ఆవు కలలో కనిపించింది" ఒట్టి పోయిన ఆవు కనిపించటం అంటే కలియుగంలో ధర్మం నశించింది. సత్యసాయి అవతారంలో మళ్ళీ ధర్మం పునరుద్ధరింపబడింది. వేదమాత గోమాత గోవు అంటే జీవులు. సమస్త జీవులు సత్యసాయి యుగంలో ధర్మ మార్గాన నడిచి సుఖశాంతులతో వర్ధిల్లుతారు.

"సమస్త జీవా సుఖినోభవంతు" అని స్వామి చెప్పిస్తున్నారు. అంటే ధర్మ మార్గాన నడిచి సుఖశాంతులతో ఉండమని స్వామి సందేశం.

ధర్మ జీవనం గడపని వాడికి సుఖం లేదు. కాబట్టి స్వామి సందేశాన్ని వివేకంతో అర్థం చేసుకుని సత్య ధర్మాలను ఆచరించండి.

జీవా! సాయి అవతారంలో సాయి సందేశాన్ని ఆచరణలో పెట్టి ముక్తిని పొందు. నోటితో వర్ణించటం కాదు.

గురుదేవా! శంఖంలో పోసిన జలంతో నిన్ను అభిషేకిస్తారు. శంఖాన్ని కంఠంతో పోలుస్తారు కదా. కాబట్టి శంఖం లాంటి నా కంఠంతో జలానికి బదులు అమృత వాక్కులతో నిన్ను అభిషేకిస్తాను. ఆ సత్యవాక్కులు నీవు ప్రసాదించినవే. అవి నీకే సమర్పిస్తున్నాను. నీది కాని సంపద ఏదీ నా వద్ద

లేదు. అంతా నీదే. ఈ ఆధ్యాత్మిక సంపద త్వరలో అందరికీ పంచే అదృష్టం నాకు కలిగించి నీలో ఐక్యం చేసుకో. ఆలస్యం చేయకు. 1985లో వస్త్రం ఇస్తానని 10 సం॥ సాధన చేయించి 1995లో జ్ఞానమణిని ప్రసాదించావు. కృష్ణాష్టమికి దేహానికి వస్త్రం ఇస్తానని చెప్పి ఈ కృష్ణాష్టమికి పది సంవత్సరాలు పూర్తవుతాయి. ఇప్పుడైనా నన్ను నీ పాదాల వద్దకి చేర్చుకుని నన్ను ఆశీర్వదించు.

**20.7.2009**

నిన్నంతా "స్వామీ! నాతో మాట్లాడి నేనేమిటో చెప్పమని ఏడ్చాను. ఎక్కడికీ వెళ్ళాలని లేదు. ఇంకా ఏదయినా సాధన ఉంటే చేయించు నువ్వు నాకు కావాలని" ఏడిచాను. తలనొప్పి వలన దర్శనానికి వెళ్ళాలని లేకపోయినా వెళ్ళాను.

భజన తరువాత స్వామి హారతి తీసుకుని, కారు వద్దకి వెళ్ళి, వెంటనే మళ్లీ వెనుకకు తిరిగి వచ్చి "స్పీచ్" ఇచ్చారు. ఏ "అకేషనూ" ఇవ్వాళ లేదు. కేవలం నా కోసమే స్వామి స్పీచ్ ఇచ్చారనిపించింది. అనుభవంతో ఆత్మను తెలుసుకుని "అహంబ్రహ్మాస్మి" స్థితిలో ఉండాలని స్పీచ్‌లో చెప్పారు. నా ప్రార్థనను మన్నించి, నా స్థితిని తెలియచేశారు. దయగల నా తల్లి ఈ విధంగా వేదనని తీర్చింది ఇది ఊహించని అనుగ్రహపు జల్లు. గురుదేవుని పాదాలకు నా నమస్కారములు.

**22.9.2009**

ఉదయం స్వామి పంపిన చీరలు సేవాదళ్‌వారు పంచారు. నాకు లేత పసుపు రంగు చీరె వచ్చింది. చీరతో పాటు స్వామి ఫొటో కూడా ఈసారి ఇచ్చారు.

**23.9.2009**

రాత్రి – స్వామి ప్రేరణతో, "చీరతో ఇచ్చిన" సాయికృష్ణ ఫొటో, నా ఫొటో, ప్రభ ఇచ్చిన అర్జున్ పెళ్లి శుభలేఖపై అట్ట తీసి, జిగురుతో అతికించి స్వామి పాదాల వద్ద పెట్టాను.

**24.9.2009**

ఉదయం 7 గంటలకి స్వామి ప్రేరణతో ఆ ఫొటో స్వామి పాదాల వద్ద నుండి తీసి, స్వామి పంపిన లైటు ఎల్లో రంగు చీర కుర్చీలో వేసి అందులో పెట్టాను.

"జీవాత్మ, పరమాత్మ కళ్యాణం" అని నా గురుదేవులు హృదయ భాషలో చెప్పారు. వెంటనే భాస్కరమ్మని పిలిచి ఆమెకు పాద నమస్కారం చేసుకున్నాను. సాయిమాత ఆ రూపంలో వచ్చింది. ఆమె చేత అక్షింతలు ఫొటోపైన, నాపైన వేయించుకున్నాను.

సర్వదవేతా స్వరూపిణి, సాయిలలిత గురు స్వరూపిణిగా, 27 సం॥లు సాధన చేయించి ఈ రోజు జీవాత్మ, పరమాత్మ కళ్యాణం చేసింది. అద్భుతమైన ఈ రోజు సువర్ణాక్షరాలతో వ్రాసుకునే శుభదినం.

ఈ అదృష్టం ఎన్ని జన్మల సాధన ఫలితమో! కృష్ణ ప్రేమలో లీనమైనాను. భగవాన్ సత్యసాయి బాబా! గురువుగా వచ్చి, పరతత్త్వాన్ని తెలియచేసి, కృష్ణ పరమాత్మగా నీలో లీనం చేసుకున్నావా! కృష్ణా! నా జన్మ ధన్యం అయింది. సేమ్యా పాయసం చేశాను.

నాకు నువ్వు తప్ప ఎవ్వరూ లేరు. దేహబంధాలు లేవు. నా ప్రతిచిన్న అవసరం నువ్వే చూడాలి.

ఈ కళ్యాణం విశ్వకళ్యాణం. నా తల్లి సాయి మాత. తండ్రి షిరిడీ సాయి. ముక్కోటి దేవతలు, ప్రకృతితోపాటు అన్ని జీవాలు, చలించేవి, చలన రహితమైనవి నాకు ఆశీస్సులు అందజేశారు.

ఉదయం మందిరం దగ్గర ప్రొఫెసర్ శర్మగారు కనిపించారు. స్వామి ప్రేరణతో ఉదయం జరిగిన కళ్యాణం గురించి చెప్పాను. ఆయన నమ్మి, నవ్వుతూ "అయితే అంతా విధిగా జరిగిందన్న మాట" అన్నారు.

**25.9.2009**

నిన్న జీవాత్మ, పరమాత్మల కళ్యాణం జరిగిన దగ్గర నుంచి హృదయమంతా ఆనందంతో నిండి ఉన్నది. ఇద్దరి మధ్యా తెర తొలగింది. జీవుడు జీవత్వం నశించగా పరతత్వంలో పురుషోత్తముడి సన్నిధిలో పరమ ప్రేమ సాగరంలో సర్వం మరచి పరమానందంలో ఉన్నాడు.

గురుదేవా! ఈ వ్రాతలన్నీ అబద్ధాలయిన రోజున నాకు నేనే శిక్ష వేసుకుంటాను. కానీ, నా స్వామి ఇవి ఏవీ అబద్ధాలు కావని ఋజువు చేస్తారు. సమయం ఆసన్నమైంది.

**26.9.2009**

కుర్చీలోంచి ఫొటో తీసే లోపల "ఆది నారాయణ" రావాలనుకున్నాను. అది సాయి సంకల్పం. అలాగే ఈ రోజు ఉదయం 11 గంటలకి వచ్చారు. ఫొటో గురించి చెప్పాను. చాలా ఆనందించారు. "మీరు నిజమైన అనుభూతులు అనుభవిస్తున్నారని, ఇదంతా అసత్యం కాదు" అనీ అన్నారు. ఫోటోకి అక్షింతలు వేయమంటే వేసి, "స్వామికి అక్షింతలు వేయటం మహాభాగ్యం" అన్నారు. తరువాత కర్పూరం వెలిగించి హారతి పట్టారు.

ఉదయం స్వామి బంగారం రథం వద్దకి వచ్చారు. దగ్గర నుంచి మంచి దర్శనం అయింది. సాయంత్రం కూడా స్వామికి దగ్గరగా కూర్చున్నాను. స్వామి కొద్దిగా నా వైపు చూసినట్లయింది.

సాయంత్రం మల్లెపూలు కొందామంటే చిన్నదండ తనకే కావాలని పూలమ్మి అన్నది. ఇంక ఏ పూలు కొనాలని అనిపించక వచ్చేశాను. రాత్రి 8 గంటలకి భాస్కరమ్మ తులసిమాల తెచ్చి ఫొటోకి వేసింది. ఇది నిజంగా స్వామి లీల! ఈ రోజు శనివారం విష్ణుమూర్తికి (వేంకటేశ్వరస్వామి) తులసిమాల ఎంతో ఇష్టం. స్వామి తన ప్రేరణతో తనకి ఇష్టమైన తులసిమాల భాస్కరమ్మ చేత కొనిపించి వేయించుకున్నాను. బాబాకి భక్తులపై ఎంత ప్రేమ!

**27.9.2009**

ఉదయం స్వామి దర్శనానికి వెళ్ళినపుడు, మందిరంలో "గోవిందా! గోవిందా! ఏడుకొండల వాడా! అనుకుంటూ కూర్చున్నాను. స్వామి వచ్చారు. వేంకటేశ్వర స్వామిని స్వామిలో చూశాను. నేను తిరుపతిలో ఉండాలని అనుకుంటే ఇక్కడికి తీసుకువచ్చి ఇరవై ఏడు సంవత్సరాల తరువాత తిరుపతి, పుట్టపర్తి ఒక్కటే అన్న అనుభూతి కలగచేశారు. ఈ రోజు స్వామి నాతో మాట్లాడతారని, కనీసం "స్పీచ్"లోనైనా సందేశం ఇస్తారని అనుకున్నాను.

రెండూ జరగలేదు. కానీ, ప్రశాంతత ఇచ్చారు. 4.10.09న పుట్టపర్తి నుండి బయలుదేరి 5.10.09న హైదరాబాద్ వచ్చాను.

**5.10.2009**

ఉదయం స్నానం చేస్తుండగా స్వామి హృదయ భాషలో ఇలా తెలియచేశారు. తల్లి తరువాత తల్లి అంతటిది వదిన. ఆమె ఆశీర్వాదం తీసుకుని

మద్రాసు వెళ్ళమని" చెప్పారు. వెంటనే నాంపల్లి వెళ్ళి వదిన ఆశీస్సులు తీసుకున్నాను.

**6.10.2009**

"కళ్యాణం చేసుకుని వచ్చావు ప్రభ వద్ద చీర తీసుకోమని" స్వామి హృదయ భాషలో చెప్పారు.

ప్రభతో ఐదుగంటలకి చీర ఇవ్వమని అన్న దాన్ని 3.30 గంటలకు ఇవ్వమన్నాను. చీర, పళ్ళు, కొబ్బరికాయ, పసుపు, కుంకుమ, అన్నీ పళ్ళెంలో పెట్టి నాకు ఇచ్చే సమయానికి మణితో "ఇదంతా స్వామి ఎందుకు చేయిస్తున్నారో! నా తల తిరిగిపోతున్నదని" అంటూ ఉండగా డాక్టర్ బలరామ్‌గారి పెద్ద కోడలు "స్వామి "బ్లెస్" చేసి ఇచ్చిన విభూతి" అని తెచ్చి ప్రభకి ఇచ్చింది. ఆ సమయంలో కొద్దిగా జల్లు పడుతున్నది. స్వామి బ్లెస్ చేసిన విభూతి ఇన్నాళ్ళూ ఇవ్వక ఇలా వానజల్లు పడుతుండగా ఈ సమయంలో ఇవ్వటం ఆశ్చర్యం అనిపించింది. ఇదంతా నా విభూతి (మహిమ). చీర తీసుకోమని చెప్పినట్లు అయింది. ప్రభ చీర ఇచ్చింది. కుంకుమ రంగు చీర, ప్రభ, మణి, వాసంతి హారతి పట్టారు.

జీవాత్మ, పరమాత్మ, కళ్యాణం అయింది. తిరుపతి వెళ్ళి దర్శనం చేసుకోమని స్వామి హృదయభాషలో చెప్పారు. నవంబరు 14న తిరుపతి వెళ్ళి వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకుని వచ్చాను.

**27.12.2009**

డిశంబరు 27న నా పుట్టిన రోజు. ఆ రోజున స్వామి నా తల్లి దండ్రుల ఫొటోలు నా దేవుడి మందిరంలో పెట్టించారు. భాస్కరమ్మ, నేను, మా తమ్ముడు శర్మ ఫొటోలకి హారతి పట్టాము.

**5.1.2010**

నిన్న సాయంత్రం మందిరం నుంచి వస్తూ స్వామీ! రేపటి నుంచీ నీ మందిరానికి రాను. ఎక్కడకీ వెళ్ళి ఉండలేను. ఇక్కడే ఈ ఇంట్లోనే ఉంటానని ఏడ్చాను. మందిరానికి రాననటం తప్పా స్వామీ. బాధలో అలా అన్నానని పశ్చాత్తాప పడ్డాను.

మధ్యాహ్నం పడుకుంటే దృశ్యం "నా ముందు కొంచెం లావుపాటి తాడు ఉన్నది. అది దాటలేక పోయాను."

"స్వామీ ... నీ వద్దకి రాకుండా నాకు నేనే తాడు అడ్డుకట్టుకున్నానా. నేను నీ వద్దకి రాలేనా?" అని ఏడ్చాను. సాయంత్రం మందిరం బయట నుంచే దర్శనం చేసుకుని ఇంటికి వచ్చాను. మందిరంలోకి వెళ్ళనని శపథం చేసిన తరువాత మాట తప్పి ఎలా వెళ్ళను! బాధ వచ్చినపుడు మందిరానికి రానని అంటూ ఉంటాను. కానీ, నిన్న శపథం చేయటం వలన, మాట తప్పి వెళ్ళటం ఇష్టం లేదు. ఏం చేయాలో తోచక ఏడిచాను.

తాడుకి అర్థం స్వామి ఇలా తెలియచేశారు. "నువ్వు తాడుతో బంధించుకోలేదు. నేనే తాడుతో నిన్ను బంధించాను. నా బంధం నుంచి తప్పించుకోలేవు. మన బంధం తెగనిది. నన్ను తిట్టానని బాధపడకు. నా భక్తులు నా మీద ప్రేమతో తిట్టిన తిట్లు నాకు బ్రహ్మానందం. త్వరలోనే నీ ప్రేమ ఫలం నీకు దక్కుతుంది. నిన్ను ఏడిపించి నీ చేత తిట్లు తినటం నాకు అమృతం సేవించినంత. నేను పలికిన క్షణం నుంచీ బ్రహ్మానందంలో వుంటావు. నన్ను తిట్టే అవకాశం ఉండదు. అప్పటి వరకు నీ తిట్ల వర్షం ఆపకు. పండితులు వేదాలతో నన్ను కీర్తిస్తారు. వేద వాక్కులతో స్తుతిస్తారు. కానీ, నా భక్తుల దూషణలే నాకు ఎనలేని భూషణాలు. నువ్వెక్కడున్నా నా దృష్టంతా నా నిజ

భక్తుల మీదే వుంటుంది. నిన్ను నా హృదయ పంజరంలో బంధించి పంజరంలోని చిలకకి మధుర ఫలాలు యజమాని తినిపించినట్లు నీ హృదయమంతా మధుర వాక్కులతో నింపి, నీ నోట వేదాల సారాన్ని సూక్తులుగా పలికిస్తాను. నా మాట సత్యం నిశ్చింతగా వుండు".

కృష్ణా! నిన్నటి నుంచీ పడుతున్న బాధ క్షణంలో తీసిన నీకేమివ్వను? జ్ఞానక్షీరంతో నిన్ను అభిషేకించి నీ ఋణం తీర్చుకుంటాను.

1984లో స్వామి దగ్గరకు "గురుపూర్ణిమ"కి వెళ్ళి వచ్చిన తరువాత వచ్చిన ఒక దివ్య స్వప్నం –

"ఒక తోటలో నేను, స్వామి ఉన్నాము. అక్కడ చాలా ఎత్తులో నాలుగు ఉయ్యాలలు ఉన్నాయి. ఆ ఉయ్యాలల్లో నలుగురు అందమైన పిల్లలు బ్రహ్మతేజస్సుతో ఉన్నారు."

"ఆ నలుగురూ నాలుగు వేదాలని, ఆ నాలుగు వేదాలు బిడ్డల రూపంలో ఇస్తానని" స్వామి హృదయ భాషలో ఈ కలకి అర్థం తెలియచేశారు.

1984 డిశంబరులో మా రెండవ అమ్మాయి మణికి "ప్రేమ"సాయి జన్మిస్తాడని స్వామి చెప్పించారు. 1986 జులై 13వ తేదీన "ప్రేమ" సాయి జన్మించాడు. 1986 జనవరిలో మా నాలుగవ అమ్మాయి సుధ ఇంటికి అల్లవరం వెళ్ళినప్పుడు అక్కడ సీత అన్న ఆమెకి "ధర్మ"సాయి పుడతాడని స్వామి చెప్పించారు. 1987లో సీతకి ఇదే విషయం రెండవసారి చెప్పించారు.

1986 నవంబరులో మా మూడవ అమ్మాయి సుజతకి "సత్య"సాయి జన్మిస్తాడని చెప్పించారు. అలాగే 1987 డిశంబరు 14న సత్యసాయి జన్మించాడు.

1987లో విజయకి "శాంతి" సాయి జన్మిస్తాడని స్వామి చెప్పించిన విధంగానే 1988లో విజయకి "శాంతి" సాయి జన్మించాడు. స్వామి చెప్పించిన విధంగా "ప్రేమ"సాయి, "సత్య"సాయి, "శాంతి"సాయి వెంటవెంటనే జన్మించారు.

కాని, సీత విషయంలో మాత్రం "ధర్మ"సాయి పుట్టడం గురించి అనేక సూచనలు ఇచ్చి చివరికి ఒక రోజు కలలో "సీతకి కొడుకు పుట్టడని" చెప్పారు. అలా కలలో చెప్పిన తరువాత కూడా "ధర్మ"సాయి గురించి అనేక సూచనలు ఇచ్చి చివరికి "ధర్మాచరణమే" నాలుగవ బిడ్డ అని మానసికంగా తెలియచేశారు.

"స్వామీ! సీతకి కొడుకు పుడతాడని చెప్పించి, సీతకి ఆశ పెట్టి ఈ విధంగా జరగటం సత్యం తప్పటం కాదా! నా సాధనలో నువ్వు ఎన్నుకున్న కొద్ది మందిని అనుగ్రహించి, వాళ్ళ వాళ్ళ కోరికలు తీరుతాయి అని నా ద్వారా చెప్పించావు. ఇచ్చిన మాట తప్పి జీవించటం కన్న మరణమే మేలన్న నీ సత్యవాక్కునే నమ్మి, వారికి చెప్పించినవి జరగటం ఆలస్యం అయితే నేను పడ్డ మానసిక ఘర్షణ, వేదన నీకు తెలియనిది కాదు. కాని నీవు నా ద్వారా చెప్పించినవన్నీ నీ సంకల్పంతో ఫలించాయి. ఇచ్చిన మాట నిలుపుకోవడం కోసం మరణమునకు కూడా తెగించిన నన్ను ఎన్నోసార్లు కాపాడవు.

కాని, సీత విషయంలో ఇలా ఎందుకు జరిగింది అని చాలా వేదన పడుతుండగా స్వామి "నువ్వు సత్యం తప్ప లేదు. సీతని అనుగ్రహించి జ్ఞానమే పుత్రుడుగా ఇస్తాను" అని హృదయభాషలో తెలియచేశారు.

"ధర్మసాయి పుట్టిన వెంటనే ఈ పుస్తకం ముగిస్తాను" అని తెలియచేసి స్వామి ఈ పుస్తకాన్ని ముగించారు.

# ముగింపు

"ధర్మాచరణే బిడ్డ"గా మానసికంగా తెలియచేసి స్వామి ఈ పుస్తకం ముగింపు చేయించారు. "అద్వైతామృత వర్షిణి"గా పుస్తక రూపం దాల్చిన ఈ అనుభవాల వ్రాత ప్రతిని పరిశీలించి, ముందుమాట వ్రాసిన శ్రీ వి.యస్.ఆర్. మూర్తి గారు "ఈ పుస్తకం ప్రింటు చేయించండి. పది మందికీ పనికి వచ్చే పుస్తకం. వెలుగులోకి తీసుకురండని" చెప్పారు.

"స్వామి నన్ను భౌతికంగా పిలిచి ప్రింటు చేయించమని అంటేనే ప్రింటు చేయిస్తాను. లేకపోతే చేయించను" అని అన్నాను. "స్వామి చెపితేనే కాని ప్రింటు చేయించ నన్నమాట మానేసి పుస్తకం ప్రింటు చేయించండి. స్వామి తప్పక "బ్లెస్" చేస్తారు" అని వారు అన్నారు.

2010, సెప్టెంబరు 15వ తారీఖు నుండి స్వామి దర్శనానికి మందిరానికి వెళ్ళటం మానేసి, 16వ తేదీ నుంచి ఫోను కూడా స్విచ్ ఆఫ్ చేసి స్వామిని ప్రార్థిస్తూ ఇంట్లోనే ఉండిపోయాను. కాని, స్వామి నన్ను భౌతికంగా పిలవలేదు. "ఈ దుఃఖానికి అంతం లేదా! విజయదశమి రోజుకి ఏదో ఒకటి చెయ్యి. లేకపోతే పుట్టపర్తిలో దశమి తరువాత వుండనని" ఏడ్చాను.

నేను ఎవరితోను ఫోనులో మాట్లాడటంలేదని తెలిసి మా మూడవ అమ్మాయి సుజాత నాకు ఒక ఉత్తరం వ్రాసింది. అది ఇక్కడ వ్రాస్తున్నాను.

'అమ్మా ... నీకు రోజూ ఫోను చేస్తున్నాను కానీ, నీవు ఫోనులో మాట్లాడటం లేదు. ఎందుకమ్మా నీకు ఆవేదన? నీ వ్యక్తిత్వం, భక్తి, ఆధ్యాత్మిక శక్తిని గురించి నిరూపించాల్సిన అవసరం లేదు. మా జన్మ సంస్కారం బట్టి

మేము గ్రహించగలగాలి. నీవు ఎప్పుడో గురు స్థానంలో ప్రతిష్టించబడ్డావు. బాబా నిన్నే తనలో ఉంచుకన్నప్పుడు ఇంక దిగులు ఎందుకు? మార్గదర్శకం చేసే వ్యక్తులు మౌనం వహిస్తే ధర్మానికి చోటు ఎక్కడ ఉంంటుంది? అజ్ఞానంలో ఉండి గత జన్మలో సరియైన గురువు లేక మనుష్య జన్మ ఎత్తిన మాకు ఆత్మసాక్షాత్కారం ఎలా జరుగుతుంది? నిత్యం చేసే కర్మలు తప్పవు కానీ మనస్సుని మార్చుకునే ప్రయత్నం చేసే అవకాశం ఇవ్వకపోతే ఎలా?

నేను చెప్పింది ఎవరు ఆచరిస్తున్నారని బాబా అనుకుంటున్నారా? అది వ్యక్తి ప్రాప్తికి సంబంధించినది. కనుకే ఆయన అజ్ఞాతంలో ఉండక, అందరికీ దర్శనం ఇచ్చి బోధలు చేస్తున్నారు. అదే స్థితిలో ఉన్న నీవు మౌనంగా ఉండటం ఎందుకు?" ఉన్న జీవితంలో ఎంతమందికి జ్ఞానం అందించాలి? అనే విషయమే మీ లాంటి ఆధ్యాత్మిక గురువుల లక్ష్యం కావాలి. అప్పుడే మార్పు సాధ్యం అవుతుంది. ఎవరూ వినలేదని ప్రయత్నం ఆపకూడదు కదా! ఎవరూ పట్టించు కోవటం లేదని, ప్రకృతి తన ధర్మాన్ని నిలిపివేస్తుందా? మా లాటి అతి చిన్న జ్ఞానం ఉన్న వాళ్ళకి మీకు చెప్పే శక్తి ఉన్నదా? కాకపోతే మీ నీడన బ్రతికే అవకాశం మాకు ఇవ్వండి అనే హక్కు మాకు ఉంది కదా! ఇతరులను పట్టించుకోకుండా ఎవరికి వారే తరిస్తే ఈ సమాజంలో ఇంతటి ఆధ్యాత్మిక జ్ఞానం ఉండేదా?

ప్రజలని చైతన్యం చేయటం గురువు ధర్మం. మీరందించే ఈ ధనం తరగనిది. అది ఈ సమాజంలో అవసరం. భగవంతుడికి రూపంలేదు. కానీ, భగవంతుడిని అనుభవించి దర్శింప చేసే శక్తి దైవానికి ప్రతి రూపమైన గురువులకే ఉన్నది. గురువు తన విధిని విస్మరించకూడదు. మీలాంటి వాళ్ళని మా కోసం

భగవంతుడు సృష్టి చేసి ఇచ్చాడు. రాగద్వేషానికి అతీతమైన స్థానం మీది. అజ్ఞానంలో ఉన్న మమ్మల్ని దూరం చేయవద్దు. సూర్యుడు ఎంత తేజస్సుగా తన కిరణాలను వెదజల్లినా అవి కొన్నిటిని తాకలేకపోవచ్చు. కానీ సూర్యుడు తన విధిని విసుగు లేకుండా నిర్వహిస్తున్నాడు. మీకు పరీక్షలు పూర్తి అయినాయి కాబట్టే మీకు ఆ జ్ఞానం, ఆ స్థానం లభించింది.

మీ మాటలతో, రచనలతో ఉత్తమ మార్గాన్ని, సందేశాన్ని అందించాలి. ఇది బాబా మళ్ళీ మళ్ళీ గుర్తు చేయనక్కరలేదు. ఆయన నిన్ను గుర్తించారు అనే నిదర్శనమే నీకు ఉన్న జ్ఞానం. అది గ్రహించి మౌనం విడిచిపెట్టు. సమాజంలో ఉన్న ప్రతి బిడ్డ మీ వెలుగులో ఎదిగే అవకాశం ఇవ్వు. ఇంత స్థితికి వచ్చిన నీవు అందరికీ అందుబాటులో ఉండి, అజ్ఞానమనే చీకటిని పోగొట్టు. అది బాబా నీకు ప్రసాదించిన వృత్తి ధర్మంగా భావించు. మానసికంగా ధైర్యం నీకు బాబానే ఇస్తారు.

పుస్తకం ప్రింటు చెయ్యమని బాబా నీకు చెప్పనక్కరలేదు. అంత జ్ఞానం అందించటానికి కారణమే అది. ధర్మాన్ని బోధించే ఆధ్యాత్మిక గురువులు తమ ధర్మాన్ని విస్మరించకూడదు" ...

కాని, నేను మాత్రం స్వామి భౌతికంగా నన్ను పిలవాలన్న పట్టుదలతోనే ఉన్నాను.

సాయి ప్రేరణతో సుధ, స్వామి భక్తులయిన శ్రీ నిష్టల వెంకట్రావుగారికి, "నేను వ్రాసిన ఉత్తరం, "అద్వైతామృత వర్షిణి" పుస్తకం వ్రాత ప్రతిని" అందచేసింది. ఆ ఉత్తరం, పుస్తకం శ్రీ వెంకట్రావుగారు స్వామి వద్దకు తీసుకు వెళ్ళినట్లు సుధ చెప్పింది.

అనుకోకుండా ప్రొఫెసర్ శర్మగారు నా వద్దకి వస్తే వారికి ఈ విషయం చెప్పాను. ప్రొఫెసర్ శర్మగారు వెంకట్రావుగారిని కలిసి పుస్తకం గురించి అడిగితే స్వామి ఉత్తరం చదివి, పుస్తకం "బ్లెస్" చేసి ప్రింటు చేయించమన్నారని చెప్పారు. ఈ విషయం ప్రొఫెసర్ శర్మగారి ద్వారా నవమి రోజున నాకు తెలిసింది. విజయదశమికి ఒకరోజు ముందే నాకు స్వామి ఇలా శుభవార్త తెలియచేశారు.

విజయదశమి రోజున శ్రీ వి.యస్.ఆర్.మూర్తి గారికి ఫోన్ చేస్తే వారు "స్వామి బాహ్యంగా, మాట్లాడలేదన్న మాట ఆలోచించకుండా బయలుదేరి వచ్చి పుస్తకం ప్రింటుకు యివ్వమని" చెప్పిన మీదట 18 తా॥ బయలుదేరి హైదరాబాదుకు వచ్చాను. వచ్చే ముందు స్వామి ఆ రోజు త్వరగా దర్శనానికి రావటం వలన బస్ ఎక్కే ముందు స్వామి దర్శనం చేసుకుని బయలుదేరాను.

ముప్పై అయిదు రోజులు స్వామి దర్శనం కోసం మందిరానికి వెళ్ళకుండా, ఫోన్ ఆఫ్ చేసి బాహ్య బంధాలు తెంచుకున్నా కూడా స్వామి నేను కోరుకున్న విధంగా బాహ్యంగా మాట్లాడలేదు. తన పద్ధతిలోనే పుస్తకాన్ని వెలుగులోకి తీసుకు వస్తున్నారు. అద్భుతసాయి లీలలు అద్భుతం! వాటిని అనుభవించి ఆనందించటమే కాని అర్థం చేసుకోలేము!!

భగవాన్ శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారు 18-11-2010న తమ జన్మదినోత్సవ వేడుకల శుభ సందర్భంలో ఈ పుస్తకాన్ని సాయికుల్వంత్ హాలులో సాయంకాలం దర్శనానంతరం రాత్రి 8 గం॥కి తమ కరకమలములతో ఆవిష్కరించి అను గ్రహించారు. భగవాన్ బాబా వారి పదకమలములకు నా కృతజ్ఞతాభివందనములను సమర్పిస్తున్నాను.

// జై సాయిరాం //

# అర్పణం

ఆధ్యాత్మిక పుష్ప వాటికలోని జ్ఞాన పుష్పాల నుంచి జ్ఞానామృత
బిందువులు స్వీకరించి, మధురాక్షర పంక్తులుగా తీర్చిదిద్ది,
"అద్వైతామృతవర్షిణి"గా రచన చేసి సాధకులకు అందిస్తున్న
దివ్యభావ "అంతర్వాహిని" ఇది.
నా చేత ఇంత చక్కని రచన చేయించిన నా గురుదేవులు భగవాన్
శ్రీశ్రీశ్రీ సత్యసాయిబాబా వారి దివ్య చరణారవిందములకు
నమస్సుమాంజలి ఘటిస్తూ సర్వం సాయి కృష్ణార్పణం !

# అద్వైతామృత వర్షిణి

